# హ్యూమరాలజీ-3

*-యర్రంశెట్టి శాయి*

# టెలుగూ గన్

నక్సలైట్స్ ని ఎదుర్కోటానికి భూస్వాములందరికీ గన్స్ ఇవ్వాలని ఎన్టీఆర్ కోరిక.

ఆ కోరిక తీరాక ఆంధ్రప్రదేశ్ లో ఓరోజు మాకాలనీ మామూలుగానే రకరకాల సమస్యలతో హడావుడిగా వుంది. రంగారెడ్డి రిక్లెయిమ్డ్ హౌస్ సైట్ లో ఇల్లు ఎలా కట్టాలో నూట అరవై మూడోసారి ప్లాను గీస్తున్నాడు. శాయిరామ్ ఏ సాకు చూపి కాలనీ తాలూకు జనరల్ బాడీ మీటింగ్ పెట్టాలా అని శతవిధాలా ఆలోచిస్తున్నాడు.

జనార్ధన్ తను హీరోగా నటించిన ఫ్లాఫ్ సినిమా తాలూకూ వీడియో కాసెట్, అద్దె వి.సి.ఆర్ తీసుకొచ్చి రోజుకో ఇంట్లో బలవంతంగా చూపే స్కీమ కింద ఆరోజు పార్వతీదేవి ఇంట్లో క్యాసెట్ చూపిస్తున్నాడు.

డిటెక్టివ్ రచయిత్రి రాజేశ్వరి తన లేటెస్ట్ నవల సబ్జెక్ట్ కోసం హిచ్ కాక్ సినిమా తాలూకూ రివ్యూ చదువుతోంది.

యాదగిరి ఆంధ్రప్రదేశ్ తాలూకూ కుళ్ళు రాజకీయాల గురించి మా కాలనీ గూండాకి బలవంతంగా, విశదంగా చెప్తున్నాడు.

గోపాల్రావ్ తమ 'ఈక్షణం' తెలుగు పత్రికకు 'ఆంధ్రప్రదేశ్ లో గూండాల స్వర్ణయుగం' అనే ఆర్టికల్ తయారుచేస్తున్నాడు.

చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ ప్రచురణకు నోచుకోని తన ఇరవై రెండవ నవల రాస్తున్నాడు.

నేను మనకు స్వాతంత్ర్యం వచ్చిన్నాటినుంచి నేటివరకూ మన సైన్యానికి ఏయే దేశాలనుంచి ఏయే ఆయుధాలు మన ప్రభుత్వాలు కొన్నదీ, వాటిల్లో ఎవరెవరికి ఎంతెంత కమిషన్ ఉ ముట్టిందీ న్యూస్ పేపర్ క్లిప్పింగ్స్ సాయంతో రిసెర్చ్ చేయడం ప్రారంభించాను.

ఇలా అందరం ఎవరి కార్యక్రమాల్లో వారు హడావుడిగా ఉండగా చాలా పెద్దగా 'ధడ్' మంటూ ఆటోమేటిక్ గన్ పేలిన శబ్దం వినిపించింది.

అందరం అనుమానంగా బయటకు పరుగెత్తుకొచ్చాము.

"శ్యామల్రావ్ ఇంటివేపు నుంచీ తుపాకి కాల్చిన శబ్దం వచ్చింది" అన్నాడు శాయిరామ్.

అందరం శ్యామల్రావ్ ఇంటివైపు పరుగెత్తాం.

అప్పటికే వాళ్ళింటి ఇరుగుపొరుగు వాళ్ళు గుమికూడి వున్నారక్కడ. శ్యామల్రావ్ ఇంటి తలుపులు మూసివున్నాయ్.

"తప్పకుండా శ్యామల్రావ్ ఎవర్నో మర్డర్ చేసి వుంటాడు" అంది రాజేశ్వరి అనుమానంగా.

రంగారెడ్డి వెళ్ళి గట్టిగా తలుపులు కొట్టి శ్యామల్రావ్ ని బిగ్గరగా పిలవసాగాడు.

"శ్యామల్రావ్, శ్యామల్రావ్-శ్యామల్రావ్!"

మరో అయిదునిమిషాల తర్వాత శ్యామల్రావ్ నెమ్మదిగా తలుపు తెరుచుకుని బయటికొచ్చాడు.

అతని ముఖం పాలిపోయి వుంది.

"ఏమిటి-మీ ఇంట్లో గన్ కాల్చిన శబ్దం వినిపించింది!" అడిగాడు రంగారెడ్డి.

శ్యామల్రావ్ కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయ్.

రంగారెడ్డి మీద వాలిపోయి భోరున ఏడ్చేయసాగాడు.

అందరికి సస్పెన్స్ పెరిగిపోయింది. కొంతమందికి శ్యామల్రావ్ మీద జాలికూడా కలిగింది- పాపం ఏదో ఘోరం జరిగిపో వుంటుందని!

"ఏమిటయ్యా! ఏడుస్తావేంటి? ఏం జరిగిందసలు?" అతనిని చిరాగ్గా వదిలించుకుని అడిగాడు రంగారెడ్డి.

"ఇంకా ఏం జరగాలి రంగారెడ్డీ! ఇంక మేము ఎవరి కోసం బతకాలి రంగారెడ్డీ!" అంటూ మళ్ళీ భోరుమన్నాడు. మాకు సస్పెన్స్ మరింత పెరిగిపోయింది.

వెనుకే అతని కొడుకు కూడా ఏడుస్తూ బయటికొచ్చాడు.

"నాన్నా! మన ఇంటి దేవత దేవతల్లో కలిసిపోయింది నాన్నా! నేనూ ఇంత విషం తిని దాంతోపాటు పైకెళ్ళిపోతాను నాన్నా- ఇంత ప్రేమగా చూసుకున్నా- నీకు అప్పుడె దేవుడి పిలుపు వచ్చిందా రాజ్యలక్ష్మి!" అంటూ నేలమీదపడి మట్టిలో పొర్లుతూ ఏడవసాగాడతను.

మాకందరికి షాక్ తగిలినట్లయింది.

రాజ్యలక్ష్మి ఎవరోకాదు, శ్యామల్రావ్ కోడలు. రెండు సంవత్సరాల క్రిందటే శ్యామల్రావ్ కొడుకుతో పెళ్ళయిందామెకి. పెళ్లయిన మర్నాటినుంచీ వాళ్ళు ఆమెను కట్నకానుకల కోసం నానాహింసలూ పెట్టడం మాకందరికీ తెలుసు. శ్యామల్రావ్, అతని భార్య, వాళ్ళబ్బాయ్, రెండో కొడుకూ కలసి ఆమెను చంపడానికి్కూడా ప్రయత్నాలు చేయడం తెలిసి మేమందరం వాళ్ళకు వార్నింగ్ ఇవ్వడం జరిగింది.

"చూశారా! నేను చెప్పలేదూ! మర్డర్" అంది రాజేశ్వరి నెమ్మదిగా.

"అదేమిటి! ఎలా చనిపోయిందామె?" అడిగింది పార్వతీదేవి అనుమానంగా శ్యామల్రావ్ ని.

"ఎలాగని చెప్పను చెల్లమ్మా! చెప్పటానికి నోరు రావడం లేదు. నక్సలైట్స్ దాడి గురించి భయపడి గవర్నమెంట్ దగ్గర గన్ కొనుక్కున్నాను. ఆ గన్ ని జాగ్రత్తగా నా అల్మారాలో దాచి తాళం కూడా వేశాను. కోడలి సంగతి మీకు తెలిసిందేగదా! ప్రతి మంగళవారం వద్దంటున్నా వినకుండా ఇంట్లో వస్తువులన్నీ శుభ్రం చేసి నీట్ గా పెడుతుంది. అలవాటు ప్రకారం నా అల్మారాలోని సామాన్లన్నీ తీసి శుభ్రం చేస్తోంటే గన్ కనిపించింది. పాపం అది లోడ్ చేసి వుందని కూడా తెలుసుకోలేని అమాయకురాలు. దానిని శుభ్రంచేస్తూ పొరబాటున తన వేపు గురిపెట్టినప్పుడు ట్రిగ్గర్ కూడా గట్టిగా నొక్కి క్లీన్ చేయబోయింది. అంతే! క్షణాల్లో ప్రాణంపోయింది..."

మా కందరికీ రక్కున అర్థమయిపోయింది.

కోడలిని గన్ తో కాల్చిచంపి మాకీ కథ అల్లి చెప్తున్నారు వాళ్ళు.

"ఇదిగో శ్యామల్రావ్! నీయవ్వ- ఎంతమంచి కథల్జెప్పినావ్ రా భాయ్! నీ కోడలు గన్ గిట్ల శుభ్రం చేస్తుంటే అచానక్ గోలి ఎళ్ళినాది? మా చెవుల్లో పూలుపెట్టుకుని వున్నామనుకున్నావ్?" హేళనగా అన్నాడు యాదగిరి.

"నాకు తెలుసయ్యా! ఇంతమందిలో ఎవరొకళ్ళు నీలా బురద జల్లుతారని నేను యిందాకే అనుకున్నా! రండి! మీరే చూడండి! ఆమె చేతిలో గన్ ఇంకా అలాగే వుంది. అదిచూస్తే మీకు క్లియర్ గా తెలిసిపోతుంది. మీరే నా మాటలు నమ్ముతారు అప్పుడు" బాధ నటిస్తూ అన్నాడు.

అందరం శ్యామల్రావ్ ఇంట్లోకి నడిచాము.

లోపల బెడ్ రూమ్ లో నేలమీద పడిపోయి వుందామె. గుండె చుట్టూ రక్తం మడుగు, ఓ చేతిలో ఆటోమేటిక్ గన్- ఆమెవేపుకి గురిపెట్టుకుని వుంది.

"జాగ్రత్త! ఎవరూ ఈ గదిలో వేలిముద్రలు పడకుండా చూడండి. లేకపోతే మనల్నే హంతకులుగా చేసేస్తాడు" అంటోంది డిటెక్టివ్ రచయిత్రి రాజేశ్వరి.

మా కందరికీ రాజ్యలక్ష్మిని చూస్తే జాలివేసింది.

మా కాలనీ ఆడాళ్ళు చాలామంది కన్నీళ్ళు పెట్టుకున్నారు.

"బిడ్డ పాపం అత్తగారింటికి వచ్చిన దగ్గర్నుంచీ సుఖం అనేది తెలీదమ్మా. అత్తమామలు, మరిది పగలంతా కాల్చుకుని నానాహింసలూ పెడితే ఆ భర్త ముండాకొడుకు రాత్రుళ్ళు తాగివచ్చి మీ నాన్న దగ్గర కెళ్ళి డబ్బు తేవే' అంటూ తెల్లార్లూ గొడ్డుని బాదినట్టు బాదేవాడు" అంటోంది సావిత్రమ్మ.

ఆ అమ్మాయి తెల్లవారుజామున అయిదింటికి లేచి ఇంటిముందు కళ్ళాపిజల్లి, ముగ్గులు వేస్తుంటే- ఆ దృశ్యం ఇకముందు మాకు కనిపించదనుకునేసరికి మా అందరి హృదయాలూ బాధతో భారంగా తయారయినయ్.

శ్యామల్రావ్ భార్య శవం పక్కన కూర్చుని దొంగ ఏడుపులు ఏడుస్తోంది. మరి కాసేపట్లో పోలీసులు వచ్చారు. మాకు చెప్పిన కథే వాళ్ళకూ చెప్పాడు శ్యామల్రావ్.

ఆ కథ అబద్ధమనీ, ఆ అమ్మాయిని వాళ్ళే గన్ తో కాల్చి చంపి వుంటారనీ పోలీస్ ఇన్ స్పెక్టర్ తో చెప్పాము. అతను శ్యామల్రావ్ ని పక్కకు తీసుకెళ్ళి రహస్యంగా పావుగంటసేపు మాట్లాడాడు. ఆ తరువాత ఇద్దరూ శ్యామల్రావ్ గదిలోకెళ్ళి అయిదునిమిషాల తర్వాత బయటికొచ్చారు.

"ఆయన కాల్చగా మీలో ఎవరయినా చూశారా?" అడిగాడు ఇన్ స్పెక్టర్ మా దగ్గరకొచ్చి.

మేము మొఖాలు చూసుకున్నాం.

"చూడక్కర్లేదండీ! రోజూ ఆమెను హింసిస్తున్న వాళ్ళు చంపలేదని ఏమిటి నమ్మకం?" అంటూ ఎదురు తిరిగాడు రంగారెడ్డి.

"అంటే ఇదంతా కేవలం మీ అనుమానం అన్నమాట! అంతేనా?"

"అనుమానమేంటండీ? ఆ అమ్మాయి గన్ క్లీన్ చేయటమేంటసలు? పైగా లోడెడ్ గన్! అది క్లీన్ చేస్తూ గన్ ని తనకే గురిపెట్టుకోవడం, ప్రమాదవశాత్తూ ట్రిగ్గర్ నొక్కడం ఎవరైనా నమ్ముతారా ఈ హరికథలు?" అరిచాడు శాయిరామ్.

ఇన్ స్పెక్టర్ కి మా మీద కోపం పెరిగిపోతున్నట్లు తెలుస్తూనే వుంది.

"అయితే ఇప్పుడేమంటారు?" మరింత మండిపడుతూ అడిగాడు.

"శ్యామల్రావ్ దంపతులనూ, ఆమె భర్తనూ అరెస్ట్ చేయండి ముందు. తరువాత ఇన్ వెస్టిగేట్ చేస్తే మీకే రుజువులు దొరుకుతాయ్" దబాయించాడు.

"అంటే మా పోలీసులున్నది జనం ఏం చెప్తే అది చేయటానికి అన్నమాట"

"అవును! మీ డిపార్ట్ మెంట్ చేతగాని డిపార్ట్ మెంట్ గనుక మేము చెప్పడానికి మాకు అధికారం వుంది"

"అలాగా! ఆల్ రైట్! అయితే మీరందరూ ముందు స్టేషన్ కి పదండి!"

మేము అదిరిపడ్డాం.

"మేమెందుకు?"

"స్టేట్ మెంట్స్ తీసుకోవాలి- మేజిస్ట్రేట్ దగ్గర! పదండి"

ఆ మాటతో క్షణంలో మా వెనుక వున్న వాళ్ళంతా చెల్లాచెదురయిపోయారు. చివరకు నేనూ, రంగారెడ్డి, శాయిరామ్, గోపాల్రావ్ మాత్రం మిగిలాము.

"చూస్తారేమిటి? వాన్ ఎక్కండి!" ఉరిమాడు ఇన్ స్పెక్టర్.

"మా వాళ్ళను కూడా తీసుకొస్తాము" అని బొంకి మేము కూడా అక్కడినుంచి పారిపోయాం. పోలీస్ స్టేషన్ లో కెళ్ళినా, పోలీస్ కేస్ లో ఇరుక్కున్నా నరకం అనుభవించాలో మాకు అదివరకే తెలిసింది కదా!

తెలిసి తెలిసి నిప్పుని ఎవరూ తాకరు కదా!

మర్నాడు న్యూస్ పేపర్ లో ఆ వార్త ప్రచురించబడింది.

"ప్రమాదవశాత్తూ గన్ పేలడంవల్ల ఓ ఇల్లాలి మృతి! ఆమె మరణానికి కృంగిపోతూన్న భర్త, అత్తమామల ఫోటోలు లోపలిపేజీలలో చూడవచ్చు!"

మాకు కోపం ఆగలేదు. ఆ న్యూస్ పేపర్స్ చింపి పారేశాం, అంతకంటే ఇంకేం చేయగలం కనుక?

ఇది జరిగిన మూడో రోజునే మా కాలనీ బయటవున్న ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్స్ లో మరో పెద్ద శబ్దం వినిపించింది.

అందరికీ ఆ శబ్దం ఏమిటో అర్థమయిపోయింది.

అచ్చం శ్యామల్రావ్ ఇంట్లో విన్న శబ్దమే.

పరుగుతో ఆ స్టోర్స్ కి చేరుకున్నాం.

కొత్తగా ఆ షాప్ పెట్టిన ఆన్ ఎంప్లాయిడ్ గ్రాడ్యుయేట్ రక్తపు మడుగులో పడి వున్నాడు. ఎదురుగా గన్ పెట్టుకుని మా ఏరియా తాలూకూ శంకర్ దాదా కోపంగా నిలబడి వున్నాడు.

"సాలే! వినాయకచవితి చందా వెయ్యి రూపాయలిమ్మంటే వంద రూపాయిలిస్తాడు బాడుకవ్? గిసంటోళ్ళ నెట్ల ఖతమ్ జెయ్యాలో నాకెరుక బే! వెళ్ళండ్రి! అన్ని దుకాణాలకు పోయి మనం అడిగినన్ని పైసలు ఎవళ్ళియ్యరో ఆళ్ళ పేర్లు రాస్కరాండ్రి! ఖతమ్ జేస్తా కొడుకులను" అరుస్తున్నాడతను.

మిగతా షాపుల వాళ్ళందరూ గూండాలు అడిగినంత డబ్బిచ్చేస్తూ కనిపించారు మాకు.

"ఏయ్! మీరేం జూస్తున్రు బే! పొండ్రి ఈడకెళ్ళి! సాలేగాండ్లు సినిమా జూస్తున్నట్టు జూస్తున్రు" గన్ మావేపు గురిపెట్టి గాలిలో ఇంకో రౌండ్ కాల్చాడతను.

క్షణంలో ఎవరిళ్ళల్లో వాళ్ళున్నాము మేము.

మర్నాడు ఆత్రుతగా న్యూస్ పేపర్ చూశాము.

"నిన్నరాత్రి శంకర్ దాదా ఇంటిమీద నగ్జలైట్లు దాడి చేసినప్పుడు శంకర్ దాదా వారిని వీరోచితంగా ఎదుర్కొని వేటాడి గన్ తో మెయిన్ రోడ్ మీద ఓ షాప్ లో దాక్కున్న ఒక నగ్జలైజ్ ని కాల్చి చంపినట్లు పోలీస్ వర్గాలు తెలుపుతున్నాయ్!"

మేము ఎవ్వరం ఆ విషయం చర్చించుకోలేదు. ఎందుకంటే శంకర్ దాదాతో కిరికిరి పెట్టుకోవడం మాకేమాత్రం నచ్చనిపని!

అదేరోజు మధ్యాహ్నం ఇంటర్ పరీక్షలు రాస్తూన్న మా కాలనీ పిల్లలు పరీక్షల మధ్యలో ఇళ్ళకు పారిపోయి వచ్చారు.

"ఏమిట్రా- ఏమిటిప్పుడే వచ్చారు. సాయంత్రం వరకూ పరీక్ష వుంది కదా?" అడిగామ్మేం ఆశ్చర్యంగా.

"ఉంది కానీ, మా ఎగ్జామినేషన్ సెంటర్ లో ఫ్లయింగ్ స్క్వాడ్ వచ్చి ఓ స్టూడెంట్ దగ్గర కాపీలు పట్టుకున్నందుకు ఆ కుర్రాడు గన్ తో ఫ్లయింగ్ స్క్వాడ్ వాళ్ళను ఇద్దరిని కాల్చి చంపేశాడు. మాకు భయం వేసి పారిపోయి వచ్చేశాం"

మేం ఏమీ మాట్లాడలేదు. మర్నాడు పేపర్ చూశాము.

"గుర్తు తెలీని వ్యక్తులు ఫ్లయింగ్ స్క్వాడ్ మెంబర్స్ ఇద్దర్ని ఎగ్జామినేషన్ సెంటర్లో కాల్చి చంపిన వైనం. పాతకాలం నాటి కక్షలే దీనికి కారణమయి వుండవచ్చని పోలీసులు భావిస్తున్నారు" అని ఉందందులో.

"అయుండవచ్చు!" అన్నాడు రంగారెడ్డి.

"మే బి!" అన్నాడు గోపాల్రావ్.

"మీకేం మతిపోయిందా? మన కాలనీ స్టూడెంట్స్ ప్రత్యక్షంగా చూసిన విషయం విన్నా కూడా ఆ న్యూస్ పేపర్ లో రాసిన పోలీస్ వర్షన్ నమ్ముతున్నారా?" ఆశ్చర్యంగా అన్నాడు శాయిరామ్.

నాకూ, మిగతావారికీ కూడా రంగారెడ్డి మీద కోపం వచ్చింది.

రంగారెడ్డి ఛప్పున స్పృహలో కొచ్చాడు.

"సారీ బ్రదర్! ఈ న్యూస్ పేపర్స్ లో పోలీస్ వర్షన్ ఖు చదివి చదివి "బ్రెయిన్ వాష్" అయిపోయినట్లనిపించింది. హోమియోపతి మెడిసిన్ వాడితే గాని లాభంలేదు" అన్నాడు కణతలు నొక్కుకుంటూ. తరువాత మా కాలనీని ఆనుకుని వున్న ఓ భవనంలోనుంచి కాల్పులు వినిపించాయ్.

అయితే ఈసారి ఎవ్వరం పరుగెత్తుకెళ్ళలేదు.

ఆ సాయంత్రం ఆ భవనం యజమాని ఇంట్లోనుంచి అతని భార్య శవాన్ని తీసుకెళ్తున్నప్పుడు మాత్రం అందరం మెయిన్ రోడ్ దగ్గర కెళ్ళి నిలబడ్డాం.

ఆమె భర్త భోరున ఏడుస్తూ శవం ముందు నడుస్తూంటే మాకతని మీద విపరీతమయిన జాలి కలిగింది.

మేమందరం గుమిగూడి అతనిమీద జాలి పడుతూంటే వాళ్ళింట్లో పనిచేస్తున్న ముసలి నౌకరు మా దగ్గరకొచ్చాడు.

"ఘోరం బాబూ! దేవతలాంటి అమ్మగారిని వాడే చంపేశాడండీ! పెళ్ళయిన రోజు నుంచీ ఆ అమ్మాయిని నాలుగ్గోడల మధ్యే బంధించి చిత్రహింసలు పెట్టాడండీ! ఆమె అందంగా వుందని ఆమె శీలం మీద ఒకటే అనుమానం. నిన్న సినిమా హాల్లో కూల్ డ్రింక్స్ అమ్మే వాడితో రహస్యంగా మాట్లాడిందని సాకు- చూపి నానా రభస చేసి చివరకు నా కళ్ళెదురుగ్గానే తుపాకితో కాల్చి పారేశాడు బాబూ!"

మేం నిశ్చేష్టులమైపోయాం గానీ క్షణాల్లో మామూలు పరిస్థితి కొచ్చేశాం.

"వాడే చంపుతే అలా భార్యకోసం రోడ్ మీద ఏడుస్తాడా ఎవడయినా?" అనుమానంగా అన్నాడు రంగారెడ్డి.

"అదేబాబూ నాటకం! ఈ విషయం బయటపెడితే నా ప్రాణం తీస్తానని కూడా బెదిరించాడు! పోనీండి బాబూ! ఆ తల్లి జీవితమంతా ఇలాంటివాడి దగ్గర నరకం అనుభవించటం కంటె ఆడి చేతిలో ఒకేసారి చావడం మంచిది!"

మాకెందుకో ఆ నౌకరు మాటలు పట్టించుకోబుద్ధికాలేదు.

అతను చెప్పేది నిజమే అని తెలిసినా, మేమేమీ చెయ్యలేని పరిస్థితిలో ఉన్నప్పుడు ఆ విషయాల గురించి ఆలోచించటం అనవసరమని మాకు తెలుసు.

మర్నాడు ఎంత వద్దనుకున్నా న్యూస్ పేపర్లో ఆ వార్త గురించిన పోలీస్ స్టేట్ మెంట్ చదవక తప్పలేదు.

"నిన్న నిర్భయ్ నగర్ కాలనీ సమీపంలో ఒక ఇల్లాలు గన్ తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె గత కొద్ది సంవత్సరాలుగా విపరీతమయిన కడుపునొప్పితో బాధపడుతోందని, ఆ బాధ విముక్తికోసమే ఇప్పుడు ఆత్మహత్య చేసుకుందనీ పోలీస్ అధికారులు చెప్పారు ఆమెకు భర్త ఒక పాప వున్నారు. ఆమెను అమితంగా ప్రేమించే ఆమె భర్త ఈ దారుణానికి తట్టుకోలేక మూర్ఛిల్లినట్టూ, ప్రస్తుతం నగరంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నట్లూ తెలుస్తోంది."

"పాపం! పూర్ ఫెలో! భార్యలను అమితంగా ప్రేమిస్తే యిదే ట్రబుల్!" అన్నాడు రంగారెడ్డి.

"అవును. అందుకే నేను మా ఆవిడను రెండు మూడేళ్ళకోసారి కసురుకుంటుంటాను" అన్నాడు చంద్రకాంత్.

రాన్రాను ఈ వార్తలు మరింత వింత రూపంలో న్యూస్ పేపర్స్ లో కనిపించసాగాయి.

"నిన్న ఉదయం పంజాగుట్టలో ఒక బార్ ఓనర్ కీ, కస్టమర్ కీ జరిగిన వాగ్వివాదంలో కస్టమర్ తన గన్ తో జరిపిన కాల్పులలో బార్ ఓనర్ తోపాటు ఒక్క టేబుల్ దగ్గర కూర్చున్న మరో ఆరుగురు కస్టమర్లు మృతి చెందారు. అయితే హత్యానంతరం అంతులేకుండా పారిపోయిన ఆ వ్యక్తి ఆచూకీ కోసం పోలీసులు దేశమంతా గాలిస్తున్నారని పోలీస్ వర్గాలు వెల్లడిస్తున్నాయి."

మరో రెండురోజుల తర్వాత ఇంకో వార్త.

"నిన్న రాత్రి మంజీరా ప్లాట్స్ లో నివసిస్తున్న రెండు కుటుంబాల మధ్య హోలీ సందర్భంగా చెలరేగిన వివాదం కారణంగా ఓ కుటుంబానికి చెందిన వ్యక్తి రెండో కుటుంబం సభ్యులందరినీ గన్ తో కాల్చి చంపినట్లు తెలుస్తోంది. సాక్షులెవరూ లేకపోవడం వల్ల పోలీస్ లు ఇంకా హంతకులను నిర్ధారించుకోలేదని పోలీస్ అధికారులు చెపుతున్నారు."

మర్నాడు మరికొన్ని వార్తలు.

"నిన్న రాత్రి నగరంలోని కొంతమంది గూండాలు తాగిన మైకంలో కొన్ని ఇళ్లమీద దాడిచేసి అనేకమంది స్త్రీలను, పురుషులను తుపాకులతో కాల్చి చంపి కొంతమంది స్త్రీలను ఎత్తుకుపోయినట్టు తెలుస్తోంది. పోలీసులు పరిశోధన ప్రారంభించారు."

"నిర్భయ్ నగర్ కాలనీ సమీపంలో యాభైమంది నగ్జలైట్ల కాల్చివేత" మేం అదిరిపడ్డాం. ఆ యాభైమందీ నిజంగా నగ్జలైట్లు కాదు. కాంట్రాక్ట్ లేబర్. వాళ్ళకు డబ్బులు ఎగ్గొట్టిన కాంట్రాక్టర్ ని నిలదీయడానికి వెళ్తే కాల్చి చంపి నగ్జలైట్లని స్టేట్ మెంటిచ్చాడు.

"భర్తతో కాపురానికి రానని మొరాయించిన భార్యనూ, ఆమె తల్లిదండ్రులనూ ఆమె భర్త గన్ తో కాల్చిచంపిన సంఘటన నిన్న చార్మినార్ సమీపంలో జరిగింది. అతనికి అదివరకే ఇద్దరు భార్యలున్నట్లు తెలుస్తోంది. పోలీసులు అతనికోసం గాలిస్తున్నారు" ఇది మరో వార్త.

"గంగిగోవులపాలెంలో నిన్న రాత్రి ఒక వర్గం మీద భూస్వామి వర్గానికి చెందిన కొందరు దాడిచేసి అక్కడి నివసిస్తున్న రెండొందల తొంభైమంది పురుషులు,స్త్రీలు, పిల్లలను గన్స్ తో కాల్చి చంపారు. కిందటి ఎన్నికల్లో తమకు ఓటు వేయలేదన్న కక్షతో ఇలా చేసినట్లు అక్కడి ప్రజలంటున్నారు. కానీ అదంతా అబద్ధమని వాళ్ళంతా నగ్జలైట్స్ నీ, వారే భూస్వామి వర్గానికి చెందిన వారిమీద దాడి చేశారనీ, ఆత్మరక్షణ కోసం ఆ ఎమ్మెల్యే ఆయన అనుచరులు కాల్పులు జరిగిపినప్పుడు వారంతా హతులయ్యారనీ, పోలీస్ వర్గాలు అంటున్నాయ్."

మాకు భయం వేసింది. మా ఏరియా పోలీస్ ఇన్ స్పెక్టర్ కి మేమంటే పడదు. ఏ క్షణాన్నయినా మా కాలనీ వాళ్ళందర్నీ పిల్లల్ని కాల్చినట్లు కాల్చేసి నగ్జలైట్స్ అని ముద్ర వేస్తాడేమోనని.

"దాని కింద మరోవార్త చదివేసరికి మాకు మతిపోయినట్లయింది. అట్టడుగు వర్గాలున్న ఓ ఊళ్ళో ఆ వూరి జనాభా ఆరొందల మంది గన్స్ తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుల బాధవల్ల ఆ విధంగా ఆత్మహత్యలకు పాల్పడినట్లు పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు."

ఆ తరువాతి రోజు అలాంటి వార్తలు మరో పాతిక్కనిపించాయ్.

ఈ లెక్కన న్యూస్ పేపరంతా అలాంటి వార్తలతోనే నిండే రోజు ఎంతో దూరం లేదని మా కర్థమయిపోయింది. శాయిరామ్ వెంటనే ఆ విషయం చర్చించటానికి మీటింగ్ ఏర్పాటు చేశాడు.

"పరిస్థితి ఇలాగే కొనసాగితే మన సమాజం రూపురేఖలే భయంకరంగా తయారవుతాయి. ఏదో ఒక ఉపాయం ఆలోచించాలి" అన్నాడు శాయిరామ్.

అందరూ రకరకాల సలహాలు ఇవ్వసాగారు.

ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన గన్స్ ని వాపస్ తీసుకోవాలని కొంతమంది సూచించారు.

మిగతా అందరికీ కూడా గన్స్ యిస్తే ఒకరంటే మరొకరికి భయం వుంటుందనీ, అందువల్ల హత్యలు జరగవనీ రంగారెడ్డి అన్నాడు.

ఆఖర్లో యాదగిరి వేదిక మీదికొచ్చాడు.

"సోదర సోదరీమణులారా! మనం వున్నది డెమోక్రసీలో! గనుక ప్రజలు అంటే మనం ఇచ్చిన సలహాలు గిట్ల ప్రభుత్వం బరాబర్ నిరాకరిస్తది. గనుక మనం ఈ పరిస్థితి నుంచి తప్పించుకోనికి ఒకే ఒక్క రాస్తా వున్నది. అదేమంటే న్యూస్ పేపర్ చదివెడిది బంద్ చేయడం. న్యూస్ పేపర్స్ ని మనం చదువుతుండబట్టేగదా గిసంటి ఖతర్ నాక్ దందాల గురించి ఎరుకవుతున్నది. కేనుక మనం రేపటికెళ్ళి న్యూస్ పేపర్స్ కొనద్దు. సమజైనాది?"

అందరూ ఆనందంగా తప్పట్లు కొట్టారు.

ఆ తరువాత మేమెప్పుడూ న్యూస్ పేపర్లు చదవలేదు. కనుక ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగడంలేదని మేము సంతృప్తి చెందాం.

*****

## ఆహా! విమాన ప్రయాణం

(విమానాల పనితీరు ఆ రోజుల్లోనే కాదు ఇప్పుడూ అలాగే అఘోరించింది.)

విమాన ప్రయాణాలు మా కాలనీ వాళ్ళకు కొత్తేం కాదు.

రెండుమూడు సార్లు ఎయిర్ పోర్ట్ కెళ్ళి మా కాలనీ కొచ్చిన కొంతమంది వీఐపీలకు వెల్ కమ్ లు, సెండాఫ్ లు ఇచ్చాం.

మేము వెయిటింగ్ హాల్ కెళ్ళడం, అక్కడ ఫ్లైట్ ఎనౌన్స్ మెంట్, సెక్యూరిటీ చెక్ ఎనౌన్స్ మెంట్స్ వినడం, అప్పుడు తిరిగి ఇళ్ళకు చేరుకోవడం జరుగుతుండేది.

అప్పుడప్పుడూ మాత్రం లోలోపల మాకనిపిస్తుండేది- ఎప్పుడయినా మేమూ విమానంలో ప్రయాణం చేస్తే బాగుంటుందని.

కానీ రైల్లో సరదాగా మాకిష్టమయిన ఊళ్ళు చూడ్డానికే ఆర్థిక స్థోమతులేనివాళ్ళం- అలా విమానాల్లో ప్రయాణం గురించి కలలు కనడం మన డెమొక్రసీకే అవమానం గనుక మా కోరికను లోలోపలే అణచుకునేవాళ్ళం.

అకస్మాత్తుగా ఓ రోజు మా రంగారెడ్డికి టెలిగ్రామ్ వచ్చేసరికి ఎవరికో సీరియస్ గా వుంది కాబోల్నని అందరం అతని ఓదార్చడానికి గుమికూడాం.

తీరా చూస్తే ఆ టెలిగ్రామ్ భారత్ బ్రాంది కంపెనీ వాళ్ళ దగ్గర్నుంచి వచ్చింది.

వాళ్ళు పెట్టిన "బ్రాంది మేరా సాథీ" కాంపిటీషన్ లో రంగారెడ్డికి ప్రథమ బహుమతి వచ్చిందని దాని సారాంశం! ప్రథమ బహుమతి అంటే రంగారెడ్డి ఉచితంగా మద్రాస్ కి విమాన ప్రయాణం- మద్రాస్ లో ప్రముఖ చలనచిత్ర సెక్స్ డాన్సర్ విద్యతో కలసి ఓ పెగ్గు భారత్ బ్రాంది తాగడం, తర్వాత ఆమెతో లంచ్- ఆ తర్వాత తిరిగి విమానంలో హైదరాబాద్ చేరుకోవడం-

ఆ వివరాలన్నీ తెల్సేసరికి మాతోపాటు రంగారెడ్డి కూడా ఆశ్చర్యపోయాడు.

"ఇదెక్కడి గొడవయ్యా! అసలిలాంటి కాంపిటీషన్ వున్నట్లే నాకు తెలీదే! దీనికి నేను సెలక్టవటమేంటి?" అన్నాడు అయోమయంగా.

ఈలోగా రంగారెడ్డి భార్య కన్నీళ్ళొత్తుకుంటూ బయటికొచ్చింది.

"నాకారోజే అనుమానం వచ్చిందన్నయ్యగారూ ఈ మనిషి తాగేస్తున్నారని! అక్కడికీ నిలదీసి అడుగుతే 'ఛ పిచ్చిదానా! నేను తాగడమేమిటే నీ తలకాయ! మా ఫ్రెండొకడు ఖాళీ చేసిన బాటిల్ బావుందని మనం మంచినీళ్ళు తాగడానికి ఉపయోగించుకోవచ్చనీ తీసుకొచ్చాను- అని అబద్ధం చెప్పారు" అందామె కోపంగా.

ఆమె మాటతో మాకూ రంగారెడ్డి మీద అనుమానం వచ్చింది.

"ఇదేం పని గురూ! నువ్వేం రాజకీయ నాయకుడివా? రోజూ తాగడానికి? మేము ఎప్పుడయినా పార్టీకి ఇన్ వైట్ చేస్తే న్యూ ఇయర్స్ డే ఒక్కరోజు తప్ప ఇంకెప్పుడూ తాగనని పెద్ద ఫోజిచ్చేవాడివి కదా!" అన్నాడు శాయిరామ్ ఉడికిపోతూ.

రంగారెడ్డికి తిక్క పుట్టుకొచ్చింది.

"ఏయ్- మీకేం మతుందా లేదా? నేను తాగడమేంటయ్యా! తాగుతున్నానని చెప్తే నాకేం భయమా? ఈ భారత్ బ్రాందీ గొడవేంటో నాకేమాత్రం తెలీదు. ఎవరో నన్ను అభాసుచేయడానికి వేసిన ప్లాన్" అన్నాడు నెత్తీ నోరూ కొట్టుకుంటూ.

అందరం కన్ ఫ్యూజన్ లో వుండగా మావెనుక సెపరేట్ గా కూర్చుని దీర్ఘంగా నిట్టూరుస్తూ కనిపించాడు చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్.

అందరం వెనక్కు తిరిగి అతనివేపు చూశాం.

"నీకేమొచ్చిందయ్యా- అలా ఒక్కడివే దూరంగా కూర్చుని ఏడుస్తున్నావ్?" అడిగాడు గోపాల్రావ్ అనుమానంగా. అడగడం ఆలస్యం- ఒక్కసారిగా భోరుమన్నాడతను.

"ఏడవకేం చేయను గురూ! నా బ్రతుక్కి "లక్" అనేది ఏ కోశానా లేదు. ఇప్పుడే కాదు. నా చిన్నప్పటినుంచీ ఇంతే! క్లాస్ టెస్ట్ పెట్టినప్పుడల్లా క్లాస్ లో నేనే ఫస్ట్ వచ్చేవాడిని. తీరా యాన్యువల్ ఎగ్జామ్స్ వచ్చేసరికి ఏదోక ఆన్సర్ మర్చిపోవడం-రమణ గాడికి ఫస్ట్ మార్క్ లు రావడం జరిగేది. అందాకా ఎందుకు కాలేజీలో చదివేప్పుడు ఆరునెలలు కామేశ్వరి ఇంటి చుట్టూ తిరిగినందుకు ఆ అమ్మాయి జాలిపడి ఫలానా రోజు సినిమాకు రమ్మని రాసిన వుత్తరం మా రూమ్మేట్ కి దొరికింది. వాడు ఝూమ్మంటూ ఆమెతో సినిమాకెళ్ళి- చివరకు ఆమెనే పెళ్ళి కూడా చేసేసుకున్నాడు. వీటన్నికంటె దారుణమయిన విషయం ఏమిటంటే- నేను ఆ రోజుల్లోనే వెరయిటీ నవల రాయాలని చేతబడికి సంబంధించిన వివరాలన్నీ ఆంధ్రప్రదేశ్ అంతా తిరిగి సేకరించాను. నవల సగం రాశాక రెండు నెలలు బద్ధకించేసరికి యండమూరి కాస్తా ఆ నవల రాసి క్రెడిట్ కొట్టేశాడు. అందాకా ఎందుకూ మొన్నటికి మొన్న- ఫారెస్ట్ మీద నవల రాయాలని మా కజిన్ బ్రదర్ ఫారెస్ట్ రేంజర్ గా పని చేస్తున్న ఓ అడవికెళ్ళి అడవులకు సంబంధించిన వివరాలన్నీ సేకరించుకొని నవల రాయడం మొదలుపెట్టానో లేదో ఇంకో రచయిత అదే సబ్జెక్ట్ తో సీరియల్ మొదలు పెట్టేశాడు..."

మేము అడ్డుపడకపోతే అతనలా అన్నం, నీరు లేకుండా యుగాల తరబడి చెప్తూనే వుంటాడని మాకు అనుభవపూర్వకంగా తెలీడం వల్ల ఠక్కున అతని నోరు మూసేశాము.

"అదంతా ఎందుగ్గానీ ఇప్పుడు నీ ఏడుపుకి కారణం ఏమిటో చెప్పు చాలు" అన్నాడు జనార్ధన్.

"అదే చెపుతున్నా గురూ! నాకు చిన్నప్పటినుంచీ-"

"అదే వద్దన్నాను ఇప్పటి సంగతి మాట్లాడు! చిన్నప్పటి సంగతి చెప్పకు" కోపంగా అన్నాన్నేను.

"ఇప్పటి సంగతే చెపుతున్నా గురూ! నాకు చిన్నప్పటినుంచి 'లక్' లేదని చెప్పాను కదా! ఎన్నో వందలసార్లు నేను పూర్తి చేసిన క్రాస్ వర్డ్ పజిల్స్, రకరకాల పోటీలు ఎన్నో కేవలం వెంట్రుక వాసిలో తప్పిపోతుండేవి! దానర్థం ఏమిటి? నాకు అన్నీ వున్నాయ్ గానీ నా పేరుకి 'లక్' లేదనే గదా! అందుకే మొన్న భారత్ బ్రాందీ వాళ్లు పెట్టిన స్లోగన్ పోటీలో స్లోగన్ రాసి రంగారెడ్డి పేరు మీద పంపించాను. అందుకే రంగారెడ్డికి మొదటి బహుమతి వచ్చింది. ఇప్పుడు రంగారెడ్డే విమానంలో మద్రాస్ వెళ్ళి సినీ స్టార్ విద్యతో భారత్ బ్రాందీ ఒక పెగ్ తాగి డిన్నర్ చేసి" ఇంక చెప్పలేక మళ్ళీ భోరుమని ఏడ్చాడతను.

అప్పటిగ్గానీ మాకు సంగతంతా అర్థం కాలేదు. చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ మీద అందరికి విపరీతమయిన జాలి కలిగింది.

"బెటర్ లక్ నెక్ట్స్ టైమ్" అంటూ ఓదార్చి అతనింటివరకూ తీసుకెళ్ళి వాళ్ళావిడకు అప్పజెప్పాము.

"ఈ రాత్రి కొంచెం మీ ఆయన్ని జాగ్రత్తగా చూస్తుండమ్మా! ఏమయినా అఘాయిత్యం చేసినా చేయవచ్చు" అని హెచ్చరించాం ఆమెను.

మేము తిరిగి వచ్చేసరికి రంగారెడ్డి తను జరుపబోతున్న విమాన ప్రయాణం గురించి చాలా ఉత్సాహంగా అందరితో చర్చిస్తున్నాడు.

"నేను గుంటకల్లో పనిచేసేప్పుడు ఓ కొండదొర చెప్పాడు గురూ- థర్టీఫైవ్ ఇయర్స్ ఏజ్ దాటాక విమాన ప్రయాణం చేస్తానని! అచ్చం వాడు చెప్పినట్లే జరుగుతోంది. వాడు సామాన్యమయిన కొండదొర కాదు! మన ప్రెసిడెంట్ కీ, ప్రధానమంత్రికి కూడా వాడే చెప్పాడు" అందరికీ రంగారెడ్డిని చూస్తే ఈర్ష్యగానూ వుందీ, మేం చేయలేని పని అతను చేస్తున్నాడన్న ఆనందమూ కలుగుతోంది.

ఆ రోజు నుంచీ రంగారెడ్డి ప్రవర్తన పూర్తిగా మారిపోయింది. పొద్దున్నే కాలనీలో కొచ్చిన కూరగాయల బండివాడిని ఆపేశాడు.

"టమాటో ఎంత కిలో?" అడిగాడు రెడ్డి.

"మూడ్రూపాయల్సార్"

"ఏం రాజయ్యా? నేను ఎల్లుండి విమానంలో మద్రాస్ వెళుతున్నాననా ఏమిటి, ధరలు కూడా ఆకాశాన్నంటించేస్తున్నావ్! నేను వెళ్ళేది ఒక్క రోజేనయ్యా బాబు! ఆ సినిమా స్టార్ విద్యతో డిన్నర్ అవగానే మళ్ళా గంటలో హైదరాబాద్ చేరుకోనూ? సినిమా స్టార్ తో డిన్నర్ తీసుకుంటే నాకేం కొమ్ములొస్తాయా ఏమన్నానా? నువ్ టమాటో మూడు రూపాయలు చెప్తే ఎలా?"

"ఏంటి సార్? ఎల్లుండి విమానంలో మద్రాస్ వెళుతున్నారా?" ఆశ్చర్యంగా అడిగాడు రాజయ్య.

"తప్పేట్లు లేదు! ఆ భారత్ బ్రాంది కంపెనీ వాళ్ళు మొండి బలవంతం చేస్తున్నారు. నాకేమో అక్కడ ఆఫీసులో చచ్చేంత వర్క్ వుంది. సెలవు ఇస్తారో ఇవ్వరో తెలీదు. వెళ్ళకపోతే ఆ భారత్ బ్రాందీ వాళ్ళూ, ఆ సినీ స్టార్ ఏమనుకుంటారోనని మళ్ళీ అదొకటి! పోనీలేగదాని ఆహ్వానిస్తే వీడికింత టెక్కా అనుకోరూ! మన గొడవలు వాళ్ళకేం తెలుస్తాయ్!"

"సినిమా స్టార్ విద్యతో డిన్నర్ చేస్తారా సార్?" మరింత ఎగ్జైట్ అయిపోతూ అడిగాడు రాజయ్య.

"వాళ్ళ మాట కాదని అనలేం కదా! సరదాగా చేయక తప్పదిక"

"అబ్బ! ఎంత అదృష్టం సార్ మీది?"

"ఆ- మనకిలాంటివి అసలు ఇంట్రెస్టు వుండవోయ్ ఏదో ఒక...."

ఆ సాయంత్రం మా ఆఫీస్ కాంటీన్ లో టీ తాగి వక్కపొడి కొడుక్కుంటున్నప్పుడు మళ్ళీ ఫోజు ప్రారంభించడం మాకు వినిపించింది.

"ఇదిగో-రాములూ ఒక వక్కపొడి పొట్లాం ఇవ్వు! అన్నట్టు మర్చిపోయాను ఎల్లుండి విమానంలో మద్రాస్ వెళ్ళి సినీస్టార్ విద్యతో డిన్నర్ చేయాలి! విమానంలో కొంచెం తిప్పినట్లుంటుందట కదా! అలాంటప్పుడు ఉపయోగించడానికి స్పెషల్ వక్కపొడి ఏదయినా వుందా మన దగ్గర?" ఇలా అడుగడుగునా తన మద్రాస్ విమాన ప్రయాణం గురించి బలవంతంగా అందరికీ చెపుతూనే వున్నాడు.

రెండు రోజుల్లో భారత్ బ్రాంది కంపెనీకి చెందిన ఓ సేల్స్ మేనేజర్ స్వయంగా మా కాలనీ కొచ్చి రంగారెడ్డికి ఫ్లైట్ టికెట్స్ ఇచ్చి వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడు ఉదయం ఎనిమిదీ యాభైకే విమానం.

ఆ రాత్రి మాకెవరికీ నిద్రపట్టలేదు.

రంగారెడ్డి ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లు చేస్తూనే వున్నాం. రంగారెడ్డి మాత్రం బయట మా కాలనీ ఘూర్కాతో మాట్లాడుతున్నాడు.

"రేప్పొద్దునే లేసి విమానంలో మద్రాసెళ్ళాలోయ్! అందుకని ఈ రాత్రికి పెందలాడే నిద్రపోతాను. కొంచెం నువ్వు ఇవ్వాళ ఎర్లీగా రౌండ్స్ కొట్టడం మంచిది" చాలా కాజువల్ గా మాట్లాడుతున్నట్టు నటించసాగాడతను.

"రేపు విమానంలో మద్రాసెళ్తున్నారా సాబ్?"

"పర్సనల్ గా నాకు విమాన ప్రయాణం ఇష్టం వుండదనుకో- ఆ కంపెనీ వాళ్ళు బలవంతం చేయడం వల్ల"

"ఆహా! అదృష్టం సార్ మీది"

"ఆ విమాన ప్రయాణం దేముందిలే ఈ రోజుల్లో వెయ్యి రూపాయలు పారేస్తే ఢిల్లీ వెళ్ళవచ్చు"

రాత్రి తొమ్మిది గంటలకు రంగారెడ్డి ఇంటి దగ్గర్నుంచి అందరం ఎవరిళ్ళకువాళ్ళు బయల్దేరబోతుంటే జనార్థన్ ఓ ఇంగ్లీష్ డెయిలీ తీసుకుని హడావుడిగా వచ్చాడు.

"గురూ! మొన్న గౌహతిలో జరిగిన వాయుదూత్ విమాన ప్రమాదం గురించి ఇందులో రాశారు చూశారా?" అడిగాడు గాబరాగా.

ఆ మాటలతో అందరం ఎలర్ట్ అయిపోయాం.

"ఏం రాశారు?" అడిగాడు రంగారెడ్డి అనుమానంగా.

"ఆ రోజు కంట్రోల్ టవర్లో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ ఎక్కడికో వెళ్ళాడట... అక్కడ బిల్స్ రాసుకుని రికార్డులు మెయింటెయిన్ చేసే అసిస్టెంట్ ఫ్లైట్ కాప్టెన్ కి ఆదేశాలు ఇచ్చేశాడు. దాంతో ఆ విమానం కొండక్కొట్టుకుని మటాష్ అయిపోయిందిట."

అందరికీ ఆశ్చర్యం కలిగింది.

"అదేమిటి? ట్రాఫిక్ కంట్రోలర్ డ్యూటీ అసిస్టెంట్ చేసేస్తూంటాడా?" అడిగాడు శాయిరామ్.

"అదే! మన రైల్వేలే కూడా అంతేగా? డ్రైవర్ ఎవరితోనయినా హస్కు కొడుతుంటే అసిస్టెంట్లు నడిపేస్తుంటారు" అన్నాడు అప్పలాచారి.

"అవునవును! గార్డు డ్యూటీ ఒకోసారి బఠానీలవాడు చేస్తూంటాడు కదా"

"అన్ని చోట్లా అది మామూలే లేవోయ్! లారీ డ్రైవర్లు నిద్రపోతుంటే క్లీనర్లు నడపడం అందరికీ తెలిసిందేగా?"

"కానీ వాటి సంగతివేరు, విమానం సంగతివేరు"

"అది మిగతా దేశాల్లో సంగతి. మనదేశంలో అన్నీ ఒకటే. మినిష్టర్లు చేసే పనులు సెక్రటరీలు చేస్తుంటారు. సెక్రటరీలు చేసే పని డిపార్టుమెంట్ ఆఫీసర్లు చేస్తుంటారు"

యాదగిరి జనార్ధన్ చేతిలోనుంచి ఆ పేపర్ తీసుకుని చకచక చదవసాగాడు.

"అరె బాప్రే! దిసీజ్ టూ మచ్ భాయ్" అన్నాడు గుండెలు బాదుకుంటూ.

"ఏమిటి?" మరింత ఆత్రుతగా అడిగాడు రంగారెడ్డి.

"ఏమాత్రం అనుభవంలేని పైలెట్లు ప్రస్తుతం ఇండియన్ ఎయిర్ లైన్స్ విమానాలు నడుపుతున్నారట!" అందరం ఉలిక్కిపడ్డాం.

"ఏమాత్రం అనుభవం లేనివాళ్ళా?"

"ఏమాత్రం అంటే చాలా తక్కువ"

"ఎందుకలా చేస్తున్నారు వాళ్ళు?"

"షార్టేజ్ భాయ్! ఆర్టీసీవోళ్ళు స్ట్రైక్ చేసినప్పుడూ, రైల్వేవోళ్ళు స్ట్రైక్ చేసినప్పుడూ గవర్నమెంట్ ఎవర్నంటే ఆళ్ళను డ్రైవర్లు జేసి నడిపించడంలే? గప్పుడే గదా యాక్సిడెంట్లయి ప్రయాణం జేసేటోళ్ళందరూ దేవతలయిపోతున్రు! ఇది కూడా గట్లనే"

"దిసీజ్ టూ మచ్" అన్నాడు రంగారెడ్డి భయంగా.

"గంతేకాదు ఇన్ స్ట్రుమెంట్ లాండింగ్ ప్రోగ్రాంభీ మంచిగా లేదంట. రాడార్ ఫెసిలిటీ ఎన్నో ఎయిర్ పోర్ట్స్ లో లేవంట. కంట్రోల్ టవర్స్ లో స్టాఫ్ ఎప్పుడూ తక్కువేనంట. దీనికితోడు షార్టేజ్ ఆఫ్ ఇంజనీర్స్! అందుకని విమానాల్లో చిన్నచిన్న సాంకేతిక లోపాలున్నా అలాగే ఎగురుతుంటాయన్నమాట. చాలా ఎయిర్ పోర్టుల్లో 'రన్ వే' మొదలయినట్లు సూచించే ఎప్రోచ్ లైట్స్ కూడా పనిచేయడం లేదంట- కారణ ఏమిటంటే వాటిల్లోని బల్బులు ఎక్కువగా దొంగిలింపబడుతున్నాయి గనుక మాట్లాడితే కొత్త బల్బులు వేయడం కుదరదంటున్నారు"

అప్పటికే రంగారెడ్డి ముఖంలో భయం స్పష్టంగా కనిపించింది మాకు.

ఎందుకయినా మంచిదని యాదగిరి దగ్గర్నుంచీ పేపర్ లాక్కుని చింపి అవతల పారేశాం.

"ఆ! ఇవన్నీ మామూలేలే- మన దేశంలో ఏ ఫీల్డ్ తీసుకున్నా ఇలాగే అవకతవక లుంటాయి మరి! ఈ మాత్రానికే బెదిరిపోతే ఎలా?"

"అందాకా ఎందుకు? మనదృష్టం బాగుండాలేగానీ లేకపోతే మన గవర్నమెంట్ పరిపాలనకు ఇంట్లోనే చావమా ఏమిటి? గవర్నమెంట్ కట్టిన హౌసింగ్ బోర్డ్ ఇళ్ళు కూలిపోతే అందులో వున్నాళ్ళు తప్పించుకోగలరా? ఫ్యాక్టరీల తాలూకూ పొల్యూషన్ ఆ చుట్టుపక్కల వున్న నీళ్ళల్లో కొచ్చి ఆ నీళ్ళు తాగినవాళ్ళు చావకుండా తప్పించుకోగలరా? కల్తీ ఆహారం సరేసరి! స్లోపాయిజనింగే కదా! గూండాలు సరదాగా కత్తులు తీసుకుని రోడ్ మీద వెళ్ళేవారిని పొడిచి నవ్వుకోవడం, పోలీసులు లాకప్ లో ఎదురుతిరిగినవాళ్ళను చట్నీ చేసెయ్యడం- వీటికంటే విమాన ప్రయాణం ప్రమాదకరమైనదా ఏంటి?" రెడ్డికి ధైర్యం చెపుతూ అన్నాడు శాయిరామ్.

"అవునవును! మనకేం భయం లేదులే" అన్నాడు రెడ్డి ధైర్యం తెచ్చుకుంటూ. అదీగాక మనవి అంత తేలిగ్గాపోయే ప్రాణాలయితే మన రాష్ట్ర రాజధానిలో వుంటూ కూడా ఇంతకాలం బ్రతికి ఉండేవాళ్ళమా?"

అందరం ఇళ్ళకు చేరుకున్నాం.

ఉదయం బేగంపేట ఎయిర్ పోర్టు చేరుకున్నాం. ఎంట్రెన్స్ టికెట్ తీసుకుని లోపలకు వెళ్ళాం.

అప్పటికే బాంబే, ఢిల్లీఫ్లైట్స్ కోసం జనం నిండిపోయి వున్నారు.

భారత్ బ్రాందీ కంపెనీ తరపు సేల్స్ ఆఫీసర్ రంగారెడ్డిని కల్సుకున్నాడు.

"మీకిచ్చిన టికెట్ ఆ కౌంటర్ లో చూపించి కన్ ఫరమ్ చేసుకోండి" చెప్పాడతను.

వెళ్ళి క్యూలో నిలబడ్డాడు రంగారెడ్డి. కాసేపటి తరువాత బోర్డింగ్ టికెట్ తీసుకుని మా దగ్గరకొచ్చాడు మళ్ళీ.

వేరే నగరాలకు వెళ్ళే ప్రయాణీకులు సెక్యూరిటీ చెక్ కోసం క్యూలో నిలబడ్డారు.

హఠాత్తుగా ఎనౌన్స్ మెంట్ వినిపించింది.

ఢిల్లీ నుంచి మద్రాస్ వెళ్ళే బోయింగ్ అప్పుడే లాండ్ అయిందని...

రంగారెడ్డి మొఖంలో కొంచెం భయం కనబడుతూనే వుంది.

గంటయినా సెక్యూరిటీ చెక్ కి ఎనౌన్స్ మెంట్ రాకపోయేసరికి ప్రయాణికులందరూ ఎంక్వయిరీ కౌంటర్ దగ్గర గుమికూడారు.

"మరేం లేదండీ! ఒకసైడ్ రెక్క కొంచెం లూజ్ అయిందట... అందుకని ఆలస్యం అవుతోంది" అందామె.

మా గుండెల్లో రాయిపడినట్లయింది.

సరిగ్గా అప్పుడే ఎనౌన్స్ మెంట్ వినిపించింది.

"ప్రయాణీకుల్లోగానీ, వారికి సెండాఫ్ ఇవ్వడానికి వచ్చినవారిలో గానీ వెల్డింగ్ తెలిసిన వెల్డర్స్ ఎవరయినావుంటే వెంటనే ఎయిర్ పోర్ట్ మేనేజర్ని కలుసు కోవలసిందిగా కోరుతున్నాం!"

రంగారెడ్డి మొఖం పాలిపోయింది.

ఈలోగా ఓ పైలట్ హడావుడిగా మరో ఎయిర్ పోర్టు అధికారి దగ్గరకు పరుగెత్తుకొచ్చాడు.

"బాక్ ట్యూబ్ పంచరయినట్లుంది సార్... గాలి తగ్గిపోయింది. ఆ రోడ్ మీద పంక్చర్స్ వేసే కుర్రాడిని పిలిపించండి! అర్జెంట్" చెప్పాడతను.

వెంటనే ఆ కుర్రాడిని తీసుకురావడానికి ఎయిర్ లైన్స్ కారు దూసుకెళ్ళిపోయింది బయటకు.

"మా కో- పైలట్ పని చేయనంటున్నాడు! ఇక్కడింకెవరయినా దొరుకుతారేమో చూడండి."

"అదేమిటి? ఎందుకు పనిచేయడు?"

"అతను ఇప్పటికే షార్టేజ్ వల్ల రెస్ట్ లేకుండా పనిచేస్తున్నాడు."

"కానీ ఇంత సడెన్ గా ఇక్కడ కో- పైలట్ ఎవరు దొరుకుతారు?"

"ఎవరోకరిని చూడండి! మద్రాస్ కి గంట ప్రయాణమేగా! నేనే ఎలాగోలా మానేజ్ చేసుకుంటాను! నా పక్కన కూర్చుని నేను నొక్కమన్న మీటలునొక్కి, రివర్స్ గేర్ లాగగలుగుతే చాలు."

ఎయిర్ పోర్ట్ అధికారి ఓ క్షణం ఆలోచించాడు.

"మా బామ్మర్దిని తీసుకెళ్ళండి! వాడికి పాపం చిన్నప్పటినుంచీ విమానం పైలట్ అవ్వాలని కోరిక! అదృష్టం బావుండక ఫైరింజన్ డ్రైవరయాడు గానీ లేకపోతే..."

పైలట్ ఓ క్షణం ఆలోచించాడు.

"అతనికి విమానాల గురించి ఏమయినా తెలుసా?"

"తెలీటమా? మొత్తం ఎనిమిది రకాల విమానాల బొమ్మలున్నాయి వాళ్ళింటి అల్మారాలో! ఒకోటీ ఆరొందలు పెట్టి కొన్నాడు. అవి చెడిపోతే వాడే రిపేర్ చేసుకుంటాడు"

"ఆమాత్రం వస్తే ఇంకేం కావాలి? మా కో-పైలట్ కంటే నయం కదా? వాళ్ళింట్లో నాలుగే బొమ్మలున్నాయట!"

వాళ్ళు మాట్లాడుతుండగానే ఇంకో అధికారి పరుగుతో వచ్చాడు.

"సార్ విమానం ఫ్లోరింగ్ సింక్ అవుతోందిట! ఎలా ఇప్పుడు!"

"మనమేం చేయగలం? ఇంజనీర్లు షార్టేజ్ కదా! ఎలాగోలా మద్రాస్ దాకా వెళ్ళేలా చూడమని మన కార్పెంటర్ తో చెప్పు"

"కార్పెంటర్ చూసి అయిదారుచోట్ల చెక్కముక్కలు వేసి మేకులు కొట్టాడుసార్! అయినాగానీ ముందు వరుసలో కూర్చున్న వాళ్ళకాళ్ళు కిందకు వేలాడుతున్నాయ్"

"గంటసేపు జర్నీయే కదయ్యా! కాళ్ళు సీట్లో పెట్టుకుని కూర్చోమను"

అతను వెళ్ళగానే ఇంకోవ్యక్తి వచ్చాడు.

"సార్! బోయింగ్ లో కాఫీ ఫలహారాలు అన్నీ అవుటాఫ్ స్టాక్. ఏం చేయమంటారు?

"మన కాంటీన్ నుంచి సప్లయ్ చేయండయ్యా"

"మన దగ్గర కూడా లేవు సార్! నిన్న పండగ కదా! కంట్రాక్టర్ రాలేదు."

"అయితే బయట రోడ్ పక్కన ఒకడు పొయ్యి, కళాయి పెట్టుకుని బజ్జీలు చేస్తున్నాడు చూడు. వాడి దగ్గర వున్నవన్నీ కొనేసి సప్లయ్ చేయండి."

"సార్" కౌంటర్ దగ్గర్నుంచి ఒకామె పిలిచింది. "మీకు ఫోన్! కంట్రోల్ టవర్ నుంచి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ పిలుస్తున్నాడు"

అతను పరుగుతో వెళ్ళి ఫోన్ అందుకున్నాడు.

"సార్ మా ఆవిడా, పిల్లలూ రైల్లో అమెరికా వెళుతున్నారు. స్టేషన్ కెళ్ళి సెండాఫ్ ఇచ్చి వస్తాను. అంతవరకూ నా బదులు మా ఆఫీస్ స్వీపర్ నా డ్యూటీ చేస్తాడు. మీ ఫర్మిషన్ అడుగుదామని"

"నీ డ్యూటీలు రోజూ చేసేది వాడే కదయ్యా- ఇవాళ పర్మిషనెందుకు ప్రత్యేకంగా?"

"ఎందుకంటే- నిన్న వాడి పొరబాటువల్లే కదా- ఆ వాయుదూత్ ముక్కలయింది. అందుకని వాడిని కోప్పడ్డారట ఎంక్వయిరీలో! వాడికి కోపం వచ్చింది. మీరు వప్పుకుంటేగానీ చేయనంటున్నాడు."

"సరే- మాట్లాడమను వాడిని"

"హల్లో అంగముత్తూ ఏం ఫర్లేదులే! ఇవాళ ప్లేన్లు పడినా నిన్నే మీ అనంగానీ- కొంచెం చూసో్క- మన రాజ్ సింగ్ స్టేషన్ కు వెళ్ళి వచ్చేవరకూ-"

ఫోన్ పెట్టేశాడతను.

అప్పుడే మళ్ళీ పైలట్ ఇంకో వ్యక్తితో పాటు హడావుడిగా వచ్చాడు.

"సార్- ఈ మీటియోరోలాజికల్ వాళ్ళ వెదర్ రిపోర్ట్ మీద నిన్నటి తారీఖుంది- అదేమంటే ఇష్టమయితే తీసుకో- లేకపోతే పొమ్మంటున్నాడు. పదిహేను రోజుల్నుంచీ ఇదే రిపోర్ట్ ఇస్తున్నాడు."

వెదర్ రిపోర్ట్ తెచ్చిన అధికారి కస్సుమంటూ లేచాడు.

"వెదర్ నిన్నటి వెదర్ లాగానే వుందయ్యా! అసలు పదిహేను రోజుల్నుంచీ మారటం లేదది! నేనేం చేయను? అందుకని అదే ఇచ్చాను కావాలంటే డేట్ మార్చి రాస్తాను ఇటివ్వు"

అవతల ఏరోడ్రోమ్ అంతా మంచుపట్టి భీకరంగా వుంటే వెదర్ క్లియర్ అని ఎలా రాస్తావయ్యా!"

"నువ్వెక్కడో పిచ్చాడిలాగున్నావే యాక్చువల్ వెదర్ కీ, వెదర్ రిపోర్టుకీ సంబంధం ఎందుకుంటుందయ్యా! దాని దారిదాన్దే! కావాలంటే ఇవాల్టికి నా బైనాక్యులర్స్ ఇస్తానుగానీ- ఈ రిపోర్ట్ తీసుకుని సంతకం చెయ్! రేపు కావాలంటే వెదర్ రిపోర్ట్ మారుస్తాను."

ఆ అధికారి ఇద్దరికీ సర్దిచెప్పాడు.

"ఇవాల్టికి పోనీవయ్యా! రేపట్నుంచీ రోజుకోరకంగా మార్చి వెదర్ రిపోర్ట్ ఇస్తానంటున్నాడుగా"

పైలట్ గొణుక్కుంటూ సంతకం చేసి వెదర్ అధికారి మెడలోని బైనాక్యులర్స్ తీసుకుని వెళ్ళిపోయాడు.

సరిగ్గా అప్పుడె వెల్డింగ్ మిషన్ తో ఓ వ్యక్తి వచ్చాడక్కడికి.

"ఏం సార్! మొత్తం ఒక సైడ్ రెక్కంతా వెల్డింగ్ చేసినా ఆర్రూపాయలేనా సార్! ఇదే నేను బస్ కి చేస్తే అరవై రూపాయలు చార్జ్ చేస్తాన్సార్!"

"మరి ముందు ఆర్రూపాయలు అన్నావ్ కదయ్యా!"

"రెక్క చివర్లో కొంచెం వెల్డింగ్ అంటే నిజంగా కొంచెమే అనుకున్నాను సార్! తీరా చూస్తే మొత్తం విరిగి వేలాడుతోంది. అందుకని స్ట్రాంగ్ గా వెల్డింగ్ చేసి పారేశాను. మద్రాస్ చేరేవరకూ ఊడదది! కావాలంటే చూస్కోండి"

"సరే ఇంతకూ ఇప్పుడెంతిమ్మంటావ్!"

"నలభై రూపాయలివ్వండి"

"అంత డబ్బిస్తే రేపు మాకు ఆడిట్ అబ్జెక్షన్ వస్తుందిరా!"

"అయితే ఓ పని చేయండి సార్! ఈడు మా చిన్నమ్మ కొడుకు. వెల్డింగ్, ఫిట్టర్ పనులు జబర్దస్త్ చేస్తాడు. జర ఈడిని మీ ఇండియన్ ఎయిర్ లైన్స్ లో ఇంజనీర్ గా ఉద్యోగంలోకి తీసుకోండి. మీ దగ్గర ఇంజనీర్లు షార్టున్నారని 'ఇండియా టుడే' లో రాశారు కదా"

ఎయిర్ పోర్ట్ అధికారి ఓ క్షణం ఆలోచించాడు.

"అచ్చా! సరే- ఇప్పుడే పనిలో చేరమను"

వాడి తమ్ముడు ఆనందంగా సెల్యూట్ కొట్టాడు.

"వెళ్ళరా! ఆ మూల రూమ్ లోకెళ్ళి నేను చెప్పానని చెప్పి ఇంజనీర్ డ్రస్ వేసుకో పో."

"సరిగ్గా అప్పుడే ఎనౌన్స్ మెంట్ ప్రారంభమయింది. మద్రాస్ ప్రయాణీకులు సెక్యూరిటీ చెక్ కెళ్ళాలని!

రంగారెడ్డి కెవ్వున కేకవేసి ఎయిర్ పోర్ట్ బయటకు పరుగెత్తడం ప్రారంభించాడు.

అందరం అతని వెనుక పడ్డాం!

అప్పుడు మెలకువ వచ్చింది నాకు. గుండె వేగంగా కొట్టుకుంటోంది. బయట రంగారెడ్డి గొంతు గట్టిగా వినబడుతోంది. ఓరినీ! ఇదంతా కలా?"

లేచి వాళ్ళింటివేపు నడిచాను. అప్పటికే టైమ అయిదవుతోంది. అచ్చం నాకు వచ్చిన కలలాంటిదే తనకూ వచ్చినట్లుంది. అంతా వర్ణించి అందరికీ చెపుతున్నాడతను.

అందరం అతనికి ధైర్యం చెప్పి ఎయిర్ పోర్టుకి బయల్దేరదీశాము.

సెక్యూరిటీ చెక్ ఎనౌన్స్ మెంట్ కోసం ఎదురు చూస్తూండగా వినిపించింది ఎనౌన్స్ మెంట్.

"మద్రాస్ ఫ్లైట్ తాలూకూ లాండింగ్ గేర్ జామ్ అయిపోవడం వల్ల బాంబే నుంచి ఇంజనీర్స్ వచ్చి రిపేర్ చేయవలసి వుంది. అంచేత ఈ ఫ్లైట్ రాత్రి ఎనిమిది గంటలకు బయల్దేరును. ప్రయాణీకులు తను లంచ్ కూపన్స్ కౌంటర్ దగ్గర కలెక్ట్ చేసుకోవచ్చును."

రెడ్డి ముఖంలో భయం స్పష్టంగా కనిపించసాగింది. కాళ్ళూ చేతులూ వణుకుతున్నాయ్?

"చూశారా! అదృష్టం మనయందుండబట్టే లాండింగ్ గేర్ ఇక్కడే జామ్ అయింది. ఇదే ఆకాశంలో వుండగా ఫెయిలయితే ఏమయిపోయుండేవాడిని" అన్నాడు గాబరాగా.

"పద మళ్ళీ సాయంత్రం ఎనిమిదింటికి వద్దాం" అన్నాడు శాయిరామ్.

"ఊహూ! వద్దు బ్రదర్! నేనసలు విమానంలో మద్రాస్ వెళ్ళను. నాకు ఇంకొన్ని రోజులు బ్రతకాలని వుంది" అంటూ కౌంటర్ దగ్గర కెళ్ళి టికెట్ కేన్సిల్ చేసుకున్నాడు.

అందరం అతనిని వెంబడించాం ఇంక చేసేదేమీలేక.

* * * * *

## ఆహా! మన ట్రాన్స్ పోర్ట్

మెదక్ లోని బబ్రిపూర్ వద్ద లారీలో ప్రయాణం చేస్తున్న పాతికమంది ప్రయాణీకులు లారీ ప్రమాదంలో మరణించిన విషయం న్యూస్ పేపర్స్ లో చదివిన క్షణం నుంచీ మా కాలనీలో అందరం విషాదంలో మునిగిపోయాం.

ఆ వార్తవిని రాష్ట్ర ముఖ్యమంత్రి 'దిగ్భ్రాంతి' వ్యక్తం చేసిన విషయం కూడా మేము న్యూస్ పేపర్లో చదివాం. మా కాలనీ వాళ్ళందరం కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన విషయం గురించి న్యూస్ పేపర్లో రాయమని మా గోపాల్రావ్ ని అడిగాం గానీ గోపాల్రావ్ వప్పుకోలేదు.

దిగ్భ్రాంతి అనేది కేవలం గొప్పాళ్ళకే గానీ లేదా గొప్ప పదవుల్లో ఉన్నవారికి మాత్రమే కలుగుతుందనీ, సామాన్య ప్రజలకు కలగదనీ, అంచేత న్యూస్ పేపర్లు ఆ విషయం రాయరనీ చెప్పాడు.

మాకు ఆ మాట వినేసరికి ఆశ్చర్యం కలిగింది.

"కేవలం గొప్పాళ్ళకూ, పెద్ద పదవుల్లో ఉన్నవారికే అది కలిగేట్లయితే మరి మాకెందుకు కలిగినట్టు?" గోపాల్రావ్ ని అడిగాడు శాయిరామ్.

"ఇంకా తెలీనట్లు అడుగుతారేంటి? మన కాలనీలో కూడా గొప్పాళ్ళయిపోయారన్న మాట చాలామంది! అందుకే అది కలిగింది" అన్నాడతను.

"మేం గొప్పాళ్ళయినప్పుడు మా 'దిగ్భ్రాంతిని పేపర్లో వేయవచ్చు కదా!" లా పాయింట్ తీశాడు రంగారెడ్డి.

గోపాల్రావ్ నవ్వాడు.

"మీరు గొప్పాళ్ళయిన విషయం మీకూ నాకూ తెలుసుగానీ బయటి ప్రపంచానికి తెలీదుకదా! తెలిసే వరకూ ఆగండి" అన్నాడతను.

మర్నాడే న్యూస్ పేపర్లో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీదొర స్టేట్ మెంట్ చూశాం.

"ఆర్టీసీ బస్సులు కాకుండా ప్రైవేట్ వాహనాలలో ప్రజలు ఎక్కువగా ప్రయాణం చేయటం వల్ల అటు ఆర్టీసీకి నష్టాలు రావటమే కాకుండా ఇటు ప్రయాణీకులు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. కనుక ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం చేయటాన్ని నిషేధించాలి" అవటాని చెప్పారాయన.

మాకందరికీ ఆ స్టేట్ మెంట్ చూసేసరికి అమితమయిన ఆనందం కలిగింది.

"ఆయన చెప్పిన మాట నిజమే! ఈ లారీల్లో ఎవరూ ప్రయాణం చేయకపోతే ప్రమాదాల్లో ఎవరూ చనిపోరు కదా!" అన్నాడు రంగారెడ్డి సపోర్ట్ చేస్తూ.

"అవును! నన్నడిగితే ప్రయాణీకులను తీసుకెళ్ళే లారీ డ్రైవర్ లను షూట్ చేయాలి" అన్నాడు శాయిరామ్.

"అసలు పల్లెటూళ్ళల్లోని ప్రజలందరినీ ఎడ్యుకేట్ చేయాలి. లారీల్లోనూ, ఇతర ప్రైవేట్ వాహనాల్లోనూ ప్రయనించటం వల్ల ప్రాణాలు పోగొట్టుకునే ప్రమాదం ఉందని వారందరికీ మనం వివరంగా చెప్పాలి!" అన్నాడు చంద్రకాంత్.

"అంటే మనందరం అదో సోషల్ సర్వీస్ లాగా చేపట్టాల్సిన కార్యక్రమం అవుతుందన్న మాట!" అన్నాడు జనార్ధన్ సైడ్ ఫోజిచ్చి ఓ చేయి గోడమీద ఆనిస్తూ.

"మన ఆర్టీసీ ఎమ్ డీగారు పాపం ప్రజల ప్రాణాల గురించి అంత ఓవర్ గా జాలి పడుతూన్నప్పుడు, మన వంతు కర్తవ్యం మనం కూడా నెరవేర్చాలి కదా!" అంది డిటెక్టివ్ రచయిత్రి రాజేశ్వరీదేవి.

"అంటే మన కాలనీ వాళ్ళందరం కలసి మన రాజధాని చుట్టుపక్కలున్న ఊళ్ళకెళ్ళి మన ఆర్టీసీ చైర్ మెన్ దొరగారి మనోవేదననూ, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు గురించీ- అందరికీ చెప్పగలుగుతే మనవంతు కర్తవ్యాన్ని మనం నెరవేర్చిన వారిమవుతాం!" అన్నాడు గోపాల్రావ్.

ఆ తరువాత ఆదివారంనాడే ఆ కార్యక్రమాన్ని చేపట్టాలని పార్వతీదేవి సూచించింది.

అందరం ఆ సూచనను అంగీకరించాం!

ఆరోజు తెల్లారుజామునే నిద్రలేచి ఆడామగా కలసి ఓ పదిమంది సోషల్ సర్వీస్ కోసం బయల్దేరాం.

బస్ డిపో చేరుకోగానే ప్లాట్ ఫారం మీద బస్ సిద్ధంగా కనిపించింది. అందరం ఆనందంగా ఆ ఎర్రబస్ లో కూర్చున్నాం.

"చూశారా! మన ఆర్టీసీ ఎంత అభివృద్ధి అయిందో! పాసింజర్ బస్ లు, లగ్జరీ బస్ లు, సెమీ లగ్జరీ బస్ లు- ఎలా కిటకిట లాడిపోతున్నాయో!" అన్నాడు రంగారెడ్డి ఆనందంగా.

"అవును! ఇంత అద్భుతమయిన బస్ సర్వీస్ పెట్టుకుని ఆ ఊరోళ్ళు లారీలూ ఎందుకెక్కుతారు నాకర్థం కావటం లేదు" అన్నాడు శాయిరామ్.

అందరం కాసేపు భారత ప్రజల అజ్ఞానం గురించి మాట్లాడుకున్నాం.

"నిజానికి మన బస్ ఋ మనదేశంలోనే మొదటి బహుమతిని పొందాయ్!" అన్నాడు చంద్రకాంత్. "మిగతా రాష్ట్రాల బస్ లన్నీ మన తెలుసు బస్ లముందు బలాదూర్ అట" అన్నాడతను.

మన ఏపీఎస్ ఆర్టీసీకి ఎన్టీఆర్ టైమ్ లో వరుసగా రెండేళ్ళు నేషనల్ అవార్డు రావటం మాకందరికీ గుర్తువచ్చింది.

"మనదేశంలో ఏమిటి నీ తలకాయ? ఆసియాలోనే బెస్ట్ సర్వీస్ అట మనది! మొన్న ఉప్పల్ డిపో కండక్టర్ చెప్పాడు. పైగా అతను అల్లాటప్పా కండక్టరేం కాదు. నా ఫాన్! మొత్తం వరల్డ్ లోని బస్ సర్వీసెస్ గురించి టెరిఫిక్ నాలెడ్జ్ ఉందతనికి! అతనే కాదు. సాధారణంగా నా ఫాన్స్ అసోసియేషన్ వాళ్ళందరూ అంతే! చాలా క్లాస్ ఆడియెన్స్" అంటూ జనార్ధన్ ఇంకా చాలా చెప్పబోయాడుగానీ చప్పున అతనిని కట్ చేసేశాడు శాయిరామ్.

మా బస్ అగిడిపల్లి చేరుకుంది.

దిగి ఊళ్ళోకి నడిచాం అందరం. ఆ ఊరి సర్పంచ్ మమ్మల్నందరినీ చూసి ఆప్యాయంగా ఆహ్వానించాడు.మా అందరికీ క్షణాల్లో 'చాయ్' సప్లయ్ చేయించాడు. ఊరివాళ్ళందరూ మా చుట్టూ మూగారు ఆసక్తిగా.

మాకు వాళ్ళ వినయం, విధేయత చాలా ఆనందం కలిగించినయ్.

"పాపం! కపటం, కల్మషం లేని ప్రజలంటే కేవలం ఈ విలేజర్సే" అన్నాడు గోపాల్రావ్.

మేము వెంటనే మా ప్రచారం ప్రారంభించాం.

ఆర్టీసీబస్ లు మాత్రమే వాళ్ళందరూ ఎక్కాలనీ, లారీలు, ఇతర ప్రైవేట్ వెహికల్స్ ఎక్కితే ప్రమాదానికి గురి అయి ఎగిరిపోతారనీ-

"అదిగో చెప్పకపోతిరి? మీరు బాంకోళ్ళు కాదా?" అనడిగాడు సర్పంచ్ దెబ్బతిన్న ఫీలింగ్ తో.

"బాంక్ వాళ్ళం కాదు సర్పంచ్ సాబ్! సోషల్ సర్వీస్ వాళ్ళం!"

"సోషల్ సర్వీసా! గిదేందో కొత్తగెళ్ళినట్లున్నది? మీరు మాకు అప్పులు గిట్ల ఇస్తరా?" అనుమానంగా అడిగాడు.

"నోనో- అప్పులిచ్చే సంస్థకాదు మాది. సంఘసేవ చేస్తామన్న మాట" అంటూ రంగారెడ్డి వివరించబోయేలోగానే అందరూ మూకుమ్మడిగా లేచి ఎవర్దారిన వాళ్ళు వెళ్ళిపోబోయారు.

"థూ నీయవ్వ పైసలియ్యనికి వచ్చినోండ్లు కాదంట"

మేము హడావుడిగా అందరినీ చుట్టుముట్టి రెండు నిముషాలు మా మాటలు వినమని బ్రతిమాలాంగానీ వాళ్ళు మమ్మల్నీ తీసుకుంటూ పారిపోయారు.

సర్పంచ్ మమ్మల్ని చూసి జాలిపడ్డాడు.

"ఇగో ఈడ మావోండ్లు ఎట్లున్నారంటే వచ్చినోండ్లు పైసలయిన ఇయ్యాలె- గుడంబయిన తాగిపించాలె! లేకుంటే నువ్వేం జెప్పినగానీ ఇనరు."

"దిసీజ్ టూమచ్!" అన్నాడు శాయిరామ్ ఇంగ్లీష్ లో.

"మరి మేము వాళ్ళను ఎడ్యుకేట్ చేయటానికొచ్చాం కదా! ఇదంతా వాళ్ళ బాగుకోసమేకదా!" అన్నాడు రంగారెడ్డి.

"బాగు గురించి జెపుతున్నవ్! మంచిగనే ఉన్నది! మగర్ గిందుల నీకేమీ ఫాయిదా లేకుండానే ఉన్నదా? అహా! ఒక్కమాట అడుగుతా!"

మేము అదిరిపడ్డాము.

"అరె! ఇదంతా సోషల్ సర్వీస్ అని జెప్పినాం గదువయ్యా! ఇంక ఫాయిదా ఏడకెళ్ళుంటది?" కోపంగా అడిగాడు యాదగిరి.

సర్పంచ్ మొఖంలో రంగు మారిపోయింది.

"ఇగో సోషల్ సర్వీసుగానీ, మరింకేదైనాగానీ ఇయ్యాళ్ళేపు పైసల్లేకుండా ఎవళ్ళు జేస్తారువయ్యా? ఈడెవళ్ళూ చెవిల పూల్ పెట్టుకుని లేరు సేరో! మస్తుమందిని చూసినాం! మీకు ఆర్టీసీవోళ్ళిచ్చే పైసల్లో సగం మాకియ్యండ్రి! మీరేం జెప్పినాగానీ ఇంటాం! గంతనేగాని ఫుక్కట్ గా ఇననికి ఈడెవళ్ళూలేరు పోండ్రి" అనేసి తనదారిన తను వెళ్ళిపోయాడు.

అందరం అతనిని మళ్ళీ చుట్టుముట్టి బ్రతిమాలాం అసలు విషయమంతా చెపుతూ.

చాలాసేపటి తర్వాత కన్విన్స్ అయాడతను.

"మీరెవళ్ళూ పైసల్దినటం లేదని నాకు భరోసున్నదివయ్యా! కానీ ఈ ఊరోండ్లు మాత్రం ఇనరు. ఆళ్ళువచ్చి మీరు చెప్పేడిది ఇనాల్లంటే ఒక్కటే రాస్తా ఉన్నది."

"ఏమిటది?" ఆత్రుతగా అడిగాడు శాయిరామ్.

"మీతోని కలసి ఈడకొచ్చిన ఈ పోరిలున్నయ్ గదా! ఆళ్ళను డాన్స్ చేయమను! బరాబర్ వస్తారందరూ!"

ఆమాట వింటూనే పార్వతీదేవి, రాజేశ్వరి, సావిత్రమ్మ ముగ్గురూ వులిక్కిపడ్డారు.

"ఏమిటి? మేము డాన్స్ జేయాలా? ఏం పిచ్చిపిచ్చిగా ఉందా? మేమెట్లా కనబడుతున్నాం నీకు?" అంటూ అతనిమీద విరుచుకుపడేసరికి సర్పంచ్ కంగారుపడి పోయాడు.

"గట్ల గరమౌతారేందమ్మా! సోషల్ సర్వీస్ అంటున్రు గదా డాన్సులు చేస్తారనుకొని దాన్ని గురించ చెప్పిన! ఇష్టం లేకుంటే జేయకండ్రి! మీ మీటింగ్ కి పబ్లిక్ గావాల్నన్నారని అయిడియా జెప్పినా!"

మేము మాట్లాడుతూండగానే చాలామంది ఊరోళ్ళు నెత్తిన కూరగాయల బుట్టలతోనూ, పాలడబ్బాలతోనూ, బస్ స్టాండ్ దగ్గరకు వెళుతూ కనిపించారు.

మేమూ వాళ్ళదగ్గరకు చేరుకుని మా ప్రచారం ప్రారంభించాం.

"ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ గారూ ప్రభుత్వమూ మీమీద జాలితోనే, మీరు ప్రమాదాలకు గురి కాకూడదనే మీకు మనవి చేస్తోంది. కేవలం ఆర్టీసీ బస్ ల్లోనే ప్రయాణం చేయండి. మీ ప్రాణాలను కాపాడుకోండి."

వాళ్ళందరూ మొఖాలు చూసుకున్నారు.

"ఆర్టీసీవాళ్ళు కేవలం మీ కోసమే పాసింజెర్ సర్వీస్ లు నష్టం వస్తోన్నా నడుపుతున్నారు" చెప్పాడు రంగారెడ్డి.

"ఆమాట నిజమేనే! పద్దినాల కిందట పాపం ఇరవై అయిదుమంది మెదక్ డిస్ట్రిక్ట్ ల లారీ ప్రమాదం జరిగి ఖతమయిపోయిన్రు!" అన్నాడొక ఊరతను మా మాటలు సపోర్టుచేస్తూ.

ఆ మాటతో మాకు చాలా బలం వచ్చినట్లయింది.

వెంటనే లారీలు, లేక ఇతర ప్రైవేట్ వాహనాలమీద ప్రయాణం చేయుట వలన కలిగే నష్టములు అన్న సబ్జెక్ట్ మీద అరగంట చెప్పిందే చెపుతూ ఉపన్యాసం ఇచ్చాడు రంగారెడ్డి.

"నేను సినిమాలో హీరోవేషం వేయడానికి మద్రాసు వెళుతున్నప్పుడుకూడా లారీ యాక్సిడెంట్ లో ఒకడు చనిపోయినట్లు పేపర్లో చూశాను" అన్నాడు జనార్ధన్.

ఆమాట అనటంతోనే కొంతమంది జనార్ధన్ చుట్టూ మూగారు.

"ఏ సిన్మాలో ఏసినావు నువ్వు?" అడిగాడో స్టూడెంట్.

జనార్ధన్ జవాబు చెప్పకుండా సిగరెట్ వెలిగించుకుంటూ సినిమా హీరోలా ఆ పక్కనేవున్న చెట్టుమీద చేయివేసి వెనక్కు తిరిగి చూశాడు.

"ఒకటేమిటి? ఆరు సినిమాలు!" అన్నాడు చాలా నిర్లక్ష్యంగా.

ఈలోగా ఓ ఇసుకలారీ పెద్దగా హారన్ కొట్టుకుంటూ వచ్చి ఆగింది.

మరుక్షణం అందరూ బుట్టలతో, పాలడబ్బాలతో ఎగబడి లారీ ఎక్కసాగారు. మాకు మతిపోయినట్లయింది.

"సోదరులారా! లారీలలో ప్రయాణం చేయకండి! మీ ప్రాణాలు పోగొట్టుకుంటారు. మా సర్వే ప్రకారం లారీలో ప్రయాణించేవారిలో నూటికి పదిహేనుమంది లారీ ప్రమాదాల్లో చనిపోతున్నారు" అన్నాడు శాయిరామ్.

వాళ్ళ మొఖాల్లో మార్పు కనిపించింది.

అది చూసి యాదగిరి వుత్సాహం పుంజుకున్నాడు.

"ఇగో- మీకు తల్లున్నది, నాయనున్నాడు, భార్యున్నది, పిల్లగాండ్లున్నారు. నువు లారీ ప్రమాదంలో చచ్చిపోయినావంటే గీళ్ళందరి గతేం కావాలి? పరిషానౌతరా లేదా? మొన్న యాక్సిడెంట్ ల పోయినోండ్ల సంగతేమాయె? తననికి తిండి గిట్టలేక రోడ్లమీద వడిన్రన్నట్లు- ఎవళ్ళూస్తరువయా వాళ్ళను. లారీలోళ్ళు జూస్తరా? గదే నువ్వు ఆర్టీసీ బస్ యాక్సిడెంట్ ల జచ్చివావనుకో! గవర్నమెంటూకుకుంటదా? ఖామోషుంటదా? బరాబర్ నీవోండ్లకు పైసలిస్తది! మీ పిల్లగాండ్లకు కొలువులిస్తది"

యాదగిరి స్పీచ్ చాలా పవర్ ఫుల్ గా పనిచేసింది.

రెండు నిమిషాల్లో అందరూ లారీ దిగిపోయి కింద నిలబడ్డారు.

లారీవాడు మావంక కోపంగా చూస్తూ వెళ్ళిపోయాడు.

సరిగ్గా అప్పుడే దూరంగా దుమ్మురేపుకుంటూ వస్తోన్న ఎర్రబస్ కనిపించింది.

"చూసిన్రా! నేను జెప్పలే! ఆర్టీసీవోళ్ళు మీ గురించే మంచిగ బస్ లు ఏసిన్రని! ఆరామ్ తోటి సీట్ల కూర్చుని శహర్ పోవాలె! బేఫికర్ గుజరాయించాలె!"

అందరూ మావేపు అభినందన పూర్వకంగా చూశారు.

"అవ్ సార్! ఇన్ని దినాలు పాగల్ గాండ్ల లెక్క లారీల్లోనే పోతున్నాం!" అన్నాడొకతను.

అందరం చూస్తుండగానే ఎర్రబస్ కిటకిటలాడుతూ బయటకు వేలాడుతున్న జనంతో ఆగకుండా వెళ్ళిపోయింది.

"రోకో రోకో" అని అరుస్తూ అందరం బస్ వెనుక పరుగెత్తాంగానీ బస్ ఆగలేదు. మాకు కోపం కూడా ఆగలేదు.

"యాదిగిరీ నెంబర్ నోట్ చేసుకో! ఆర్టీసీ ఎమ్ డీ గారికి చెపుదాం ఈ బస్ సంగతి!" అన్నాడు రంగారెడ్డి ఆవేశంగా.

యాదగిరీ డయిరీ తీసి చకచకా బస్ నెంబర్ రాసుకున్నాడు.

సరిగ్గా అప్పుడే ఇంకో ఇసుకలారీ పెద్దగా హారన్ కొట్టుకుంటూ వచ్చి ఆగింది.

అందరూ అమాంతం లారీ మీదకు ఎగబడబోయారుగానీ మేమందరం చేతులు పట్టుకుని వారికి అడ్డంగా నిలబడ్డాం.

"సోదరులారా తొందరపడకండి! ఇంకో బస్ వచ్చే టైమవుతోంది! మనం ఓ గంట ఆలస్యంగా వెళ్ళినా ఫర్లేదుగానీ క్షేమంగా, సురక్షితంగా వెళ్ళాలనీ ఆర్టీసీ వాళ్ళు చెప్తున్నారుకదా!"

ఆ లారీ వెళ్ళిపోయింది. ప్రతి పావుగంటకు బస్సుందన్నారుగానీ ఒక్కటీ కనిపించటం లేదు- ఈ సారి గంటయినాగానీ బస్ జాడలేదు. ఉండుండి ఎక్స్ ప్రెస్ బస్ లు మాత్రం వేగంగా వెళ్ళి పోతున్నయ్.

"ఏమయ్యా మీ దిక్కుకెళ్ళి మా పన్లన్ని ఖరాబయి పాయె! ఇంకో గంటయెనా అంటే పాలుపోయించుకునేటోళ్ళు వాపస్ జేస్తారు. కూరగాయల ధరగూడ గిరాయించి పోతది- ఈ నష్టమంతా ఎవళ్ళు ఇయ్యాలె?" అన్నాడొకతను మావేపు కోపంగా చూస్తూ.

మా గుండెలు ఝల్లుమన్నాయ్.

ఆ నష్టమంతా మమ్మల్ని ఇమ్మంటారేమోనని.

సరిగ్గా అప్పుడే దూరంగా మరో ఎర్రబస్ కనిపించింది.

"అదిగో వస్తోంది. చూశారా! ఎప్పటికీ తొందరపడగూడదు! ఓర్పే విజయం! అన్నాడు శాయిరామ్.

"అదిగూడ ఆగదు! మేం దినాం సూట్టంలే? ఒక్క బస్ కూడా ఆగదీడ!" అన్నాడింకొకతను.

మాకు భయం వేసింది.

ఆ బస్ కూడా ఆగకపోతే మా పరువు పోతుంది.

"యాదగిరి! అందరం అడ్డు నిలబడదాం లేకపోతే వాడు కూడా ఆపేట్లు లేడు" అన్నాడు రంగారెడ్డి అప్పటికప్పుడే గొప్ప ప్లాన్ ఆలోచిస్తూ.

అందరం రోడ్ కడ్డంగా నిలబడ్డాం.

"బస్ ఓ పక్కకు ఒరిగిపోయి నెమ్మదిగా వచ్చి ఆగింది. డ్రైవర్ మావేపు కోపంగా చూశాడు.

"నీయవ్వ ఎవళువయా మీరు? ఎందుకాపిన్రీడ?" అడిగాడు మండిపడుతూ.

"వీళ్ళందరూ బస్ ఎక్కాలి!"

"ఏడెక్కుతారు? నా నెత్తిమీదనా? జాగా ఏడున్నది? కండ్లులేవా మీకు? ఓవర్ లోడున్నది కానరాలే?"

అప్పటికే జనం బయటకు వేలాడటంతో ఇంకెవరూ బస్ ఎక్కటానికి వీల్లేకపోయింది. ఆ బస్ వెళ్ళిపోయింది.

మాకు భయం మొదలయింది. వీళ్ళందరూ కలసి మమ్మల్ని తిడతారేమోనని.

"నీయవ్వ ఆర్టీసీ బస్ లో పొమ్మని చెప్తున్రు ఏడాగినయ్ బస్ లు?" మమ్మల్ని ఎటాక్ చేయటం ప్రారంభించాడొకతను.

"ఈపాలు గిట్ట ఖరాబయినాయో- ఈ సాలెగాండ్లను ఈడనే తందాం" అన్నాడింకొకడు.

"ఏయ్- ఏమ్మాట్లాడుతున్నావ్?" అంటూ ఎదురు తిరిగాడు యాదగిరి.

"లేకుంటే ఏందిది? పోయేటోళ్ళను రుకాయిస్తుంటివి? బస్ ఋ ఆపకపోతివి! దమాకేమన్న ఖరాబయి ఈడకొచ్చిన్రా మీరు" మూడోవాడు మీదకొచ్చాడు.

దాంతో మాకు పరిస్థితి క్షీణిస్తోందని అర్ధమయిపోయింది.

సరిగ్గా అప్పుడే ఇంకో ఇసుకలారీ వచ్చిందిగానీ దాన్నిండా అప్పటికే జనం నిండిపోయి వుండటంతో ఆగకుండా వెళ్ళిపోయింది.

"ఏయ్! ఇప్పుడేమంటవ్! గిప్పుడు లారీల జాగా దొరికెడిది కూడా భరోసాలేదు."

మా దగ్గరకొచ్చి నిలదీశాడింకోవ్యక్తి.

మాకేం చెప్పాలో తెలీలేదు.

"ఇంకో ఎర్రబస్ ఇంకో పావుగంటలో వస్తుంది కదా?"

"అది అస్సలు ఆగదు! జమానాకెళ్ళి జూస్తున్నాం"

"ఇగో! ఇంకో అర్ధగంటలో మేమీడకెళ్ళిపోవాలె! బస్ రుకాయిస్తరో, లారీ రుకాయిస్తరో మాకెరుకలే! లేకుంటే బొక్కలిరుగుతయ్" మరోడు వార్నింగిచ్చాడు.

మా మొఖాల్లో రంగులు మారిపోయాయ్.

"బుద్ధి తక్కువయి వచ్చాం" అన్నాడు శాయీరామ్.

"అయినా సోషల్ సర్వీస్ గవర్నమెంట్ తో సంబంధం లేనిదయితేనే చేయాలిగానీ ఉంటే ఇలాగే అవుతుంది" అన్నాడు రంగారెడ్డి.

మరో పావుగంటలో ఇంకో లారీవచ్చిందిగానీ అదికూడా కిటకిట లాడిపోతూండటం వల్ల ఆగకుండా వెళ్ళిపోయింది.

మాకు టెన్షన్ పెరిగిపోతోంది.

అందరూ డైరెక్ట్ గానే మమ్మల్ని తిడుతున్నా వినబడనట్లు దిక్కులు చూస్తున్నాం!

ఈసారి ఇంకో లారీ దూరంగా కనిపించింది.

ఆ లారీ కూడా ఆగకపోతేవాళ్లు మమ్మల్ని చావగొడతారన్న విషయం అర్థమయిపోయింది మాకు!

అందుకని అందరం పరుగుతో రోడ్ మధ్యకెళ్ళి చేతులూపుతూ లారీకి అడ్డంగా నిలబడ్డాం.

లారీ వచ్చి ఆగింది.

దాన్నిండా కూడా జనం కనిపించేసరికి మా పై ప్రాణం పైనే పోయినట్లయింది.

"ఎలాగోలా వీళ్ళను ఎక్కించుకెళ్ళండి డ్రైవరుగారూ ప్లీజ్" అంటూ బ్రతిమాలసాగాడు గోపాల్రావ్?

"మాకేం ఆకలున్నదా? నీయవ్వ జగా ఏడున్నదింకా?" అంటూ లారీ భాషలో. మమ్మల్ని ఏవేవో తిట్టి మళ్ళీ స్టార్ట్ చేసుకెళ్ళిపోయాడు.

మరో రెండు లారీలు కూడా జనంతో నిండి వెళ్ళిపోయినయ్.

"ఏయ్! ఈ పాలకు, కూరగాయలకు మీరే పైసల్ గట్టండ్రి" అంటూ రంగారెడ్డి చొక్కా పట్టుకున్నాడో యువకుడు.

అందరం అతికష్టం మీద అతని చొక్కా విడిపించాం.

ఈసారి మరోలారీ కనిపించేసరికి మళ్ళా మేము రోడ్ కి అడ్డంగా నిలబడ్డాం. దగ్గరుకొస్తున్న కొద్దీ లారీ వేగం పెరిగిపోవటంతో మాకు గుండె ఝల్లుమంది.

"వాడు తాగి ఉన్నట్లున్నాడు" అన్నాడు శాయిరామ్ వణుకుతూ. దగ్గరికొచ్చేసినా లారీ వేగం తగ్గకపోవటంతో అందరం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్డు అంచులకు పరుగెత్తాం! అందరం ఒకేసారి పరుగెత్తటంతో ఒకరిద్దరు కింద పడటం కూడా జరిగింది. పార్వతమ్మకి మోచేతులు కొట్టుకుపోయినయ్.

"ఇగో ఇంకొక్క అర్ధగంట టైమిస్తున్నాం! ఈ లోపట లారీ ఆపక పోయిన్రంటే మొత్తంమీద పైసలు మాకు గట్టాలె! సమజయిందా?"

సరిగ్గా అప్పుడే ఇంకో లారీ వస్తూ కనిపించింది.

మళ్ళా అందరం రోడ్డుకి అడ్డంగా నిలబడ్డాం.

లారీ ఆగింది.

సగం మేరకు జనం నిండిపోయి ఉన్నారు దానిమీద. డ్రైవరు అంతమందిని ఎక్కించుకోడానికి వప్పుకోలేదు.

"ఎవళ్ళయిన కిందపడితే ఆ ఫాల్తూ కిరికిరి నాకు తగులుకుంటది భాయ్. ఇంకో లారీలో రాండ్రి" అన్నాడు మళ్ళీ స్టార్ట్ చేయబోతూ.

"అట్లనకు స్వామీ! కావాల్నంటే ఓ పాతిక రూపాయలూ మేము ఎక్కువ ఇస్తాం! తీసుకో!" అంటూ బలవంతంగా ఓ పాతిక డ్రైవర్ చేతిలో పెట్టి అందర్నీ లారీ ఎక్కించాము. లారీ వెళ్ళిపోయింది.

"అమ్మయ్యా! కిరికిరి వదిలిపోయింది" అన్నాడు రంగారెడ్డి తేలిగ్గా గాలి పీల్చుకుంటూ.

"ఇంకోసారి ఛస్తే ఇలాంటి ఫాల్తూ సోషల్ సర్వీస్ చేయొద్దు" అన్నాడు శాయిరామ్.

"అయినా ఈ మూర్ఖపు ప్రజలకు మనం ఎంత చెప్పినా, ఏం చెప్పినా ప్రయోజనం లేదు. లారీల్లో వెళ్తూనే ఉంటారు. ఛస్తూనే వుంటారు!" అన్నాడు గోపాల్రావ్.

దూరంగా మరో ఎర్ర బస్ కనిపించింది.

"పదండి! మనదారిన మనం ఆ బస్ లో వెళ్ళిపోదాం!" అన్నాడు శాయిరామ్.

అందరం బస్ ఆపమన్నట్లు చేయి అడ్డంగా చాపాంగానీ బస్ ఆగలేదు.

"ఓ గంట ఆలస్యం అయితే అయింది. ఇంకో బస్ వచ్చాక వెళ్దాం! అంతేగానీ ఈ ఊరోళ్ళలాగా కొంప మునిగిపోయినట్లు లారీల్లో వెళ్ళాల్సిన ఖర్మ మనకేంటి?" అన్నాడు రంగారెడ్డి.

అందరం మాట్లాడుకుంటూనే ఉన్నాం అంతలోనే టైం ఒంటిగంటయిపోయింది. ఒక్క బస్ కూడా రాకపోయేసరికి మాకు చిరాకు మొదలయింది.

"నాకు ఆకలేస్తోంది! ఇంతవరకూ ఎప్పుడూ ఒంటిగంటవరకూ భోజనం చేయకుండా ఉండలేదు" అంది డిటెక్టివ్ రచయిత్రి రాజేశ్వరీ.

"నిజం చెపుతున్నాను. నాకు ఇందాకట్నుంచీ ఆకలికి కళ్ళు తిరుగుతున్నాయ్" అంది పార్వతీదేవి.

"అయినా ఈ దరిద్రపు బస్సులు ఒక్కటికూడా తగలడటం లేదేమిటి?" కోపంగా అన్నాడు శాయిరామ్.

"నాకు నాలుగింటికల్లా మా ఫ్రెండ్ వాళ్ళ గృహప్రవేశానికి వెళ్ళాలి! లేకపోతే చాలా ఫీలవుతాడు వాడు" అన్నాడు చంద్రకాంత్.

"మా బాస్ ఇవాళ సాయంత్రం మీటింగ్ కి ఫైల్స్ తీసుకుని రమ్మన్నాడు! లేకపోతే ఉద్యోగమే ఊడిపోయినంత ప్రమాదం జరుగుతుంది" అన్నాడు శాస్త్రి దిగులుగా.

"ఇవాళ ఆరింటికి మంజు టాకీస్ దగ్గర మా గాళ్ ఫ్రెండ్ ని కలుసుకోవాలి. లేకపోతే రేపట్నుంచీ ఆ విశ్వనాథం గాడికి గాళ్ ఫ్రెండయిపోతుంది" అన్నాడు స్టూడెంట్ సురేష్.

అప్పుడె ఆ ఊరి సర్పంచ్ వచ్చాడు ఓ సంచితో.

"అప్పటికెల్లి ఈడనే ఉన్రా మీరు?" అనడిగాడు ఆశ్చర్యంగా.

"బస్ కోసం చూస్తున్నాం!" అన్నాడు రంగారెడ్డి.

"బస్సా! ఈ టైమ్ ల బస్సేడున్నది? సాయంత్రం నాలుగ్గంటల కొకటున్నది!"

మా గుండెలవిసిపోయినయ్.

అప్పుడే లారీ వచ్చి ఆగింది.

సర్పంచ్ లారీ ఎక్కి మావేపు జాలిగా చూశాడు.

"మీరు భీ లారీలో ఎక్కండ్రి! బస్ గురించి నుల్చుంటే ఈడనే రుకాయించి పోతరు" అన్నాడతను.

మేము మొఖాలు చూసుకున్నాంగానీ లారీ ఎక్కడానికి ధైర్యం చేయలేకపోయాం!

లారీ వెళ్ళిపోయింది.

సాయంత్రం నాలుగ్గంటలకల్లా శోష వచ్చినట్లు వాలిపోయాం అందరం ఉండుండి దూరంగా ఉన్న పాకలో పాచిపోయిన జంతికలు మాత్రం తీసుకొచ్చి తలోటీ ఇస్తున్నాడు యాదగిరి.

అయినా బస్ జాడమాత్రం లేదు.

"నేను లారీలో వెళ్ళిపోతాను" హఠాత్తుగా పూనకం వచ్చినట్లు లేచి నిలబడింది రాజేశ్వరి.

"మీకేం పిచ్చెక్కిందా? లారీల్లో ప్రయాణం చేస్తే ప్రమాదమని అందరికీ చెప్పటానికొచ్చి మీరు లారీలో వెళతారా?" కోపంగా అన్నాడు శాయిరామ్.

"ఈ బోడి ఆర్టీసీ బస్సులను నమ్ముకోవటం నావల్లకాదు. మీరెవరొచ్చినా రాకపోయినా నేను లారీలోనే వెళ్తున్నా" అందామె మొండిగా.

నిజానికి మాకూ లోపల్లోపల లారీలోనో, ట్రాక్టర్ లోనో, టెంపోలోనో, ఎలాగోలా ఆ ఊరువదలి ఇంటికి చేరుకోవాలనుంది. సరిగ్గా అప్పుడే సర్పంచ్ సిటీకి వెళ్ళటం, పని చూసుకుని ఇంకో లారీలో తిరిగి రావటం కూడా జరిగిపోయింది.

"నీయవ్వ! ఇంకా బస్ గురించే ఇంతజార్ లో ఉన్నారు? అహహ" అంటూ వెళ్ళిపోయాడు.

అప్పుడె ఓ లారీ శరవేగంతో వచ్చి ఆగింది.

"ఆ! లష్కర్ లష్కర్ లష్కర్" అరచాడు క్లీనర్ మావేపు చూస్తూ.

రాజేశ్వరి పరుగుతోవెళ్ళి ఇసుకమీద ఎక్కికూర్చుంది.

ఆమె వెనుకే అందరం ఆర్టీసీ బస్ లను తిట్టుకుంటూ లారీ ఎక్కాం.

డ్రైవర్ కి మందు ఎక్కువయిపోవటం వల్ల లారీ పిచ్చెక్కినట్లు రోడ్డంతా తిరిగేస్తూ శరవేగంతోపోతోంది.

అయినాగాని మాకా ప్రయాణం రిస్క్ అనిపించలేదు. భయం వేయలేదు.

ఇంకా ఆర్టీసీ బస్ కోసం ఎదుర్చూడ నక్కర్లేదన్న నిజం ఎంతో ధైర్యాన్నిస్తోంది.

ఇసుకలో మా పక్కనే కూర్చున్న ఓ ఆర్టీసీ డ్రైవర్ న్యూస్ పేపర్ లోని ఓ అయిటమ్ గట్టిగా చదివి తన సహోద్యోగికి వినిపిస్తున్నాడు.

"విస్తీర్ణంలో ఆంధ్రప్రదేశ్ కంటే అతిచిన్న రాష్ట్రాలయిన మహారాష్ట్ర, తమిళనాడు, కర్నాటక, కేరళల్లో ఆంధ్రప్రదేశ్ కంటే కొన్ని వేల బస్ లు ఎక్కువగా తిరుగుతున్నాయ్. మన రాష్ట్రంలో మన ప్రజావసరాలకు సరిపోయేన్ని బస్ లు వేయాలంటే కనీసం పదహారువేల బస్ లు కొని నడపాల్సి ఉంటుంది. ఏనాటికయినా అది మన దివాణాకోరు ప్రభుత్వం వల్ల కాని పని! అంతవరకూ రాష్ట్ర ప్రజలు చచ్చినట్లు లారీల్లో తిరగాల్సిందే ఆర్టీసీ బస్ కోసం ఎదుర్చూస్తూ చావటం కంటే, బ్రతుకుమీద లాటరీ వేసుకుంటూ లారీల్లో తిరగటమే ఉత్తమం!"

మేమందరం ఆ వార్తలు వినీవిననట్లు ఊరుకున్నాం.

కాసేపటికి హైదరాబాద్ పొలిమేరల్లోకొస్తోండగా రోడ్ మీద కనిపించిన దృశ్యం చూసి షాకయ్యాం. రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొని నుజ్జునుజ్జయాయ్.

పోలీసులు వాటిమధ్య నుంచి డెడ్ బాడీస్ తీసి అంబులెన్స్ లోకి చేరుస్తున్నారు.

* * * * *

## ఆంధ్రాస్ ఆర్ కమింగ్

మాకాలనీలో చాలామంది పిల్లలు ఇంటర్ పరీక్షలు రాశారు. అయితే పరీక్షలు రాస్తున్నప్పుడే వాళ్ళ పరీక్షా ఫలితాలు ఎలా వుంటాయో మాకు తెలిసిపోయాయ్. ప్రశ్నాపత్రంలో ఒకటి రెండు ప్రశ్నలు తప్ప మిగతా వాటి గురించి తమ టెక్స్ట్ బుక్స్ లో ఎక్కడా ఏమీ లేదని, ఉన్నా ఆ పోర్షన్ సిలబస్ లో లేదని తామనుకున్నామనీ అన్నారు వాళ్ళు.

అయితే తీరా వాళ్ళ ఫలితాలు ఆ రోజు పేపర్లో వచ్చేసరికి కాలనీలో అందరికీ మతులు పోయినంత పనయింది.

అసలు చదవని వాళ్ళకు ఫస్ట్ క్లాస్, కొంచెం చదివిన వాళ్ళకు సెకండ్ క్లాస్, బాగా చదివిన వాళ్ళకు థర్డ్ క్లాస్ వచ్చాయ్.

ఎప్పుడూ డిస్టింక్షన్ లో పాసయ్యే ఒక్క అమ్మాయి మాత్రం తప్పింది.

మా అందరికీ అర్థమయిపోయింది.

"ఇది ఖచ్చితంగా కంప్యూటర్ పనే" అన్నాడు రంగారెడ్డి ఖచ్చితంగా.

"కంప్యూటర్ కాకపోతే ఇంత అవకతవకలుండవ్. నాకూ అదే అనిపిస్తోంది" అన్నాడు శాయిరామ్. ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ఇలాంటి అవకతవకలకు ప్రథమస్థానం వహిస్తున్న విషయం నిజమే అవడం చేత మిగతా వారందరూ కూడా మా అభిప్రాయాలతో ఏకీభవించారు. అయితే హఠాత్తుగా మాకో విషమ సమస్య ఎదురయింది.

అందరూ న్యాయంగా అయితే తప్పాలి గనుక వాళ్ళ భవిష్యత్తు గురించి పెద్దగా ప్లాన్ చేయడానికి ఏమీ లేకపోయింది.

"మళ్ళీ సెప్టెంబర్ లోనో, మార్చిలోనో పరీక్షలకు కట్టి పాసయినప్పుడు చూద్దాం!" అనుకున్నారు.

ఇంక గత్యంతరం లేక నగరంలోని అన్ని కాలేజీలకు అప్లికేషన్ లు గుప్పించాం. మామూలుగానే ఎక్కడా సీటు దొరకలేదు.

ఎవర్నడిగినా బి.ఎ. కయితే సీటు ఇస్తామంటున్నారు. బి.ఎ. చదివితే ఆ వచ్చే ప్యూన్ ఉద్యోగం కూడా రాదని మాకు తెలుసు.

"బి.కామ్, బి.ఎస్సీ, కంప్యూటర్ లాంటివి కావాలంటే ఆంధ్రప్రదేశ్ లో కుదరదు. మా కర్నాటక వెళ్ళండి" అన్నాడు ఓ కన్నడ ఫ్రెండ్.

"అక్కడ మనకే కోర్సు కావాలంటే అది చదువుకోవచ్చా?" ఆశ్చర్యంగా అడిగాం మేము.

"ఎంట్రెన్స్ కూడా లేకుండా చదువుకోవచ్చు."

"ఎంట్రెన్స్ కూడా లేకుండానా?" మరింత ఆశ్చర్యపోతూ అడిగాము.

"అవును...." మేము ఆశ్చర్యంలో మరింత లోతుకి కూరుకుపోయాము.

"అదే కాదు, ఇంజనీరింగ్, మెడికల్, ఫార్మసీ, పాలిటెక్నిక్, బి.ఇడి., ఏదైనా సరే."

అందరం ఘొల్లున నవ్వేశాం అతని మాటలకు.

"ఏం జోక్ చేస్తున్నావ్ రా నాయనా! ఎంట్రెన్స్ లేకుండా ఇంజనీరింగ్, మెడికల్, పాలిటెక్నిక్ లో సీట్లు దొరుకుతాయా?"

మిగతా వాళ్ళందరూ కూడా అతనిని పిచ్చివాడిని చూసినట్టు చూశారు.

"పిచ్చి నాక్కాదయ్యా! మీ ఆంధ్రాస్ కి ఎక్కింది. అడుక్కుతినే రాష్ట్రం! అడుక్కుతినే చదువులు! బోడి సినిమాలు తీయడంలోనే ఫస్ట్ మీరు!" అనేసి కోపంగా వెళ్ళిపోయాడతను.

ఒకవేళ వాడు చెప్పేది నిజమేనేమో" అన్నాడు గోపాల్రావ్ అనుమానంగా.

"ఏడ్చావ్! మనక్కావలసిన చదువు చదువుకోవడం ఇండియాలో ఎలా సాధ్యమవుతుంది?" అన్నాడు జనార్ధన్. "వాడు చెప్పేది ఇంకేదో దేశంలో కర్నాటక అనే ఊరు గురించి అయి వుంటుంది-"

"అయితే ఈ కర్నాటక అనేది ఒక వేళ ఎక్కడయినా విదేశాల్లో వుందేమో. ఎంక్వయిర్ చేద్దాం" అన్నాడు రంగారెడ్డి.

"అవును. ఆ పేరుతో ఇంకెక్కడో ఏదో దేశం వుండి ఉంటుంది. లేకపోతే మనదేశంలో మామూలు మిడిల్ క్లాస్ మనుషులకు చదువుకునే అవకాశం ఎందుకుంటుంది?" అన్నాడు శాయిరామ్.

"ఈ కిరికిరంత ఎందుకు భాయ్! జర వరల్డ్ మాప్ ల చెక్ జేస్తే మంచిగుంటది కద!" అన్నాడు యాదగిరి. ఎవరో ఇంట్లోకి పరుగెత్తుకెళ్ళి మాప్ తీసుకొచ్చారు. అందులో అన్ని దేశాలూ చూశాంగానీ ఎక్కడా కర్నాటక అనేది కనిపించలేదు.

"అయితే ఇది మనదేశంలోని కర్నాటకే అయి వుంటుంది" అన్నాడు గోపాల్రావ్ మళ్ళీ అనుమానంగా.

ఈలోగా చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ ఓ ఇంగ్లీష్ డెయిలీ తీసుకొచ్చాడు.

"ఇది మన పొరుగు కర్నాటక రాష్ట్రమే గురూ! ఇదిగో ఈ పేపర్ నిండా ఆ రాష్ట్రంలోని కాలేజీల ప్రకటనలే! ఎల్.ఎల్.బి., పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఇంజనీరింగ్, మెడిసిన్ అన్నీ ఎంట్రెన్స్ లేనివే వున్నాయక్కడ. మన దిక్కుమాలిన రాష్ట్రంలాగా ఎంట్రెన్స్ లూ, పిచ్చిరాంకులూ, కొశ్చెన్ పేపర్లు అవుటయి కొంతమంది రాజకీయ నాయకుల బంధువుల పిల్లలే సెలక్టవటాలూ ఇవేమీ లేవట! కేవలం సెకండ్ క్లాస్ లో ఇంటర్ పాసయితే, ఇంజనీరింగ్, మెడికల్ రెండింటికి అప్లయ్ చేసుకోవచ్చు-" న్యూస్ పేపర్లోని ప్రకటనలు చూస్తూ అన్నాడతను.

ఆ రాత్రి మా కాలనీలో చాలా కుటుంబాల్లో ఎవరికీ నిద్రపట్టలేదు.

"ఏమండీ! మన వాడికి మన రాజధానిలో ఎక్కడా పనికిమాలిన డిగ్రీకి కూడా సీటు దొరకలేదు కదా! వాడిని పోనీ కర్నాటకలో ఇంజనీరింగ్ లో చేర్చేద్దాం..." అంటోంది మా పక్కింటావిడ.

"సరే! వాడు ఇంజనీర్ కావాలని వాడి జాతకంలో రాసి పెట్టి వుందేమో! అందుకే మన రాష్ట్రంలో బి.ఏ.కి సీటు దొరకలేదు అంతా మనమంచికే" అన్నాడతను.

రంగారెడ్డి భార్య ఇంకో మెట్టు పైకెళ్ళిపోయింది.

"కర్నాటకలో నాలుగేళ్ళ నుంచీ వున్న వాళ్ళ పిల్లలకు కేవలం సంవత్సరానికి ఎనిమిది వేలే ఫీజుటండీ- ఇంజనీరింగ్ లో! అదీ ఎంట్రెన్స్ లో సెలక్టయితే ఇంకా తక్కువట! మనం కర్నాటకకు ట్రాన్స్ ఫర్ చేయించుకుని వెళ్ళిపోదాం పదండి- మన పిల్లలు పెద్దాళ్ళయేసరికి లోకల్ కాండిడేట్స్ అయిపోతారు-" అంటోందామె.

"కానీ మన రాష్ట్రం నుంచి కర్నాటక రాష్ట్రానికి నాకు ట్రాన్స్ ఫర్ ఇవ్వరే!"

"అయితే ఈ దిక్కుమాలిన ఆంధ్రప్రదేశ్ లో ఉద్యోగానికి రాజీనామా చెయ్యండి. కర్నాటకలో ఏదొక ఉద్యోగం దొరక్కపోదు."

మర్నాడు మీటింగ్ లో కొంతమంది కలిసి కర్నాటకలోని ఇంజనీరింగ్ కాలేజీలకు వెళ్ళి పరిస్థితేమిటో స్వయంగా కనుక్కోవాలని నిర్ణయించుకున్నాం.

హైదరాబాద్ కు దగ్గరగా వుంది గుల్బర్గా కనుక అక్కడికి చేరుకున్నాం అందరం. రైలు దిగగానే ఆటోవాళ్ళు "ఓరే ఖాజా! ఆంధ్రాస్ ఆయేరే! ఆంధ్రాస్ ఆయే" అని అరుచుకుంటూ మా చుట్టూ మూగారు.

"మేమంతా హోటల్ కెళ్ళాలి. ఎంత కావాలి?" అడిగాడు రంగారెడ్డి.

"టూ హండ్రెడ్ సర్"

అందరం అదిరిపడ్డాం.

"అంటే నువ్వనేది మా అందరికీ కలిపా?"

"కాద్సార్! ఒక్క ఆటో! అంటే ముగ్గురికి-"

"మరి మూడొందలంటావేమిటి?"

"మరి రెండొందలే మూలకి సార్! ఒక పూట మందు ఖర్చులేదు."

"ఏమిటి? ఒక పూట మా మందు ఖర్చు రెండొందలా? ఏయ్- సంవత్సరానిక్కూడా అంత ఖర్చవదయ్యా మాకు! మీటింగ్ రీడింగ్ ప్రకారం వస్తావా రావా?"

ఆటోవాళ్ళందరూ మొఖాలు చూసుకున్నారు.

"వీళ్ళు ఆంధ్రాస్ కాదురా! ఇంకెవరో అయివుంటారు. ఆంధ్రాసైతే ఇలా బేరాలాడరు మస్తు పైసలుంటయ్ ఆళ్ళదగ్గర" అన్నాడొకడు.

"అచ్చం ఆంధ్రాస్ లాగా భలే ఫోజ్ కొట్టార్లే" అన్నాడు ఇంకొకడు. అందరూ మమ్మల్ని వదిలేసి ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

మేము నడుస్తూ దగ్గర్లో వున్న ఒక లాడ్జికి చేరుకున్నాం.

"మాకు ఆరు డబుల్ రూమ్స్ కావాలి" అన్నాడు రంగారెడ్డి.

"ఎక్కడి నుంచి వచ్చారు మీరు?"

"హైదరాబాద్"

అతను ఆశ్చర్యపోయాడు.

"అంటే మీరు ఆంధ్రాసా?"

"అవును!"

"మరి మీ కార్లేవి!"

"కార్లా? కార్లేమిటి?"

"ఆంధ్రాస్ అయితే కార్లలో వస్తారు కదా! మీరు ఆంధ్రాస్ కాదు కదూ?"

"ఆంధ్రాసేనయ్యా! అయినా మేమెవరయితేనేం? రూమ్స్ వున్నాయా లేవా?"

"ఉన్నయ్ లెండి! అరే దస్తగిర్! వీళ్ళకు మామూలు రూమ్స్ ఇవ్వరా! ఆంధ్రాస్ ఇంకా రాలేదు. ఈ రాత్రికి వస్తారేమో! ఆ డీలక్స్ రూమ్స్ ఖాళీగానే వుండనీయండి"

మాకు వళ్ళు మండిపోయింది గానీ మధ్యలో తల దూర్చడమెందుకని ఊరుకున్నాం. త్వరగా రడీ అయి అందరం ఇంజనీరింగ్ కాలేజీకి బయల్దేరాం.

హోటల్ ఆవరణ దాటి రోడ్ మీద కొచ్చేసరికి ఓ కారు రివ్వుమంటూ వచ్చి మాముందాగింది. అందులో మంచి ఓ సూట్ వాలా దిగాడు.

"హలో సార్! నమస్తే- ఆంధ్రాస్ కదూ!" చిరునవ్వుతో పలకరించాడు.

"అవును!"

"నేనిప్పుడే అనుకున్నాను! వెరీ గ్లాడ్ టు మీట్ యూ! ఇలా పక్కకు రండి!" అన్నాడతను.

పక్కకు ఎందుకు రమ్మంటున్నాడో, అసలతను ఎవరో మాకేం అంతుబట్టలేదు.

ఏం జరుగుతుందో చూద్దామని రోడ్ పక్కనున్న చెట్టుకిందకు వెళ్ళి అతని చుట్టూ మూగాము.

"బ్రహ్మాండమయిన స్టాండర్డ్ సార్! ఫారిన్ స్టాండర్డ్! కారు చవక! ఎన్ని కావాలి?" అడిగాడతను. మాకు అర్థమయిపోయింది వాడెవరో స్మగుల్డ్ సామాన్లమ్మేవాడని!

వెంటనే శాయిరామ్ కుతూహలంగా అతని దగ్గరకు జరిగాడు.

"జపాన్ వాచీలున్నాయా? ఎలక్ట్రానిక్ వి"

"నాకు త్రీ ఇన్ వన్ కావాలి! దొరుకుతుందా?" అడిగాడు గోపాల్రావ్.

అతను ఆశ్చర్యంగా చూశాడు మావేపు.

"అదేమిటి? నేను స్మగుల్డ్ సామాన్లమ్మే వాడిననుకుంటున్నారా?"

మేము తెల్లబోయాం.

"కాదా? అయితే మరి ఇందాక మీరు దేన్ని గురించి మాట్లాడారు?"

"ఇంజనీరింగ్ అండ్ మెడికల్ సీట్స్ గురించి సార్! అదురుపాటు స్టాండర్డ్ వున్న కాలేజీలు! కారు చవక! ఎన్ని సీట్లు కావాలి?"

మాకు మతిపోయినంత పనయింది.

కర్నాటకలో ఇంజనీరింగ్ కాలేజీలు బోలెడున్నాయని తెలుసుగానీ మరీ ఇంత చవకలో- ఇలా వాళ్ళే మన దగ్గరకొచ్చి సీట్లు అమ్ముతారని తెలీదు.

"ఒక్క నిమిషం!" అని అతనితో చెప్పి మేమంతా అతనికి దూరంగా జరిగి మాలో మేము గుసగుసలాడుకోసాగాం.

"ఏయ్! మనం చౌకగా వస్తోందికదా అని తొందరపడి సీట్లు కొనేయకూడదు. మనకేం ఆసక్తి లేనట్లు కొంచెం బేరాలాడదాం! వాడు ధర తగ్గిస్తే తగ్గించవచ్చు!" అన్నాడు రంగారెడ్డి.

మళ్ళీ అందరం అతని దగ్గరకు నడిచాము.

"ఇదిగో చూడబ్బీ, ఒకో ఇంజనీరింగ్ సీట్ కి మూడువేలిస్తాం, ఇస్తే ఇవ్వు లేకపోతేలేదు" అన్నాడు అప్పలాచారి.

ఆ వ్యక్తి మా వంక విచిత్రంగా చూశాడు.

"నీయమ్మ- నాకప్పుడే డౌటొచ్చింది- ఆంధ్రాస్ అయితే ఇలా అడుక్కుతినే వాళ్ళలాగా వుండరే అని! పైగా కార్లులేవు! మీరు టమిళియన్స్ గానీ, కేరళైట్స్ గానీ అయుంటారు కదూ" అడిగాడు అతను.

"కాదు! మేము ఆంధ్రాసే" కోపంగా అన్నాడు గోపాల్రావ్.

"ఆంధ్రాసయితే ఇంత గీసిగీసి బేరాలడగరే! ఒకవేళ మీ ఫోర్ ఫాదర్స్ మద్రాస్కిగానీ, కేరళాగానీ చెంది వుంటారు"

అతను కార్లో వెళ్ళిపోయాడు.

తిన్నగా మేమందరం ఓ ఇంజనీరింగ్ కాలేజీకి చేరుకున్నాం.

ప్రిన్సిపాల్ రూమ్ చేరుకోగానే ప్యూన్ వినయంగా వంగి నమస్కారం చేసి తలుపు తెరిచి పట్టుకున్నాడు.

మాకు మతిపోయినంత పనయింది.

"అదేమిటి? ప్రిన్సిపాల్ గారి పర్మిషన్ తీసుకున్నావా?"

"మీరు ఆంధ్రాసే కద్సార్! పర్మిషన్ అక్కర్లేదండి! మీ కోసమే మా కాలేజీ కమిటీ మెంబర్లందరూ రెండ్రోజుల్నుంచి వెయిట్ చేస్తున్నారు సార్!"

మేము లోపలికి నడిచాం. మమ్మల్ని చూడగానే లోపల అందరూ ప్రేమగా చిరునవ్వు నవ్వారు.

"రండి! వెల్ కమ్ టు కర్నాటకా- ఇండియాలో మిగతా రాష్ట్రాలన్నిటికి విద్యాదానం చేస్తున్న మా రాష్ట్రానికి స్వాగతం" అన్నాడు ప్రిన్సిపాల్.

అందరం నమస్కరించి కూర్చున్నాం.

"ఎన్ని సీట్లు కావాలి?" అడిగాడు ప్రిన్సిపాల్.

"పన్నెండు"

"ఒండర్ ఫుల్! మీ బ్రీఫ్ కేస్ లేవీ!"

మేము అదిరిపడ్డాం.

"బ్రీఫ్ కేస్ లేమిటి?"

"అదే! ఆంధ్రాస్ బ్రీఫ్ కేస్ లో నోట్లకట్టలు తెస్తారు కదా!"

మేము నవ్వేశాం.

"మా దగ్గర అలాంటివేమీ లేవండి! మేము మామూలు మిడిల్ క్లాస్ వాళ్ళం"

అతను ఆశ్చర్యపోయాడు.

"ఆంధ్రాస లో మిడిల్ క్లాసువాళ్లుకూడా వుంటారా?"

"ఎందుకు వుండరండి? మేము ప్రత్యక్షంగా కనబడుతూనేవున్నాం కదా!"

ప్రిన్సిపాల్ వెంటనే ఎక్కడికో ఫోన్ చేశాడు.

"త్వరగారండి! ఇక్కడ కొంతమంది ఆంధ్రాస్ వచ్చారు! వాళ్లు బీదాళ్ళట! తమాషాగా లేదూ. రండి వాళ్ళను చూద్దురుగాని" అని కన్నడలో చెప్పి ఫోన్ పెట్టేశాడు.

మాకు వళ్ళు మండిపోతోంది- మమ్మల్ని 'జూ'లో జంతువుల్లా అతను ట్రీట్ చేయడం.

"ఇంతకూ డొనేషన్ ఎంతో చెప్తే మేం ఆలోచించుకుంటాం" అన్నాడు రంగారెడ్డి కోపంగా.

"డొనేషన్ మామూలే! ముప్ఫయివేలు. అదిగాక నాలుగేళ్ళ ఫీజు కూడా ముందే కట్టాలి"

"ఫీజెంత?"

"సంవత్సరానికి పన్నెండున్నరవేలు చొప్పున యాభయివేలు"

మాకు గుండాగినంత పనయింది.

"అదేమిటి? ఫీజు సంవత్సరానికి ఎనిమిదివేలే అన్నారు కదా"

"అది జనతా ప్రభుత్వం రోజుల్లో- ఇప్పుడు గవర్నర్ రూల్ కదా! ఆమాత్రం పెరగదేమిటి?"

మేము మాట్లాడకుండా లేచి బయటికొచ్చాం.

రోడ్ మీద కొచ్చేసరికి నలుగురు వ్యక్తులు మా చుట్టూ మూగారు.

"ఇంజనీరింగ్ మెడికల్ సీట్లుసార్! అయిదువేలు డొనేషన్- బెంగుళూరు, బీజాపూర్, తుంకూర్, కోలార్, హుబ్లి, ధార్వాడ్, ఖార్కి, బీదర్" అన్నాడొకతను.

"అయిదువేలేనా?" ఆశ్చర్యంగా అడిగాడు శాయిరామ్.

"అవున్సార్! కేవలం అయిదువేలు! ఎన్నిమ్మంటారు?"

"పన్నెండు కావాలి? మొత్తం మీద ఏమయినా తగ్గిస్తావా?" అడిగాడు రంగారెడ్డి.

"నాలుగువేలు సీటుచొప్పున ఇవ్వండిసార్- తలో అయిదొందలు అడ్వాన్స్ కట్టండి చాలు"

"మరి ఫీజుకూడా ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం కడతాం"

"ఏం ఫర్లేదు సార్! అంతా మీ ఇష్టం"

మేము డబ్బు లెక్కపెడుతుంటే అతనిపక్కనున్న రెండోవాడు ఘోల్లున నవ్వాడు.

"గోవిందా! గోవిందా! వాడు చెప్పిన కాలేజీల్లో చేరారో మీ పిల్లల భవిష్యత్తు గోవిందా గోవిందా!"

మేము కంగారుగా డబ్బు లెక్కపెట్టడం ఆపి వాడివేపు చూశాం.

"ఏమిటి నువ్వనేది?"

"ఆ కాలేజీలో చేరిన పిల్లలందరూ బెంగుళూరు కెంప్ గౌడ రోడ్ లో ఫుట్ పాత్ పక్కన పడివుంటారు చూళ్ళేదా?"

"అదేమిటి? ఎందుకలా పడివుండడం?"

"ఎందుకేమిటి సార్! డ్రగ్స్! అంతా డ్రగ్ ఎడిక్ట్స్ అయిపోతారు. ఆ తరువాత ఇంకేముంది గోవిందా, గోవిందా-"

మాకు గుండె ఆగిపోయినంత పనయింది.

"అంచేత నా దగ్గరున్న లిస్ట్ లోని కాలేజీల్లోనే చేరండి! ఫీజు యాభయ్ వేలు కడితే చాలు! నో డొనేషన్" మాకు ఎక్కడలేని ఆనందం కలిగింది.

"డొనేషన్స్ అస్సలు లేవా?"

"అస్సల్లేద్సార్-"

"మరి అక్కడ డ్రగ్స్ లేవా?"

"డ్రగ్స్ అస్సల్లేవు! మోస్ట్ డిసిప్లిన్డ్ ఇన్ స్టిట్యూషన్స్! సీటుకి రెండొందలు చొప్పున అడ్వాన్స్ కొట్టండి చాలు-"

మేము తలో రెండొందలూ పోగుచేస్తుండగా మూడోవాడు ఘోల్లున నవ్వాడు.

"డ్రగ్స్ లేవనగానే బోల్తాపడిపోయారు సార్! కానీ ఆ కాలేజీల్లో స్టాఫ్ లేరుసార్! ప్రొఫెసర్లంతా డిప్లొమా హోల్డర్స్-లాబొరేటరీలు లేవు. వర్క్ షాప్ లేదు ఇంక మీ పిల్లలు చూసోకండి! తాపీ మేస్త్రీలవుతార్సార్! ఇంజనీర్లు కాదు-"

మాకు ఏడుపొచ్చేసింది. రెండోవాడివేపు కోపంగా చూశాం.

"అతను చెప్పేది నిజమేనా?"

"అంతా అబద్ధం! మొన్నే ఒక కంప్యూటర్ కి కూడా ఆర్డరిచ్చారు మావాళ్ళు. మీ కుర్రాళ్ళు ఫైనలియర్ కెళ్ళే లోపల వచ్చేస్తుందది"

"మరి ఈలోగా ఏం చేస్తారు?"

"మరి ఈలోగా బోర్డ్ మీద బొమ్మలు గీసి చెప్తారు. కంప్యూటర్ రియల్ ఫోటోలు చూపిస్తారు- అంతకంటే ఇంకేం కావాలి?"

మాకు పిచ్చెక్కినట్టయింది.

ఈలోగా ఇంకోడెవరో దూరం నుంచి అరిచాడు.

"ఒరే మందారా! త్వరగా రా! అసలీ ఆంధ్రాస్ వస్తున్నారిక్కడ- త్వరగా రా రియల్ ఆంధ్రాస్ డబ్బుకట్టల్తో వచ్చారు-"

ఆ మాట వింటూనే వాళ్ళంతా పరుగుతో వెళ్ళిపోయారు.

మేం బ్రతుకు జీవుడా అని అక్కడినుంచి బయల్దేరాం.

వారం రోజులపాటు పాతిక కాలేజీలకు వెళ్ళి వివరాలన్నీ వాకబు చేసుకుంటూ డొనేషన్ ఱు బేరాలాడుకుంటూ చివరకు ఓ ఊళ్ళోని కాలేజీలో సీట్లు కొనేశాం.

"హమ్మయ్యా!- ఎలాగైతేనేం మన మధ్యతరగతి పిల్లలు కూడా ఇంజనీరింగ్ చదివే అవకాశం మనకిచ్చిన కర్నాటక ప్రజలకు జై" అన్నాడు రంగారెడ్డి.

అప్పుడె ప్రిన్సిపాల్ గదిలోకి ఓ వ్యక్తి పరుగెత్తుకెళ్ళాడు.

"మా డబ్బు మాకిచ్చేయండి సార్- మా వాడిక్కడ చదవనంటున్నాడు-" అంటూ బ్రతిమాలడం వినిపించింది మాకు.

"ఒకసారి కట్టిన డబ్బు ఏ పరిస్థితుల్లోనూ తిరిగి ఇవ్వబడదు అని బోర్డు పెట్టాం కద్సార్."

పావుగంటసేపు బ్రతిమాలి అతను కళ్ళవెంబడి నీరు పెట్టుకుంటూ బయటికొచ్చేసాడు.

మేమంతా అతనిచుట్టూ మూగాం.

"ఏమిటి? ఎందుకు డబ్బు వాపస్ అడుగుతున్నారు?"

"ఈ కాలేజీకి యూనివర్సిటీ రికగ్నిషన్ రాలేదంట సార్! కిందటి సంవత్సరం స్టూడెంట్స్ ని పరీక్ష రాయనీలేదట"

మా గుండెలవిసిపోయాయ్.

"రికగ్నిషన్ లేకుండా కాలేజీ పెడితే గవర్నమెంట్ ఎలా ఊరుకుంది?"

"గవర్నమెంట్ కేం సంబంధం? వాళ్ళు కాలేజీ పెట్టడానికి పర్మిషన్ ఇచ్చారు- అంతే! యూనివర్సిటీ ఎఫ్లికేషన్స్ తెచ్చుకోవడం కాలేజీ వాళ్ళ తలనొప్పి ఇక"

"మరి యూనివర్సిటీ ఛాన్సెలర్ లింగాయత్ కమ్యూనిటీకి చెందినవాళ్ళు- కాలేజీ ఓనర్ గౌడా కమ్యూనిటీకి చెందినవాళ్ళూ. అంచేత తన కంఠంలో ప్రాణం వుండగా ఇవ్వనని ఛాన్సెలర్ పట్టు పట్టాడట."

మాక్కూడా ఆ మాట వినేసరికి ఏడుపొచ్చింది.

అందరం మళ్ళీ ప్రిన్సిపాల్ దగ్గరకు పరుగెత్తాం. ఇప్పటికే మరో పాతికమంది మాలాంటి పేరెంట్స్ మూగిపోయి వున్నారతని చుట్టూ.

"నేను చెప్తున్నాను కదా. మీకేం ఫర్లేదు. మన కాలేజీకి ఇంకోవారం రోజుల్లో ఎఫ్లికేషన్ వచ్చేస్తుంది. మన కేసు సుప్రీంకోర్ట్ కి కూడా వెళ్ళింది- ఒకవేళ రాకపోతే అప్పుడు మీ డబ్బు మీకు వాపస్! సరేనా?"

చేసేది లేక తలూపి బయటపడ్డాం.

బస్ లో తిరిగి హైదరాబాద్ బయల్దేరాం. బస్ లో అందరూ మాలాంటివాళ్ళే. ఇంజనీరింగ్, లా, ఫార్మసీ, పాలిటెక్నిక్ చదవటానికి వచ్చిన వాళ్ళు. కొద్దిసేపటి తర్వాత కర్నాటక రాష్ట్రంలోనుంచి ఆంధ్రప్రదేశ్ లోకి ప్రవేశించింది మా బస్.

రోడ్డుకి అడ్డంగా కట్టిన ఆర్చీమీద "ఆంధ్రప్రదేశ్ మీకు స్వాగతం చెప్తోంది" అని రాసి వుంది.

దానిమీద తాటిచెట్టంత ఎత్తున ముఖ్యమంత్రి బొమ్మ చిరునవ్వుతో చేతులు జోడిస్తోంది.

"నీయవ్వ ఆంధ్రప్రదేశ్! ఛీ! చదువుల కోసం పక్క రాష్ట్రాల కెళ్ళి నానా అవస్థలు పడాల్సి వచ్చిన పనికిమాలిన రాష్ట్రం!" అన్నాడు రంగారెడ్డి.

"పనికి మాలిన రాష్ట్రమేమిటి? అడుక్కుతినే రాష్ట్రం! మనం దీపం వెలిగించుకోవాలన్నా కూడా పొరుగు రాష్ట్రాన్ని కరెంట్ అడుక్కోవాలి" అన్నాడు శాయిరామ్.

"ఆఖరికి కిలో రెండ్రూపాయలు బియ్యం కావాలన్నా కేంద్రాన్ని అడుక్కోవాలి!" అన్నాడు గోపాల్రావ్.

ఆ తరువాత మన రాష్ట్రం ఇంకా ఏమేం విషయాల్లో ఇతర రాష్ట్రాల్ని అడుక్కుతింటోందో మాలో అందరూ తలోటీ చెపుతుంటే మాకే సిగ్గేసింది. ఆ పక్కనే వినబడుతోంది. "మా తెలుగు తల్లికి మల్లెపూదండ-" అనే పాట-

* * * * *

# గుడిశెల రాజకీయం

మాకాలనీలో వుండే మిమిక్రీ ఆర్టిస్ట్ మారుతీ ప్రసాద్ సొంతిల్లు కట్టుకుని గృహ ప్రవేశం చేయబోతున్నాడన్న వార్త అశనిపాతంలా తాకింది మమ్మల్ని.

ఆ సాయంత్రం అందరం కాలనీ వేదిక దగ్గర కూర్చుని ఆ విషయమే బరువెక్కిన హృదయాలతో మాట్లాడుకుంటూంటే మారుతీ ప్రసాద్ చిరునవ్వుతో వెలిగిపోతున్న ముఖంతో మా దగ్గర కొచ్చాడు.

"రేపే తెల్లారుఝామున గృహప్రవేశం సార్! మన కాలనీవాళ్ళంతా తప్పకుండా రావాలి!" అన్నాడు అందరికీ తలో ఇన్విటేషన్ కార్ట్ ఇస్తూ.

ఆ ఇన్విటేషన్ కార్డ్ చూస్తూనే మాకందరికీ మాట పడిపోయినంత పనయింది.

"తప్పకుండా వస్తాం" అన్నాం లోపలి ఫీలింగ్స్ బయటకు కనిపించకుండా అణచిపెడుతూ.

అతను వెళ్ళిపోయిన చాలాసేపటి వరకు అందరం నిశ్శబ్దంగా వుండిపోయాం.

"అందరూ ఇళ్ళు కట్టుకుంటున్నారు. మనకే.. స్థలం వుండీ- లేకుండా పోయినట్లయింది" అన్నాడు శాయిరామ్.

"లేకపోతే ఈ పాటికి మనందరం కూడా గృహ ప్రవేశాలు చేసి వుండేవాళ్ళం అన్నాడు రంగారెడ్డి విచారంగా.

ఆ రాత్రి ఆ మారుతీ ప్రసాద్ గృహ ప్రవేశం తాలూకూ ఇన్విటేషన్ కార్డ్ చూసేసరికి కాలనీలో ఆడాళ్ళందరూ సాధింపు ప్రారంభించినట్టు స్పష్టంగా వినిపిస్తూనే వుంది బయటకు.

"ఇంత చేతకాని వాళ్ళు కాబట్టే కొన్న ప్లాట్లను ఆ గుడిశెల వాళ్ళకు అప్పజెప్పి నోర్మూసుక్కూర్చున్నారు" అంటోందొకావిడ.

"మా పుట్టింటి వాళ్ళిచ్చిన డబ్బు మాకు తెచ్చిచ్చేయండి. ఇల్లు కట్టని కాడికి ప్లాటుండేం లాభం?" అంటోందింకో ఆవిడ.

వాళ్ళ సూటిపోటి మాటలు భరించలేక భోజనాలవగానే అందరం ఇళ్ళల్లో నుంచి బయటపడ్డాం.

"ఎట్లాగయినా మనప్లాట్లు మనం స్వాధీనం చేసుకోవాలి!" అన్నాడు గోపాల్రావ్ ఆవేశంగా. అతనిమాటతో మా అందరికీ కూడా ధైర్యం, ఆవేశం పుట్టుకొచ్చినయ్.

"అవును! అదంతా మన కష్టార్జితం. కనుక వదలడానికి వీల్లేదు" అన్నాడు రంగారెడ్డి.

"కానీ ఎలా స్వాధీనం చేసుకుంటాం! పోలీసులు మనకేమాత్రం సహాయం చేయడం లేదు కదా! పైపెచ్చు గుడిసెలను తీసేస్తామని మన డబ్బుకూడా కొట్టేశారు" అన్నాడు చంద్రకాంత్ అనుమానంగా.

దాంతో మా ఆవేశాలు మళ్ళీ చల్లారిపోయాయ్.

"పోలీసులు సహాయం చేయకపోతే వాళ్ళపై అధికారులకు రిపోర్టిద్దాం" అన్నాడు గోపాల్రావ్.

అతని సూచన మాకందరికీ నచ్చింది.

పోలీస్ అధికారుల్లో కూడా అవినీతివున్నా డైరెక్ట్ గా వచ్చే కొత్త ఐపీయస్ అధికారులు కనీసం కొంతకాలం వరకయినా చాలా సిన్సియర్ గా నీతిగా వుంటారని మాకు తెలుసు. అందుకని వాళ్ళను బ్రతిమాలుకుంటే ఫలితం వుండవచ్చని మాకనిపించింది.

మర్నాడే అందరం కలిసి పోలీస్ అధికారులను కలుసుకోవాలని నిర్ణయించుకున్నాం.

"కొంతమంది పోలీస్ అధికారులు నాకు బాగా తెలుసు. వాళ్ళు మామూలు పౌరులకు సహాయం చేయకపోవచ్చుగానీ మా జర్నలిస్ట్ లకు మంచి సహాయం చేస్తారు" అన్నాడు గోపాల్రావ్.

తీరా మర్నాడు మేం వెళ్ళేసరికి పోలీస్ అధికారులమరూ నక్సలైట్లు పట్టుకున్న ఓ మండలాధికారిని విడిపించే విషయంలో చాలా బిజీగా వున్నారని తెలిసింది.

సాయంత్రం ఆరుగంటలవరకూ వేచి వున్నాక మాకు ఒక పోలీసాఫీసర్ ఇంటర్వ్యూ దొరికింది.

మా సంగతంతా చాలా ఆసక్తిగా విని మా ఆర్జీ తీసుకున్నాడతను.

"నేను చూస్తాను! మీరింక వెళ్ళిరండి" అన్నాడు చివరలో.

మేము ఆనందంగా తిరిగి వచ్చేశాము.

మర్నాడే పోలీసులువెళ్ళి ఆ గుడిసెలన్నిటినీ పీకేస్తారని మేము అనుకున్నాంగానీ నెలరోజులు అయినా ఏమీ జరగకపోయేసరికి మాకు తిక్కరేగిపోయింది.

అందరం కలిసి మళ్ళీ పోలీస్ స్టేషన్ కెళ్ళాం.

ఇన్ స్పెక్టర్ మమ్మల్ని చూసి నవ్వాడు.

"కుదరదయ్యా వాళ్ళ గుడిశెలు తీయడం కుదరదని చెప్పినా వినకుండా మా ఆఫీసర్ దగ్గరకెళ్ళారుకదా! ఆయనేం చేస్తాడు? మాకు చెప్పాల్సిందేగా మళ్ళీ?"

మా ముఖాలు మాడిపోయాయి.

"వాటిని పీకేయడం ఎందుకు కుదరదు? మీకు ఇచ్చిన డబ్బు చాల్లేదా?" కోపంగా అడిగాడు రంగారెడ్డి.

"అది కాదయ్యా! మన రాజధానిలో వుంటూ కూడా గుడిశెల రాజకీయం గురించి మీకు తెలీలేదంటే ఏం చెప్పాలి? మీ స్థలాల్లో గుడిశెలు వేయించింది ఎవరోకాదు. ఆ ఏరియా ఎమ్మెల్యే ఆ ఏరియాలో వాళ్ళ పార్టీకి ఓట్లు కొంచెం తక్కువయ్యాయని గుడిశెలేయించి వాళ్ళపార్టీ వాళ్ళను అందులో వుంచారు. కనుక వాళ్ళను కాళీ చేయించడం ఎవడివల్లా కాదు-"

మేము గొణుక్కుంటూ ఇళ్ళకు చేరుకున్నాం.

ఆ రాత్రి ఎవరికీ నిద్రపట్టలేదు.

ఆ స్థలాలకు తిలోదకాలు వదులుకోవాల్సి వచ్చిందే అనే బాధ.

తెల్లారుజామున నాలుగ్గంటలకు కాలనీలో గోపాల్రావ్ వుంటున్న వేపు నుంచే పెద్దగా కేక వినిపించేసరికి అందరం అదిరిపడి లేచి కూర్చున్నాం.

మరి కాసేపట్లో బిగ్గరగా మాటలు వినిపించేసరికి వుండబట్టలేక బయటకు నడిచాను. అప్పటికే మా వాళ్ళందరూ నిద్రకళ్ళతో గోపాల్రావ్ చుట్టూ మూగివున్నారు.

గోపాల్రావ్ చాలా ఉత్సాహంగా మాట్లాడుతున్నాడు.

"రాత్రంతా ఆలోచిస్తూనే వున్నాను గురూ! కొశ్చెనాఫ్ అవర్ స్వెట్ అండ్ బ్లడ్ కదా! ఎలా వదులుకుంటాం? చివరకు మార్నింగ్ ఫోరోక్లాక్ కి అయిడియా వచ్చింది!"

"ఏమిటది?"

"మనందరం కలిసి కోర్టుకెళ్తాం! ఇది అనేకమందికి సంబంధించిన కేస్ కాబట్టి త్వరగా న్యాయం జరగడానికి అవకాశం వుంది. ఇలాంటికేసుల్లో మాంచి స్పెషలిస్ట్ లాయర్ ఒకతను నాకు బాగా తెలుసు. అతని దగ్గరకెళదాం" అన్నాడతను ఉత్సాహంగా.

మాకూ అతని మాటలు ఆశలు కలిగించినయ్.

అప్పటికప్పుడే రెడీ అయి ఉదయం ఆరుగంటలకల్లా లాయర్ నరసింహారావ్ ఇంటికి చేరుకున్నాం.

గోపాల్రావ్ ని చూస్తూనే ఆదరంగా ఆహ్వానించాడతను.

"వీళ్ళంతా మీ కాలనీ వాళ్ళేనా?" అడిగాడతను.

"అవును!"

"గుడ్ ఫెలోస్! పేపర్లో పాపం మీ పాట్లు అప్పుడప్పుడూ చూస్తేన్ వుంటాను. ఇంతకూ ఏం పనిమీద వచ్చారు?"

గోపాల్రావ్ జరిగిందంతా చెప్పాడు.

అతనికి మామీద జాలివేసింది.

"దిసీజ్ టూమచ్! మన రాష్ట్రంలోనేకాదు. దేశమంతా కూడా పరిస్థితి ఇలాగే అఘోరించింది. మధ్యతరగతివాడి గురించి పట్టించుకునే నాధుడేలేడు. గవర్నమెంట్ దృష్టిలో ప్రజలంటే మందలుమందలుగా ఓట్లు నివసించే ప్రాంతాలు! అంతే!"

"ఇప్పుడు మనం కోర్టుకెక్కితే వాళ్ళను మా స్థలాల్లోనుంచి ఖాళీ చేయిస్తారంటారా?" ఆశగా అడిగాడు శాయిరామ్.

"ఇంతమందికి అన్యాయం జరిగింది గనుక తప్పక మనకు అనుకూలంగా తీర్పులభించే అవకాశాలున్నాయి"

మా మహజర్లు, డాక్యుమెంట్లు, పోలీస్ కంప్లెయింట్ కాపీలు అన్నీ జతపరచి ఆయనకిచ్చాము.

ఆరునెలల తరువాత మా నరసింహారావు వ్యక్తిగత పలుకుబడివల్ల మా కేసు హియరింగ్ కొచ్చింది. అందరం కోర్టుకెళ్ళి మతగ్రంథాలమీద ప్రమాణాలు చేసి మేజిస్ట్రేట్ గారికి జరిగినదంతా విన్నవించుకున్నాం.

ఆయనకు మామీద విపరీతమయిన జాలి కలిగింది.

మా జనార్ధన్ అద్భుతమయిన నటనతో సహా తను ఎన్నికష్టాలు పడి ఆ స్థలం కొన్నదీ వివరిస్తోంటే మేజిస్ట్రేట్ గారికి కూడా కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయ్.

ఆ మేజిస్ట్రేట్ గారు కూడా ఆ మధ్య కొన్న ఓ స్థలంలోకూడా ఎవరో గుడిసెలు వేశారనీ, అందువల్ల ఆయన మా బాధ తేలికగా అర్థం చేసుకోగలిగాడనీ తరువాత చెప్పాడు నరసింహారావు.

ఇంక మాకేసుకి తిరుగులేదనీ, ఆ గుడిశెలవాళ్ళూ చెప్పేదికూడా విన్నాక వాళ్ళను ఆ స్థలాల నుంచి బయటకు గెంటించడం ఖాయమనీ చెప్పాడతను.

మేమందరం ఆనందంగా ఇళ్ళకు వెళ్ళాం.

ఆ తరువాతి వారంలోనే గుడిశెల నాయకులు బోనులో నిలబడ్డారు. మేమంతా శెలవుపెట్టి కోర్టుకి వెళ్ళాం.

"చూడు కిష్టయ్యా! నువ్వు ఇంకొంతమందీ కలిసి రెండునెలల క్రితం ఇంకొకరి స్థలాల్లో గుడిశెలు కట్టుకున్నారట నిజమేనా?"

"రెన్నెల్లకిందటేడ దొరా! మేమాడ గుడిశెలుగట్టి యాబై ఏండ్లయిపాయే"

మేము మాతోపాటు మా లాయరుకూడా అదిరిపడ్డాం.

"ఏమిటి? మీరా గుడిశెలువేసి యాభైఏళ్ళయిందా?"

"అవ్ దొరా! ఆ జమానాల నిజాం దొర ఖుద్ ఆ జమీన్ మాకు నజరానా ఇచ్చిండన్నట్లు-"

"అంతా అబద్ధం! వాళ్ళు రెండునెలల క్రితమే గుడిశెలు వేశారు" అరచాడు రంగారెడ్డి.

"ఆర్డర్! మధ్యలో అలా అరిచారంటే బయటకు గెంటిస్తాను" అన్నాడు మేజిస్ట్రేట్ కోపంగా.

మేము రంగారెడ్డిని బలవంతంగా కూర్చోబెట్టేశాము.

"మీరు యాభైఏళ్ళ నుంచీ అక్కడ గుడిశెలు వేసుకుని వున్నట్లు సాక్ష్యాధారాలేమయినా వున్నాయా?"

"సాక్ష్యమేమున్నది దొరా! ఆడుండేటోళ్ళందరూ ఖసంతోటి సాక్ష్యం జెప్పనికి తయారున్నరు-"

రెండు రోజుల్లో రెండువందలమంది బోను ఎక్కి వాళ్ళు ఆస్థలాల్లో యాభైఏళ్ళ నుంచీ గుడిశెలు వేసుకుని వుంటున్నట్లు సాక్ష్యాలు చెప్పారు. ఆఖరులో ఆ ఏరియా ఎమ్మెల్యే కూడా వాళ్ళంతా తరతరాల నుంచీ అక్కడే గుడిశెలు వేసుకుని వున్నట్లు సాక్ష్యం చెప్పాడు.

ఆ రోజు మా లాయర్ మాతో చెప్పేశాడు.

"మన రాజధానిలో ఎక్కడయినా గానీ ఇదే పద్ధతిలో భూముల కబ్జా జరుగుతూంటుంది. గుడిశెలు వేసేస్తారు. వేశాక ఆ స్థలాల ఓనర్లు కాళీ చేయించడానికి కోర్టుకెక్కితే యాభైఏళ్ళ నుంచీ అక్కడే గుడిశెలు వేసుకుని వున్నట్టు వాళ్ళ లేబర్ తోనే సాక్ష్యాలు చెప్పిస్తారు. వాళ్ళు కేవలం రెండు నెలల క్రితమే అక్కడకు వచ్చి గుడిశెలు వేసుకుని వున్నట్టు మనం కోర్టులో చెప్తాం. కానీ మనకు ఎవరూ సాక్ష్యం వుండరు కదా! అంచేత కేస్ ఎప్పుడూ వాళ్ళే గెలుస్తుంటారు-"

ఆ తరువాత మరో రెండు నెలల్లో జడ్జిమెంట్ వచ్చింది.

"వాళ్ళు యాభై సంవత్సరాల నుంచీ ఆ స్థలాల్లో గుడిశెలు వేసుకుని వున్నట్టు సాక్షాధారాలతో ఋజువు కావటం వల్ల కేస్ కొట్టివేయడమైనది."

"ఇదన్యాయం!" అంటూ ఆవేశంగా అరిచాడు యాదగిరి.

అతనిని వెంటనే పోలీసులు బయటకు తోసేశారు.

మేమంతా దిగాలుపడి కోర్టు ఆవరణలోనే వున్న ఓ కాంటీన్లో 'టీ' తాగుతోంటే ఆ గుడిశెలు వేయించిన పాండూ దాదా మా దగ్గర కొచ్చాడు.

"ఏం తంబీ? ఏమాయే? సుధరాయించిన్రా లేక బడే కోర్ట్ ల రకరాయిస్తరా?" అన్నాడు ఎగతాళిగా.

మాకు రక్తం ఉడికిపోయింది కానీ మధ్యతరగతి వాళ్ళం గనుక నోర్మూసుకుని వుండిపోయాం.

"ఏయ్- ఇదీ గరిబోండ్ల రాజ్యంబే! మేమేం జేస్తే గదే కానూన్ అవుతది! మేమేం జెప్తే గదే ప్రభుత్వం జేస్తది. మేమెవళ్ళకు ఓట్లేస్తే వాండ్లే రాజ్యం జేస్తరు. సమజైందా?" హేళనగా అడిగాడు.

మేము ఇళ్ళకు తిరిగి వచ్చేశాము. అంతకుముందు కేవలం మా కష్టార్జితమైన ఆ ఇళ్ళస్థలాలు పోయాయన్న బాధ ఒక్కటే వుండేది.

ఇప్పుడు దానికి తోడు ఆ దాదాగాడు మిమ్మల్ని అతిదారుణంగా ఫూల్స్ ని చేయడం మరింత బాధ కలిగిస్తోంది. చదువులేనివాడు విద్యావంతుల్ని ఫూల్స్ చేయడమే మనదేశంలో డెమొక్రసీ!

ఇంట్లో టీవీ కార్యక్రమాలు మామూలు ప్రకారం ప్రజల్ని చీల్చి చెండాడుతున్నయ్! మరికాసేపటి తరువాత హోమియోపతి డాక్టర్ తో ఇంటర్ వ్యూ ప్రారంభమైంది. మామూలుగానే డాక్టర్ నేమీ మాట్లాడనివ్వకుండా అన్నీ మాట్లాడేస్తున్నాడు ఇంటర్వ్యూ చేసే వ్యక్తి.

డాక్టర్ మధ్యలో జొరబడడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు గానీ ఆ వ్యక్తి అతనికే మాత్రం సందు దొరకనీయడం లేదు. ఆఖరులో ఆ వ్యక్తికి హఠాత్తుగా దగ్గు రావడం వల్ల ఆ సమయాన్ని డాక్టర్ ఛటుక్కున దొరకబుచ్చుకుని తను చెప్పదల్చుకున్న నాలుగు మాటలు శరవేగంతో చెప్పేశాడు.

"హోమియోపతి ప్రకృతి సహజమైన అతి ముఖ్యమైన ప్రిన్సిపుల్ మీద పనిచేస్తోంది. ముఖ్యంగా మన ప్రాచీన భారత వైద్య శాస్త్రానికి హోమియోపతి వైద్యం ఎంతో దగ్గరగా ఉంది. ఉదాహరణకు 'ఉష్టం ఉష్ణేన శీతలం' అనేది మన ప్రాచీన వైద్య విధానానికి చెందిన సూత్రం. హోమియోపతి కూడా అదే సిద్ధాంతం ప్రకారం పని చేస్తుంది. అందుకే హోమియోపతి మందులు ముందు రోగి జబ్బుని మరింత పెంచి అప్పుడు దానిని తగ్గించేందుకు చర్య ప్రారంభిస్తుంది-"

నాకు ఆ మాటల్లో ఏదో గొప్ప మెసేజ్ కనిపించింది.

ఆ రూల్ మా ప్లాట్స్ గొడవకు కూడా వర్తిస్తుందనిపించింది.

అంటే అన్యాయాన్ని అన్యాయంతోనే ఎదుర్కోవాలి! అక్రమాన్ని అక్రమాలతోనే ఎదుర్కోవాలి! గూండాయిజాన్ని గూండాయిజంతోనే ఎదుర్కోవాలి.

అంతేకానీ తెల్లారి లేస్తే ఆ గూండాల దయాదాక్షిణ్యాల మీద బ్రతికే పోలీస్ సహాయం కోరగూడదు. ఎదుటిమనిషి ఎంత పెద్దమనిషి అన్న విషయం వదిలేసి వాడు తెచ్చుకున్న సాక్ష్యాధారాలకు విలువిచ్చే కోర్ట్ ల సహాయం తీసుకోకూడదు.

ఉదయం లేస్తూనే ఆవేశంగా వెళ్ళి శాయిరామ్ ని నిద్రలేపాను.

"వెంటనే మన వాళ్ళందర్నీ పిల్చుకురా! రాత్రి నాకు బ్రహ్మాండమైన అయిడియా వచ్చింది. మన ప్లాట్స్ లోనుంచి ఆ గుడిశెల వాళ్ళను ఒక్కరోజులో లేపేద్దాం-" అన్నాను.

పావుగంటలో అందరూ వేదిక దగ్గర గుమిగూడి పోయారు. నేను చాలా గర్వంగా నా ప్లాన్ వాళ్ళకు చెప్పాడు.

"మనం చేయాల్సింది చాలా సింపుల్! శంకర్ దాదా దగ్గరకెళ్ళి ఎంతోకొంత రేటు మాట్లాడి డబ్బు ఇచ్చేశామంటే మన ప్లాట్స్ లోనుంచి వాళ్ళందరినీ దెబ్బకు ఖాళీ చేయిస్తాడు శంకర్ దాదా!"

అందరికీ ఆ ఆలోచన నచ్చింది.

నిజానికి గూండాయిజాన్ని ప్రోత్సహించడం మాలో ఎవరికీ ఇష్టం లేదు కానీ మేము కష్టార్జితానికి నీళ్ళు వదులుకోకుండా వుండాలంటే అంతకంటే గత్యంతరం లేదు.

అప్పటికప్పుడే తలో వెయ్యి రూపాయిలూ పోగుచేసి, ఆ మొత్తం తీసుకుని శంకర్ దాదా ఇంటికి చేరుకున్నాం. అప్పటికి టైమ్ పదవుతోంది.

అప్పుడే గుడుంబాతో మొఖం కడుగుతున్నాడు శంకర్ దాదా.

మమ్మల్ని చూసి ఆశ్చర్యపోయాడు.

"ఏమ్ సంగతి- చాల్దినాలకొచ్చిన్రు" అన్నాడు మొఖం కడగగా మిగిలిన ద్రావకం త్రాగేస్తూ.

సంగతంతా చెప్పామతనికి.

కొద్దిక్షణాలు ఆలోచనలో పడ్డాడు శంకర్ దాదా.

"ఆ ఏరియా దాదా ఎవరు? పాండూ దాదానా?" అడిగాడు మమ్మల్ని.

"అవున్సార్"

"గట్లనా? ఆడయితే కొంచెం కిరికిరి కొడుకే" మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

"మీరెంత డబ్బంటే అంత ఇచ్చేస్తాం సార్!" అన్నాడు రంగారెడ్డి ఆ మాటతో శంకర్ దాదా మొఖంలోకి కళ వచ్చేసింది.

"అగో చెప్పక పోతిరి మల్ల! ఇంకా మీ కేస్ లో పుకట్ గా పని జేయాలనుకుంటున్న! పైసలద్దెస్తే కిరికిరి మున్నదివయ్యా? నిమిషాల్ల ఖాళీ జేయ్ పిస్త! సమజయిందా?"

"అయింది సార్!"

"ఎన్ని పైసలు తెచ్చిన్రు?"

"పదివేల్సార్"

"పదివేలా? పదివేలకు గిసంటి ఖతర్ నాక్ పనులెవళ్ళు జేస్తారయ్యా! పదిహేను వేలయినగాని వుండాలె!"

మేము మారు మాట్లాడకుండా పదిహేనువేల రూపాయలు అతని చేతిలో పెట్టాము.

అతను మావేపు ఆప్యాయంగా చూశాడు.

"ఇగో- ఇంక ఇండ్లకు పోయి భేపికరుండండి! రేపీ టైమ్ కల్లా మీ జాగాలన్నీ ఖాళీ అయిపోతై సమజయిందా?"

"అయింది సార్" అన్నాడు యాదగిరి.

"అయితే ఇకపోండ్రి"

మేమంతా కాలనీ కొచ్చేశాము.

మర్నాడు ఉదయం మేము ప్లాట్స్ దగ్గరకెళ్ళేసరికి సగం గుడిశెలు కనిపించడంలేదు.

అయితే మిగతా సగం ఇంకా ఉండటం ఇబ్బందికరంగా అనిపించి మళ్ళీ శంకర్ దాదా దగ్గరకెళ్ళాం. ఆ టైమ్ లో గుడంబాతో స్నానం చేస్తున్నాడతను.

"ఏమాయే? ఖాళీ జేసిన్రుగదా ఆళ్ళు-" అడిగాడతను గుడంబా నెత్తినబోసుకుంటూ.

"సగం మందే చేశారు సార్"

"మిగతా వాళ్ళు ఆ ఏరియా ఎమ్మెల్యే గ్యాంగ్ రాభయ్! నేను పోయి ఎమ్మెల్యేను బ్రతిమిలాడితేగానీ పోరు-"

"ఒక్కసారి ఆయన్తో మాట్లాడండి సార్"

"మాట్లాడిన లాభంలేదురాభయ్! ఆడసలే పైసల్ కోసం గడ్డితినేటైప్- కనీసం ఓ పదివేలైనా వానికియ్యకపోతే ఒప్పుకోడు."

గత్యంతరం లేక శంకర్ దాదాకి ఇంకో పదివేలిచ్చాం.

"మంచిది బిడ్డా! నేనిప్పుడే ఎమ్మెల్యేతానకు బోయి- సెటిల్ జేస్తా-" అన్నాడతను.

రెండోరోజు ఉదయానికి పూర్తిగా గుడిశెలన్నీ ఆనవాల్లేకుండా లేచిపోయినయ్.

పోలీసుల వల్లా, కోర్టుల వల్లా కాని పని కేవలం గూండావల్ల అయిందంటే నిజంగా మన రాష్ట్రం ఎంత అభివృద్ధి చెందిందో, మన రాష్ట్ర ప్రభుత్వం ఎంత ఉన్నత స్థితిలో వుందో, మనరాష్ట్ర ప్రజలు ఎంత అదృష్టవంతులో- మాకు అర్థమయింది. తిన్నగా అందరం శంకర్ దాదా ఇంటికి చేరుకున్నాం.

"మళ్ళీ వచ్చిన్రేమి సంగతి? ఇంకెవళ్ళయినా ఖాళీ చేయకుండ మిగిలిన్రా?" అడిగాడతను.

"లేద్సార్! అన్ని గుడిశెలూ లేచిపోయాయ్! మీ రుణం ఎలా తీర్చుకోవాలో తెలీడం లేదు" అన్నాడు రంగారెడ్డి.

"అరె- నీ యవ్వ- దాన్దేమున్నది భాయ్! ఒక జాగాల వున్నోళ్ళం! మంచిగ ఒకరి గురించి ఒకళ్ళు సహాయం చేసుకోవాలె! ఏం జెపున్నా! గట్లనే జరవచ్చే ఎలక్షన్ల గురించి గూడా ఖ్యాల్ తోటుండండి! నేనే ఎంపీగా ఈ ఏరియాకి నిలబడుతున్నా-"

అందరం అతనికే ఓట్లువేస్తామని ప్రామిస్ చేసి అక్కడి నుంచి మా కాలనీ వైపు బయలుదేరాం ఆనందంగా. దాదాలూ, మర్డరర్లూ, గాంగ్ లీడర్లూ, ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా ఎందుకు ఎన్నికౌతున్నారో అప్పుడే తెల్సింది మాకు.

* * * * *

# అహ నా ఇల్లు అంట

ముందు ప్రసూనాంబ చూసిందా ఇంటిని. చూడ్డంతోనే ఆమెకు ఆనందంతో గుండె ఆగిపోయినంత పనయింది. "అబ్బ! ఎంత అందంగా ఉందో ఈ ఇల్లు" అనుకుందామె తెగ మురిసిపోతూ. ఆ అందమైన ఇంటిపైన అంతకంటే

అందంగా అంతకంటే ముద్దులొలికే ముద్దు అక్షరాలలో రాసి ఉన్న వైనం... వేగంగా కొట్టుకుంటూన్న గుండెతో చదివిందామె.

"ఇదే- ఇదే మీరు కలలు కంటున్న స్వప్న మందిరం! పదేపదే మీ సొంతం కాబోతూన్న సొంత గృహం" ఆ తరువాత మేటర్ కూడా చకచకా చదివేసిందామె.

"కేవలం భారత ప్రజల మీద కక్కుకు చచ్చేంత ఎక్కువ ప్రేమ పొంగి పొరలటం వల్ల 'హోమ్ లోన్' పథకాన్ని మా పబ్లిక్ సెక్టర్ బ్యాంక్ వారు ప్రారంభిస్తున్నారు. మేమిచ్చే రుణ సహాయంతో నేడే ఈ పథకం చేపట్టి మీరు ఎప్పటినుంచో కలలు కంటూన్న స్వప్న గృహాన్ని సొంతం చేసుకోండి!

ఆలసించిన ఆశాభంగం!

ఎల్లప్పుడూ భారత ప్రజలను వదలకుండా వెంటాడి, వేటాడి సేవలు చేసే బ్యాంక్ మా బ్యాంక్" అంతవరకూ చదివేసరికి ప్రసూనాంబ ఇంక ఉండలేకపోయింది. ఆ న్యూస్ పేపర్ పట్టుకుని గాల్లో తేలిపోతున్నట్లు నడుస్తూ రామ్ గోపాల్ గదికి చేరుకుంది. రామ్ గోపాల్ కూడా ఆ ప్రకటన చూసి థ్రిల్ అయ్యాడు.

"ఇయాళ్రేపు మన గవర్నమెంట్ జర ఆకలి తోటి పనిచేస్తున్నదే! మనసంటి పబ్లిక్ కి మదద్ జెయ్యనికి జబర్దస్త్ స్కీమ్ లు షురూ జేస్తున్నది" అన్నాడు ఆనందంతో పొంగిపోతూ.

"అయితే ఆలస్యం ఎందుకండీ! మనం ఈ దిక్కుమాలిన ఏరియాలో ఫ్లాట్ కొని ఆరేళ్ళయిపోతోంది. ఇల్లు కట్టుకోడానికి డబ్బులేక ఈ పాడు అద్దె కొంపలో ఆ ఓనర్ గాడి సర్వ చాదస్తాలకూ తల ఒగ్గి, చేతులు కట్టుకుని నిలబడి నానా అవస్థలూ పడుతున్నాం. మన మధ్య తరగతి వాళ్ళ పాలిత కల్పతరువులా పాపం ఈ బ్యాంక్ వాళ్ళెవరూ ఇల్లు కట్టుకోడానికి అప్పు ఇస్తామంటున్నారు."

రామ్ గోపాల్ ఒక్క క్షణం ఆలోచించాడు.

"అంటే ఇయాళ్నే బ్యాంక్ కి బోమంటావా?" అడిగాడు సందేహంగా.

"అవునండీ! రాక రాక ఛాన్స్ వచ్చింది. దీన్ని వదులుకుంటే ఎలా?"

"మరి నా ఆఫీస్?"

"ఇవాళ సెలవు పెట్టేయండి! సొంతానికి ఓ ఇల్లు ఏర్పడుతోంటే ఆఫీస్ ఓ రోజు ఎగ్గొడితేనేం?"

ఆమె చెప్పిన మాట నిజమేననిపించింది రామ్ గోపాల్ కి.

అప్పటికప్పుడే వాళ్ళ ఆఫీస్ సూపర్నెంట్ కి టెలిఫోన్ బూత్ లో నుంచి ఫోన్ చేశాడతను.

"సార్! నేను రామ్ గోపాల్ ని మాట్లాడుతున్నాను" అన్నాడు. అవతలి గొంతు హలో అనగానే

"ఎస్? రామ్ గోపాల్!"

"నేను ఉస్మానియా జనరల్ హాస్పిటల్ కెళ్ళి మాట్లాడుతున్నా సార్. హెల్త్ ఖరాబున్నదని ఈడికొచ్చినా! ఒక్కదినం లీవ్ శాంక్షన్ జేయాల్సార్."

"నో ప్రాబ్లెమ్ రామ్ గోపాల్! తీసుకో! కానీ, గవర్నమెంట్ హాస్పిటల్ కి పోయినోండ్లకు ఒక్కదినం ఏం సరిపోతది? వాలంటరీ రిటైర్మెంట్ కి అప్లయ్ జేసి నీ జాబ్ మీ మిసెస్ కి ఇప్పియ్యనుండె! గట్ల జేస్తే నువ్ వాపస్ వచ్చినా రాకున్నాగానీ నడిచిపోతది."

రామ్ గోపాల్ గతుక్కుమన్నాడు.

"నాకు మరీ సీరియస్ ప్రాబ్లెమ లేద్సార్! జరంత సర్ది జేసిందన్నట్లు- అంది ఇస్నోఫీలియానా కాదా అని టెస్టింగ్ జేయిపించాలె! గంతనే!"

"ఓకే రామ్ గోపాల్! వన్ డే లీవ్ శాంక్షన్డ్."

"థాంక్యూ సర్."

ఇంటికి చేరుకుని త్వరత్వరగా రెడీ అయి ఇద్దరూ న్యూస్ పేపర్లో ప్రకటన ఇచ్చిన ఆ బ్యాంక్ కి చేరుకున్నారు. మేనేజర్ చుట్టూ అరడజను మంది మూగి వున్నారు. అందరితోనూ ఒకేసారి మాట్లాడుతున్నాడతను.

"సీతారామ్! మాకు అయిదు లక్షలు ఫిక్సుడ్ వేస్తామన్నారుగా- దాని సంగతేమయింది?"

"వేస్తాన్సార్! తప్పకుండా వేస్తా! మా వాడి లోను సంగతేమయింది మరి?"

"ఇంకో రెండు నెలలు ఆగండి. ప్రస్తుతం క్రెడిట్ స్క్వీజ్ ఉంది. ఆ! మీకేం కావాలి?" రామ్ గోపాల్ వంక చూస్తూ అడిగాడు.

"అదేనండీ! హోమ్ లోన్ అనే స్కీమ్- మా మిడిల్ క్లాస్ వాళ్ళ గురించి తీసిన్రని పేపర్ల చదివినా! దాని గురించి...."

ఓ- అదా! వెరీగుడ్! కూర్చోండి! నిజం చెప్తున్నా కదా! మిడిల్ క్లాస్ వాళ్ళ పాలిట ఈ స్కీమ ఒక వరం అనుకోండి. ఆఁ- "మీకేం కావాలండీ!" ఇంకొకతనిని అడిగాడు.

"ఓడీ కావాల్సార్! లేకపోతే ఆరు చెక్కులు బౌన్స్ అయిపోతాయ్. క్లర్క్ మిమ్మల్ని అడగమంటున్నాడు."

"అలాగా! మీ షాప్ లో అయిలాఫ్ అని ఏదో కొత్త కోల్డ్ క్రీమ్ వచ్చిందంటగా? మా అమ్మాయ్ అది కావాలని అడుగుతోంది. ఒక బాటిల్ శాంపుల్ పంపుతే..."

"ఇప్పుడే తెచ్చిస్తాన్సార్!"

"వెరీగుడ్! అయితే, ఓడీ తీసుకోండి. ఆ క్లర్క్ కి నేను చెప్పానని చెప్పండి. ఆఁ- మీ పేరేమన్నారు?" మళ్ళీ రాంగోపాల్ వేపు తిరిగాడతను-

"రామ్ గోపాలండి"

"రామ్ గోపాల్ గారూ! మీరు చెయ్యాల్సిందేమిటంటే, వెంటనే హోమ్ లోన్ ఎకౌంట్ మా బ్యాంక్ లో ఓపెన్ చేయండి! నెలకు వెయ్యి రూపాయలు చొప్పున మాకు ఏడేళ్ళపాటు మీరు కట్టాలన్నమాట. కడితే మేము మీకు ఆ డబ్బుకు డబుల్ ఎమౌంట్ లోన్ గా ఇస్తామన్న మాట... ఏడేళ్ళ తర్వాత!"

రామ్ గోపాల్, ప్రసూనాంబ ముఖాలు చూసుకున్నారు.

"మీరు నేను చెప్పింది సరిగ్గా అర్థం చేసుకోలేదనుకుంటానండీ- మేము ఇల్లు కట్టుకోడానికి డబ్బులేక లోన్ కోసం వచ్చామండీ.

"తెలుసండీ! అందుకే హోమ్ లోన్ ఎకౌంట్ తెరవమంటున్నాను."

"కానీ, మేము లోన్ కావాలని అడుగుతూంటే ఏడేళ్ళపాటు మీరు మమ్మల్ని పైసలు కట్టమంటున్రేమిటి?"

"అదంతేనండీ! మేము ప్రజల క్షేమం కోసం, లాభం కోసం ఏ స్కీమ్ ప్రారంభించినా ఇలాగే ప్రజలకు లాభపడే విధంగా ఉంటాయ్ అన్నమాట. మీకేం కావాలండీ?" ఇంకొకతనిని అడిగాడు మధ్యలో.

"నాకు ఇంకో లాకర్ ఇస్తానన్నారు. దాని విషయం మాట్లాడదామని-"

"నాకు పాత చింతపండు పంపిస్తానన్నారు. దాని సంగతేమిటి?"

రామ్ గోపాల్, ప్రసూనాంబ దిగాలుపడి ఇంటికి చేరుకున్నారు.

"ఇగో ప్రసన్నా! నేన్జెపుతున్నా ఇను- మనదేశంలో మిడిల్ క్లాసోడికి సాయం జేసేటోడెవ్వడూ లేడు. ఎరుకనా? ఉన్నోడూ, లేనోడూ అందరూ దుబాయించెడిది మిడిల్ క్లాసోడినే. మనం ఈ జన్మల ఇల్లు కట్టలేము" అన్నాడు రామ్ గోపాల్. ఇన్ స్టాల్ మెంట్ లో ముచ్చటపడి కొనుక్కున్న టేప్ రికార్డర్ ఆన్ చేస్తూ.

ముకేష్ పాట మొదలుపెట్టాడు-- "కహతా హై జోకర్ సారా జమానా-"

రామ్ గోపాల్ కి ఆ పాట ఎన్నిసార్లు విన్నా ఎక్కడలేని ఆనందం కలుగుతుంది. అది మిడిల్ క్లాస్- వాడి మీదే రాసినట్లనిపిస్తుందతనికి.

ప్రసూనాంబ చుట్టుపక్కల వాళ్ళందరికి ప్రకటనల ద్వారా బ్యాంక్ వాళ్ళు చేస్తున్న మోసం గురించి చెప్తోంది.

"అవునండీ! మొన్న ఆ మధ్య మా వారు కూడా ఇలాగే ఆ క్రెడిట్ కార్డ్ పబ్లిసిటీ బోర్డులు సిటీబస్ వెనక చూసి ఆ కార్డ్ కోసం బ్యాంక్ కెళ్ళారు. ఓ రోజు ఆఫీస్ కి సెలవు పెట్టి, తీరా వెళ్ళాక మీరు ఆరు నెలలపాటు ఎకౌంట్ ఓపెన్ చేసి మెయింటెయిన్ చేస్తే తప్ప కార్డ్ ఇవ్వం అన్నారు. సర్లేగదాని ఎకౌంట్ ఓపెన్ చేసి ఆరునెలల తర్వాత వెళితే అప్లికేషన్ లు రాయించుకుని క్రెడిట్ కార్డ్ మీకు ఇవ్వలేనందుకు చింతిస్తున్నాను అంటూ లెటర్ రాశారు" అంది సావిత్రమ్మ గారు.

"మమ్మల్నీ ఇంకో బ్యాంక్ వారిలాగే మోసం చేశారు అక్కయ్యగారూ, మా వారు నానా తిప్పలూ పడి ఎకౌంట్ ఓపెన్ చేసి క్రెడిట్ కార్డుకి అప్లయ్ చేస్తే "ఇవ్వలేనందుకు చింతిస్తున్నాం" అంటూ ఉత్తరం రాశారు" అంది రాజేశ్వరి.

"అన్నీ దొంగ బ్యాంకులు, మోసం ప్రకటనలు" అంది పార్వతీ దేవి.

అప్పుడె ఇంటి ఓనర్ స్కూటర్ మీద గేటు ముందాగి "వచ్చే నెల నుంచీ అద్దె ఎనిమిది వందలకు పెంచుతున్నా" అనేసి వెళ్ళిపోయాడు.

మర్నాడు న్యూస్ పేపర్ చూస్తూనే కెవ్వున కేకవేసింది ప్రసూనాంబ ఆనందంతో, రామ్ గోపాల్ ఉలికిపడి నిద్రలేచాడు.

"ఏమండోయ్! ఇది చూశారా! ఇదేదో హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ అంట వెంటనే ఇల్లు కట్టుకోడానికి అప్పు ఇస్తామంటున్నారు."

రామ్ గోపాల్ ఆత్రుతగా చదివాడా ప్రకటన. పూర్తిగా చదివేసరికి అతను నిరాశపడిపోయాడు.

"నేన్జెప్పలే ఇందులో ఏదో మతలబ్ ఉంటదని! వాళ్ళు ఏమంటున్రో ఎరుకనా! ముందు మనం పాతిక వేలు డిపాజిట్ కట్టాల్నంట. తర్వాత ఆడు లోన్ ఇస్తాడంట! ఒక్కసారి మన పైసలు ఆడి చేతిలో పడినాంక ఇంక ఆడి చేతిల మనం తోలుబొమ్మలే కదా! ఆడెట్టాడిపిస్తే అట్లాడాలె."

ప్రసూనాంబకు కోపం వచ్చింది.

"అన్నీ అట్లా అనుకుంటే ఎలా? మనం ఇంకెప్పటికీ ఇల్లు కట్టలేము. నా మాట విని ఒక్కసారి వెళ్ళి వివరాలు కనుక్కురండి."

"ఇదిగో మాట్లాడితే సెలవు పెట్టనికి నా తోటిగాడు."

ప్రసూనాంబకు కోపం వచ్చేసింది. కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయ్.

"నాకు ముందే తెలుసు, మీ నిజామాబాద్ జిల్లా వోళ్లు ఇలాగే అంటారని! మా నాన్నగారు అంటూనే ఉన్నారు- మన ఖమ్మం జిల్లావోళ్ళకి, నిజామాబాద్ జిల్లా వోళ్ళకి కుదర్దే! మన మెంటాలిటీ వేరు, వాళ్ళ మెంటాలిటీ వేరు అని! కానీ, మా అమ్మే వినిపించుకోకుండా కాళ్ళ దగ్గర కొచ్చిన బంగారంలాంటి వరంగల్ సంబంధం కాదని మీ సంబంధం అంటగట్టింది!"

ఆ మాటతో రామ్ గోపాల్ కి కోపం ముంచుకొచ్చింది.

"అంటే, మా నిజామాబాదోండ్లం చిల్లరగాండ్లమా?"

"అవును. ముమ్మాటికీ చిల్లరగాళ్ళే! లేకపోతే సొంత భార్య మాట ఎవరయినా కాదంటారా?"

"మా అమ్మ గూడా ఖమ్మ పోరిలను జేసుకోకురా బిడ్డా అని మొత్తుకుంటుండెగానీ, నేనే మీరు మా నాయన్తాలాకు బంధువులని, కాదంటే మా నాయన దిల్ దుఃఖాయిస్తదని జేస్కోనికి వప్పుకున్నా. ఇప్పుడు జూడు- బరాబర్ మా అమ్మ జెప్పినట్లే అవుతున్నది. పెండ్లయిన దినం కెళ్ళి ఒకటే కిరికిరి, ఒకటే లొల్లి."

కొద్దిసేపు ఇద్దరూ గొడవపడ్డాక మామూలుగానే రాజీపడ్డారు.

బ్యాంకులో ఇద్దరు పిల్లల కోసం వేసిన ఫిక్స్ డ్ డిపాజిట్లు ఇరవై వేలు తీసుకెళ్ళి ఆ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లో డిపాజిట్ చేసి ఇంటి లోన్ తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. తీరా ఆ ఆఫీసుకు చేరుకునేసరికి ఆఫీస్ బయట కొన్ని వందలమంది గుమికూడి కనిపించారు. పెద్దగా అరుపులు, కేకలు వినబడుతున్నాయ్. కొంతమంది నేలమీద కూలబడి బిగ్గరగా ఏడ్చేస్తున్నారు. ఏడుస్తున్న వారిలో ఓ గొంతు విని ఠక్కున గుర్తుపట్టాడు రామ్ గోపాల్.

"ఆ గొంతు మా ఆఫీస్ లో పనిజేసే శ్రీనివాస శాస్త్రిదే. పద" అంటూ జనాన్ని తోసుకుంటూ అతని దగ్గరకు చేరుకుని తనూ నేలమీద కూర్చున్నాడు.

"ఏమాయె శ్రీనివాస్! ఏడుస్తున్నావేం సంగతి?"

శ్రీనివాసశాస్త్రి అమాంతం రామ్ గోపాల్ ని కౌగిలించుకొని మళ్ళీ బోరుమని ఏడ్చేయటం ప్రారంభించాడు.

"ఏం చెప్పను గురూ! నేను ఇంటి లోన్ కోసమని యాభయ్ వేలు డిపాజిట్ కట్టాను. ఆరునెలల్లో లోన్ ఇస్తానన్నాడు. అయిదు నెలలవంగానే అందరి డిపాజిట్లు తీసుకుని తమిళనాడుకు పారిపోయాడు"

రామ్ గోపాల్ గుండె ఝుల్లుమంది.

"అదేమి? మంది పైసలద్దీసుకుని పోతూంటే గవర్నమెంటేం జేస్తున్నది? అట్టాంటోళ్ళకు ఇట్ల డిపాజిట్లు కలెక్టు జేసేందుకు పర్మిషనెట్లిచ్చిన్రు" అడిగాడు ఆశ్చర్యంగా.

"గీబాడుకవులూ- గవర్నమెంట్ బాడుకవులూ కుమ్మక్కై మందిని ముంచిన్రు దేముడో- గిప్పుడు నాకేం దిక్కు దేముడో-"

"ఊరుకో శాస్త్రీ. ఏడిస్తే ఏం లాభం?"

"అమ్మో! నా యాభయ్ వేలు- అవి కష్టపడి సంపాదించిన పైసలయితే అట్లాగే ఊరుకునేవాడిని. కానీ, అవన్నీ ఆఫీసులో లంచాలు తీసుకుని సంపాదించిన డబ్బు. లంచాలు తీసుకోవడమంటే మాటలా? ఎంత రిస్క్ ఉంటుందందులో? పైదాకా ఎవడికి సరిగ్గా వాటాలందకపోయినా మొత్తం తవ్వి ఆఖరికి నాలాంటి గుమాస్తాగాడినే మటాష్ చేసేస్తారు. ఓరి దేముడో! అంత రిస్క్ తీసుకుని సంపాదించిన డబ్బుకే ఎసరు పెట్టాడే వీడు. కష్టార్జితం అయినా పోతే పోయిందని ఊరుకునే వాడిని దేవుడా!"

ప్రసూనాంబ ముఖం పాలిపోయింది.

"పదండి, ఇంటికెళదాం" అంది దిగులుగా.

ఇద్దరూ ఇంటికి చేరుకున్నారు మళ్ళీ మళ్ళీ టేప్ రికార్డర్ ఆన్ చేశాడు రామ్ గోపాల్ పడక కుర్చీలో కూర్చుని.

"కహతా హై జోకర్ సారా జమానా..." పాట వినబడుతోంది.

బయట స్కూటర్ హారన్ మోగింది. ఇంటి ఓనర్ ఇంజన్ ఆఫ్ చేయకుండానే మాట్లాడాడు.

"ఈ నెల నుంచీ అద్దె ఎనిమిది వందలు. గుర్తుందో లేదోనని వార్నింగివ్వటానికొచ్చా" అనేసి వెళ్ళిపోయాడు. రామ్ గోపాల్ కి కోపం వచ్చేసింది.

"ఎనిమిది వందలు- ఈ ఫాల్తూ ఇంటికి ఎనిమిది వందలా? నేనివ్వ! ఏడొందలు కంటే ఒక్కపైస గూడా ఎక్కువివ్వ" అని గావుకేక వేశాడు.

ఆ రాత్రి అతనికి జ్వరం వచ్చింది. ప్రసూనాంబ కన్నీరు పెట్టుకుంది "మీ నిజామాబాద్ జిల్లా వోళ్ళు ఇలాగే ఆవేశపడి కొంపలు మీదకు తెచ్చుకుంటారని మా నాన్నగారు ముందే చెప్పారండీ" అంది జాలిగా.

"చూడండీ! అనవసరంగా డాక్టర్ కి యాభై కట్టాల్సి వచ్చింది. ఎంత నష్టం? అదే ఇంటికి ఓ కిటికీ వచ్చేది"

మర్నాడు ఆఫీసు కెళ్ళేసరికి గుమాస్తాలందరూ రామ్ గోపాల్ చుట్టూ మూగిపోయారు.

"కంగ్రాచ్యులేషన్ గురూ" అన్నాడు రామానుజాచారి.

"ఎందుకు? నాకు ప్రమోషన్ ఏమైనా వచ్చిందా?" ఆశగా అడిగాడు రామ్ గోపాల్.

అందరూ ఆ జోక్ కు పగలబడి నవ్వారు.

"బలేవాడివేలే, సెంట్రల్ గవర్నమెంట్ లో ప్రమోషనా? ఇంకా నయం! నీకు ఇంటి లోన్ శాంక్షన్ అయినట్లు లెటర్ వచ్చింది." దభేల్ మని కిందపడ్డాడతను.

రామ్ గోపాల్ ను స్పృహ తప్పిన మిగతావాళ్ళ పక్కన పడుకోబెట్టారు వాళ్ళు. సాయంత్రానికల్లా అందరూ లేచి కూర్చున్నారు.

"అదేమిటి?" సెంట్రల్ గవర్నమెంట్ హౌసింగ్ లోన్ శాంక్షన్ అవదుగా అసలు?"

"ఎక్కడో ఏదో పొరబాటు జరగడం వల్ల లోన్ శాంక్షన్ అయ్యుంటుందని మన బాస్ కూడా అన్నారు. నువ్వు ఆలస్యం చెయ్యకుండా వెంటనే డాక్యుమెంట్స్ అన్నీ ఇచ్చేసి లోన్ తీసేసుకో. లేకపోతే ఓ క్షణంలోనైనా ఎర్రర్ రిగ్రెటెడ్ అని టెలెక్స్ మెసేజ్ రావచ్చు-"

రామ్ గోపాల్ మెరుపువేగంతో బయటకు పరుగెత్తాడు. వారంరోజుల్లో ఇంటి లోన్ తాలూకూ చెక్కు తీసుకొచ్చి ప్రసూనాంబకు చూపించాడతను. ప్రసూనాంబ కన్నీరు పెట్టుకుంది.

"మా నాన్నగారు ఈ మాట కూడా ముందే చెప్పారండీ! నిజామాబాద్ జిల్లా వోళ్ళు అనుకున్నది ఎప్పటికైనా సాధిస్తారని, ఆ ఒక్కటీ వాళ్ళ దగ్గర మంచి గుణం ఉందని అంటూండేవాళ్ళు" అంది ఆనందంగా.

ఆ మర్నాటినుంచీ నెల రోజులు సెలవుపెట్టి ఇంటి పని ప్రారంభించాడతను. పొద్దున్నే తన మోపెడ్ వేసుకుని తాపీ మేస్త్రీ ఇంటికి చేరుకున్నాడు. ఎవడో ఇల్లు కట్టిన ఫ్రెండ్ ఇచ్చాడా అడ్రస్. ఓ పెంకుటిల్లది. ఇంటి ముందున్న జీప్ అప్పుడే స్టార్టయింది. ఫ్రంట్ సీట్లో కూర్చున్న వ్యక్తి జీప్ ఆపించి, రామ్ గోపాల్ వేపు ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఎవళ్ళు కావాలాస్సార్?"

"అంజయ్య మేస్త్రి"

"నేనే సార్! ఏం గావాలి?"

"మా ఇల్లు కట్టాల"

అతను జేబులోనుంచి ఓ కాగితం తీసి రామ్ గోపాల్ కిచ్చాడు.

"అది నా రేట్స్ కొటేషన్ సార్! సరేననుకుంటే నాకు ఫోన్ జేయండ్రి! రేపే పని షురుజేస్త. ఇంటి ఫోన్ నెంబర్ కూడా అందులోనే రాసున్నది"

అతని జీప్ వెళ్ళిపోయింది.

రామ్ గోపాల్ నిశ్చేష్టుడైపోయాడు.

తాపీ మేస్త్రీ ఒక జీప్ మెయింటెయిన్ చేస్తున్నాడా? అతనింటికి ఫోన్ కూడా ఉందా? మోపెడ్ స్టార్ట్ చేసుకుని వడ్రంగి మేస్త్రీ ఇంటికి చేరుకున్నాడు. అతని భార్య తలుపు తీసింది.

"వడ్రంగి మేస్త్రీ ఉన్నాడామ్మా?"

"లేదు. ఎయిర్ పోర్ట్ కి పోయిండు"

"ఎయిర్ పోర్టుకా? ఎందుకు? అక్కడేమయినా వడ్రంగి పని చేస్తున్నాడా?"

"కాద్సార్! మా పోరడు పెద్ద సదువులకు అమెరికా పోతుండు. సెండాఫ్ ఇయ్యడానికి పోయిండు."

రామ్ గోపాల్ కు మతి పోయినట్లయింది.

"సరే! అయితే మళ్ళీ వస్తాలే. నేను ఇల్లు కడుతున్నా! దానికి కార్పెంటరీ పని గురించి మాట్లాడాని కొచ్చినా"

"ఏ టైమ్ కొస్తవో జెప్తే బుక్ లో రాస్తా సార్! లేకుంటే ఇంటి దగ్గరుండడు. చాలా బిజీగుంటడు."

"అట్లనా! దినాలట్లున్నయ్, సాయంత్రం ఆరు గంటల కొస్తానన్జెప్పు"

"ఈ బుక్ లో టైమూ, నీ పేరూ అడ్రసూ రాయ్ సార్"

రామ్ గోపాల్ పుస్తకంలో రాసిచ్చాడు.

మర్నాడు పని ప్రారంభమైపోయింది. కూలీలు వచ్చి పునాదులు త్రవ్వడం ప్రారంభించారు. వాళ్ళందరికీ సాయంత్రమయ్యేసరికి కూలీ డబ్బు ఇస్తోంటే చాలా గర్వంగా, ఓ విధమైన థ్రిల్లింగ్ గా ఉందతనికి. ఎప్పుడూ కాషియర్ ముందు నిలబడి జీతం తీసుకోవడం, ఆఫీసర్ ముందు చేతులు కట్టుకుని నిలబడి చెప్పిన పనులు చేయడమేగానీ, పదిమందిని ఆజ్ఞాపించే అవకాశం, వాళ్ళకు జీతాలిచ్చే స్టేటస్ అనుభవించలేదు.

మామూలుగానే ఇంటికి స్లాబ్ పడేసరికి అతనికి శాంక్షన్ అయిన లోన్ అంతా ఖర్చయిపోయింది.

"అదేమిటండీ! ఇల్లంతా పూర్తవడానికి సరిపోయేంత లోన్ ఇచ్చారు కదా వాళ్ళు? అప్పుడే ఎలా అయిపోయింది?" గాబరాగా అడిగింది ప్రసూనాంబ.

"మనం లోన్ అప్లయ్ చేసి ఐదేండ్లయిపాయె. అప్పటి బడ్జెట్ ప్రకారమైతే సరిపోతుందే కానీ, ఇప్పుడు ఇంటికి కావల్సిన వస్తువుల ధరలన్నీ డబుల్ ఐపాయె. ఇంకేడకెళ్ళి సరిపోతది?

"మరిప్పుడేం చేద్దాం? మధ్యల ఆపుతే అటూ ఇటూ కాకుండా ఐపోతాం గదండీ! జీతంలో ఇంటి అప్పు తెగుతూంటుంది. ఇటు ఇంటి అద్దెకూడా కట్టుకుంటూండాలి"

ఇద్దరూ రాత్రంతా నిద్రలేకుండా ఆలోచించారు. ఉదయం ఆమె మెడలో నగలన్నీ బ్యాంక్ కు తీసుకెళ్ళాడతను.

"నగలు తాకట్టు పెట్టుకోవటం మానేశాం. గోల్డ్ లోన్ మీద బాన్ ఉంది" అన్నాడు మేనేజర్ చిరునవ్వుతో.

"నేను పదేళ్ళనుంచీ మీ కష్టమర్ని సార్! ఇలాంటి కష్ట సమయంల మదద్ జేయకుంటే ఎట్ల సార్? మీ సేవకోసమే మా బ్యాంక్ అని టీవీలో పబ్లిసిటీ గూడా జేస్తున్రుగద్సార్"

"మీ సేవకోసమే మా బ్యాంక్ అన్న మాట నిజమేగానీ, గోల్డ్ లోన్ ఇవ్వం"

"పోనీ ఓడీ ఇస్తారా?"

"ఇవ్వం"

"పోనీ ఇంకేదయినా లోన్ ఇస్తారా?"

"ఏదీ ఇవ్వం"

"ఐనాగానీ మీసేవ కోసమే మా బ్యాంక్ అని పేపర్లో వేయిస్తారు"

"ఔను. మేముందందుకే మరి"

"ఆ విషయం న్యూస్ పేపర్లలోనూ, టీవీలోనూ, రేడియోలోనూ పబ్లిసిటీ చేసేందుకు అయ్యే ఖర్చు మా లాంటివాళ్లు బోలెడుమంది నిజమైన సేవ చేసేందుకు ఉపయోగపడుతుంది కదా?"

"పడుతుందిగానీ, పబ్లిసిటీ కోసం బడ్జెట్ లో ఎక్కువ మొత్తాన్ని కేటాయించడం వల్ల అవి దానికే ఖర్చుచేయాలిగానీ, ఇంకొక హెడ్ కి ఖర్చు చేయగూడదని స్ట్రిక్ట్ ఇన్ స్ట్రక్షన్స్ ఉన్నాయ్"

రామ్ గోపాల్, ప్రసూనాంబ లేచి నిలబడ్డారు.

"పద పోదాం! వీళ్ళు చేసేది సేవకాదు. కస్టమర్ల భరతం పడ్తారు" అన్నాడు రాంగోపాల్.

"మీకే సహాయం కావాలన్నా ఎప్పుడూ మా బ్యాంక్ ని గుర్తుంచుకోండి. కేవలం ప్రజలను సేవించటమే మా ధ్యేయం" చిర్నవ్వుతో అన్నాడు మేనేజర్.

"అదేమిటి? ఇప్పుడేగా మాకెలాంటి సహాయమూ చేయలేను అన్నారు?"

"ఇది కర్టెసీ వీక్ లెండి. కస్టమర్స్ తో చాలా వినయ విధేయతలతో లౌక్యంగా, ప్రేమగా మాట్లాడాలని చాలా స్ట్రిక్ట్ ఇన్ స్ట్రక్షన్స్ వచ్చాయ్ నిన్నే- కర్టసీ వీక్ కోసం రెండొందల కోట్ల బడ్జెట్ కూడా ఇచ్చారు."

ఇద్దరూ నగలన్నీ తీసుకెళ్ళి మార్వాడీ దగ్గర వందకు నెలకు ఐదు రూపాయల వడ్డీకి తాకట్టు పెట్టి డబ్బు తీసుకున్నారు.

ఇంటి పని మరికొంత జరిగి మళ్ళీ ఆగిపోయింది. రామ్ గోపాల్ స్నేహితులందర్నీ అప్పు అడిగాడు. అందరూ "నెలరోజుల క్రితం అడిగితే ఇచ్చి వుండేవాళ్ళం" అన్నారు. మరికొంతమంది "నిన్న ఎందుకడగలేదు?" అన్నారు.

"సాయంత్రమయ్యేసరికి కూలివాళ్ళు కూలీకి వస్తారండీ! ఏమిటి చేయడం?" అంది ప్రసూనాంబ ఆందోళనగా. రామ్ గోపాల్ కేమీ తోచలేదు. ఇద్దరికీ ఆపూట ఆకలి కూడా వేయలేదు. అందుకని భోజనం చెయ్యలేదు.

"పోనీ మన టీవీని అమ్మేసేద్దామా?" అడిగాడతను.

ప్రసూనాంబ విరుచుకుపడింది.

"ఎన్నో అవస్థలుపడి వాయిదాల పద్ధతిలో కొనుక్కున్నాం! ఇప్పుడు దానిని అమ్మేస్తే ఇంకెప్పటికీ కొనలేము. నా శవం మీద నుంచే ఆ టీవీని తీసుకెళ్ళాల్సి ఉంటుంది" అంది.

మరో గంట తర్వాత ఆమే అతనికి సాయంపట్టి టీవీని ఆటోలోకి చేర్చింది.

రెండు రోజులు మరికొంత పని జరిగింది. మూడో రోజు పెళ్ళయిన కొత్తలో ప్రసూనాంబ మీద ప్రేమతో రామ్ గోపాల్ కొనిచ్చిన టేప్ రికార్డర్ అమ్మేశారు. ఆ తరువాతి వారంలో డైనింగ్ టేబిల్ ని పక్కింటి వాళ్ళే కారుచవకగా కొనేసుకున్నారు.

మర్నాడు ఆ పక్క కాలనీలోని ముసలాళ్ళు ఇద్దరు వచ్చారు వాళ్ళింటికి.

"మీరు ఇళ్ళు కడుతున్నారని తెలిసింది. సాధారణంగా ఇల్లు కట్టే వాళ్ళ సామాన్లన్నీ అమ్మేస్తూంటారని మాకు తెలుసు. అందుకే ఏమయినా సామాను అమ్మితే చౌకగా కొనుక్కెళదామని వచ్చాం" అన్నారు వాళ్ళు.

రామ్ గోపాల్ ప్రసూనాంబ వేపు చూశాడు.

ప్రసూనాంబ ఇల్లంతా కలయజూసింది.

"మనం కొద్దిరోజులు చాపమీద పడుకుందాంలెండి" అంది డబుల్ కాట్ వైపు చూస్తూ.

ఆ మంచాలు రెండూ రిక్షాలో తీసుకు వెళ్ళిపోయారు ఆ ముసలి వాళ్ళు.

ఆ మర్నాడు సాయంత్రం రామ్ గోపాల్ ఇంటికి తిరిగొస్తుంటే, తమ ఇంటిలోనుంచి ఓ వ్యక్తి తమ బొచ్చు కుక్కపిల్లను చంకలో పెట్టుకొని తీసుకెళ్లడం కనిపించింది.

ఛటుక్కున అతని చొక్కా పట్టుకున్నాడు రామ్ గోపాల్.

"మా కుక్క పిల్లను ఎత్తుకుపోతున్నావ్ కదూ?"

"కాదండీ! మీ మిసెస్ దీనిని ఆరువందలకు మాకు అమ్మేశారు"

రామ్ గోపాల్ కి కోపం చచ్చిపోయింది.

నీరసంగా ఇంట్లోకి చేరుకున్నాడు.

ఓ పక్క పిల్లలు ఏడుస్తున్నారు.

"మాకా పాడు ఇల్లు వద్దు. జూలీయే కావాలి" అంటూ.

ప్రసూనాంబ మరోపక్క ఓ ముసలతనితో మాట్లాడుతోంది. "ఇల్లంతా చూశానమ్మా! మీరు చేసిన తప్పేమిటంటే ఈస్ట్ లో ఖాళీస్థలం ఎక్కువ వదల్లేదు. అందుకనే మీ ఇల్లు పూర్తికావటంలేదు" అన్నాడతను. అంటే మేమేం చెయ్యాలంటారు?"

"బాత్రూమ్ ఒకటుందికదా! అది పడగొట్టేయండి"

మర్నాడే బాత్ రూమ్ ను పడగొట్టేశారు వాళ్ళు.

ఆ రోజు ఇంకో వాస్తుశాస్త్రజ్ఞుడిని ఖమ్మంనుంచి తీసుకొచ్చాడు ప్రసూనాంబ తండ్రి. అతను ఇల్లంతా చూసి "ఇరవై నాలుగు గంటల్లో మెట్లు పడగొట్టేయకపోతే ఇంటి ఓనరు ఠా" అన్నాడు.

"ఈ నిజామాబాదోళ్ళు అంతేనమ్మా! అన్నీ ప్రాణాలమీదికి తెచ్చుకుంటారు" అన్నాడాయన.

ఆ రాత్రి నిజంగానే జ్వరం వచ్చింది రామ్ గోపాల్ కి. జ్వరం వెంటనే తగ్గితే మెట్లు పడగొట్టేస్తానని వెంకటేశ్వరస్వామికి మొక్కుకుంది ప్రసూనాంబ. తెల్లవారేసరికి అతని జ్వరం తగ్గిపోయింది. వెంటనే మెట్లు పడగొట్టించడానికని ఇంటిదగ్గరికి చేరుకునేసరికి ఆ దారిన వెళుతున్న మరో వాస్తుశాస్త్ర విశారదుడు లోపలికొచ్చి "మెట్లు అలా ఉండడం వల్లే మీరు బతికి బయటపడ్డారు లేకపోతే ఎగిరిపోయేవారే" అన్నాడు.

"అట్లనా? అయితే మరి మేము ఇల్లు ఎందుకు పూర్తి చేయలేకపోతున్నాం?" అనడిగాడు రామ్ గోపాల్.

"ముందు హాల్లో దోషం వుంది మెయిన్ డోర్ గోడతో మూసి పారేసేయండి"

"మరి హాల్లోంచి బయటకు వెళ్ళేదెలా?"

"వంటింట్లో నుంచి రాకపోకలు పెట్టుకోండి!"

"అదేమిటి? ఇంటి వెనుక నుంచా?"

"అవును- అలా చేయకపోతే ఇంటావిడ ఠా!" అన్నాడతను.

ఆ రాత్రి ప్రసూనాంబకు గుండెనొప్పి వచ్చింది. వెంటనే రామ్ గోపాల్ ఆ హాల్ మొత్తం మూసివేస్తానని యాదగిరి గుట్ట నర్సింహుడికి మొక్కుకున్నాడు. తెల్లారేసరికి రామ్ గోపాల్ తండ్రి నిజామాబాద్ నుంచి మరో వాస్తు శాస్త్రజ్ఞుడిని తీసుకొచ్చాడు.

"బెడ్ రూమ్ పడగొట్టేసి, అక్కడ పూజ గది కట్టండి" అన్నాడతను. "అలా చేయకపోతే భార్యాభర్తలు ఇద్దరూ తా" అన్నాడు అతను.

రామ్ గోపాల్ కి పిచ్చెక్కిపోయినట్లయింది.

ఆ రాత్రి ప్రసూనాంబ భోరున ఏడ్చేసింది.

"మా నాన్నగారు ముందే చెప్పారండీ, నిజామాబాద్ జిల్లా వాళ్ళు వట్టి ఆరంభ శూరులు, ఏ పని పూర్తిగా చేయరు అని" అందామె.

రామ్ గోపాల్ కు కోపం వచ్చింది. ఆమె చెంప ఛెళ్ళుమనిపించాడు.

ప్రసూనాంబ మళ్ళీ అతని చెంప ఛెళ్ళుమనిపించింది.

"నిజామాబాద్ జిల్లా వాళ్ళు ఇలా పెళ్ళాం మీద చేయి చేసుకున్నప్పుడు తిరిగి చేయి చేసుకోవాలని కూడా మా నాన్నగారు అప్పుడే చెప్పారు."

ఆ మర్నాడు ఉదయం ఏడు గంటలకు ఖమ్మం జిల్లా భార్య, నిజామాబాద్ జిల్లా భర్త గేటు దగ్గర నిలబడి న్యూస్ పేపర్ కుర్రాడు విసిరేసిన న్యూస్ పేపర్ని అమాంతం అందుకుని ఆత్రుతగా "అమ్మకాల' పేజీ చూశారు.

"ఇంచుమించుగా కట్టడం పూర్తయిన, అందమయిన ఇల్లు అమ్మకానికి వుంది. వాస్తుశాస్త్రం, తర్కశాస్త్రం, ఇంకా అయిదారు పేరు తెలీని శాస్త్రాలకు అనుగుణంగా మలచబడిన ఈ ఇంటి ఓనర్లు అర్జంటుగా విదేశాలకు వెళ్ళవలసి రావడం వల్ల అతి కారుచౌకగా ఈ ఇల్లు అమ్మేయాలని నిశ్చయించుకున్నారు. కావలసినవారు వెంటనే ఈ కింది చిరునామాతో సంప్రదించవలసిందిగా కోరుతున్నాం."

ఆ ప్రకటన చూస్తూనే ఆనందంతో పొంగిపోయింది ప్రసూనాంబ.

"ఏవండోయ్! చూశారా! ఇదిగో ఎంత బాగుందో మన ఇంటి ప్రకటన!" అంది తన్మయత్వంతో. రామ్ గోపాల్ మనసు కూడా ఆ ప్రకటన చూసి ఊరడిల్లింది.

"మనం మనుషులుగా బ్రతకినికి అవసరమయిన వస్తువులన్నీ మళ్ళీ కొనుక్కుని ఖుషీగా కలో గంజో తాగి ఇజ్జత్ తోటి జిందగీ గుజరాయిద్దాం ప్రసూనా! ఈ ఫాల్తూ ఇల్లు మనకొద్దు! మన్లాంటి మిడిల్ క్లాసోడికి గసంటి కలలు గిట్ట రావొద్దు" అన్నాడతను.

* * * * *

# అక్షరజ్యోతి అహ్హాహ్హా

"కేరళ నూటికి నూరు శాతం అక్షరాస్యత సాధించిందట" న్యూస్ పేపర్ పట్టుకుని మా ఇంటికొస్తూ అన్నాడు రంగారెడ్డి.

అప్పటికే మా ఇంటి దగ్గర శాయిరామ్, జనార్ధన్, యాదగిరి, గోపాల్రావ్, పార్వతీదేవి అంతా పోగయి ఉన్నారు.

రంగారెడ్డి డైలాగ్ వింటూనే నేను పగలబడి నవ్వేను.

నేను నవ్వటం చూసి మిగతావాళ్ళు కూడా నవ్వసాగారు.

"ఏమిటి ఎందుకు నవ్వుతున్నారు?" అడిగాడు రంగారెడ్డి.

"నవ్వు రాకుండా ఎలా వుంటుంది గురూ? నూటికి నూరు శాతం అక్షరాస్యత- ఓహ్హోహ్హోహో"

అంటూ మళ్ళీ నవ్వేయసాగాడు గోపాల్రావ్.

"జబర్దస్త్ జోక్ అన్నా" అన్నాడు యాదగిరి కూడా నవ్వలేక కిందపడి దొల్లుతూ-

"అరె! పేపర్ లో క్లియర్ గా దాని వివరాలిచ్చారయ్యా! జర్నలిస్ట్ లేం అల్లాటప్పావాళ్ళు కాదు ఇష్టమొచ్చినట్లు రాసేయడానికి. మంచిగ నిజాయితీతో రాస్తారు-" అన్నాడు రంగారెడ్డి.

ఆ మాట వినగానే గోపాల్రావ్ తో సహా మేమంతా పగలబడి నవ్వేయసాగాం మళ్ళీ.

"నీ యవ్వ ఇది ఇంకా జబర్దస్త్ జోక్ గా ఉన్నది భాయ్. జర్నలిస్ట్ లంతా నిజాయితీతోటి రాస్తారంట."

అందరం ఐదు నిమిషాలు నవ్వుకుంటూ కళ్ళవెంబడి జారుతున్న కన్నీటిని తుడుచుకున్నాం. సరిగ్గా వారం గడిచేసరికి శాయిరామ్ హడావుడిగా, ఓ న్యూస్ పేపర్ తీసుకుని తెగ ఎగ్జయిట్ అయిపోతూ వచ్చాడు. మేమందరం వేదిక దగ్గర వెన్నెల్లో కూర్చుని పిచ్చాపాటి మాట్లాడుకుంటూండగా.

"గురూ! అద్భుతమైన వార్త! మన ఆంధ్రప్రదేశ్ కూడా అక్షరజ్యోతి స్కీమ్ ప్రారంభించిందట" అన్నాడతను.

మాకతని మాటలేం అర్థం కాలేదు.

"అక్షరజ్యోతా? అంటే ఏమిటి?"

"అంటే మన రాష్ట్రం కూడా కేరళ రాష్ట్రంలాగానే నూరుపాళ్ళు అక్షరాస్యత సాధించేస్తుందన్నమాట!"

ఆ మాట వింటూనే మళ్ళీ అందరూ పగలబడి నవ్వారు.

"ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్- నీయవ్వ- భలే దిల్దార్ జోకులేస్తుందన్నా! ఇంకేరాష్ట్రానికీ గింత సెన్సాఫ్ హ్యూమర్ లేదు." అన్నాడు జనార్ధన్.

"అలా నవ్వకూడదు భాయ్! చాలా తప్పు పని చేస్తున్రు" అన్నాడు యాదగిరి.

"ఎందుకని నవ్వకూడదు?"

"ఎందుకంటే మన ఆంధ్రప్రదేశ్ ని మీరు తక్కువ అంచనా వేస్తున్రు. మన తెలుగు ప్రజల సంగతి మీకెరుకలేదు. తిక్క లేచిందంటే ఒక్క రోజుల పబ్లికంతా అక్షరాస్యులయి పోతారు- అంత కెపాసిటీ ఉందాళ్ళకు" అతనిని శాయిరామ్ సపోర్ట్ చేశాడు.

శాయిరామ్ కీ మధ్య తెలుగు ప్రజల మీద అభిమానం ఎక్కువైందన్న విషయం మాకు తెలుసు. అందుకని అతన్ని నిరుత్సాహ పరచటం ఇష్టంలేక వూరుకున్నాం.

"మనం కూడా ప్రభుత్వంతో సహకరిస్తే నూరుశాతం అక్షరాస్యత క్షణాల్లో సాధించవచ్చు" అన్నాడు గోపాల్రావ్ అతికష్టం మీద నవ్వాపుకుంటూ.

"మన కాలనీ వాళ్ళందరం కూడా ఈ స్కీమ్ లో చేరి నిరక్షరాస్యతను ఎదుర్కొందాం" అన్నాడు రంగారెడ్డి మరింత వుత్సాహంతో.

"మనమా!" ఉక్కిరి బిక్కిరౌతూ అడిగాడు జనార్ధన్.

"అవును! మన రాష్ట్రానికి మనం చేసుకోకపోతే ఇంకెవరు చేస్తారు?" అంది పార్వతీదేవి. ఆమెకీమధ్య దేశభక్తి ఎక్కువయిపోయింది. ఉండుండి 'రామ్ ఔర్ రోటీ' అంటోంది.

"మంచి పద్ధతి ఏమిటంటే అదివరకు లాగానే మన కాలనీ వాళ్ళందరం కలసి ఆదిమానవులు అనే అడవిజాతిని నాగరీకులుగా చేసే కార్యక్రమం విజయవంతంగా అమలుపరచాం కదా!" అన్నాడు చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్.

ఆ ఆలోచన నిజంగానే అందరికీ ఉత్సాహం కలిగించింది.

ఎందుకంటే ఎదుటివాడికి తెలియని విషయాలు చెప్పటం మా అందరికి భలే సరదా!

అందులో చదువురాని వాళ్ళకు చదువు చెప్పటానికి మా కాలనీలో ఆడామగా అందరూ ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉన్నారు.

ఎటొచ్చీ నేర్చుకునే వారెవరూ దొరకకపోవటంవల్ల అందరి కోరికలూ అలానే అణగారి ఉండిపోయినయ్. చాలామంది తమ పిల్లల మీదనే ఆ కోరిక తీర్చుకోవాలనుకున్నారు గానీ ఈ రోజుల్లో సిలబస్ కి ఆ రోజుల్లో మేము నేర్చుకున్న సిలబస్ కి చాలా తేడా వుండడంతో మా కోరిక నెరవేరలేదు.

మా ప్రపోజల్ వినడంతోనే మా కాలనీ వాళ్ళంతా కూడా మేము చదువు చెప్తాం అంటే మేము చెప్తాం అంటూ పోటీలుపడి రంగారెడ్డి దగ్గర పేర్లు నమోదు చేయించుకో సాగారు.

సాయంత్రం అయ్యేసరికి లిస్టు లో పేర్లు మూడొందల అరవై అయిదుకి చేరినయ్.

"ఇప్పుడేం చేయాలి మనం!" అడిగాడు గోపాల్రావ్.

"ఏం లేదు. ఇదిగో అక్షరజ్యోతి ఫోన్ నెంబర్! సిటీబస్ వెనక రాసి ఉంటే నోట్ చేసుకున్నాను. మనం ఈ నెంబర్ కి ఫోన్ చేసి కనుక్కుంటే మనం ఈ కార్యక్రమం ఎలా అమలు జరపాలి. అదే విషయం వారు చెపుతారు" అన్నాడు శాయిరామ్.

"అయితే పదండి ఫోన్ చేద్దాం"

అందరం బయలుదేరబోతుంటే పార్వతీదేవి మంచి రోజు చూసి ఆ పని ప్రారంభించాలని గొడవ పెట్టిందిగానీ ఎదుటివాడికి చదువు చెప్పాలనే మా 'కసి' ముందు ఆమె తీర్మానం నెగ్గలేదు.

అందరం మా కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన టెలిఫోన్ కౌంటర్ దగ్గరకు నడిచాం.

"నెంబరెంత?" అడిగాడు రంగారెడ్డి.

"236951" చెప్పాడు శాయిరామ్.

ఆ నెంబర్ రింగ్ చేసి వెంటనే కంగారుగా రిసీవర్ పెట్టేశాడతను.

"ఏమిటి? రాంగ్ నెంబరా?" అడిగాడు గోపాల్రావ్.

"కాదు! 'అక్షరజ్యోతి' అనే అన్నాడు అవతలతను.

"అయితే మరెందుకు పెట్టేశావ్? అదేగా మనక్కావలసింది?" ఆశ్చర్యంతో అడిగాము మేము.

సాధారణంగా మొదట ఏ నెంబర్ కొట్టినా రాంగ్ నెంబర్ వెళ్తుంది కదా- ఆ అలవాటు చొప్పున ఇంకే నెంబర్ కయినా వెళ్తుందేమో అనుకున్నాను. కానీ మనం అక్షరజ్యోతికి రింగ్ చేస్తే అక్షరజ్యోతే ఫోనులో కొచ్చేసరికి షాక్ తగిలినట్లయి కంగారుగా ఫోన్ పెట్టేశాను.

అందరూ అతనిని అర్థం చేసుకున్నారు.

"నిజమే! అలా సడెన్ గా మనం రింగ్ చేసిన నెంబరే పలుకుతే చాలా షాకింగ్ గా వుంటుంది. కొంచెం వీక్ గా ఉన్న హార్ట్ పేషెంట్స్ అయితే ఎగిరి పోతారసలు"

ఈసారి నేను అక్షరజ్యోతికి రింగ్ చేశాను.

"హల్లో అక్షరజ్యోతి హియర్" అన్నాడు ఫోన్ కవతలివేపు నుంచీ.

"హల్లో సర్. మేము నిర్భయ్ నగర్ కాలనీ వాళ్ళం మాట్లాడుతున్నాం"

"ఏం కావాలి మీకు?"

"అదేనండీ! మేమంతా చదువురాని వాళ్ళందరికీ చదువు చెప్పి మన ప్రభుత్వానికి సహాయం చేయాలనుకుంటున్నాం. మీ స్కీమ్ వివరాలేమిటో చెపితే?"

"ఆ స్కీమ్ లో ముందు కండిషనేమిటంటే ముందు అసలు మీకు కొద్దో గొప్పో చదువొచ్చి ఉండాలండీ! మరి మీ వాళ్ళకి. ఆ అర్హత ఉందా?"

"ఓ మా కాలనీ అంతా కూడా ఎడ్యుకేటెడేలెండి. లేకపోతే గవర్నమెంట్ జాబ్స్ ఎట్లా చేస్తాం?"

"ఓ! అలాగా! అయితే సరే! నెక్ట్స్ మీరు చేయాల్సిందేమిటంటే మీ కాలనీకి చుట్టు పక్కలున్న పదిమంది నిరక్షరాస్యులను వెతికి పట్టుకోవాలి. వాళ్ళ వయసు పదిహేనూ ముఫ్పై మధ్య ఉండాలి. సాయంత్రం సమయాల్లో మీరీ క్లాసులు కండక్ట్ చేయాల్సుంటుందన్నమాట. ముందు వాళ్ళకు చదువెలా చెప్పాలీ అనే విషయం గురించి మేము మీకు నాలుగు రోజులు ట్రైనింగ్ ఇస్తాం! మీక్కావలసిన మెటీరియల్ కూడా ఇస్తాం. మీ ఇంటి నెంబర్లు, పేర్లు, చిరునామాలు చెపితే మీరు ఎప్పుడు ట్రైనింగ్ కి రావలసిందీ మేమే పోస్ట్ కార్డ్ ద్వారా ఇంటిమేషన్ పంపుతాం!"

"ఐసీ! అయితే మేమే స్వయంగా మీ ఆఫీసుకొచ్చి కనుక్కుంటాంలెండి"

అందరికీ ఆ వివరాలు చెప్పాను.

నిరక్షరాస్యులకు చదువు చెప్పాలంటే ముందు మేము నాలుగు రోజులు ట్రయినింగ్ తీసుకోవాలి అనేసరికి మా లిస్ట్ లో సగం మంది జారిపోయారు.

"చూడుగురూ! నువ్వేమయినా చెప్పు. నన్ను ఏదైనా సరే గవర్నమెంట్ ఆఫీస్ కెళ్ళమని మాత్రం చెప్పకు. నా మీదేమయినా పగ ఉంటే నన్ను నరుకు. చెప్పు తీసుకుని కొట్టు అంతేకాని గవర్నమెంట్ ఆఫీస్ కి వెళ్ళమని మాత్రం చెప్పకు" అన్నాడు జనార్ధన్.

"ఆ మాట నిజమే! లక్ష ప్రయివేట్ కంపెనీలకెళ్ళి పనులు చేసుకురమ్మంటే చేసుకొస్తాం గాని ఒక్క గవర్నమెంట్ డీలింగ్ కూడా మా వల్లకాదు మా కొద్దసలు" అన్నారు మిగతావాళ్ళు కూడా!

"మా పెదనాన్నగారు గవర్నమెంట్ ఆఫీస్ లో పాపం ఏదో చిన్న పనిపడి దానికోసం తిరిగి తిరిగి కదా చివరకు ఆ ఆఫీస్ వరండాలో చనిపోయాడు" అంది పార్వతీదేవి.

"ష్! మరీ అలా మాట్లాడకండి! మనలో కూడా గవర్నమెంట్ సర్వెంట్స్ వున్నారు" అన్నాడు రంగారెడ్డి.

ఆ విషయం అప్పుడు గుర్తుకొచ్చి టక్కున ఆ టాపిక్ మాట్లాడటం మానేశాం అందరం.

"అయినా ఇంకొకడికి చదువు చెప్పడానికి గవర్నమెంటెందుకు మధ్యలో! మనమే మనచుట్టు పక్కల ఉన్న కొంతమంది చదువురాని వాళ్ళను తీసుకొచ్చి వాళ్ళను అక్షరాస్యులను చేసేద్దాం" అంది పార్వతీ దేవి.

"అవును అదే మంచిది"

అందరం అప్పటికప్పుడే నిరక్షరాస్యులను వెతకటానికి టార్చ్ లైట్లు తీసుకుని బయల్దేరాం.

మా కాలనీకి దగ్గరిలోనే ఉన్న సంజయ్ నగర్ గుడిశెల సంఘంలో చాలామంది నిరక్షరాస్యులుంటారని మాకు తెలుసు.

మమ్మల్ని చూడగానే గుడిశెల వాళ్ళందరూ పరుగుతో వచ్చి చుట్టుముట్టేశారు. అందరి ముఖాల్లోనూ ఆనందం.

"సార్! మాకియ్యండ్రిసార్! గరీబోండ్లున్నాము జమానా కెళ్ళి ఓట్లు మీకే వేస్తున్నాము"

మాకు ఆశ్చర్యంతో నోటమాటరాలేదు.

"ఏమిటీ మీ కిమ్మంటున్నారు" అడిగాడు రంగారెడ్డి.

"అదేసార్! ఐదువేలు పుక్కట్ లోన్ ఇస్తనికి వచ్చిన్రు గద్సార్ మీరు- బాంకోళ్ళకు అప్పు గురించి రాసిచ్చి సంవత్సరమైపాయె సార్-"

మాకు అప్పుడు అర్థమైంది.

సాధారణంగా ప్రతి ఎలక్షన్ ముందూ గవర్నమెంట్ అలాంటి ఓటు బాంక్ అందరికీ తలో ఐదువేలు అప్పు ఉచితంగా ఇస్తూండటం పరిపాటి.

ముఖ్యంగా జనార్ధన్ పూజారి చేసిన పని ఇది.

రంగారెడ్డి నవ్వాడు బిగ్గరగా!

"అమ్మా! మీ అందరికీ ఫ్రీగా బాంక్ ల ద్వారా అప్పులిప్పించిన జనార్ధన్ పూజారి వల్ల బంగారం మొత్తం అమ్ముకునే స్థితికొచ్చిందమ్మా మనదేశం- ఇంకా పుక్కట్ లోన్లు ఆపరా మీరు?"

మేము లోన్ లు ఇచ్చేవాళ్ళం కాదని తెలీగానే క్షణాల్లో మమ్మల్ని వదిలి ఎవరి ఇళ్ళలోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

మేము గత్యంతరం లేక మరికొన్ని గుడిశెల దగ్గరకు వెళ్ళి అందరినీ బయటకు పిలిచాము.

అది సాయంత్రం టైమవటంతో చాలామంది గుడిసెల ముందే కూర్చుని గుడంబా తాగుతున్నారు.

"ఏం గావాలి మీకు?" ఒకతను తాగటం ఆపి మావేపు చూశాడు.

"ఈ ఏరియాలో చదువురాని వారందరికీ కనీసం రాయటం, చదవటం నేర్పిస్తాం" అన్నాడు రంగారెడ్డి.

"దేన్ని గురించి జేస్తున్రిదంతా?" అడిగాడింకొకతను.

"మా దగ్గర చదువు నేర్చుకుంటే మీ అందరూ ఇకనుంచి వేలి ముద్ర వేయకుండా మీ సంతకాలు మీరే చేయవచ్చు" అంది పార్వతీదేవి.

వాళ్ళు ముఖాలు చూసుకున్నారు.

"ఏదైతే ఏమయింది? అంగూఠా బదులు దస్తఖత్ జేస్తే మీకేమైనా ఫాయిదా ఉంటదా?" వాళ్ళ ప్రశ్నకు ఏం సమాధానం చెప్పాలో మాకు అర్థం కాలేదు.

"అదేం వుండదుగానీ- అలా చేస్తే చాలా బాగుంటుందన్నమాట! అలా అందరూ సంతకాలు చేయటం నేర్చుకుంటే మన రాష్ట్రంలో అందరూ చదువుకున్న వారికింద లెక్కన్నమాట."

"రాష్ట్రంలో అందరూ సదువుకున్నోళ్ళుంటే ఫాయిదా ఏమైనా వుంటుందా సార్ మనకి?"

ఆ ప్రశ్నకు నాకు సమాధానం దొరకలేదు.

"అంటే ఇంతకాలం అది మంచిగ పని జేయలేదా సార్?"

"పన్జేస్తే ఇప్పుడు విదేశాలకు బంగారం ఎందుకమ్ముకుంటాం? ప్రజల్లో, రాజకీయ నాయకుల్లో చదువు లేకపోవటం వల్లే మన గతి ఇట్ల తయారయింది" అన్నాడు రంగారెడ్డి.

"అంతేకాదు భాయ్! సదువు లేనందువల్లే లీడర్లు మన ఓట్లు గిట్ట పైసలిచ్చి కొని గెలుస్తున్రన్నట్లు!" అన్నాడు యాదగిరి.

"మళ్ళా ఎమ్మే చదివి లెక్చరర్ ఉద్యోగం జేస్తున్న భీమ్ రెడ్డి సాబ్ కూడా పైసల్దీసుకుని ఓటేసిండు గద్సార్ మొన్నా?" ఎవరో అడిగారు.

మాకు మళ్ళీ గొంతు నొక్కుకు పోయింది.

అందరం ఆ ప్రశ్న విననట్లు నటించాం.

ఓట్లు అమ్ముకోవడానికి బీదతనం కారణమనీ, చదువుకోవడం చదువుకోకపోవడం కారణం కాదనీ అర్థమయింది మాకు అప్పుడే!

"సరే! గదంతా మంచిగానే వుందిసార్! మరిప్పుడు ఈ సదువుకి పైసల్సంగతేంది?

అందరూ అతని వంక అభినందిస్తూ చూశాం!

శాయిరామ్ అతనికి ధైర్యం చెపుతున్నట్లు భుజం తట్టాడు.

"పిచ్చివాడా! మేం కసాయి వాళ్ళం కాదు. మీలాంటి బీదల దగ్గర పైసలు తీసుకొని చదువు చెప్తామనుకుంటున్నారా! మేం సమాజం కోసం ఈ పని చేపట్టాం! మన రాష్ట్రంలో నూటికి నూరుపాళ్ళు అక్షరాస్యత సాధించాలనేది మా ధ్యేయం." అన్నాడు ఉత్సాహంగా.

అతను మావంక పిచ్చోళ్ళను చూసినట్లు చూసాడు.

"నేననెడిది అదిగాద్సార్! మీరు మాకు పైసలిచ్చెడి సంగతి! మీ దగ్గర సదువు గిట్ట నేర్చినందుకు మాకేమిస్తవ్?"

అతని ప్రశ్న మాకు మతిపోగొట్టింది.

"మీకు చదువు చెప్పినందుకు మేము మీకు పైసలివ్వాలా?" షాక్ నుంచి తేరుకుంటూ అడిగాడు జనార్ధన్.

"అవ్ సార్! ఇయాళ్రేపు ఏపనయినాగానీ పైసల్లేకుండా ఎవళ్ళు జేస్త్రారాస్సార్."

రంగారెడ్డి రంగంలోకి దిగాడు.

"ఇదిగో నీ పేరేంటి బాబూ?"

"నర్సింహ సార్"

"చూడు నర్సింహా! చదువు రోజంతా నేర్చుకోరు కదా మీరు. మీ పనులు మీరు రోజంతా చేసుకుని సాయంత్రం రెండు గంటలు చదువు నేర్చుకుంటారన్నమాట! దీనికి పైసలడగటం తప్పుకదూ?"

"ఇగో సార్! ఈ నకరాలన్నీ మనదగ్గర నడవయ్! మాకు ఊరికే మీరెందుకు సదువు జెప్తారు సార్! మీరేం పాగల్ గాళ్ళా? గవర్నమెంట్ దగ్గరో, లేకుంటే ఇంకెవళ్ళ దగ్గరో మంచిగ పైసలు కమాయిస్తారు. మాకెరుక లేదా సార్! మా గుడిసెలోళ్ళ పేరు జెప్పుకొని ఎంతమంది ఎన్ని పైసలు కమయించలేద్సార్! అన్నీ మా కెరుకే సార్! సంతకం జేయడానికి రాదుగాని దునియా తెల్సుసార్ మాకు! టైమ్ వేస్టెందుకు గ్గానీ- మేం వందమందున్నాం. అందరం మంచిగ మీరెట్ల జెప్తే అట్లా సదువు నేర్చుకుంటం! మాకు ఎన్ని పైసలిస్తారో జెప్పండ్రి!"

అప్పటికే అక్కడ మరో వందమంది పోగయిపోయారు.

నేను రంగారెడ్డి వైపు చూసాను.

"మనం ఏం చెప్పినా వాళ్ళు నమ్మరు! అందుకని ఎంతోకొంత డబ్బిచ్చేసి వాళ్ళను అక్షరాస్యులిగా చేయటమే మంచిది" అన్నాను.

"అవును! మన కాలనీలో చదువు చెప్పాలని ఉత్సాహపడుతున్న వాళ్ళంతా పాపం నిరుత్సాహ పడిపోతారు" అన్నాడు శాయిరామ్.

"అదీగాక మన రాష్ట్రాన్ని నూరుశాతం అక్షరాస్యత గల రాష్ట్రంగా మార్చే అవకాశం పోగొట్టుకుంటాం" అన్నాన్నేను.

"సరే పైసలెన్ని ఇవ్వాలి?" అడిగాడు రంగారెడ్డి.

నర్సింహ తల గోక్కున్నాడు.

"ఒక్కొక్కనికి దినానికి ఇరవై రూపాయలివ్వండి- పిల్లగాండ్లకు పదిరూపాయలిస్తే చాలు."

అందరం ఉలిక్కిపడ్డాం-

"రోజుకి ఒక్కొక్కళ్ళకు ఇరవై రూపాయలా?"

"అవ్ సార్! సాయంత్రం కూలిపనికెళ్ళొచ్చినాంక మూడు గంటలు పనిజేయాలె! మళ్ళా అదిగూడా కాళ్లతో, చేతులతో చేసెడి పని కాదు దమాక్ తోటి పని జేయాల! మెదడు తోటి రెండు గంటలు పనిజేయించాలంటే తక్కువ పనాసార్ అది? మేం పనిజేయాలె- మా మెదడు తోటి గూడా మేమే పని జేయించాలె! అక్కడికీ ఇద్దరి కూలీ అవుతున్నది గద్సార్!"

నేను రంగారెడ్డిని పక్కకు పిలిచాను.

"రెడ్డీ! వెంటనే వాడడిగింది ఒప్పేసుకో! లేపోతే వాడికీ వాడి మెదడుకీ ఇద్దరికీ చెరో ఇరవై ఇమ్మని అడుగుతాడు" అన్నాడు రహస్యంగా. రంగారెడ్డి ఒప్పుకున్నాడు.

"సరే భయ్! రేపు సాయంత్రం నుంచీ రోజూ మేమంతా ఇక్కడికి వచ్చి మీకు చదువు చెప్తాం! మీరంతా పదిమంది చొప్పున పది బాచీలు- ఇక్కడ రడీగా ఉండాలి. ఆరింటికల్లా- సరేనా?"

నర్సింహ మొఖంలో ఆనందం కనిపించింది.

"అలాగే సార్! పైసల్దీసుకున్నాక ఇక పని జేయకుండ ఎట్లుంటాం సార్! గసంటి దోకాబాజ్ మనతాన లేద్సార్! ఇప్పుడు ఒక్కరోజు జీతం అందరికీ అడ్వాన్స్ ఇయ్యండ్రి!"

మేము గతుక్కు మన్నాము.

"అడ్వాన్సా? అడ్వాన్సెందుకు?"

"లేకుంటే ఎట్లా సార్? మీరు రేపు కాకపోతే ఎంత నుక్సార్ సార్?"

"అదేమిటి మేం రాకపోయినా మీకు నష్టమేముంది?"

"మీ మాట ఇని- మేం వేరే వాండ్లెవరైనా సదువు జెప్పనికొస్తే మా బేరం పోగొట్టుకుంటాం గద్సార్? న్యాయం ఆలోచించాలే!"

మాలో చాలా మందికి చెమటలు పట్టినయ్! కర్చీఫ్ తీసి మొఖాలు తుడుచుకున్నాం.

"ఇచ్చేసేద్దామా?" అడిగాడు రంగారెడ్డి పార్వతీదేవి వైపు చూస్తూ.

"ఇచ్చేద్దాం" అంది పార్వతీదేవి.

"తప్పేదేముంది?"

"దీనికి సోంచాయిస్తారేం సార్? ఈ అక్షరజ్యోతి దిక్కుకెళ్ళి మాలాంటోళ్ళకు మంచి డిమాండున్నది సార్ ఇయాళ్రేపు! ఇయాళ అడ్వాన్స్ ఇయ్యకపోతే రేపు వేరే వాండ్ల దగ్గరజేరిపోతాం!" దబాయింపుగా అన్నాడు నర్సింహ.

మేము కిక్కురుమనకుండా అందరం తలో ఇరవై తీసి వాళ్ళకిచ్చాం.

"మిగతా అందరికీ రేపిస్తాం- ఇక్కడున్న పదిమందికీ మాత్రం ఇవాళ ఇస్తున్నాం" చెప్పాడు రంగారెడ్డి.

నర్సింహ ఒప్పుకున్నాడు.

అందరం ఆనందంగా కాలనీకి చేరుకున్నాం.

చదువు చెప్పాలంటే ఒక్కొక్కరూ రోజుకి ఇరవై రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందనేసరికి చదువు చెప్తాననే వాలంటీర్ల సంఖ్య పూర్తిగా పడిపోయింది.

కేవలం మా కమిటీ సభ్యులం మాత్రమే మిగిలాం! తెల్లారేసరికి వాళ్ళల్లో కూడా కొంతమంది మాయమైపోయి- చివరకు నేనూ రంగారెడ్డి మాత్రమే ఆ పదిమందినీ అక్షరాస్యులుగా చేయడానికి నిర్ణయించుకున్నాం!

మర్నాడు మేము వెళ్ళేసరికి నర్సింహ తాలూకు గ్రూప్ వాళ్ళందరూ సిద్ధంగా కూర్చుని వున్నారు. అందరికీ పలకలూ, బలపాలూ ఇచ్చి అ ఆ ఇ ఈ లు రాయించటం ప్రారంభించాం!

పది నిముషాలు దిద్దగానే నర్సింహ గుడిశెలో కెళ్ళి గుడంబా సీసా తీసుకొచ్చాడు.

అందరూ తలో గ్లాసులో పోసుకొంటూంటే మాకు భయం వేసింది.

"అదేమిటి? చదువు అయ్యేవరకూ తాగకూడదు" అన్నాడు రంగారెడ్డి.

"ఇగో సార్! ఈ నకరాలు మన దగ్గర నడవయ్! తాగొద్దంటానికి నువ్వెవళ్ సార్? నా పైసల్తో నేన్తాగుత! ఇష్టముంటే సదువు చెప్పు- లేకుంటే పో-"

అందరూ తలో గ్లాసు తాగేశారు.

"ఆ ఇప్పుడు జెప్పు సార్! 'అ ఆ ఇ ఈ' సూడకుండా రాయాలి. గంతనే గదా?" అడిగాడు నర్సింహ.

"అవును-"

అతను రాసి తీసుకొచ్చి చూపించాడు.

ఆ అక్షరాలేమిటో నాకర్థం కాలేదు. ఎందుకంటే అవి తెలుగులిపిలో లేవు-

"ఇట్లా కాదు" అంటూ రంగారెడ్డి మళ్ళీ రాసిచ్చాడు అందరికీ-

సరిగ్గా పదినిమిషాల్లో ఓ మనిషి ఇంకో బాటిల్ తీసుకొచ్చి నర్సింహకిచ్చి పైసలు తీసుకు వెళ్ళిపోయాడు.

మళ్ళీ అందరూ తలో గ్లాసూ తాగారు.

ఈ సారి పలకల మీద అ ఆ ఇ ఈ లంటూ ఏవో పిచ్చి బొమ్మలు గీసుకొచ్చి చూపించారు. మరో పది నిమిషాల్లో మళ్ళీ అదే వ్యక్తి గుడంబా బాటిల్ తీసుకొచ్చి నర్సింహ కిచ్చాడు.

"ఏయ్- ఏమిటిది? ఓ పక్కన మేం వీళ్ళకు చదువు చెప్తూంటే నువ్వు బాటిల్ తెచ్చిస్తే ఎలా? వీళ్ళింక ఏం చదువుకుంటారు?" అడిగాడు రంగారెడ్డి.

అతను మావేపు కోపంగా చూశాడు.

"ఏయ్ పోన్లేగదాని ఇడుస్తున్న! లేకుంటే మిమ్మల్ని అప్పుడే తన్ని ఇంటికి పంపుతుండె! మీదిక్కు కెళ్ళి ఆళ్ళు గుడంబ బంద్ జేస్తే నష్టం ఎవరికి? మాకా, మీకా? నీయవ్వ- మా సేఠ్ గవర్నమెంట్ కి సంవత్సరానికి ఎంత కట్టాలో ఎరుకనా? నాలుగు నక్షలు బే! నీ తాతిస్తాడా అంత సొమ్ము- అక్షరజ్యోతంట అక్షరజ్యోతి- సాలె- రేపటికెళ్ళి ఈడ కనిపించొద్దు మళ్ళా- కాళ్ళు చేతులు ఇరుస్తా- సాలెగాండ్లు - తిని తిన్నగ ఉండనికి కాదు బాడుకవ్ లకి-" అనేసి వెళ్ళిపోయాడతను.

మా మొఖాలు అవమానంతో ఎర్రబడి పోయినయ్.

అప్పటికే వాళ్ళు మూడో బాటిల్ ఖాళీచేసేశారు. పక్కనే టీవీలో వస్తున్న సినిమా చూడ్డాని కెళ్ళారు కొందరు.

చేతిలో పలకలు విసిరిపారేసి కిందపడిపోయాడొకడు. రెండోవాడు మూడోవాడి చొక్కా పట్టుకుని లింగయ్య అనేవాడు పెళ్ళిలో తనకు చేసిన మోసం గురించి ప్రతీకారం తీర్చుకోడానికి సిద్ధంగా ఉన్నాడు.

అక్కడున్న ఆడాళ్లిద్దరూ కూడా నిషా ఎక్కువైపోయి ఏమిటేమిటో మాట్లాడుతున్నారు. చేసేది లేక ఆ పూటకు చదువాపేసి మర్నాడు మళ్ళీ వెళ్ళాం. అందరూ వీసీఆర్ లో కాసెట్ వేసుకుని సినిమా చూస్తున్నారు. మళ్ళీ మూడో బాటిల్ వచ్చేసరికి తిరిగి వచ్చేశాం.

ఇలాగే తొమ్మిది రోజులూ గడిచిపోయింది.

"ఇలాక్కాదు గానీ ముందు వీళ్ళకు సంతకం నేర్చుదాం" అన్నాడు రంగారెడ్డి. "వీళ్ళ పేర్లు వీళ్ళు చదువుకుని సంతకం చేస్తే చాలు ఇంకేమీ నేర్పటం మన వల్లకాదు-"

ఇద్దరం కలసి మూడో బాటిల్ వచ్చే లోపలే వాళ్ళ సంతకాలు చేయటం నేర్పించి, వాళ్ళ పేరు మేము రాస్తే చదవటం నేర్పించాము కానీ మూడో బాటిల్ తాగేస్తే అదంతా మర్చిపోయి మళ్ళీ పిచ్చి బొమ్మలు. గీతలూ గీసి డాన్స్ చేస్తారని మాకు తెలుసు- ఏమయితేనేం? మాకు బ్రహ్మానందం కలిగింది- మా టార్గెట్ పూర్తయినందుకు-

వెంటనే వాళ్ళందరితో గ్రూప్ ఫోటో దిగి మర్నాడు కలెక్టరాఫీసుకి చేరుకున్నాం. మేము చేసిన ఘనకార్యం చెప్పగానే మా మాటలు వారికి అర్థం కాకపోవటంతో ఆశ్చర్యంగా కాగితం మీద రాసిచ్చాం! ఆ వివరాలన్నీ రిజిస్టర్ లో రాసుకున్నారు వాళ్ళు. మాకు త్వరలో సర్టిఫికెట్స్ కూడా ఇస్తామని చెప్పారు రాత ద్వారా!

మేము తిరిగి వస్తుంటే టాంక్ బండ్ మీద కొన్ని లక్షల ఖర్చుతో ముందు గాస్ తోనూ తరువాత కరెంటుతోనూ వెలుగుతున్న అక్షరజ్యోతి కనిపించింది.

కొన్ని లక్షల రూపాయలతో నగరమంతతా రాయించిన హోర్డింగ్స్ కనిపించినయ్.

కొన్ని కోట్ల రూపాయల ఖర్చుతో ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు టీవీ రేడియోల్లో కనబడుతూ వినబడుతున్నయ్.

కొన్ని లక్షల రూపాయల ఖర్చుతో అక్షరజ్యోతి పేరు మీద జరుగుతున్న సభలూ, సమావేశాలూ, కాన్ఫరెన్స్ లూ-దారిపొడుగూతూ కనబడుతూనే ఉన్నాయ్.

"అక్షరజ్యోతి ముసుగులో ఎంత డబ్బు ఎవరెవరు కొల్లగొడుతున్నారో చూడు!" అన్నాడు రంగారెడ్డి.

"ఈ లెక్కలో మన రాష్ట్రం నూటికినూరు శాతం అక్షరాస్యత సాధించే- రోజు ఎంతో దూరంలో లేదు-" అన్నాన్నేను.

ఇద్దరం కాలనీ చేరుకున్నాం.

మేము విజయవంతంగా మా స్కీమ్ అమలు జరిపినందుకు కాలనీలో మా కోసం అభినందన సభ ఏర్పాటు చేశారు.

నేనూ రంగారెడ్డి వేదిక మీదకు రాగానే దండలు వేశారు మెడలో, అంతా తప్పట్లు కొట్టారు.

మేము మైక్ ముందుకెళ్ళి మాట్లాడే సమయం వచ్చింది. ముందు రంగారెడ్డి వెళ్ళి మాట్లాడసాగాడు.

అతని మాటలు నాకర్థం అవసాగినయ్ గానీ మిగతా వారెవ్వరికీ అర్థంకావటంలేదు.

"తెలుగులో మాట్లాడు" అంటూ కేకలు వేయసాగారు.

అది మరీ ఆశ్చర్యం కలిగించింది నాకు. ఎందుకంటే అతను తెలుగులోనే మాట్లాడుతున్నాడు. మళ్ళీ మాట్లాడ్డానికి ప్రయత్నించాడు రంగారెడ్డి. ఈసారి అతనికి మాటకూడా సరిగ్గా రావటం లేదు. దాంతో అతనిని పక్కన కూర్చోబెట్టి నన్ను మాట్లాడమన్నారు. నేను అక్షరజ్యోతి గురించి ఎంత శ్రమపడ్డామో వివరించటం ప్రారంభించాను గానీ మళ్ళీ కేకలు వినిపించినయ్.

"తెలుగులో మాట్లాడు" నాకు అప్పుడర్థమయింది.

చదువు మీద కంటే తాగుడు మీదా, సినిమాల మీదా ఆసక్తి ఉన్న వారికి చదువు నేర్పించేటప్పుడు మనకున్న చదువుకూడా పోయే అవకాశముందని-

అప్పటికప్పుడు నా భార్యా రంగారెడ్డి భార్యా భోరున ఏడుస్తూ వచ్చారు.

మా ఇద్దరికీ పిచ్చి ఎక్కిందేమోనని వారి అభిప్రాయం. మరి కాసేపట్లో డాక్టర్ కూడా వచ్చాడు. మేమేమీ మాట్లాడల్చుకోలేదు.

కొద్ది రోజులు మళ్ళీ మా కాలనీలో గడుపుతే మేము మళ్ళీ మామూలు మనుషులయి పోతామని మాకు తెలుసు.

* * * * *

## పాడవోయీ భారతీయుడా...

మా కాలనీ వాళ్ళది చాలా విచిత్రమైన సైకాలజీ!

ఎప్పుడు పిచ్చి పడుతుందో ఎవ్వరం చెప్పలేము. ఎందుకంటే నేనూ అందులో ఉన్న వాడినేగా!

ఉదాహరణకి పాకిస్తాన్ తో యుద్ధం వచ్చేట్లు కనిపించిందనుకోండి. వెంటనే టీవీ మనల్ని చిత్రవధ చేయటం ప్రారంభిస్తుంది చాలా సిస్టమేటిక్ గా!

ముందు దేశభక్తి గీతాలు మొదలవుతాయ్. అవి అయిపోగానే అడ్డమయినాడూ స్క్రీన్ మీద కొచ్చి స్వాతంత్రోద్యమం గురించి నోటికొచ్చింది చెప్పటం మొదలెడతాడు..

అది అయిపోగానే చిత్రహార్ వస్తుంది. అందులో అన్నీ దేశభక్తి చిన్న చిత్రాల పాటలే వస్తాయి.

అదీ సహించి ఇంకా మిగిలామనుకోండి.

దేశం కోసం అవసరం లేకపోయినా ఇంటినీ ఇల్లాలినీ అన్నీ త్యాగం చేసి వెళ్ళిపోతాడు హీరో.

ప్రోగ్రామ్ కీ పోగ్రామ్ కీ మధ్యలో ఓ బండగొంతు నినాదాలు చదవటం ప్రారంభిస్తుంది.

"దేశమంటే మట్టికాదోయ్- దేశమంటే మనుషులోయ్"

"నీకోసం దేశం- దేశం కోసం నువ్వు"

"మనిషికన్న ఊరు గొప్ప- ఊరుకన్న దేశం గొప్ప"

"జై జవాన్ - జై కిసాన్"

"రక్తదానం - అన్ని దానాల్లోకి గొప్పది"

"సైనికుల కోసం రక్తం ఇవ్వు"

"నీకోసం దేశం ఏమి చేసిందన్నది కాదు! దేశం కోసం నువ్వేం చేశావ్ అన్నదే ముఖ్యం"

ఎందుకో ఆ స్లోగన్ రంగారెడ్డికి అమితమయిన కోపం కలిగిస్తుంది.

"ఏమిటా పిచ్చివాగుడు? దేశం కోసం మనం ఏం చేస్తాం? మనం ఎలక్షన్స్ లో ఏదొక పార్టీని ఎన్నుకుంటోంది ఎందుకు? దేశంకోసం పాటుబడమనేగా? మళ్ళీ వాళ్ళు టీవీలో దేశం కోసం నువ్వేం చేశావ్ అని మన్నడుగుతారేమిటి?" అంటాడతను.

అది నిజమే అనిపించింది నాక్కూడా.

"ఒకవేళ వాళ్ళేమీ చేయలేక మనని సహాయం చేయమంటున్నారేమో-"

"అంత చేతకాని వెధవల్ని ఎలక్షన్లో ఎవడు నుంచోమన్నాడు. ముందే ఆ విషయం ఏడుస్తే ఇంకో పార్టీని గెలిపించే వాళ్ళంకదా"

ఇలా సాగిపోతుంది.

ఒకవేళ సైక్లోన్ వచ్చిందనుకోండి. వెంటనే టీవీ ఆన్ చేస్తే చాలు ఏడుపు ముఖంతో ఓ ఎనౌన్సర్ కూర్చుని ఉంటాడు.

అతనినేమయినా పలుకరిస్తే చాలు భోరుమంటాడేమో అని మనకు భయం వేస్తుంది.

"తోటివారికి సాయం చేయటం మానవ ధర్మం" అంటాడతను.

"సైక్లోన్ బాధితులకు విరివిగా విరాళాలివ్వండి" అంటాడు ఇంకోడు.

"ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలివ్వండి- లేదా ప్రధానమంత్రి నిధికి విరాళాలివ్వండి!" అంటూ ఇంకొకడు దీనంగా చూస్తాడు.

వెంటనే కాలనీ వాళ్ళందరం తెగ జాలిపడి వాళ్ళకు తలో కొంచెము విరాళాలిస్తాం!

రంగారెడ్డికి అది కూడా నచ్చదు.

"ఈ గవర్నమెంట్ ఇంత సిగ్గుమాలిన గవర్నమెంటయిపోయిందేమిటి? వానొచ్చినా, వరదొచ్చినా, క్షామం వచ్చినా అడుక్కోవటానికి రడీ అయిపోతుంది. పైగా పాపం ఆ బాధితులను టీవీలో, సినిమా న్యూస్ రీల్ లో అడుక్కునేవాళ్ళలా చూపిస్తుంది. సెంటిమెంట్ వర్కవుట్ అయేట్లు చేసి ప్రజల్నుంచి డబ్బులు లాగాలని ప్లాన్! అంతేగానీ మనం ఈ ప్రభుత్వాన్ని ఎన్నుకుంది "ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలొచ్చినప్పుడు నువ్ చేతులెత్తెయ్- మేము చూసుకుంటాం" అని కాదు గదా! ఆ బాధితులకు సౌకర్యాలు సమకూర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిది! ప్రజలు అసౌకర్యాలు కోరటం వాళ్ళ పౌరహక్కు! అంతేగాని పాపం వాళ్ళు అడక్కుండానే అడుక్కునే వాళ్ళలాగా చేసి వాళ్ళకు దానం చేయండి అని వాళ్ళ పరువు తీసేయటం, పెద్ద నేరం!" అంటూంటాడు.

సరే- ఆ గొడవలలా ఉండగా ఈ మధ్య ప్రధానమంత్రి దేశం కోసం అందరూ త్యాగాలు చెయ్యాలని పదే పదే స్టేట్ మెంట్స్ ఇవ్వటం మేమంతా చూస్తూనే ఉన్నాం! అది చూసి టీవీలో మళ్ళీ నినాదాలు ప్రారంభమయిపోయినయ్.

"నీ త్యాగమే నీకు శ్రీరామరక్ష / అల్లారక్ష / జీసస్ రక్ష / బుద్ధునిరక్ష" (సెక్యులర్ స్లోగన్ కదా)

"దేశం పిలుస్తోంది! కదలిరా!"

"నీ కోసం దేశం కాదు!దేశం కోసం నువ్వు"

"మనది భారతదేశం- మనమంతా భారతీయులం!"

"పొదుపు మన కర్తవ్యం!"

"ప్రతి నీటి చుక్కా ప్రగతికి సోపానం"

"విద్యుత్ ని ఆదా చేయండి- దేశ సౌభాగ్యానికి తోడ్పడండి"

"నేటి పొదుపే రేపటి మదుపు"

"పెట్రోల్ ని ఆదా చేయండి! విదేశీ మారకాన్ని మిగల్చండి"

"అవసరమయితే ప్రయాణం చేయండి"

"చెట్లు పెంచండి! పర్యావరణాన్ని కాపాడండి"

"చెట్లు నరకడాన్ని నిరసించండి"

"దుబారా చేయకండి"

అలాంటివన్నీ తెగ చూడటం, వినటం జరిగేసరికి మా కాలనీ వాళ్ళందరికీ మళ్ళీ దేశభక్తి పూనకం లాగ వచ్చేసింది.

"ఇస్ దేశ్ కి ధరితీ, పూనకంలాగ వచ్చేసింది.

మా కాలనీ ఆడాళ్ళంతా కలసి అప్పటికప్పుడే ఓ ఆదివారం మీటింగ్ ఏర్పాటు చేశారు. మీటింగ్ ఏర్పాటుచేసింది మా కాలనీ ఉమెన్స్ ఆర్గనైజేషన్ కాబట్టి మేమంతా కూడా గత్యంతరం లేక హాజరయ్యాం.

"దేశం పిలుస్తోంది రా! కదలిరా!" అని స్వయంగా ప్రధానమంత్రి వాణే టీవీలో మోగుతోంది కాబట్టి మనమంతా ఉడతాభక్తి సాయం చేయాల్సిందే" అంది పార్వతీదేవి వేదికమీదనుంచి.

"అవును! మనమంతా పొదుపు చెయ్యాలి!" అంది రాజేశ్వరి.

"పొదుపంటే ఖర్చులోనే కాదు- అన్నిటిలోనూ పొదుపు చేయాలి" అంది సావిత్రమ్మగారు.

ఆ మర్నాటి నుంచే అన్ని విషయాల్లోనూ పొదుపు చెయ్యాలని అందరూ నిర్ణయించేశారు. దుబారా విషయంలో ఆడాళ్ళకంటే మగాళ్ళే ఎక్కువ చొరవ తీసుకోవాలని వాళ్ళనేసరికి మేము కొంచెం ఇబ్బందిలో పడ్డాం.

"రోజుకి ఓ సిగరెట్ పెట్టె కాల్చేవాళ్ళు సగం పెట్టే కాల్చాలి" అంది శ్రీవల్లి.

వాళ్ళాయనను సిగరెట్లు మాన్పించడానికి అంతకంటే మరో ఉపాయం తట్టలేదామెకి. సరేనన్నారు చాలామంది.

"సుపారీ పొట్లాలు కూడా తగ్గించాలి" అన్నారు వారు.

అదీ ఒప్పుకున్నాం.

సినిమాలు కూడా వారానికొకటల్లా నెలకు రెండుకి తగ్గించాలి.

ఎక్కువ పొదుపు చేసినవారికి కాలనీ కమిటీ తరపున 'పొదుపురత్న" అవార్డు కూడా ఇవ్వాలని రంగారెడ్డి సూచించాడు.

మర్నాటి నుంచీ పొదుపు డీల్ ప్రారంభమయింది.

"పొదుపు చేసిన ప్రతి నీటిచుక్కా ప్రగతికి సోపానం" అన్న అంశంతో రోజుని ప్రారంభించాలని అందరం అనుకోవడం చేత నేను రోజూ బక్కెట్ నీళ్ళు స్నానానికి వాడేవాడినల్లా అరా బక్కెట్ కి తగ్గించి స్నానం చేయాలని నిర్ణయించుకొని బకెట్ తీసుకొని బాత్ రూమ్ కి చేరుకున్నాను. తీరా చూస్తే పంపులో నీళ్ళు రావటం లేదు.

"వేసవికాలం మొదలయిందికదా! బహుశా నీళ్ళు మామూలు సప్లయ్ వుండదు కాబోలండీ" అంది మా ఆవిడ.

"మరిప్పుడెలా?"

"ఇవాళింకేం స్నానం చేస్తారూ- సాయంత్రం చేద్దురుగాన్లెండి! ఆఫీసుకి టైమవుతోంది వెళ్ళండి" అంది.

గత్యంతరం లేక స్నానం లేకుండా ముఖం కడుక్కుని డ్రస్ చేసుకొని బయటకొచ్చాను.

"ఇవాళ నీళ్ళు ఆదా చేయటానికి ఛాన్స్ దొరకలేదు" అన్నాడు రంగారెడ్డి.

పోన్లే రేపట్నుంచి చేద్దాం" అన్నాడు శాయిరామ్.

"ఏమిటి? ఎవరూ స్కూటర్లు లేకుండా వచ్చారా?" అడిగాడు జనార్ధన్ మేము రావటం చూసి.

మేము విజయగర్వంతో నవ్వాం.

"పిచ్చివాడా! ఇంధనాన్ని ఆదా చేయటం ద్వారా విదేశీ మారక ద్రవ్యం ఆదా చేయండి! అని మన దూరదర్శన్ చెప్పటం లేదూ?? ఈ పని మనం తేలికగా చేయగలం! కనీసం మనం తేలిగ్గా చేయగలిగిన పనులన్నా చేయకపోతే ఎలా?" అన్నాడు రంగారెడ్డి.

"నిజమే! నేనూ ఇవాళ్టినుంచి మోటార్ సైకిల్ బయటకు తీయను"

అందరూ బస్టాప్ లో నిలబడ్డారు.

బస్ లు వరుసగా వస్తున్నయ్ గానీ అన్నింట్లోనూ జనం పుట్ బోర్డ్ బయట ఓ మీటర్ డయామీటర్ లో వేలాడుతున్నారు.

చివరకు ఆ ఇరుకులోనే దూరి నిలబడ్డాం.

బస్ గంటకు ఐదు కిలోమీటర్ల వేగంతో నడుస్తోంది. కొంచెం రోడ్ ఎత్తు వచ్చినచోట మాత్రం ఓసారి ఎత్తు ఎక్కలేక వెనుకకు డొల్లి పోయింది గానీ డ్రయివర్ మళ్ళీ గేరు మార్చి ముందుకు నడిపాడు.

ప్రతి స్టేజీలోనూ లోపల్నుంచి దిగాలంటే ఐదు నిమిషాలు, ఎక్కాలంటే పది నిముషాలు పడుతోంది.

చివరకు మేము ఆఫీసు చేరుకునేసరికి పదకొండయింది.

ఆ పూటకి లీవ్ లెటర్ రాయించుకున్నాడు మా సూపర్నెంట్.

"అనవసరంగా లీవ్ తీసుకున్నాం! లీవ్ దుబారా ఐపోయింది" అన్నాడు రంగారెడ్డి.

"అంతేకాదు! అవసరం ఉన్నప్పుడు వాడుకోవడానికి లీవ్ దొరక్కుండాపోతుంది" అన్నాడు శాయిరామ్.

"థూ! నీ యవ్వ బస్ లు! రేపటికెళ్ళి నా స్కూటర్లో నేనొస్తాభయ్! ఈ పెట్రోల్ పొదుపు నాతోని కాదు" అన్నాడు యాదగిరి.

ఆ సాయంత్రం మళ్ళీ బస్ లో ఇల్లు చేరుకునే సరికి ఏడున్నరయిపోయింది.

"ఏమిటింత ఆలస్యంగా వచ్చారు? పిల్లలకు హోమ్ వర్క్ ఎప్పుడు చెప్తారింకా?" అన్నారు ఆడాళ్ళు.

"పెట్రోలు ఆదా చేశాం కాబట్టి హోమ్ వర్క్ కి టైముండదు. వాళ్ళనే చేసుకోమనండి!" అన్నారు మగాళ్ళు.

"ఇప్పుడు మనం కరెంట్ ఆదా చెయ్యాలి! త్వరగా భోజనం చేసేద్దాం పదండి" అంది మా ఆవిడ.

అందరం భోజనం గదిలో కెళ్ళేసరికి కరెంట్ పోయింది.

అరగంటసేపు ఎదుర్చూసినా గానీ కరెంట్ రాకపోయేసరికి మాకు నిరాశ కలగటం మొదలుపెట్టింది.

రోజూ పదిగంటల వరకూ లైట్లు వెలుగుతూండేవి. ఆ రోజు నుంచీ తొమ్మిది గంటలకే లైట్లు ఆర్పివేస్తే చాలా కరెంట్ కలిసొస్తుందని అనుకున్నాం.

రాత్రి పదయినా కరెంట్ రాలేదు.

అందరం కొవ్వొత్తులు కొనుక్కొచ్చి వాటిని వెలిగించుకున్నాం.

"ఇవాళ్టి నుంచీ 'పవర్ కట్' అని పేపర్ లో వేశారండీ మర్చేపోయాం" అంది పక్కింటావిడ.

ఎప్పుడు నిద్రపట్టిందో మాకు తెలీదు. తెల్లారుజామున నాలుగింటికి మెలకువ వచ్చింది. అదీ పార్వతీ గాంగ్ వాళ్ళు తలుపు తట్టబట్టి. "ఏమిటి ఇంత ప్రొద్దున్నే వచ్చారు?" అడిగింది మా ఆవిడ నిద్రకళ్ళల్లో.

"పొదుపు చేయటమంటే రాత్రంతా లైట్లు, ఫానులు వేసుకుని పడుకున్నారేమిటి? పైగా ఆ టీవీ కూడా ఆఫ్ చేసినట్లులేదు" అన్నారు వాళ్ళు.

"నిద్రపోయాక కరెంట్ వచ్చినట్లుంది" అన్నాను గొణుక్కుంటూ.

"త్వరగా లైటార్పి ఆదా చేయండి"

నేను లైట్ స్విచ్ దగ్గర కెళ్ళేసరికి మళ్ళీ 'పవర్ కట్' వచ్చేసి ఇల్లంతా చీకటయిపోయింది.

అప్పుడు వినిపించింది పంపు నుంచీ నీళ్ళు వస్తోన్న ధ్వని.

మా ఆవిడ కెవ్వున కేకవేసి వంటింట్లోకి పరుగెత్తింది.

"అయ్యయ్యో! ఇంట్లో చుక్క నీళ్ళు లేవు- వాడు రాత్రి నీళ్ళు వదిలినట్లున్నాడు. తెల్లార్లూ నీళ్ళు కాస్తా పోయాయ్ దుబారా అయిపోయాయ్" అని నెత్తీ నోరూ బాదుకుంటూ బక్కెట్లతో నీళ్ళు నింపసాగింది. రెండు బక్కెట్లు నిండేసరికి నీళ్ళు రావటం ఆగిపోయింది.

ఆడవాళ్ళంతా అప్పుడే బయట గుమిగూడి అందరినీ పిలవటం మొదలుపెట్టారు.

"ఇవాళ కాలనీ అంతా చెట్లు నాటాలికదా! కాలుష్యం నివారణకు మనకు చేతనైనంత సాయం మనం కూడా చేద్దాం!" అంటోంది పార్వతీదేవి.

మరికాసేపట్లో ఆడాళ్ళంతా కలసి కాలనీ కమిటీవాళ్ళు ఫారెస్టు డిపార్ట్ మెంట్ నుంచి తీసుకొచ్చిన మొక్కలు కాలనీ అంతా ప్రతి ఇంటి ముందూ ఓ మొక్క చొప్పున నాటారు. నాటాక గుర్తొచ్చింది అందరికీ- వాటికి పోయడానికి నీళ్ళులేవని.

"ఇప్పుడెలా?" అంది రాజేశ్వరి.

ఎవరికీ నోట మాట రాలేదు.

"పోనీ ఇవాళ ఒక్కరోజు ఎలాగోలా పోద్దామన్నా రేపట్నుంచి ఎలా? ఈ సమ్మర్ అంతా నీళ్ళు సరిగ్గా దొరకనే దొరకవ్? మనకి-" అంది సావిత్రమ్మ.

అందరూ తీవ్రమైన ఆలోచనలో పడ్డారు.

రంగారెడ్డి చాలాసేపు ఆలోచించాక నెమ్మదిగా అన్నాడు. "మీరెవరూ మరోలా అనుకోనంటే ఓ చిన్న ఐడియా."

"ఏమిటిది?" ఆతృతగా అడిగారు ఆడాళ్ళు.

"ప్రతి ఇంట్లోనూ చిన్న పిల్లలుంటారు కదా! వాళ్ళతో రోజూ ఉచ్చ ఈ చెట్ల దగ్గరే పోయిస్తే బ్రతుకుతాయేమో"

అందరూ రంగారెడ్డి మీద విరుచుకుపడ్డారు.

ఆ రోజు సాయంత్రానికి మొక్కలు వాడిపోయాయి. మర్నాటి ఉదయానికి చచ్చిపోయాయి.

మేమంతా ఇప్పుడు నీళ్ళు ఆదాచేయటం కోసం కేవలం నాలుగు చెంబుల నీళ్ళు మాత్రమే స్నానానికి వాడుతున్నాం- అంచేత నీటి విషయంలో కొంతవరకూ పొదుపు చేయడానికి వీలైంది.

కరెంట్ కూడా రాత్రి ఏడునుంచీ తొమ్మిదివరకూ ఉంటుంది. గనుక ఆ రెండు గంటల్లో ఓ గంటే వాడి ఓ గంట ఆదా చేస్తున్నాం. కరెంట్ తీసేసిన సమయంలో రంగారెడ్డి వాళ్ళమ్మమ్మ బాత్ రూమ్ కి వెళ్ళబోయి చీకటితో ఓ బల్ల తగిలేసరికి కాలు ఫ్రాక్చరయ్యింది. ఆమెను హాస్పిటల్ లో చేర్చాం అందరం.

ఆ రోజు మేము ఆఫీసు కెళ్ళేసరికి మిగతా గుమాస్తాలందరూ బల్లలకింద, అల్మారాల కిందా ముక్కుకు కర్చీఫ్ లు అడ్డంగా పెట్టుకుని వెతకసాగారు.

"ఏమిటి?" అడిగాడు రంగారెడ్డి.

"ఎక్కడో ఎలుకలు చచ్చినట్లున్నయ్- నిన్న కూడా ఇలాగే వాసన వచ్చింది-" అన్నారు వాళ్ళు. మేము కూడా వెతికాంగానీ ఎక్కడా ఎలుకల శవాలు కనిపించలేదు.

మేమంతా బయటికెళ్ళి నిలబడి ప్ల్యాన్ తో మొత్తం ఫర్నీచర్ అంతా జరిపి చూడమన్నాం. వాళ్ళు వెంటనే బయటికొచ్చారు మళ్ళీ. ఇప్పుడేం వాసనలేద్సార్?" అన్నారు ఆశ్చర్యంగా. అందరూ మళ్ళీ లోపలికెళ్ళారు. నేనూ రంగారెడ్డి, శాయిరామ్ మాత్రం కాంటీన్ కెళ్ళి కాఫీ తాగి మళ్ళీ కాసేపట్లో చేరుకునేసరికి అందరూ ఠక్కున ముక్కులు మూసుకున్నారు. అప్పుడర్థమైంది మాకూ వాళ్ళకూ కూడా.

ఆ చచ్చిన ఎలుక వాసన మా దగ్గర్నుంచే అనీ- ప్రభుత్వం దూరదర్శన్ లో ఇస్తున్న ప్రకటనలు అమలు పరచడానికి నీళ్ళు పొదుపు చేస్తున్నామనీ అందుకే కొంచెం కుళ్ళు వాసన వస్తుందేమోననీ చెప్పాం వాళ్ళకు. మాతో బలవంతంగా శెలవు పెట్టించి ఇంటికి పంపించారు వాళ్ళు. మేము నీళ్ళ విషయంలో పొదుపు పాటించినంత కాలం

ఆఫీస్ కి రాకూడదని కూడా నిష్కర్షగా చెప్పారు. తీరా మేము ఇళ్ళు చేరుకునేసరికి పిల్లలు కూడా ఇంటి బయటే ఆడుకుంటూ కనిపించారు.

"ఏమిటి? మీరు స్కూలు కెళ్ళలేదా?" ఆశ్చర్యంగా అడిగాడు గోపాల్రావ్.

"వెళ్ళి వచ్చేశాం"

"అప్పుడే ఎలా వచ్చారు స్కూలు సాయంత్రం మూడు వరకు కదా?"

"మా ప్రిన్సిపాల్ ఇంటికి పంపించేశారు కాలనీ పిల్లలందరినీ"

"ఎందుకని?"

"మేము మరీ మురికిగా వున్నామంట-"

ఈలోగా మా ఆవిడ చిరాకుగా బయటకొచ్చింది.

"చూశారా వీళ్ళ ప్రోగ్రెస్ రిపోర్టులు - అందరికీ జీరోలు." మేము ఉలిక్కిపడ్డాం.

వాళ్ళకు ఇంతవరకూ ఏ పరీక్షల్లోనూ పాస్ మార్కులు తగ్గలేదు. అలాంటిది సడెన్ గా జీరోలు రావటం ఎలా జరుగుతుంది??

"ఏమిటి జీరోలా?" వాళ్ళను నిలీశాడు జనార్ధన్ బెల్ట్ తీసుకుని కొట్టడానికి రెడీ అవుతూ. వాళ్ళు ఏడుపు మొఖాలు పెట్టారు.

"మాట్లాడరేం? చెప్పండి! చదువంటే ఇంట్రెస్ట్ పోయింది! అవునా? ఇరవై నాలుగ్గంటలూ ఆ టీవీ ముందు కూర్చోవటం వల్లే బ్రెయిన్స్ దెబ్బతిని ఇలా తయారయ్యారు- అంతేనా?"

"కాదు- మాకు చదువుకోడానికి లైట్లు వుండటం లేదుగా! మీరు ఎనిమిదింటికే లైట్లార్పేస్తున్నారు" అందరం మొఖాలు చూసుకున్నాం.

"మనకు ఈ పవర్ కట్స్ తో కరెంట్ ఉండేదే రాత్రి ఏడుగంటల నుంచి తొమ్మిది వరకూ! ఆ రెండుగంటల్లో కూడా పొదుపు చేస్తే మళ్ళ పిల్లలు పెద్దయాక అడుక్కుతింటారు" అన్నాడు చంద్రకాంత్.

"నిజమే! గవర్నమెంటే మనకి పవర్ సప్లయ్ లేకుండా చేసి ఇంకా సిగ్గులేకుండా "విద్యుత్ ని ఆదాచేయి" అంటూ పిచ్చివాగుడు వాగిస్తారేమిటి ఆ టీవీ ద్వారా?" అడిగింది పార్వతీదేవి.

"నీళ్ళు కూడా అంతే! నీళ్ళు రోజు విడిచి రోజు సప్లయ్ చేస్తుంటే ఆ మెంటల్ నినాదాలేమిటి "ప్రతి నీటి చుక్కా ప్రగతికి సోపానం" అంటూ రాజేశ్వరి కోపంతో అంది.

"పెట్రోలు ఆదా చేస్తే ఏమౌతుందో చూశారుగా! రోజూ ఆఫీసుకి లేటే! దాంతో శెలవులు ఎక్కువ ఖర్చయి, అవసరానికి శెలవులు లేక, జీతాల్లేక, జీతం నష్టం మీద శెలవు తీసుకోవలసి వస్తుంది-" అంది సావిత్రమ్మ, అక్కడి నుంచి అందరూ తలోమాటా మాట్లాడసాగారు.

"అసలే తాగటానికి క్కూడా నీళ్ళు లేక ఛస్తుంటే- చెట్లు పెంచండి- పచ్చదనం ప్రగతికి సోపానం- అంటూ అడ్డమైన వాడూ చిల్లర నినాదాలే."

"మనకొచ్చే జీతాలేమో గొర్రెకు బెత్తెడు తోకలు- అది చాలక అందరం ముష్టివాళ్ళల్లాగా బ్రతుకుతున్నాం నచ్చిన బట్టకట్టుకోలేం- తినాలనుకున్నవి తినలేం- చేయాలనుకున్నవేమీ చేయలేం- అయినా గానీ ఇంకా పొదుపు చేయాలంటే ఏం చేయాలి? ఓ పూట తిని రెండో పూట పస్తుండాలా? ఈ కొద్ది రోజులు పొదుపు చేసే సరికే మన కాలనీలో ఎనిమిదిమందికి ఎనీమియా వచ్చి డాక్టర్ల దగ్గరకెళ్ళి టానిక్ లు కొనుక్కున్నారు."

"అయినా మా బ్రతుకుల్ని బాగుచేయమనీ, మమ్మల్నీ ముష్టి బ్రతుకుల నుంచి ఉద్ధరించమనీ మనం ఈ ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే గెలిచిన మర్నాటినుంచే పొదుపు చేయండి, విద్యుత్ వాడకండి, నీళ్ళు ఆదా చేయండి, పెట్రోల్ వాడకండి, ప్రయాణాలు చేయకండి అంటూ మరింత దిక్కుమాలిన బ్రతుకులు బ్రతకమంటారేమిటి? ఇలాంటి మెంటల్ గాళ్ళ నెందుకు ఎన్నుకోవాలి మనం? ఇంకొకసారి ఓట్ల కోసం ఇంటికి రానీండి! చెప్పు తీసుక్కొడతాను" అంది శ్రీవల్లి. ఆ రోజు నుంచీ మళ్ళీ ఎప్పుడూ మా కాలనీ వాళ్ళు దేశభక్తి గీతాలు, కార్యక్రమాలు, నినాదాలు విని ఉత్తేజితులవలేదు.

* * * * *

## బాబోయ్ హైదరాబాద్
### నాలుగొందలేళ్ళ ముసల్ది

హఠాత్తుగా ఏ రాజకీయ నాయకుడి నోట చూసినా "నాలుగొందలేళ్ళ హైదరాబాద్" అన్న పాట వినిపించేసరికి మా కాలనీలో కూడా అందరికీ హుషారు పుట్టుకొచ్చింది. చాలా రోజుల్నుంచీ ఎలాంటి కార్యక్రమాలూ, మీటింగ్ లూ లేకుండా గాప్ వచ్చేయడం చేత ఆ స్లోగాన్ పట్టుకొని కాలనీ ఆర్గనైజింగ్ సెక్రటరీ శాయిరామ్ విజృంభించేశాడు. వెంటనే కాలనీ వాళ్ళంతా కూడా ఆ మీటింగ్ కి హాజరయ్యారు.

"మనం కూడా మన కాలనీ తరపున "చార్ సౌ శహర్ హమారా" కల్చురల్ కార్యక్రమం నిర్వహిద్దాం! నలుగురి సంబరంలో పాలుపంచుకుందాం" అన్నాడతను ఆవేశంగా గేయం చదువుతున్నట్లు మాట్లాడుతూ.

పార్వతీదేవికి అతని మాటలేమీ అర్థం కాలేదు.

"హైదరాబాద్ కి నాలుగొందలేళ్ళు రావటమేమిటి?" అంది అర్థంకాక. మిగతా ఆడాళ్ళు కూడా అదే ప్రశ్న వేశారు.

అందరం ఆమె అజ్ఞానాన్ని చూసి మాలోమేము తృళ్ళి తృళ్ళి నవ్వుకున్నాం.

"మన ఆడవాళ్ళకు కామన్ సెన్సు రావడానికి ఇంకెన్ని వందలేళ్ళు పడుతుందో" అన్నాడు రంగారెడ్డి జాలిగా.

ఆ మాటతో ఆడవాళ్ళందరికీ కోపం ముందుకొచ్చింది.

"మహా మీ అగవాళ్ళకేడ్చిందిలే కామన్ సెన్సు! బోఫోర్సు కుంభకోణంలో ముడుపులు కొట్టేసింది ఎవరూ అనడిగితే నోరు మెదపలేక పోతున్నారు" అంటూ విరుచుకు పడ్డారు.

వాళ్ళతో గొడవెందుకని గోపాల్రావ్ ఎక్స్ప్లనేషన్ ఇచ్చాడు.

"అంటే ఉదాహరణకు మీరూ మీ పిల్లలూ ప్రతి సంవత్సరం పుట్టిన రోజులు జరుపుకుంటారు కదా! అలా మన నగరం తాలూకూ నాలుగొందలో సంవత్సరం తాలూకూ బర్త్ డే అన్నమాట ఇది"

ఆడవాళ్ళందరూ అతి కష్టం మీద నవ్వాపుకున్నారు.

"బ్రహ్మంగారు చెప్పింది నిజమేనేమో! ఈ ఏడు రాజకీయాల్లో ఉన్న వారందరికీ పిచ్చెక్కుతుందని స్పష్టంగా అన్నారటాయన" అంది సావిత్రమ్మ.

"పోనీ వాళ్ళకెక్కిందంటే అర్థం వుంది. మరి మన మగాళ్ళకెందుకెక్కినట్లు?" జానకి అడిగింది.

మాకు వాళ్ళ సంభాషణ వింటూంటే వళ్ళు మండిపోతోంది.

"ఏమ్ సంగతి? దమాక్ లేని మాటలు మాట్లాడుతున్రు? మాకు పిచ్చెక్కినాది?" కోపంగా అడిగాడు యాదగిరి.

"అవును మరి! లేకపోతే ఊరికి పుట్టింన్రోజేమిటి.. ఎవడయినా వింటే నవ్విపోతాడు..." అందామె.

"వీళ్ళ వరస చూస్తుంటే ఆ మూసీనదికీ, నగరం చుట్టూ వున్న కొండలకూ, చెట్లకూ, రాళ్ళకూ, రప్పలకూ కూడా పుట్టిన్రోజు చేసేట్లున్నారు" అంది ఇంకొకావిడ.

"అక్కడితో ఆగితే ఫర్లేదు. ఈ పిచ్చి ముదిరిందంటే రాష్ట్రంలోని అన్ని ఊళ్ళవాళ్ళు పుట్టిన్రోజులు మొదలెడతారు"

"దాంతో మెల్లిగా గూండాలు రంగంలోకి దిగి- పుట్టిన్రోజుల పేరుతో వినాయక చవితిలాగ ప్రతోడూ చందాలు వసూలుచేసి తాగెయ్యటం మొదలుపెడతారు" శాయిరామ్ పరిస్థితి విషమిస్తోందని గ్రహించాడు.

"సోదర సోదరీమణులారా! మన 'చార్ సౌ శహర్ హమారా" కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెద్దెత్తున ఎన్నో లక్షలు ఖర్చుచేసి జరుపుతుండటం మీరు చూస్తూనే ఉన్నారు. కనుక మన కాలనీ కూడా ఆ సందర్భంగా ఓ అద్భుత సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు చేస్తే రాజధాని నగర వాసులుగా మనందరికీ ఆనందదాయకంగా వుంటుంది" అన్నాడు మైక్ దగ్గరకు వెళ్ళి.

అతని మాటలు వినేసరికి యాదగిరి ఆవేశం వచ్చి మైక్ తను లాక్కున్నాడు.

"బరాబర్ చెయ్యాలా! చాల్దినాలకెళ్ళి మన కాలనీ వాళ్ళకు పనీ పాటా జర్రగూడా లేకున్నది. పని లేనోడు ఏంజేసిండు? పిల్లి తలగొరిగిండు? ఎందుగ్గొరిగిండు? చేతిలో పని లేకుండబట్టి. పనిలేకుంటే ఏం చేస్తాడు మళ్లా? బరాబరా పిల్లి తల గొరుగుతాడు. గొరగడా మళ్ళా? నువ్వు గొరగవా? ఇది జమానాల ముచ్చట! మరి ఈ దినం ముచ్చటేమి? పని లేనోండ్లు ఏదొక దందాజెయ్యాల! ఏం దందా జెయ్యాల? దినం దినం నయా నయా దందాలు ఏడి కెల్లోస్తాయ్? గందుకే ఈ చార్ సౌ శహర్ నికలాయించిన్రు! దీన్దిక్కుకెళ్ళి జబర్దస్త్ దందాపు నడిపించాలని సొలతున్నది ఏం జెప్తున్నా!"

"అవును! మనం గూడా 'చార్ సౌ' ఘుమాయించాలె" వెనుక వరుసలో నిలబడ్డ స్టూడెంట్స్ అరిచారు.

దాంతో కొంతమంది సైలెంటయిపోయారుగానీ మిగతావాళ్ళు ఇంకా గొణుగుతూనే ఉన్నారు- ముఖ్యంగా ఆడవాళ్ళు. ఈలోగా జనార్ధన్ మైక్ ముందుకొచ్చాడు.

"సోదర సోదరీమణులారా! నేను ప్రముఖ సినీ నటుడినని ఈ నగరంలో చిన్నపిల్లలకు కూడా తెలుసు" అన్నాడు చిరునవ్వుతో ఓసారి జనాన్ని 'ప్యాన్' చేసి చూసి...

వెనుక నుంచి స్టూడెంట్స్ కేకలు వినిపించినయ్.

"బస్ కరో భాయ్! బస్ కరో"

"చార్ సౌ" కార్యక్రమాలు నిర్వహించాలని మన కాలనీవాళ్ళు ఏక కంఠంతో పట్టుబట్టడం చూస్తుంటే నాకు ఎంతో ఆనందంగా ఉంది.

ఎంతోకాలం తర్వాత మన కాలనీలో ఒకే కంఠం వినబడుతోంది. ఈ సందర్భంగా కాలనీ తరపున నాలుగొందలేళ్ళ నగరం మీద ఒక వీడియో ఫిలిం తీయాలని నాకు కోరికగా ఉంది. అందులో మన కాలనీ వాళ్ళందరూ కనబడేలా తీస్తే అప్పుడు ఆ ఫిలిం దూరదర్శన్ ద్వారా టెలీకాస్ట్ చేయిద్దాం! ఆ విధంగా మన కాలనీలో ప్రతి ఒక్కరూ దూరదర్శన్ లో కనిపించే అవకాశం కలుగుతుంది."

జనార్ధన్ మాటలు అక్కడున్న వారందరికీ ఒక్కసారిగా మైకం కలిగించాయి.

"కానీ... అలా మనం ఏది షూటింగ్ చేసిస్తే అది దూరదర్శన్ వాళ్ళు ప్రసారం చేస్తారా?" అనుమానంగా అడిగింది పార్వతీదేవి.

"భలే ప్రశ్న అడిగారు! మన దూరదర్శన్ గురించి మీరు మరీ తక్కువగా అంచనా వేస్తున్నారు? కేవలం పందులూ, పక్షులూ, బట్టవన్నె మేక పిట్టలూ, దున్నపోతులూ వాటికి వీర్య వృద్ధి కలిగించే చిట్కాలు.. ఇవే దూరదర్శన్ వారు ప్రసారం చేస్తారని మీరనుకుంటే మీరంతా పొరపాటు పడ్డట్లే! ఈ రోజున దూరదర్శన్ రాష్ట్రంలో ప్రతి పౌరుడికీ ఒక్కసారయినా తనను తాను టీవీలో చూసుకునే అవకాశం కల్పిస్తోంది. ఇంత అద్భుతమయిన ప్రక్రియ కేవలం మన దేశంలోనే ప్రప్రథమంగా ప్రారంభించారని నేను మనవి చేస్తున్నాను. మన ప్రజలందరూ కూడా గొర్రెలకు ఏమాత్రం తీసిపోరని మన దూరదర్శన్ అధికారులు ఈ రోజున గమనించారు. అదీగాక 'చార్ సౌ' అనే కార్యక్రమం మీద ఏ అడ్డమయిన చెత్త అయినా సరే ప్రసారం కావాలని వారికి స్పష్టమయిన ఆదేశాలు ఇచ్చారు." హఠాత్తుగా చప్పట్లు మార్మోగిపోయినయ్.

అప్పటికప్పుడే 'నాలుగొందలేళ్ళ అందమయిన సుందర నగరోత్సవం" అనే పేరుతో అద్భుతమయిన కార్యక్రమం ఏర్పాటు చేయాలన్న నిర్ణయం జరిగిపోయింది. ఆ రోజు రానే వచ్చేసింది.

కాలనీ జనమంతా వేదిక దగ్గర ముందు నుంచే గుమిగూడిపోయారు.

శాయిరామ్ తను దీపావళి కోసం కుట్టించుకున్న కలర్ ఫుల్ కాస్ట్యూమ్స్ వేసుకుని మైక్ ముందుకొచ్చేశాడు.

"సోదర సోదరీమణులారాం ఇవాళ నిజంగా గొప్పరోజు! ఎందుకంటే ఇవాళ నిన్న కాదు! నిన్న రేపు కాదు కనుక! ఏనాటి నాలుగొందలేళ్ళ నగరమిది? ఎంత సుందరమయిన భాగ్యనగరమిది?" అంటూ కవిత్వం ధోరణిలోకి దిగగానే జనం అరుపులు మొదలెట్టారు.

"ఇక చాల్లే- ఆపు!"

సరిగ్గా అప్పుడే మంత్రిగారు వేదికకు సమీపంలో కారు దిగారు. ఆయనతోపాటు మున్సిపల్ చైర్మెన్, పోలీస్ అధికారులు-

రంగారెడ్డి వెంటనే పూలదండ తీసుకెళ్ళి మినిస్టర్ గారి మెడలో వేశాడు.

అంతా తప్పట్లు మారుమ్రోగిపోయినయ్.

అందరూ వేదిక మీదకెళ్ళారు.

కార్యక్రమం ప్రారంభమైంది.

మినిస్టర్ గారు లేచి మైక్ ముందుకొచ్చారు.

"సోదర సోదరీమణులారా! నిజంగా. ఈ భాగ్యనగరానికి నాలుగొందలేళ్ళొచ్చాయంటే నాకెంత ఆనందంగా వుందో చెప్పలేను. మా తాత వంద సంవత్సరాలు బ్రతికినప్పుడు కూడా నేనింత ఆనందించలేదు-"

"తెలుసులే- తాత ఇంకా బ్రతికుతే తిండి పెట్టాల్సి వస్తుందని ఆనందించలే" ఎవరో స్టూడెంట్స్ అరిచారు.

రంగారెడ్డి వారివైపు కోపంగా చూశాడు.

"సైలెన్స్" అన్నాడు గట్టిగా.

వాళ్ళు సైలెన్స్ అయిపోయారు.

"మన నగరానికి భాగ్యనగరమనే పేరెలా వచ్చిందో మీకందరికీ తెలుసు. మొహమ్మది కులీ అనే గొప్ప మహారాజు భాగ్ మతీ అనే బీదింటి అమ్మాయిని ప్రేమించి పెళ్ళిచేసుకున్నాడు. అందుకే ఈ నగరానికి భాగ్యనగరం అనే పేరు వచ్చింది"

"అష్టా-అభష్టం' అన్న గావుకేక జనంలోనుంచి వినిపించేసరికి అందరం ఉలిక్కిపడి చూశాం.

మధ్యనుంచి యాదగిరి లేచి నిలబడ్డాడు. యాదగిరితోపాటు జనార్ధన్ కూడా లేవడానికి ప్రయత్నించి తూలిపడబోయి నిలదొక్కుకున్నాడు. ఇద్దరూ ఒకరినొకరు ఆసరాగా తీసుకొని వేదిక దగ్గరకు నడిచారు. వాళ్ళను ఆపటానికి నేనూ, రంగారెడ్డి హడావుడిగా పరుగెత్తాం గానీ వాళ్ళు ఒక్క మాట మాట్లాడి దిగిపోతామని ప్రామిస్ చెయ్యడంతో ఊరుకోవాల్సి వచ్చింది.

యాదగిరి వేదిక ఎక్కి తూలిపడకుండా మైక్ ని పట్టుకున్నాడు. "మినిష్టర్ సాబ్ భాగ్యనగరం గురించి గలత్ జెప్పిన్రు! ఎందుకంటే ఇస్లామ్ నాలుగో ఖలీఫ్ లేడా? గా పెద్దమడిసికొక బిరుదున్నది. ఆ బిరుదు మీకెరుకనా? 'హజ్రత్ అలీ'! అగో! ఆ హజ్రత్ అలీ పేరు దిక్కుకెళ్ళి ఈ సిటీకి హైదరాబాద్ అన్న పేరు వచ్చింది నామాట కరెక్ట్ కాదని ఎవడ్నయినా జెప్పమను- చెప్పుతోటి కొడతా!"

మినిష్టర్ ముఖంలో రంగులు మారినయ్

"సోదరీ సోదరీమణులారా! ఇతను చెప్పినట్లు అది కూడా నిజమే అయుండవచ్చు. అదంతా చరిత్రకారులకు సంబంధించిన విషయం గనుక నేను ఆ టాపిక్ వదిలేస్తున్నాను" అన్నాడతను.

వెంటనే యాదగిరిని వేదిక దింపేశాము మేము.

మినిష్టర్ మళ్ళీ ఉపన్యాసం ప్రారంభించాడు.

"సోదరులారా! భాగ్యనగరం గురించి చెప్పాలంటే మాటలు రావటం లేదు. ఈ నగరంలోకి ఎవరు వచ్చినా ఆరోగ్యైశ్వర్యాలతో తులతూగేవారు ఈ నగరంలోని ప్రజలు నాలుగొందలేళ్ళనుంచి అద్భుతమయిన, ఆనందకరమైన జీవితం గడిపారు. ఇక్కడ భూకంపాలులేవు, వరదలు లేవు"

"అష్షా అభష్షం" మళ్ళీ అరిచాడు యాదగిరి.

మేము వాళ్ళకి అడ్డుపడే లోపలే యాదగిరి, జనార్ధన్ మళ్ళీ మైక్ దగ్గరకొచ్చారు.

"భాయియో! బెహనో! మినిస్టర్ సాబ్ మళ్ళా గలత్ మాట్లాడిండు. హైదరాబాద్ గొప్ప నగరం అని మినిస్టర్ అన్నాడుగాని సచ్ చెప్పాల్నంటే ఇది ఫాల్తూ సిటీ! 1908 సంవత్సరం వరకూ ఈడ ఎన్ని సార్లు వరదలు వచ్చినయో! ఎంతమంది పబ్లిగ్గా చనిపోయిన్రో మినిస్టర్ సాబ్ కి ఎరుకలేదు. అంతెందుకు భాయ్! నిన్నగాక మొన్నటి నెలలో మూసీ సడెన్ గా నదిలోనికెళ్ళి వర్షం నీళ్ళు ఛుతాయించిన్రు. యాదున్నదా? అప్పుడేమాయె? ఆడ బట్టలుతుక్కునేటోళ్ళు ఆ వరదలో బడి చచ్చిన్రు! మరి మినిస్టర్ సాబ్ గట్ల మాట్లాడతాడేమి? తాగివున్నాడా?"

గోపాల్రావు వాళ్ళిద్దర్నీ బలవంతంగా మళ్ళీ వేదిక దించాడు.

"సోదర సోదరీమణులారా! ఆ మిత్రులిద్దరూ కొంచెం మందుకొట్టి ఉండడం వల్ల అతిగా మాట్లాడుతున్నారు. వారి మాటలు పట్టించుకోవద్దని అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను"

అప్పుడే గుప్ మని మురుగువాసన ఆ ప్రాంతమంతా ఆవహించేసరికి అందరూ గాబరాగా ముక్కులు మూసేసుకున్నారు.

"ఏమిటా వాసన?" తనూ ముక్కు మూసుకొంటూ అడిగాడు మినిస్టర్.

"అది మామూలే సార్! మెయిన్ రోడ్డుమీద డ్రయినేజ్ చోక్ అయి మురుగు రోడ్డంతా ప్రవహిస్తుంటుంది" చెప్పాడు రంగారెడ్డి.

మినిస్టర్ తేలికగా గాలి పీల్చుకున్నాడు "ఓశ్! అంతేనా?" అన్నాడు సంతృప్తిగా.

"కనక సోదర సోదరీమణులారా! అందమైన మన సుందరనగరానికి నాలుగొందలేళ్ళు నిండిన సందర్భంలో మనల్ని మనం అభినందించుకోవటం ఎంతో అవసరం. ఎందుకంటే విభిన్న భాషలున్నా, విభిన్న మతాలున్నా, అద్భుతమైన మత సామరస్యంతో మెలిగిన నగరమిది. మతసామరస్యం అనేది నాలుగువందల ఏళ్ళనుంచీ ప్రజలు ఈ నగరంలో పాటించటం నిజంగా ఒక గీటురాయి- కలికితురాయి, శాంతి హృదయాలకు పరాకాష్ట"

హఠాత్ గా యాదగిరి, జనార్ధన్ మళ్ళీ మైక్ ముందుకొచ్చారు.

"అగు- అదిభీ గలత్ మాటనే! ఈ సిటీల జరిగినన్ని మారణహోమాలు ఇంకే సిటీలోనూ జరగలే! ఈడ హిందువులు జనాభా ఆ జమానలోనే అరవైశాతం వుండెడిది. ఐనా గానీ ఈడ ప్రజలు ఏ జబాన్ ల మాట్లాడిన్రు? ఉర్దూలోనే నిజాం కార్ బాయ్ నడుస్తుండే! మరీడ మెజారిటీ రూలేడున్నది వయ్యా?

అదిడిసెయ్! ఈ మినిస్టర్ సాబ్ జెపుతుండు ఈడ మతసామరస్యం జబర్దస్త్ గా ఉండెడిదని! ఈయన కేమైనా దిమాకున్నదా? ఈడ జరిగినన్ని మతకల్లోలాలు దేశంలో ఏడా జరగలే! గిసంటి స్టేట్ మెంట్లిచ్చే సాలెగాండ్లు న్యూస్ పేపర్ జదవరా? హిస్టరీ కితాబ్ ఋ జదవరా? నీయవ్వ పోలీస్ యాక్షన్ ముందే గదవయ్యా రజాకార్లు హిందువులందర్నీ ఎతికి ఎతికి చంపబోయిన్రు! ఆడకెళ్ళి మతకల్లోలాల్లో ఎంతమంది సచిన్రో పోలీస్ రికార్డులులెవ్వా? బైగన్ కీ మత సామరస్యం ఏడున్నదివయ్యా? మా చెల్లెలు ఆమె భర్తా ఓల్డు సిటీలో ఉంటుండె! కమ్యూనల్ గూండాలు ఆళ్ళను సంపి ఇల్లు తగలబెట్టనికి కోషిస్ చేస్తుంటే ఆళ్ళు ఓల్డుసిటీ ఇడిసిపెట్టి న్యూ సిటీకి ఉరికి వచ్చిన్రు! వాళ్ళ ఇల్లూపాయె, ఇంటిలో సామానూపాయె! గిసంటి కమ్యూనల్ రైట్స్ ని ఈ రాజకీయ లీడర్ లే శురూ జేయించి- సచ్చేటోడు సచ్చినాక" సార్ సౌ శహర్ దందాలు శురూ జేస్తున్రు!"

ఇంక లాభం లేదని యాదగిరిని అందరం లాక్కెళ్ళటానికి ప్రయత్నించాం.

కానీ యాదగిరి మళ్ళీ ఒక విదలింపుతో మమ్మల్ని వదిలించుకొని మైక్ దగ్గరకి పరుగెత్తాడు.

"మతసామరస్యం ఏడున్నదివయ్యా- మతసామరస్యం ఇడిసిపెట్టు! ప్రాంతీయ సామరస్యమే లేదాయె! గిసంటి హిస్టరీ ఉన్న ఫాల్తూసిటీని చార్ సౌ శహర్ హమారా అని శరమ్ లేకుండా షాన్ తోటి ఫంక్షన్స్ జేస్తున్రు"

జనమంతా యాదగిరి స్పీచ్ కి తప్పట్లు కొట్టడంతో మినిస్టర్ గారి మొహం పాలిపోయింది. "యాదగిరి సచ్చా, మినిస్టర్ జూటా" అంటూ అరిచారు స్టూడెంట్స్. తమాషా ఏమిటంటే మాకు తెలీకుండానే మేమూ తప్పట్లు కొట్టేశాం.

కొద్ది క్షణాల తర్వాత రంగారెడ్డి మేలుకొని యాదగిరిని మైక్ ముందు నుంచి పక్కకు లాగేశాడు.

మినిస్టర్ మళ్ళీ స్పీచ్ ప్రారంభించాడు.

"ఆ వ్యక్తి ఏవో కొన్ని చిన్న చిన్న అల్లర్ల గురించి మాట్లాడుతున్నాడు. కనుక మనం వాటిని పట్టించుకోనక్కర్లేదు- మన నాలుగొందలేళ్ళ మహానగరానికి స్త్రీలను గౌరవించే సాంప్రదాయం ఆనాది నుంచీ ఉందనీ మరే నగరంలో కూడా స్త్రీలకు ఇంతటి స్వేచ్ఛా స్వాతంత్రాలు లేవనీ నేను సవినయంగా మనవి చేస్తున్నాను. టావెర్నియర్, థివెనాట్, బెర్నియర్ అనే ఫ్రెంచ్ యాత్రికులు పదిహేడవ శతాబ్దంలో ఈనగరాన్ని సందర్శించి ఆ రోజుల్లో స్త్రీలకు వివాహ

సమయంలో భర్త ఒక ప్రామిస్ చేయాల్సి వచ్చేదని రాశాడు. ఆ ప్రామిస్ ఏమిటంటే స్త్రీకి ఎక్కడయినా తిరిగే స్వేచ్ఛను ఇస్తానని, ఆమె కల్లు తాగటానికి కూడా అనుమతి ఇస్తాననీ అందరి ముందూ చెప్పేవాడన్నమాట- స్త్రీకి ఇంతటి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉన్న నగరం మన చార్ సౌ శహర్ హమారా!"

యాదగిరి జనార్ధన్ పగలబడి నవ్వారు హేళనగా. మేము వారిని నిశ్శబ్దంగా ఉండమని కోరడానికి ప్రయత్నించాం గానీ జనమంతా అతనిని మాట్లాడనివ్వాలని గొడవ చేయడంతో వెనక్కు తగ్గక తప్పలేదు.

యాదగిరి మళ్ళీ మైక్ అందుకున్నాడు.

"అహ్వా! చార్ సౌ శహర్ హమారా!! మినిష్టర్ సాబ్ జెప్పిండు ఆ ఫ్రెంచోళ్ళు ఎవళ్ళో పదిహేడు శతాబ్దంల 'లేడీస్'కి ఎంత ఇజ్జత్, ఎంత ఆజాది ఉన్నాది రాసిన్రని! కానీ మినిష్టర్ సాబ్ ఆళ్ళు రాసింది పూరా సదవలేదన్నట్లు! ఆ జమానాల హైదరాబాద్ నగరంల ఇరవైవేల మంచి వ్యభిచారిణులుండె! అది గూడా ఆళ్ళేరాసిన్రు! అది మినిష్టర్ సాబ్ కెరుకలే! పోనీ, అదిడిసి పెట్టండ్రి! హైదరాబాద్ కెళ్ళి పెండ్లికాని పోరీలను అరబ్ దేశాలకు ఎక్స్ పోర్ట్ చేసెడిదందా గురించి మినిష్టర్ సాబ్ ఏం జెప్తడు? దినాం న్యూస్ పేపర్ ల జదువుతూనే ఉన్నాం! ఓల్డ్ సిటీల ఎనిమిదేండ్ల పోరీలను డెబ్బయ్ ఏండ్ల ముసలిబాడుకవ్ లు పైసలిచ్చి అరబ్ దేశాలకు తీస్కపోతున్రు! ఒక్కొక్కనికి ఇద్దరు ముగ్గురు పెండ్లాలుండిన నగరం కూడా ఈ చార్ సౌ బీస్ నగరమేనన్న సంగతి మీకు భీ ఎరుక!"

మళ్ళీ తప్పట్లు మార్మోగిపోయినయ్.

"మినిష్టర్ వాపస్ జావ్- యాదగిరి స్పీచ్ దేవ్" అని అరవటం ప్రారంభించారు స్టూడెంట్స్!

మినిష్టర్ కి కూడా చిరాకు పుట్టుకొచ్చింది.

"నేనిక మాట్లాడదల్చుకోలేదు. మన నగరాన్ని మనందరం కలసి పొగడాలని ప్రభుత్వం హైలెవల్లో డెసిషన్ తీసుకుంది. కనుక మనం పొగడక తప్పదు. నగరం మీలో ఎవరికయినా నచ్చకపోతే సైలెంట్ గా ఉండాలిగానీ ఇలా నిజాలు బయట పెట్టకూడదు. మన జాతీయ గీతం కంపల్సరీ చేసినట్లు, చార్ సౌ శహర్ హైదరాబాద్ ని పొగుడుతూ కూడా ఓ గీతం తయారు చేయించి అన్ని ఫంక్షన్స్ కి కంపల్సరీ చేయాలని నేను ముఖ్యమంత్రిగారికి సూచన చేయదల్చుకున్నాను-" అనేసి కుర్చీలో కూర్చున్నాడు కోపంగా.

శాయిరామ్ అదే అవకాశం అని మైక్ అందుకున్నాడు.

నాలుగొందలేళ్ళ నగరం- నాలుగొందలేళ్ళ వైభవం!

నాలుగొందలేళ్ళ నగరం- నాలుగొందదేళ్ళ తరం తరం

ఇప్పుడు కార్యక్రమంలో తరువాతి అంశం మన మునిసిపల్ చైర్మెన్ గారు నాలుగొందలేళ్ళ సుందర నగరం అనే అంశం గురించి మాట్లాడతారు" అనగానే చైర్మన్ లేచి మైక్ ముందుకొచ్చాడు.

"సోదర సోదరీమణులారా! నిజంగా మనది అందమయిన నగరం సుందరమయిన నగరం. ఈడున్నన్ని సౌలత్ లు పూరా దునియాల ఏడచూసినాగానీ లేవన్నట్లు! నా ఈ స్పీచ్ షురూ జేసెడి ముందు మన సుందర నగరం లోపటున్న మెయిన్ రోడ్ డ్రైనేజ్ గోతుల్లోపట స్కూటర్లతో సహాపడి చచ్చినోండ్ల గురించి జరమౌనంగా ఉండి సంతాపం పాటించాలె!

అందరం లేచి డ్రైనేజీ విక్టిమ్స్ గురించి మౌనం పాటించాం!

చైర్మెన్ మళ్ళీ స్పీచ్ మొదలుపెట్టాడు.

"గిప్పుడు స్పీడ్ బ్రేకర్లకు, రోడ్డు డివైడర్లకు తగిలి రోడ్డుమీద పడీ గోతుల్లోపడి చీకట్లో కొట్టుకొని చచ్చినోండ్ల గురించి రెండు నిమిషాలు సంతాపం చూపాలి-"

అందరూ మరోసారి నిశ్శబ్దం పాటించారు.

"గిప్పుడు మన సుందరమయిన నగరంల ఇండస్ట్రియల్ పొల్యూషన్ దిక్కుకెళ్ళి సచ్చినోండ్ల గురించి సంతాపం పాటించాలె!"

అందరూ మరోసారి నిశ్శబ్దం పాటించారు.

"గిప్పుడు మన కార్పొరేషన్ సప్లయ్ చేసే మంచినీళ్ళల్లో డ్రైనేజీ వాటర్ కలిసినప్పుడు చచ్చినోళ్ళ ఆత్మశాంతికి ఇంకో రెండు నిమిషాలు మౌనం"

మళ్ళీ అందరం లేచి రెండు నిమిషాలు మౌనంగా పాటించాం.

"గిప్పుడు పోలీసోండ్లు నగ్జలైట్స్ ని కాల్చబోతే గల్తీల గోలీలు తగిలి చచ్చిన పబ్లిక్ గురించి రెండు నిమిషాలు మౌనం నడిపించాలె!"

మళ్ళీ రెండు నిమిషాలయింది.

"సోదర సోదరీమణులారా! గిసంటి అందమయిన నగరానికి నాలుగొందలేళ్ళొచ్చి నంక మనం ఖామోషుండానికి ఏడకెళ్లవుతది? ధూమ్ మచాయించాలె! ధూమ్ మచాయింలాల్నంటే పైసలుగావలె! పైసలేడికెళ్ళొస్తయ్! గవర్నమెంట్ కెళ్లిరావాలె! మన నగరంలో అన్నీ మంచిగున్నయ్. కులీ కుతుబ్ షా సాబ్ మంచిగ అన్నీ సోంచాయించి ఈ నగరం కట్టిండు!"

అతని మాట పూర్తికాకుండానే 'తూనీయవ్వ' అంటూ అరచి లేచి మైక్ ముందుకొచ్చారు యాదగిరి జనార్ధన్ లు.

"భాయియో, బెహనో! మన చార్ సౌ బీచ్ శహర్ ని నాలుగొందలేళ్ళకు ముంగట సిర్ఫ్ నాలుగు లక్షల జనాభా గురించి ప్లాన్ ఇచ్చిన్రు! కాని ఈ దినం మన శహర్ జనాభా ఎంత? నీయవ్వ- యాభై లక్షలు! అయినాగానీ ఆ నాలుగు లక్షల జనాభాకున్న సౌలత్ లోనే యాభైలక్షల మందిగ్గూడ నడిపిస్తున్రు! అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ గందుకే రోడ్లమీదకెళ్ళి బహాయిస్తున్నది. నాల్గుదినాలు గట్టిగ ఎండలొస్తే తాగనికి నీళ్ళుండవ్, బోర్ వేల్ నీళ్ళు తాగుదాం అంటే ఇండస్ట్రీల పొల్యూషన్ తోటి ఖరాబయిపోయె! ఇంక రోడ్లు జూస్తే పాకిస్తాన్ మిలటరీ వాండ్లు హైదరాబాద్ మీద దాడిజేస్తే వాండ్ల ఆ రోడ్ల మీదే ఖతమ్ గావాల్నన్నట్లుంటయ్. రోడ్లు మన దుష్మన్ ల కోసం వేసినట్లు వేసిన్రు!"

"శభాష్ బిడ్డ! నడవనీ" తూలిపోతూ అరచాడు జనార్ధన్ మధ్యలో.

అంతా తప్పట్లు- కొంతమంది మినిస్టర్ సాబ్ కేయాల్సిన దండలు తెచ్చి యాదగిరి మెడలో వేశారు. మేమందరం యాదగిరికి మళ్ళీ నచ్చజెప్పి మైక్ నుంచి తప్పించాం.

చైర్మెన్ మాడిపోయిన మొఖంతో మైక్ లో మాట్లాడాడు.

"ఈ కాలనీ కమిటీ వాళ్ళెవరోగాని గిసంటి ఫాల్తూ మాటలు మాటాడేటోళ్ళను నజ్ దిక్ రానీకుండ జూడాలె!"

ఆ మాట అనగానే టమాటోలు ఎగిరివచ్చి స్టేజిమీద పడినయ్.

దాంతో మేము వేదిక ఎక్కక తప్పలేదు.

"సోదర సోదరీమణులారా! అతిథుల మీదకు టమాటోలు, కోడిగుడ్లు విసిరే సాంప్రదాయం మంచిదికాదని ఈ కాలనీ ఆర్గనైజింగ్ సెక్రటరీనయిన శాయిరామ్ అనే నేను అందరికీ సవియనంగా మనవి జేస్తున్నాను.

"అయితే ఆ మినిస్టర్ ని, చైర్మన్ నీ మైక్ దగ్గరకు రానీద్దు" అరచారు వెనుకనుంచి.

"మీ అందరి కోరిక ప్రకారం కార్యక్రమంలో తరువాతి అంశం- మన కాలనీ గేయకవి, రచయిత అయిన చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ గారు తను ప్రత్యేకంగా రాసిన గేయాలు చదువుతారు-

అంతా తప్పట్లు మార్మోగిపోయినయ్ చంద్రకాంత్ మైక్ ముందు కొచ్చాడు.

"అహా నాలుగొందలేళ్ళ నగరం!
ఓహో చార్ సౌబీస్ నగరం!
అటు చూస్తే నాల్గుగంటల ట్రాఫిక్ జామ్
ఇటు చూస్తే ట్రాఫిక్ రూల్స్ లేని
లారీల మధ్య మనం గులాబ్ జామ్.
ఈ డ్రయినేజ్ గోతి వయసు నాలుగొందలేళ్ళు
ఈ కర్ఫ్యూ బ్రతుకు భయం వయసు నాలుగొందలేళ్ళు. రోజంతా కార్పొరేషన్ మురికి రాత్రికి ఫ్యాక్టరీల పొల్యూషన్ ఊపిరి
నగరం నడిబొడ్డులో మురికి కూపాల 'సాగర్'లు-
నగరం శివార్లలో బందిపోట్ల 'డేగర్'లు -
జనమంతా ఈలలు, కేకలు, తప్పట్లతో ఆనందంగా మొదటి చరణం కలసిపాడారు.

ఆహా నాలుగొందలేళ్ళ నగరం -
ఓహో చార్ సౌబీస్ నగరం -
యాదగిరి హఠాత్తుగా మైక్ ముందుకొచ్చాడు.
"భాయియో, బెహనో, ఈ చార్ సౌ శహర్' ఉత్సవాలు ఎందుకు తీసిన్రో నాకెరుక! మీకెరుకనా?" అడిగాడు.
"తెలుసు- తెలుసు" అరిచారందరూ.
"తెలుస్తే జెప్పండి మళ్ళా!"
"ఈ ఉత్సవాల పేరుతోటి ప్రభుత్వం పైసలు తిననికి" అరచాడొకతను.

"సెంటర్లో కూడా దూరదర్శన్ వాళ్ళు 'నాలుగొందలేళ్ళ హైదరాబాద్ నగరం గురించి ఫిల్మ్ తీయమని లక్షల రూపాయలు ప్రైవేట్ పార్టీలకిచ్చారు. రాష్ట్రంలో లక్షల రూపాయలు ఉత్సవాలకు ఖర్చు చేస్తున్నారు. కానీ ప్రజలకు కనీస సౌకర్యాలు లేక మురిగి పోతున్న నగరానికి ఒక్క పైసా కూడా ఎవడూ ఖర్చుచేయటం లేదు- థూ నీయవ్వ" అరచాడు జనార్ధన్.

దాంతో ఇంక భరించలేక మినిష్టరూ, చైర్మనూ లేచి కోపంగా కారువేపు వెళ్ళిపోయారు.

మర్నాడు దూరదర్శన్ లో మా కాలనీ ప్రోగ్రాం చాలా ఘనంగా చూపించారు. ఎటొచ్చీ యాదగిరి, జనార్ధన్, మిగతా కాలనీ వాళ్ళ స్పీచ్ లు మాత్రం లేవు. కేవలం మినిష్టరూ, చైర్మెన్ నాలుగొందలేళ్ళ హైదరాబాద్ గురించి పొగడటం కన్పించింది.

* * * * *

## డ్రాఫ్టోపాఖ్యానం

నేను ఆఫీసుకి బయల్దేరబోతూండగా వచ్చాడు శాయిరామ్.

"గురూ నీతో పని పడింది?" అన్నాడు తాపీగా.

"ఈ వారం రోజులు నేను కాలనీ మీటింగులకి రాను- అన్నాను నిష్కర్షగా.

"అబ్బే అదికాదు గురూ! నీ ఫ్రెండెవరో మన కాలనీ బయట బాంక్ లో ఉన్నారన్నావ్ కదా! ఆ బాంక్ లో చిన్న పని పడింది."

"ఏమిటది?"

"నేను మా అంకుల్ ఒకాయనకి ఎప్పుడో సంవత్సరం క్రితం రెండు వందల రూపాయలకు డ్రాఫ్ట్ పంపించాను- ఈ మధ్య ఆయన చనిపోయారు గానీ డ్రాఫ్ట్ మాత్రం ఇంకా చేరలేదు-"

"ఎందుకని? పోస్టల్ వాళ్ళతో నీగ్గానీ మీ అంకుల్ కిగానీ ఏమైనా విరోధం ఉందా?"

"అదేం లేదు- పోస్ట్ మెన్ ఎక్కడ కనిపించినా చాయ్ ఆఫర్ చేస్తుండేవాడు"

"ఇంతకూ ఇప్పుడు గొడవేంటి?"

"ఆ డ్రాఫ్ట్ పోయింది కాబట్టి కాన్సిల్ చేయించి నా డబ్బు నేను తీసుకోవాలి."

"ఓశ్ ఇంతేనా? దీనికి పేద్ద రాద్ధాంతం ఏముంది? పద-" అన్నాను.

ఇద్దరం బాంక్ కెళ్ళాం.

మా ఫ్రెండ్ కూర్చునే స్థలంలో ఓ లావుపాటి వ్యక్తి కూర్చుని ఉన్నాడు.

"ఇక్కడ రవి అని మా ఫ్రెండ్ ఉండాలి- ఏరండీ?" అడిగానతనిని.

"ట్రాన్స్ ఫరయి వెళ్ళిపోయారు-" అనేసి అక్కడినుంచి లేచి లోపలికెళ్ళిపోయాడు.

"ఏం చేద్దామంటావ్ గురూ?" అడిగాడు శాయిరామ్.

"పద మేనేజర్ తో మాట్లాడదాం- తెలిసినవాళ్ళు లేకపోతేనేం?" అన్నాను- ఇద్దరం మేనేజర్ గదిలోకెళ్ళాం.

అప్పటికే ఓ వ్యక్తి కూర్చుని ఉన్నాడు మేనేజర్ ముందు.

వాళ్ళ మధ్యలో టేబుల్ మీద ఓ కాగితంలో ముత్యాలు ఉన్నాయ్.

"ఇవి బాగున్నాయ్- కన్సెషన్ లో ఇస్తావా?" అడిగాడు మేనేజర్ అతనిని- ఆ ముత్యాలు తీసుకుని చూస్తూ.

"మీకంటే ఎక్కువముంది సార్- ఎన్ని కావాలంటే అన్ని తీసుకోండి-"

"థాంక్యూ థాంక్యూ" అని వాటిని తీసుకోబోయి మావేపు చిరాగ్గా చూశాడు.

"యస్? ఏం కావాలి?"

"మావాడికో సమస్య వచ్చింది - మీరేమయినా సహాయం చేయగలరేమోనని" అన్నాడు-

"ష్యూర్, ష్యూర్- ఏమిటది?"

"మావాడు సంవత్సరం క్రితం ఇక్కడే ఒక డ్రాఫ్ట్ తీసుకున్నాడు- అది మిస్ అయినట్లు ఈ మధ్యనే తెలిసింది కనుక మా మొత్తం మాకిప్పిస్తే-"

మా మాట వినిపించుకోకుండా ఫోన్ తీసి ఎక్కడికో డయల్ చేశాడతను.

"హలో" అంది అవతలి గొంతు.

"చూడండి - సెల్వరాజ్ అనీ పెరల్స్ మర్చెంట్. చాలా మేలిరకం ముత్యాలు, డైమండ్స్ వున్నాయ్ అతని దగ్గర. మనకి కన్సెషన్ లో ఇవ్వటానికి వప్పుకున్నాడు. అతనిదేదో మెయిల్ - ట్రాన్స్ ఫర్ ఉందంట- కొంచెం చూడండి"

"మరి మాకూ కన్సెషన్ లో ఇస్తాడా?" అవతలి అధికారి అడిగాడు.

"ఎందుకివ్వడు? బాంక్ స్టాఫ్ అంటే చాలు! చాలా కన్సెషన్ ఇస్తాడు-"

"అయితే ఓకే" అనేసి ఫోన్ పెట్టేశాడు.

"థాంక్యూ సార్- మీరడిగినవన్నీ సాయంత్రానికి తెప్పిస్తాను-" అంటూ వెళ్ళిపోయాడా వ్యక్తి.

మేనేజర్ మళ్ళీ మావేపు చిరాగ్గా చూశాడు.

"యస్?" అన్నాడు ప్రశ్నార్థకంగా,

"అదేనండీ- ఇందాక చెప్పాంకదా?"

"ఏం చెప్పారు?"

"మావాడి డ్రాఫ్ట్ సంగతి-"

"ఏమయింది డ్రాఫ్ట్ కి-"

"ఇక్కడ డ్రాఫ్ట్ తీసుకుని - రెండొందలకి - మా అంకుల్ కి పంపించాం- అది ఆయనకు చేరలేదు-"

"దానికి మేమేం చేస్తాం- పోస్టల్ డిపార్ట్ మెంట్ ని కంటాక్ట్ చేయండి"

"ఆ వ్యవహారమంతా అయిపోయింది లెండి- ఇప్పుడు మాక్కావలసిందేమిటంటే మా డ్రాఫ్ట్ కాన్సిల్ చేసి మా డబ్బు మాకివ్వటం-"

మళ్ళీ ఫోన్ మోగింది.

"హలో- ఓ- మీరా- ప్రపోజల్ ఇంకా రాలేదు రీజనల్ ఆఫీస్ నుంచి! అక్కడ కెళ్ళి కొంచెం- ఏదయినా చేస్తే త్వరగా వచ్చేస్తుంది... అన్నట్లు మళ్ళీ స్టాకొచ్చిందా? సరే వస్తే రెండు నాకోసం తీసిపెట్టండి-" ఫోన్ పెట్టేశాడు.

"యస్!" అని మా వంక ప్రశ్నార్థకంగా చూశాడు మళ్ళీ.

"మావాడి డ్రాఫ్ట్...."

"ఓహో డ్రాఫ్ట్ పోయిందన్నారు కదూ?"

"అవునండీ-"

"అయితే అప్లికేషన్ రాసివ్వండి! డూప్లికేట్ డ్రాఫ్ట్ ఇస్తాను-"

"మాకు డూప్లికేట్ అవసరం లేదండీ-"

"మరి?"

"మా డబ్బు మాకిప్పించేయాలి"

"అలాగా అయితే సరే- ఆ సంగతే అప్లికేషన్ రాసివ్వండి-"

మేము బయటికొచ్చి డెస్క్ మీద ఓ అప్లికేషన్ తయారుచేసి మళ్ళీ లోపలికెళ్ళాం-

"యస్?" అన్నాడాయన ప్రశ్నార్థకంగా.

అప్లికేషన్ అతని చేతిలో ఉంచాం. అది చూసి అదిరిపడ్డాడు.

"వాట్? సంవత్సరన్నర క్రితం డ్రాఫ్టా?"

"అవునాండి!"

"మరాసంగతి చెప్పరేం?"

"రెండుసార్లు చెప్పామండి!"

"ఎవరికి?"

"మీకేనండీ!"

"సంవత్సరన్నర క్రితం డ్రాఫ్ట్ పోతే మీరు ఇంతకాలం ఎందుకూరుకున్నారు?"

"అది నేను పంపిన వ్యక్తికి ఎప్పటికయినా చేరుతుందనుకున్నానండీ-"

"మరింకా వెయిట్ చేయకుండా ఇప్పుడెందుకొచ్చారు?"

"మా అంకుల్ చనిపోయారండీ-"

"చనిపోయాడా?"

"అవునండీ! స్కూటర్ యాక్సిడెంట్-"

"అరెపాపం! అందుకే స్కూటర్, మోటార్ సైకిళ్ళూ ఎక్కకూడదు-"

"అవునండీ-"

"బస్ లో వెళ్ళాలి - లేదా నడిచి తిరగాలి-"

"మా ఇంకో అంకుల్ నడిచి వెళ్తోంటే లారీ వచ్చి కొట్టేసిందండీ-"

"అలాగా"

"అవునండీ-"

"అందుకే మనం నడవకూడదు-"

"అవునండీ-"

"అయితే సరే - ఓ పనిచేయండి! ఇక్కడికి కిలోమీటర్ దూరంలో మా క్లియరెన్స్ ఆఫీస్ ఉంది. అక్కడికి వెళ్ళి ఈ నెంబరుగల డ్రాఫ్ట్ అవుట్ స్టాండింగ్ లో ఉందా, లేదా అనే విషయం కనుక్కురండి-"

నేనూ శాయిరామ్ క్లియరెన్స్ ఆఫీస్ వెతుక్కుంటూ బయల్దేరాం. గంటసేపు వెదికాక ఓ పెద్ద బిల్డింగ్ లో గోడౌన్ లాంటి చోట దొరికింది.

అక్కడి మేనేజర్ దగ్గరకెళ్ళి సంగతంతా చెప్పాం.

"అలాగా- పాపం దానికోసం వచ్చారా?" అన్నాడు జాలిగా.

"అవునండీ!"

"సంవత్సరన్నర క్రితం దయితే ఇప్పుడు వెదకటం చాలా కష్టమండీ-"

"అయితే ఏం చేద్దామంటారు?"

"ఓ వారం రోజులాగిరండి! మా వాళ్ళు వెతికి ఉంచుతారు-"

మేము కాగిత మీద డ్రాఫ్ట్ వివరాలు రాసిచ్చి తిరిగి కాలనీలోకి చేరుకున్నాం. వారం రోజుల తర్వాత మళ్ళీ వెళ్ళాం.

"ఆ క్లర్క్ శెలవులో ఉన్నాడండీ రేపురండి!" అన్నాడతను.

మర్నాడు మళ్ళీ వెళ్ళాం.

ఓ రెండు గంటలు బయట కూర్చోపెట్టాక చెప్పాడతను.

"అవుట్ స్టాండింగ్ లోనే ఉందని చెప్పండి"

మళ్ళీ బాంక్ కి చేరుకున్నాం. మేనేజర్ మళ్ళీ 'యస్' అంటూ మావేపు చూశాడు.

"మీరు చెప్పినట్లు క్లియరెన్స్ ఆఫీస్ కెళ్ళి తెలుసుకున్నామండీ. అది అవుట్ స్టాండింగ్ లోనే ఉందని చెప్పారు వాళ్ళు-"

"ఏ విషయం మాట్లాడుతున్నారు మీరు?"

మళ్ళీ కథంతా చెప్పాను.

"సరే- అయితే ఈ సంగతంతా డూప్లికేట్ లో ఓ అప్లికేషన్ రాసివ్వండి-"

ఇద్దరం బయట కూర్చుని అప్లికేషన్ రెండు కాపీలు ఆయన కిచ్చాం.

"మీరు వారం రోజులు అయ్యాక రండి" అన్నాడతను.

ఎందుకయినా మంచిదని పదిరోజుల తరువాత వెళ్ళాం.

"యస్?" అన్నాడతను అలవాటు ప్రకారం. అలవాటు ప్రకారం శాయిరామ్ కథంతా చెప్పాడు.

"ఓ! అదా అది ఆఫీసర్ ని కాంటాక్ట్ చేయాలి! నన్ను కాదు-" అన్నాడు చిరాగ్గా. ఇద్దరం ఆఫీసర్ దగ్గరకు వెళ్ళాం.

"ఏం కావాలి?

అతనికి మళ్ళీ కథంతా చెప్పాము.

"ఓహో- అదా-"

"అవునండీ! అదే-"

"దానికి లెటర్ పంపించామండీ- ఇంకా జవాబు రాలేదు-"

"ఎవరికి పంపించారండీ-"

"మా క్లియరెన్స్ ఆఫీస్ కి?"

"లోకల్ లెటర్ కి వారం రోజులు టైమ్ పడుతుందా?"

"పట్టదుకానీ- ఒకోసారి పడుతుంది- అంచేత ఓ వారం ఆగండి-"

మళ్ళీ వారం తర్వాత వెళ్ళాము.

"ఇంకా రిప్లయ్ రాలేదే-" అన్నాడతను మళ్ళీ కథంతా విన్నాక.

"ఒకవేళ లెటర్ పోస్ట్ లో మిస్సయిందేమో-"

"మేము అందుకే లోకల్ లెటర్స్ అన్నీ మెసెంజర్ ద్వారా పంపిస్తాము. పోస్ట్ లో పంపం-"

"ఇప్పుడేం చేయమంటారు?"

"ఇంకో నాలుగు రోజులు-"

నాలుగు రోజుల తర్వాత మళ్ళీ వెళ్లాము.

మళ్ళీ కథంతా చెప్పాడు శాయిరామ్.

"ఓ పని చేస్తారా?" జాలిగా అడిగాడతను.

"లక్ష పనులు చేస్తామండీ! ఒకటేమిటి?"

"మీరే స్వయంగా మా క్లియరెన్స్ ఆఫీస్ కెళ్ళి మా లెటర్ కి ఎందుకు రిప్లయ్ ఇవ్వలేదు అని అడగండి-"

"సరే-"

కాళ్ళీడ్చుకుంటూ క్లియరెన్స్ ఆఫీసుకి చేరుకున్నాం.

"అబ్బే- వాళ్ళ దగ్గర్నుంచి మాకు లెటరేమీ రాలేదు మాష్టారూ- వస్తే మేము రిప్లయ్ ఇవ్వకుండా ఎందుకుంటాం?"

"అదేమిటండీ! మీ మనిషే స్వయంగా టపా తెస్తాడు కదా. ఎలా మిస్సవుతుంది?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఇదిగో ఇప్పుడీ లెటర్ మిస్సయినట్లే-" అన్నాడతను.

"అంటే ఆరోజు వాళ్ళు పంపించిన టపా అంతా ఎక్కడో పోయి ఉంటుంది! అంతే?"

"ఎగ్జాక్ట్ లీ-"

"అంటే ఇప్పుడిక మేము కట్టిన డబ్బు మాకు రాదంటారు."

"అయ్యో - ఎందుకివ్వమండి ఇస్తాం కానీ-"

"ఓపట్టాన్న ఇవ్వరు- అంతేగా-"

"మీరో పని చేయండి- మా బాంక్ కెళ్ళి వాళ్ళు మీ డ్రాఫ్ట్ గురించి మాకు పంపిన లెటర్ కాపీ తీసుకురండి-"

మళ్ళీ బాంక్ కి చేరుకున్నాం 'యస్' అంటూ ప్రశ్నించారు ఆఫీసర్.

కథంతా చెప్పాడు శాయిరామ్.

"మీరు పంపించిన లెటర్ వాళ్ళకి చేరలేదట! అందుకని ఆ లెటర్ కాపీ తెమ్మన్నాడు"

"ఆశ్చర్యంగా వుందే లెటర్ చేరకపోవటం ఏమిటి?"

"ఇందులో మాకేం ఆశ్చర్యం కనిపించటం లేదు. చాలా నేచురల్ గా వుంది."

అతను రెండు గంటలసేపు ఆ లెటర్ కోసం వెతికి కాపీ చేసి ఇచ్చాడు.

అది తీసుకుని మళ్ళీ క్లియరెన్స్ ఆఫీస్ కెళ్లాము.

ఆ లెటర్ చూసుకున్నాక "ఓకే మేము రిప్లయ్ పంపిస్తాంలెండి-"

అన్నాడతను.

"ఎప్పుడండీ?"

"రేపే"

"పోనీ ఆ రిప్లయ్ ఏదో మాకు రాసిస్తే-"

"అలా వీలుపడదండీ- మా రూల్స్ ఒప్పుకోవు"

రెండురోజుల తర్వాత మళ్ళీ బాంక్ కెళ్లాము.

"ఇంకా రాలేదే మీ డ్రాఫ్ట్ తాలూకూ లెటర్-" అన్నాడు ఆఫీసర్.

"మొన్నో పంపుతానన్నాడండీ అతను"

"కానీ పంపలేదు కదా మరి"

ఇక మాట్లాడి లాభం లేదని మళ్ళీ క్లియరెన్స్ ఆఫీస్ కెళ్ళాము.

"ఏమిటి మళ్ళీ వచ్చారు?" అడిగాడతను ఆశ్చర్యంగా.

"అదే మీరు పంపిన లెటర్ రాలేదని అన్నారు బాంక్ లో"

"అబ్బే ఆ రోజే పంపించేశాం-"

"మరిప్పుడెలా - అదీ మిస్ అయిపోయి ఉంటుంది"

"అవును"

"పోనీ- మీ రిప్లయ్ కాపీ ఒకటి ఇస్తే"

"సరే - రేపు రండి"

మర్నాడు వెళ్ళి కాపీ తీసుకుని బాంక్ కి చేరుకున్నాం.

"మంచి పనిచేశారు. లేపోతే ఓ పట్టాన తేలిచావదది" అన్నాడతను లెటర్ తీసుకుంటూ.

"అవునండీ."

"మరి స్టాంప్ పేపర్ తెచ్చారా?" అడిగాడతను.

నేను ఉలిక్కిపడ్డాను.

"అదేమిటి? స్టాంప్ పేపరెందుకు?"

"అయిదు రూపాయల స్టాంప్ పేపర్ మీద మేటర్ రాసి సంతకం పెట్టి ఇవ్వాలి కదా!"

"మా డబ్బుకి మేమే బాండ్ రాయాలా?"

"రూల్స్ బాబూ- రూల్స్-"

"మరీ విషయం ముందే - చెప్తే నిన్నే రడీ చేసుకువచ్చే వాళ్ళంకదా"

"మీరు ముందే అడిగివుంటే ముందే చెప్పేవాళ్ళం-"

"మరీ ఇంక చెత్తరూల్స్ వుంటాయని మేమనుకోలేదు."

"బాంక్ అన్నాక లేకుండా ఎలా వుంటాయండీ?"

"సరే స్టాంప్ పేపర్ తెస్తాం- అందులో లెటర్ ఏం రాయాలో రూల్స్ చూసి చెప్పండి.

అతను ఓ కాగితం కట్టను గంటసేపు వెతికి ఓ కాగితం తీసి ఇచ్చాడు. అయిదు రూపాయల స్టాంప్ పేపర్ కోసం హైద్రాబాద్ అంతా తిరిగి చివరకు బాగా పొద్దుపోయాక దొరకదని తెలుసుకుని మర్నాడు కోర్టు ఆవరణలోవున్న ఓ వ్యక్తి దగ్గర స్టాంప్ పేపర్ తీసుకుని మేటర్ టైప్ చేయించి బాంక్ కి చేరుకున్నాం. అతను కాగితం అంతా ఓసారి చదువుకున్నాడు.

"సరే- ఇవాళ ఎలాగూ టైమయిపోయింది రేపు రండి-" అన్నాడు.

మర్నాడు సంతోషంగా బాంక్ కెళ్ళాం ఆ రోజుతో మమ్మల్ని ఆవహించిన శని వదిలిపోయింది కదాని. గంటసేపు కూర్చున్నాక ఓ క్లర్కు మమ్మల్ని పిలిచాడు.

"ఇక్కడ సంతకం చేయండి" అక్కడ సంతకం చేశాడు శాయిరామ్.

అతను ఓ డ్రాఫ్ట్ శాయిరామ్ చేతికిచ్చాడు-

"ఇదేమిటి?" ఆశ్చర్యంగా అడిగాం.

"డూప్లికేట్ డ్రాఫ్ట్. ఒరిజినల్ పోయిందన్నారుగా"

"కామీ మేమడిగింది డూప్లికేట్ డ్రాఫ్ట్ కాదు- పోయిన డ్రాఫ్ట్ కాన్సిల్ చేసి డబ్బు ఇమ్మన్నాం."

"అలాగా! మరి మా ఆఫీసర్ గారు అలా చెప్పారేం?"

"ఎలా చెప్పారు?"

"ఇలా." మళ్ళీ ఆఫీసర్ దగ్గర కెళ్ళాం.

"యస్?" అన్నాడతను ప్రశ్నార్థకంగా. అని శాయిరామ్ వంక చూశాడు. నేనూ శాయిరామ్ వంక చూశాను.

మా ఇద్దరికీ అర్థమయిపోయింది. కథ మళ్ళీ మొదలయిందని. ఆ డ్రాఫ్ట్ మళ్ళీ కాన్సిల్ చేసి డబ్బు తీసుకోవాలంటే మళ్ళీ ఆ కథంతా జరగాలి. శాయిరామ్ చిరునవ్వు నవ్వాడు.

"మరేం లేదు సార్ - థాంక్స్ చెప్దామని"

"ఏం ఫర్లేదు- మీ సేవకోసమే మా బ్యాంక్ లున్నయ్. వెల్ కమ్- ఆల్వేస్ వెల్ కమ్-"

బయటికొచ్చాక శాయిరామ్ డ్రాఫ్ట్ ముక్కలు ముక్కలుగా చింపి పారేశాడు. మర్నాడు పొద్దునే శాయిరామ్ వచ్చి తలుపుకొట్టాడు. "మళ్ళీ ఏమిటి?" అన్నాడు కోపంగా.

"ఈ ఫార్స్ చూశావా?" అన్నాడు పేపర్లో ఓ బాక్స్ అయిటమ్ చూపిస్తూ.

"ఏమిటది?"

"మనం ఇన్ని రోజులూ తిరిగిన బ్యాంక్ ఉంది చూడు - అక్కడి మేనేజర్నీ స్టాఫ్ నీ మోసం చేసి మెయిల్ ట్రాన్స్ ఫర్ అరవై లక్షలు కొట్టేశాడు ఒక ముత్యాలు, వజ్రాలు అమ్మే బిజినెస్ మెన్-"

"అందులో కొత్తేముందీ? బాంక్ ని ముంచనోడెవ డీరోజుల్లో."

"అది నిజమేగాని ఈ ముత్యాల వార్తకుడెవరో గుర్తుకొచ్చిందా?"

"లేదే- ఎవరు?"

"అదే మనం మొదటిరోజు డ్రాఫ్ట్ కోసం బాంక్ కెళ్ళినప్పుడు మేనేజర్ కి ముత్యాలు కన్సెషన్ లో యిస్తానని చెప్తాడు చూడు-"

"అవునవును! గుర్తుకొచ్చింది- మనెదురుగ్గానే మేనేజర్ ఫోన్ చేశాడు స్టాఫ్ కి- అతని వ్యవహారం వెంటనే ఓకే చేయమని"

"వాడే వాళ్ళను ముంచేశాడు- కేవలం కొన్ని ముత్యాలు దానాగా చల్లి. అదే మనలాంటి పక్షులు వెళ్తే మన డబ్బు మనకివ్వటానికి సవాలక్ష రూల్స్ అడ్డం వస్తాయ్- ముత్యాలు జల్లే వాళ్ళకు సలాంకొట్టి తప్పుకుంటాయ్-"

నేనేం మాట్లాడలేదు.

* * * * *

## పోలీస్ బిల్ వస్తోంది! పారిపోండి!

మన రాష్ట్రంలో ఫైవ్ డేవీక్ వచ్చిందని మా కాలనీ వాళ్ళందరూ ఎంతో సంతోషించారు గానీ మా సంతోషం ఎంతకాలం నిలువలేదు. వారానికి రెండురోజులు ఖాళీ దొరికేసరికి శాయిరాం మరింత విజృంభించాడు. ప్రతి చిన్న సంఘటనకీ నానా హడావుడీ చేసి కొంపలు మునిగిపోయినట్లు పెద్ద మీటింగ్ ఌ పెట్టేస్తున్నాడు.

శుక్రవారం నాడు ఉదయం నేను నిద్రలేస్తూనే మా పక్కింటివాళ్ళ పిల్లి మొఖం చూశాను. పొద్దున్నే పిల్లిని చూస్తే అశుభం అని మా పక్కింటివాళ్ళు దానిని రాత్రే బయటకు తోలేసి తలుపులు వేసేస్తూంటారు. అంచేత అది మిగతా ఇళ్ళల్లో ఎక్కడో పడుకుని పొద్దున్నే కిటికీలోనుంచి దర్శనమిస్తూంటుంది.

"పిల్లి శకునం మంచిదికాదు కదా- ఏం జరుగుతుందో" అని అనుకుంటూ "ఈ క్షణం" పేపర్ తీసుకున్నాను.

ఈలోగా బయట పెద్ద కోలాహలం బయల్దేరింది.

మరి కాసేపటికి మా శ్రీమతి రానేవచ్చేసింది.

"త్వరగా బయటకురండి- సినిమా యాక్టర్లు వచ్చారు.." అందామె నాకేం అర్థం కాలేదు. బయటకొచ్చి చూశాను. అదే సమయానికి రంగారెడ్డి, గోపాల్రావ్, శాయిరామ్, చంద్రకాంత్ అందరూ కళ్ళు నులుముకుంటూ వాళ్ళిళ్ళల్లోంచి బయటకొచ్చారు.

కాలనీ మధ్యలో ఆడాళ్ళూ, పిల్లలూ గుమిగూడిపోయారు. మధ్యలో జనార్ధన్, యాదగిరి నిలబడి ఉన్నారు.

"సినిమా యాక్టర్లంటే వీళ్ళా?" నిరాశగా అన్నాడు చంద్రకాంత్.

అందరం వాళ్ళ దగ్గరకెళ్ళాం.

జనార్ధన్ ఆడాళ్ళకూ పిల్లలకూ సినిమా ఫీల్డు గురించి ఎంతో ఉత్సాహంగా చెప్పేస్తున్నాడు.

"చిరంజీవి తెలీకపోవటం ఏమిటి? రోజూ నేను చిరంజీవీ కలిసే భోజనం చేసేవాళ్ళం స్టూడియోలో-"

"మరి కృష్ణతో మాట్లాడావా?"

"మాట్లాడ్డమా? వాళ్ళింట్లో రెండు రోజులున్నాను-"

కొంతమంది పిల్లలు సంతోషం పట్టలేక తప్పట్లు కొట్టారు.

"మీ పిక్చర్లో మీ పక్కన హీరోయిన్ ఎవరు?" అడిగింది రాజేశ్వరి.

"విజయశాంతిని బుక్ చేస్తామన్నారుగానీ నేనొప్పుకోలేదు. కొత్తవారికి అవకాశం ఇచ్చాం-"

"ఎవరయినా మంచి యాక్టర్స్ ఉన్నారా మీ పిక్చర్లో?" అడిగింది పార్వతీదేవి.

జనార్ధన్ కి కోపం వచ్చింది.

"అంటే మీ ఉద్దేశ్యం ఏమిటి? మేము మంచి యాక్టర్స్ కాదనా?"

పార్వతీదేవి తడబడింది.

"అబ్బే అలా అని కాదు. పేరున్నవాళ్ళు ఇంకెవరయినా-"

"మా పిక్చర్ రిలీజయాక చూడరాదూ? మా ఇద్దర్లో ఎవరో ఒకళ్ళకు బెస్ట్ యాక్టర్ ఎవార్డొస్తది-" అన్నాడు యాదగిరి.

అప్పుడు మమ్మల్నందర్నీ చూశాడు జనార్ధన్.

"నమస్తే అన్నా!" అన్నాడు విష్ చేస్తూ.

"పిక్చర్ పూర్తయిపోయిందా?" అడిగాన్నేను.

"ఆ అయిపొయింది! వచ్చేవారమే రిలీజ్-" అని నావేపు అనుమానంగా చూశాడతను "సారీ! ఏమీ అనుకోవద్దు- మీ పేరు ఉదయార్కర్ కదూ?"

"నాకు మళ్ళీ మండిపోయింది. రెండు నెలలకే పేర్లు మర్చిపోయినట్లు నటనా?

"ఏం సినిమాల్లో కెళ్ళాక మతిపోయిందా?" శాయిరామ్ వెటకారంగా అడిగాడు.

"అబ్బే మర్చిపోవటం కాదు! జస్ట్ కన్ ఫ్యూజన్ బలరామ్ గారూ-"

"నాపేరు శాయిరామ్! బలరామ్ కాదు-"

"ఓ! అవునవును- వెరీసారీ! వేలమంది అభిమానులుండటవల్ల ఈ జ్ఞాపకశక్తితో మహా ఇబ్బందిగా ఉంది రఘురామరెడ్డిగారూ!"

"పోజులు కొట్టకు! నా పేరు రంగారెడ్డి-" చిరాగ్గా అన్నాడు రంగారెడ్డి.

"ఓ- అయామ్ సారీ! ఆ మధ్య గుమ్మడీ నేనూ కలసి షూటింగ్ కెళ్ళినప్పుడు ఇలాగే.."

ఈలోగా వాళ్ళావిడ వచ్చింది.

"ముందింటికి పదండి! తరువాత తీరిగ్గా చెప్దురుగాని మీ అనుభవాలు-" అంటూ అతగాడి సూట్ కేస్ బాగ్ తీసుకుని వెళ్ళిపోయింది.

దాంతో జనార్ధన్ యాదగిరి అయిష్టంగానే ఇళ్ళల్లోకి వెళ్ళక తప్పలేదు. అయితే వెళ్ళేప్పుడు జనార్ధన్ అచ్చం సినిమా హీరోలాగానే అందరికి చేయి ఊపుతూ వెళ్ళాడు.

"ఇంక మనాడి ఫోజులు భరించలేమనుకుంటాను-" అన్నాడు రంగారెడ్డి.

"వచ్చే శని ఆదివారాల్లో మన కాలనీ తరపున మనవాడికి సన్మానసభ ఏర్పాటు చేద్దాం!" అన్నాడు శాయిరామ్ ఉత్సాహంగా.

నేనూ, గోపాల్రావ్ శాయిరామ్ వంక తీక్షణంగా చూశాం.

ఆ వారం రోజులూ జనార్ధన్ మా కాలనీలో అందరికీ 'సినిమా' అంటే విరక్తి కలిగేంతగా బోర్ కొట్టి వదిలేశాడు.

గురువారం ఉదయం జనార్ధన్, యాదగిరి, శాయిరామ్ మా ఇంటికొచ్చేశారు హడావుడిగా.

"గురూ! మా పిక్చర్ రేపు విజయవాడలో రిలీజవుతోంది! మనందరం వెళ్ళి సినిమా చూసివద్దాం!" అన్నాడు జనార్ధన్.

"విజయవాడకు వెళ్ళాలా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అవును!"

"అక్కడి కెళ్ళడం ఎందుకు? ఇక్కడే చూడవచ్చుకదా?"

"ప్రస్తుతానికి ఇక్కడ రిలీజవటం లేదు-"

"ఎందుకని?"

"ఈ ఏరియాలో ఎవరూ కొనటం లేదు. అంచేత ముందు విజయవాడ ఒక్క ఊళ్ళోనే రిలీజ్ చేస్తున్నారు. అదికూడా మార్నింగ్ షోస్ మాత్రమే. అంచేత మనం ఇవాళ సాయంత్రమే బయల్దేరి వెళ్దాం! ప్లీజ్! మా ప్రొడ్యూసర్ కూడా ఫామిలీతో బయల్దేరుతున్నాడు. ఒక బస్ బుక్ చేశాం. మనందరికోసం."

"ఆయనన్నడిగే దేమిటిలెండి- మన కాలనీవాళ్ళ మొఖాలకు ఒక పిక్నిక్కులేదు పాడులేదు. తెల్లారిలేస్తే మన కాలనీలోనే ఒకరి మొఖాలొకరు చూసుకోవటం - మనమీదపడే అవాంతరాలు సరిదిద్దుకోవటంతోనే సరిపోతోంది. అందరం సరదాగా వెళ్దామని మా ఆడాళ్ళంతా నిర్ణయించుకున్నాం-" అంది మా శ్రీమతి లోపల్నుంచీ.

ఆ పరిస్థితుల్లో ఇంక మాకు గత్యంతరం లేక బయల్దేరడానికి వప్పుకున్నాం. సాయంత్రం ఆరుగంటలకల్లా బయల్దేరింది బస్. అనుకున్న దానికంటే ఎక్కువమంది బయల్దేరేసరికి బస్ ఫుల్ అయిపోయింది. దారిలో జనార్ధన్ పిల్లలకూ ఆడాళ్ళకూ తమ సినిమా ఫీల్డ్ తాలూకూ విశేషాలు వివరిస్తున్నాడు.

"ఆ సినిమా షూటింగవుతూండగానే ఇంకా బోలెడు ఆఫర్లు వచ్చాయ్ పార్వతీదేవి గారూ! నన్నూ చిరంజీవినీ పెట్టి ఇద్దరూ హీరోలుగా సినిమా తీయాలని ఒక ప్రొడ్యూసర్ వచ్చాడు. కానీ నేనే వప్పుకోలేదు."

"ఎందుకని?" ఆశ్చర్యంగా అడిగింది సావిత్రమ్మగారు.

"ఎందుకేమిటి?" టైటిల్స్ వేసేప్పుడు- మా ఇద్దరిలో ముందు ఎవరిపేరు వేస్తారని అడిగాను! చిరంజీవి పేరు ముందువేసి తరువాత నాది వేస్తామన్నారు. నాకది నచ్చలేదు. ముందు నా పేరు వేయమన్నాను."

"అబ్బ!-" అందరూ ఆశ్చర్యపోయారు.

"అవునుమరీ! చిరంజీవికి నాకంటె ఎక్కువమంది అభిమానులుండవచ్చు. రేపు ఈ పిక్చర్ రిలీజయాక నాకు మాత్రం అభిమానులుండరూ?"

బస్ విజయవాడలో ప్రవేశించేసరికి రాత్రి ఒంటిగంటయిపోయింది.

తీరా గవర్నర్ పేట్ దగ్గర కొచ్చేసరికి బస్ ఓ పోలీస్ వాన్ మా కెదురుగ్గా వచ్చింది. అందులోనుంచి ఓ కానిస్టేబుల్ దిగి బస్ ఆపమని సైగచేశాడు.

బస్ ఆపాడు డ్రైవర్.

మరుక్షణం నలుగురు కానిస్టేబుల్స్ బస్ లో జొరపడ్డారు.

"దిగండి అందరూ-" అరచాడొకతను.

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు శాయిరామ్.

"బస్ చెక్ చేయాలి!"

"ఎందుకు?"

"ముందు దిగవోయ్-" మీదకొస్తూ అన్నాడతను.

ఇంకేమయినా మాట్లాడితే ఈసారి 'రా' అంటాడని ఊహించి అందరం బస్ దిగాం.

బస్ అంతా అయిదు నిమిషాల పాటు వెతికారు వాళ్ళు.

"ఏదీ? మీరు దొంగతనం చేసిన సామాను?" కిందకు దిగి అడిగాడు ఓ కానిస్టేబుల్.

"దొంగతనమేంటి."

"హైద్రాబాద్ పొలిమేరలో దొంగతనం చేసి ఒక పెద్ద గాంగ్ బస్ లో ఇటే పారిపోయివచ్చినట్లు తెల్సింది మాకు-"

"అంటే మేం డెకాయిట్స్ లాగా కనబడుతున్నామా?"

హఠాత్తుగా పోలీస్ వాన్ లోనుంచి ఓ గొంతు కర్ణకఠోరంగా, ముద్దగా వినిపించింది.

"ఒరే శ్రీశైలం- ఆళ్ళనిలా తీసుకురా!"

"పదండి-" అన్నాడు కానిస్టేబుల్.

నేనూ, శాయిరామ్, జనార్ధన్, యాదగిరి, రంగారెడ్డి, గోపాల్రావ్ వాన్ దగ్గరకెళ్ళాం, వాన్ లోనుంచి బ్రాందీవాసన గుప్పుమంది.

ముందుకూర్చున్న పోలీస్ అధికారి మా మొఖాల మీద టార్చ్ లైట్ వేశాడు.

"ఎవర్రామీరు?"

మాకు కోపం పొడుచుకొచ్చింది. మా ఆఫీస్ లో పెద్ద అధికారి కూడా మమ్మల్ని 'రా' అనడు.

"మర్యాదగా మాట్లాడండీ! 'రా' అంటారేమిటి?" అన్నాడు శాయిరామ్ ధైర్యంచేసి.

లోపలి ఆకారం టార్చిలైట్ శాయిరామ్ మొఖం మీద ఫోకస్ చేశాడు.

"నువ్వెవర్రా?"

"'రా' అనవద్దనే చెప్తోంది!"

"వీడిని లోపల వేసేయండ్రా!" అరిచిందా గొంతు.

మరుక్షణంలో ఇద్దరు కానిస్టేబుల్స్ దిగివచ్చి శాయిరామ్ ని లాక్కెళ్ళి వాన్ వెనుక తలుపులు తెరచి శాయిరామ్ ని లోపలకు తోసి తలుపు వేసేశారు మళ్ళీ.

"వీళ్ళతో తలనొప్పి ఎందుగ్గానీ సరిగ్గా సమాధానం చెప్పి మన్దారిన మనం పోవటం మంచిది" అన్నాడు రంగారెడ్డి.

మాకు భయంవేసింది ఈ గొడవెంతదూరం వెళ్తుందోనని! అసలే ఫామిలీ చిల్డ్రన్స్ తో ఉన్నాం.

"మాట్లాడరేంరా- ఎవరు మీరు?"

ఎదురు తిరగటం కంటే జవాబు చెప్పటమే మంచిదని తెలిసిపోయింది.

"మేం హైదరాబాద్ నుంచి వస్తున్నాం-" అన్నాడు రంగారెడ్డి.

"హైద్రాబాద్ నుంచి వస్తున్నారని మాకు తెలుసోయ్! మీరెవరు?"

"నా పేరు ఉదయార్కర్ ఇతని పేరు రంగారెడ్డి- ఇతను..."

"ఆ విషయం మాకూ తెలుసోయ్- మీరెవరు?"

నేను రంగారెడ్డి వంక చూశాను. రంగారెడ్డి నావంక చూశాడు. ఏం చెప్పాలో ఇద్దరికీ అర్థం కాలేదు.

"ఒకవేళ ఉద్యోగం అడుగుతున్నారేమో-" అన్నాడు రంగారెడ్డి.

"మేము గవర్నమెంట్ సర్వెంట్స్-" అన్నాన్నేను.

"గవర్నమెంట్ సర్వెంట్స్ అని తెలుసోయ్- మీరెవరు?"

మా గొడవ చూసి తను ముందుకొచ్చి నిలబడ్డాడు గోపాల్రావ్

"వాట్ జ్ ది ప్రాబ్లమ్!" అడిగాడు గోపాల్రావ్ నిద్రకళ్ళతో.

"హూ ఆర్ యూ?" కమిషనర్ గోపాల్రావ్ నడిగాడు.

"పేరు గోపాల్రావండీ!"

"గోపాల్రావ్ అని తెలుసోయ్- నువ్వెవరు?"

"జర్నలిస్ట్ నండీ!"

"జర్నలిస్ట్ వని మాకు బాగా తెలుసురా! నువ్వెడివి?"

గోపాల్రావ్ కి వళ్ళు మండిపోయింది.

"మా వాడి నెందుకు వాన్ లో పడేశారు ముందు చెప్పండి."

"నువ్వెవడ్రా అడగటానికి?"

"నేనెవరో రేపు పేపర్ చదువుతే తెలుస్తుంది."

"వీడిని కూడా లోపలేసెయండ్రా-"

కానిస్టేబుల్స్ గోపాల్రావ్ కూడా ఈడ్చుకెళ్ళి వాన్ లోపలకు తోసేశారు.

"బస్ చెక్ చేశారా?" అడిగిందా గొంతు కానిస్టేబుల్స్ ని.

"చెక్ చేశాం సార్!"

"ఏమయినా దొరికాయా?"

"ఏమీ దొరకలేదు సార్! ఈ క్షణం న్యూస్ పేపర్ హైదరాబాద్ ఎడిషన్ దొరికింది." ఆ పేపర్ అందిస్తూ చెప్పాడు కానిస్టేబుల్.

ఆ ఆకారం పేపర్ తీసుకుని టార్చ్ లైట్ ఫోకస్ చేసి చూసింది.

"విజయవాడలో పోలీసు దౌర్జన్యకాండ!" గట్టిగా చదివాడతను.

"ఈ పేపర్ ఎవర్దిరా?"

రాజేశ్వరి ముందుకొచ్చి 'నాది' అంది. అతను టార్చ్ లైట్ రాజేశ్వరి మొఖం మీద వేశాడు.

"హైదరాబాద్ నుంచి ఈ పత్రిక ఇక్కడికెందుకు తెచ్చావ్?"

"తెస్తే తప్పేముంది?"

"తేకూడదని నేను చెప్తున్నా!"

"తేవచ్చని నేను చెప్తున్నాను-" మొండిగా అందామె.

"వీడిని కూడా లోపల వేసేయండ్రా-" అరిచిందా గొంతు.

కానిస్టేబుల్ ఆశ్చర్యపోయాడు.

"ఈమె మగాడు కాద్సారం లేడీ!"

"మొగాడు కాదా?"

"కాద్సార్!"

అతను మళ్ళీ రాజేశ్వరి మొఖం మీద టార్చిలైట్ వేశాడు.

"అయితే మన జీప్ లో వేసేయండి! రూమ్ కి తీసుకెళ్దాం!"

ఇంక లాభంలేదని జనార్ధన్ కల్పించుకున్నాడు.

"చూడండి! ఈ పత్రిక తేకూడదని మాకు తెలీదు-"

"ఎవర్నువ్వు?" టార్చిలైట్ జనార్ధన్ మొఖం మీద పడింది.

"పేరు జనార్ధన్"

"అది తెలుసోయ్- ఎవరు?"

"సినిమా హీరోనండీ-" సినిమా హీరోవని తెలుసోయ్- ఎవరు?"

"అంటే సినిమాలో హీరోగా నటించానన్నమాటండీ."

"అంటే- పోలీస్ ఇన్ స్పెక్టర్ వేషం వేసి, రౌడీ చేతిలో పోలీస్ మర్డరయినట్లు నటించిన పోలీస్ నువ్వేనా?"

"అది నేను కాదండీ..."

"పోలీస్ లు అంత చేతకాని వాళ్ళనుకున్నావా? ఆల్ రైట్- అలాంటి వేషం వేసినందుకు వీడినికూడా లోపల వేసేయండి-"

పోలీసులు జనార్ధన్ ని పట్టుకున్నారు.

"ఆ పాత్ర వేసింది నేను కాదండీ- ఇంకో ఆర్టిస్ట్-"

"ఎవడయితే మాకేంటి? అంతా మీ సినిమా వాళ్ళేగా- వేసేయండి-"

జనార్ధన్ కూడా వాన్ ఎక్కక తప్పలేదు.

రంగారెడ్డికి కోపం ముంచుకొచ్చింది.

"మా వాళ్లందరినీ వదలకపోతే ఇప్పుడే కలెక్టర్ కి ఫోన్ చేస్తాను-"

ఆ మాటతో అక్కడున్న వారంతా విరగబడి నవ్వారు.

"కలెక్టర్ కి చేస్తావా! ఇప్పుడు పవర్సన్నీ పోలీస్ దే- ఇంకెవరికి లేవ్-"

కానిస్టేబుల్స్ రిక్షా తీసుకొచ్చి రాజేశ్వరిని రిక్షా ఎక్కమన్నారు.

"ఆమెకు తీసుకెళ్ళడానికి వీల్లేదు" అంది సావిత్రమ్మ.

"ఎవడామాట అంది!"

"మగాళ్ళు కాద్సార్- లేడీస్"

"దాన్ని కూడా జీప్ లో వేసేయ్-"

"ఓరి దొంగముండా కొడకల్లారా! దొంగల్ని పట్టలేక పోయినా మా హైదరాబాద్ పోలీసులే నయం కదురా-" అంటూ తిట్లు మొదలు పెట్టిందామె.

బలవంతంగా వాళ్ళిద్దర్నీ రిక్షా ఎక్కించి పోలీస్ స్టేషన్ కి లాక్కెళ్ళి పోయారు.

"ఈళ్ళనేం చేస్తారో ఏమో! పదండి మనం కూడా పోలీస్ స్టేషన్ కెళదాం!" అన్నాడు రంగారెడ్డి, అందరం మళ్ళీ బస్ ఎక్కబోయాం-

కాని డ్రైవర్ వప్పుకోలేదు.

"మీ మూలాన నా బస్ లాగేసుకుంటారు సార్! మీరు వెళ్ళండి స్టేషన్ కి" అంటూ బస్ స్టార్ట్ చేసుకెళ్ళిపోయాడు.

మనం పోలీస్ స్టేషన్ వెళ్ళి కూడా లాభంలేదిప్పుడు! మన వెంకట్రామయ్యగారింటికెళ్ళి ఆయనతో చెప్దాం పదండి-" అంది పార్వతీదేవి.

"అవును అదే బెటర్" అన్నాడు రంగారెడ్డి.

అందరం రిక్షాల్లో వెంకట్రామయ్యగారింటికి చేరుకున్నాం. ఆయన పోలీస్ ఆఫీసర్ గా హైదరాబాద్ లో ఉద్యోగం చేసి రిటైరయ్యాడు. పార్వతీదేవికి బంధువవటం వల్ల మా అందరికీ బాగా తెలుసు. పార్వతీదేవి తలుపు కొట్టింది. గాని అయిదు నిమిషాలయినా ఎవరూ తలుపు తీయలేదు. ఈసారి రంగారెడ్డి గట్టిగా తలుపులు బాదటం మొదలు పెట్టేసరికి పక్కింటివాళ్ళు లైటు స్విచ్ వేసుకుని కిటికీలోంచి చూసారు.

"ఎవరూ-" ఒకతను అడిగాడు.

"మేము వెంకట్రామయ్యగారికోసం వచ్చాం-" చెప్పాడు రంగారెడ్డి.

"అలాగా! తలుపుకొడుతోంది ఒకవేళ పోలీస్ లేమో అని భయపడ్డాం! వెంకట్రామయ్యగారు తెల్లారుజామున నాలుగ్గంటలకు గానీ తిరిగి రారు-" అన్నారు వాళ్ళు.

"ఎక్కడికెళ్ళారు?"

"ఎక్కడికేంటి? కృష్ణాబారేజ్ అవతలవేపుకి? ఇవాళ శనివారం కదా" మాకేమీ అర్థం కాలేదు. "శనివారానికీ, కృష్ణాబారేజ్ కీ ఏమిటి సంబంధం" అడిగింది పార్వతీదేవి.

వాళ్ళు మావంక అనుమానంగా చూశారు. "మీదీ ఊరుకాదా?"

"కాదండీ! హైదరాబాద్ నుంచి వచ్చాం-"

"అద్గదీ సంగతి! అందుకే మీకు తెలీలేదు! ఇవాళ బహిష్కరించబడ్డ వారిని కలుసుకునే రోజయ్యా!" మాకు మరీ ఆగమ్యం అయింది.

"బహిష్కారమేంటి?"

వాళ్ళు విసుక్కున్నారు. "అదేనయ్యా పోలీసులతో తగూ పెట్టుకున్న వారందరినీ పోలీసులు సిటీ నుంచి బహిష్కరిస్తున్నారు కదా!వాళ్ళంతా మరి సిటీ వదిలి తాడేపల్లి వెళ్ళి కాపురం ఉంటారు. ప్రతి శనివారం రాత్రి అటు-వాళ్ళూ, ఇటు వాళ్ళు బంధువులూ వెళ్ళి విజయవాడ సరిహద్దుల్లో వాళ్ళను కలుసుకుని రెండు మూడు గంటల వాళ్ళతో గడిపి తిరిగివస్తుంటారు-" మాకు పరిస్థితి అర్థమయింది.

"మరి వెంకట్రామయ్యగారెందుకు వెళ్ళినట్లక్కడికి?"

"ఎందుకేంటి? వాళ్ళ పెద్దబ్బాయిని వారంకిందటే సిటీ నుంచి బహిష్కరించారు కదా!"

"ఎందుకని?"

"పోలీస్ వాళ్ళు అమ్మే లాటరీ టిక్కెట్లు కొనడానికి వప్పుకోలేదట! అందుకని బహిష్కరించారు-" అనేసి కిటికీ తలుపులు మూసేసుకున్నారు వాళ్ళు.

అందరం ఆ అరుగుమీదే కాసేపు కూర్చున్నాం.

"బుద్ధి తక్కువయి వచ్చినాం ఈడకి!" అన్నాడు యాదగిరి.

"అవును! ఇదంతా మీపాడు సినిమావల్లే జరిగింది" అంది పార్వతీదేవి యాదగిరి వంక కోపంగా చూస్తూ. పిల్లలు అరుగుమీదే నిద్రలోకి జారిపోయారు.

మూడవుతోండగా ఆటోలో నుంచి దిగారు వెంకట్రామయ్యగారూ- ఆయన సతీమణి, వాళ్ళ రెండో అబ్బాయీ. మమ్మల్ని చూసి ఆశ్చర్యపోయారాయన.

"ఏమిటింత రాత్రివేళ ఇలావచ్చారు?" అన్నాడు భయంగా.

సంగతంతా చెప్పాం ఆయనకు.

"విజయవాడ పోలీసుల చేతిలో పడకుండానే ఉండాలి! పడ్డారంటే ఖాళీయే- ముఖ్యంగా ఆ తాగుబోతు సర్కిల్ ఒకాయన ఉన్నాడు. అతను రాత్రంతా తాగి వీరవిహారం చేసి కనబడ్డ వారందరినీ లాకప్ లో పడేస్తుంటాడు..."

"అంతా అతనిష్టమేనా?" అడిగాడు రంగారెడ్డి.

"పోలీస్ బిల్ పవర్స్ అలా ఏడ్చినయ్. ఎవరేం చేయగలం?"

అందరం ఇంట్లోకి వెళ్ళి మాట్లాడుతూ కూర్చున్నాం. పదినిమిషాలయినా గడపక ముందే గట్టిగా పోలీస్ విజిల్స్, ఆ తరువాత పోలీస్ వాన్, జీప్ వచ్చి వెంకటరామయ్యగారింటి ముందు ఆగినయ్. మరుక్షణంలో మా తలుపులు గట్టిగా బాదసాగారు బయట నుంచి.

వెంకట్రామయ్య వెళ్ళి తలుపు తెరచాడు.

ఎదురుగ్గా అంతకుముందు మమ్మల్ని అటకాయించిన కానిస్టేబుల్సే నిలబడి వున్నారు. మమ్మల్నందరినీ చూడగానే వాళ్ల మొఖాలు సంతోషంతో విప్పారినయి.

"నేను చెప్పలే వాళ్ళే వీళ్ళయి ఉంటారని!" అన్నాడొకతను.

"పదండి? బయట వాన్ లో సర్కిల్ గారున్నారు-"

"నాతో ఏం పని?"

"అదే ఆయన్నడగండి!"

అయన వెనుకే నేనూ రంగారెడ్డి కూడా వెళ్ళాం.

"ఎవర్రా నువ్వు?" అదే గొంతు.

"వెంకట్రామయ్యనండీ-"

"తెలుసోయ్- వెంకట్రామయ్యవని తెలుసు! ఎవర్నువ్వు?"

"మాది పోలీస్ డిపార్ట్ మెంటేనండీ! అయిదేళ్ళయింది రిటైర్ అయి"

"తెలుసోయ్ పోలీస్ డిపార్ట్ మెంటనీ- ఎవరు?"

"ఎవరంటే ఇంకేం చెప్పనండీ?"

"అర్థరాత్రి మీ ఇంట్లో మీటింగ్ ఎవరి పర్మిషన్ తీసుకుని పెట్టావ్?"

"ఇది మీటింగ్ కాదండీ! బంధువులొచ్చారు!"

"అయినా మీటింగే అది! పర్మిషన్ చూపించు-"

"బంధువులతో మాట్లాడ్డానికి పర్మిషనెందుకండీ-"

"నీకు పోలీస్ బిల్ గురించి తెలీదా? ఎవరు గుమికూడినా, గుమి కూడినచోట ఏ సబ్జెక్ట్ మాట్లాడాలన్నా పోలీసులే పర్మిషనివ్వాలి! నీ ఇష్టం వచ్చిన సబ్జెక్ట్ మాట్లాడకూడదు-"

"మేము కేవలం మా క్షేమ సమాచారాల గురించి మాట్లాడుతున్నామండీ-"

"దానిక్కూడా పర్మిషనుండాలి- ఏయ్ త్రీనాట్ ఫోర్-"

"యస్సార్-"

"వీళ్ళందరూ లోపల ఏం మాట్లాడుతుండగా విన్నావ్?"

"తాగుబోతు అయిన పోలీస్ అధికారివల్ల ప్రజలంతా నానా ఇబ్బందులూ పడుతున్నారని మాట్లాడుకుంటున్నారండీ-"

"వేసేయ్ లోపల వీడిని-"

"దిసీజ్ టూమచ్- మేము..."

అతని మాటలు వినిపించుకోకుండా అతనిని వాన్ లో వేసేశారు- అది చూసి పార్వతీదేవికి మండిపోయింది.

"పోలీస్ డిపార్ట్ మెంట్ వాళ్ళనికూడా చూడకుండా అరెస్ట్ చేస్తారా- మీకేమయినా సిగ్గుందా?" అందామె కోపంగా.

"ఆడెవడు?" అడిగాడు సర్కిల్.

"వాడు కాద్సార్! ఆమె! లేడీస్-"

"నీయమ్మ! ఈ లేడీస్ తెగ బరితెగించిపోయారే ఇవాళ. వేసేయండి లోపల వాడితో పాటు"

పార్వతీదేవిని వాన్ ఎక్కించిపోయేసరికి నేను వెళ్ళి అడ్డుపడ్డాను.

"సార్! ఆమెను వదిలేయండి! తెలీక పొరబాటు మాట్లాడింది-"

"తెలీక మాట్లాడిందా?"

"అవునండీ!"

టార్చ్ లైట్ పార్వతీదేవి మొఖం మీద పడింది.

"ఆర్నీయమ్మ- ఇది సిల్కుస్మిత కదూ?" అన్నాడతను ఆశ్చర్యంగా.

మేం ఉలిక్కిపడ్డాం.

"అబ్బే కాదండీ! మా కాలనీలోనే ఉంటుందామె-" గాబరాగా అన్నాను.

"పోవోష్! నాకు తేడా తెలీదేంటి? ఇది సిల్కుస్మితే!- ఏయ్ స్మితా! నేను నీ ఫ్యాన్నే! నీ సెక్స్ డాన్స్ లన్నీ తెగ షూస్తా- ఆ షినిమాలో డాన్స్ షేషావ్ షూడు- అది ఒక్కసారి షేయవే- వదిలేస్తా నిన్ను-"

మాకేం మాట్లాడాలో అర్ధంకాలేదు-

"అయ్యో వీడి మొఖం మండిపోనూ- నన్ను సిల్కుస్మిత అంటాడేమిటి?" కోపంగా అంది పార్వతీదేవి.

"డాన్స్ షేస్తావా - లేదా- త్రీ' అనే లోపల షేయకపోతే లాకప్ లో కెళ్ళిపోతావ్-"

"ఈమె షిల్కుష్మిత కాదుసార్-" అన్నాడు యాదగిరి. సర్కిల్ కి కోపం ముంచుకొచ్చింది.

"వీడిని కూడా లోపలవేషేయండి-"

పోలీసులు యాదగిరిని కూడా వాన్ లోకి తోసేశారు.

"ఏయ్ షిల్క్ ష్మితా- త్రీ అనే లోపల డాన్స్ చేస్తావా? చేస్తే- వదిలేస్తా! లేకపోతే జీప్ లో వేసేస్తా!"

"నేను సిల్క్ స్మితనా? నీ కళ్ళుపోయినయ్యా? మా కాలనీలో అందరూ నేను విజయశాంతి లాగున్నానని అంటూంటే- నీకు సిల్క్ స్మితలా కనబడుతున్నానా!" మండిపడుతూ అంది పార్వతీదేవి.

"వన్-" అన్నాడు సర్కిల్.

మాకు భయం వేసింది- వాడు పార్వతీదేవిని కూడా జీప్ లో వేసుకెళ్ళిపోతాడేమోనని.

'టూ-" అన్నాడతను.

"చూడండీ! ఆడాళ్ళతో అలా ప్రవర్తించటం..." సర్దిచెప్పబోయాడు రంగారెడ్డి.

'త్రీ' గట్టిగా అరిచేశాడతను.

"పోనీ ఓసారి ఏదొక డాన్స్ చేసేస్తే పోతుందిగదా?" అన్నాడు రంగారెడ్డి నెమ్మదిగా పార్వతీదేవి చెవిలో. మా గొడవంతా విని ఆ చుట్టుప్రక్కల ఇళ్ళవాళ్ళందరూ నిద్రలేసి కిటికీల్లోనుంచి చూడటం ప్రారంభించారు.

"ఒరేయ్- దీన్ని జీప్ లో వేసేయండి" అరచాడతను.

వాళ్ళు పార్వతీదేవి దగ్గరకొచ్చేసరికి ఆమె గట్టిగా కేకలు వేయటం ప్రారంభించింది. దాంతో నలుగురయిదుగురు స్టూడెంట్స్ పరుగుతో వచ్చారక్కడికి. స్టూడెంట్స్ ని చూసి ధైర్యం తెచ్చుకొని మరికొంతమంది ఇళ్ళవాళ్ళు బయటికొచ్చారు.

పార్వతీదేవిని బలవంతంగా జీప్ ఎక్కించగానే, జీప్ లు రెండూ వెళ్ళిపోయాయ్.

రంగారెడ్డి విషయమంతా చెప్పేసరికి అందరికీ పౌరుషం పొడుచుకొచ్చింది.

'ఇలా ఊరుకుంటే లాభంలేదు! ఇవాళ ఆమెను సిల్క్ స్మిత అని డాన్స్ చేయమన్నాడు- రేపు మన ఆడాళ్ళను జయమాలిని డాన్స్ చేయమంటాడు- చేయకపోతే జీప్ లో వేసుకుపోతాడు-" అన్నాడొకతను.

"ముందు మనమందరం డిప్యూటీ కలెక్టర్- గారింటికి వెళ్ళి రిపోర్టుచేద్దాం!" అన్నాడు స్టూడెంట్ లీడర్ రాజేశ్వర్రావ్. అరగంటసేపు నడిచాక అందరం డిప్యూటీ కలెక్టర్ గారింటికి చేరుకున్నాం. ఇల్లంతా లైట్లు వెలుగుతున్నాయ్ అప్పటికే.

మేము గేటు దగ్గర కెళ్ళేసరికే ఆయన భార్య ఆత్రుతగా బయటకు పరుగుతో వచ్చింది.

"ఏమయింది? ఆయనను వదిలేశారా?" అడిగిందామె.

మేము తెల్లబోయాం.

"ఎవరినండీ?"

"ఆయనే - డిప్యూటీ కలెక్టర్ గారిని!"

మాకేమీ అర్థం కావటం లేదు ఆమె మాటలు.

"డిప్యూటీ కలెక్టర్ గారితో మాట్లాడ్డానికి వచ్చామండీ మేము-" అన్నాడు రంగారెడ్డి.

"అంటే ఆయనను వదిలేశారా?"

"వదిలేయట మేమిటండీ- మాకేమీ అర్థం కావటం లేదు!"

ఆమె చిరాకు పడింది.

"మీరెవరసలు?"

"మేం హైదరాబాద్ నుంచి వచ్చామండీ! సిటీలోకి రాగానే మావాళ్ళను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి తీసుకుపోయారు. ఈ విషయం డిప్యూటీ కలెక్టర్ గారికి రిపోర్ట్ చేద్దామని ఇక్కడి కొచ్చాం-"

ఆమె రెండు చేతులతో తల పట్టుకుంది.

"ఏడిచినట్లుంది! రాత్రి డిప్యూటీ కలెక్టర్ గారే కాంప్ నుంచి తిరిగి వస్తూంటే ఆయనో రౌడీ లాగున్నాడని అనుమానించి జీప్ డ్రైవర్ తో సహా అందరినీ అరెస్ట్ చేసి లాకప్ లో పడేశారు. ఆయన డిపార్ట్ మెంట్ వాళ్ళు ఇంతమంది వెళ్ళి బ్రతిమాలినా ఆయనను వదలటం లేదు-"

మాకు మతిపోయింది.

"పోనీ కలెక్టర్ గారికి ఫోన్ చేయకపోయారా?" అన్నాన్నేను.

"ఆ పనేప్పుడో చేశాం, ఇంకెక్కడయినా తను జోక్యం కలుగజేసుకుంటారటగానీ విజయవాడ పోలీసులతో మాత్రం పేచీకి దిగటం తన ప్రిన్సిపుల్స్ కి వ్యతిరేకమని అన్నారాయన"

"ఇలాక్కాదు- వెంటనే ముఖ్యమంత్రికి టెలిగ్రాం ఇద్దాం!" అన్నాడు రాజేశ్వర్రావ్.

అందరం టెలిగ్రాఫ్ ఆఫీస్ కెళ్ళాం. అప్పటికే ఆ ఇద్దరు కానిస్టేబుల్స్ అక్కడ నిలబడి ఉన్నారు.

"మీ దగ్గర్నుంచీ టెలిగ్రాం తీసుకోం సార్-" అన్నాడు టెలిగ్రాఫ్ క్లర్క్.

"ఎందుకని?"

"ఇప్పుడేటెలిగ్రామ్స్ తీసుకోవటం స్టాప్ చేయమని పోలీస్ డిపార్ట్ మెంట్ ఆర్డర్స్ వచ్చాయ్-"

"అదేంటి? మిమ్మల్ని ఆజ్ఞాపించటానికి వాళ్ళెవరు?"

"పోలీస్ బిల్ ప్రకారం వాళ్ళకి మా డిపార్ట్ మెంట్ మీద పూర్తి అధికారం ఉంది-"

"ఎవరయ్యా ఇలాంటి తెలివితక్కువ బిల్ తయారు చేసింది?" అరచాను నేను కోపంగా.

"మన ముఖ్యమంత్రీ, హోమ్ మంత్రిగారూ కలసి చేసిన పనండీ ఇది-"

"వాళ్ళెవరూ విజయవాడ వచ్చి ఏం జరుగుతుందో చూడరా."

"వాళ్ళది చాలా జాలిగుండె అండీ! ప్రజలిలా కష్టాలు పడుతూంటే చూడలేరు. అందుకే ఇక్కడికి రావటం మానేశారు..."

"ఓ పనిచేద్దాం!" అన్నాడు రాజేశ్వర్రావ్. "మా డాక్టరుగారింట్లో ఫోన్ ఉంది. అక్కడికెళ్ళి ఐజీపీకి ముఖ్యమంత్రిగారికీ, ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియాకు ఫోన్ చేద్దాం!"

"అయితే ఆలస్యం ఎందుకు? త్వరగా పదండి?" అందరం డాక్టరు గారింటికి బయల్దేరాం! అప్పటికే తెల్లారిపోవటం మూలాన మా అందరినీ చూచి మరికొంతమంది జనం పోగయ్యారు. డాక్టర్ గారు సంగతంతా విని మండిపడ్డాడు.

"వెంటనే ట్రంక్ కాల్ చేయండి! లైట్ నింగ్ కాల్ చేయండి! డైరెక్ట్ డయిలింగ్ కొట్టండి?" అన్నాడు.

రంగారెడ్డి హడావుడిగా రింగ్ చేశాడు. 'హలో-'

"హలో హలో హలో-" అంది అవతలి గొంతు.

"ముఖ్యమంత్రిగారితో అర్జంటుగా మాట్లాడాలి-"

"ముఖ్యమంత్రిగార్తో మాట్లాడాలా? మాట్లాడండి-"

రంగారెడ్డి ఆశ్చర్యంగా ఫోన్ నాకిచ్చాడు "ఇట్లా మాట్లాడ్తున్నా రేమిటో చూడు-"

నేను ఫోన్ అందుకున్నాను.

"హలో ఎవరు మాట్లాడుతున్నారు?" అడిగాను నేను.

"ఎవరేమిట్రా? నేనే ముఖ్యమంత్రిని-"

"ముఖ్యమంత్రిగారా?"

"అవునని చెప్తుంటే చెవుడేరా.. రాస్కెల్!"

"మేం హైదరాబాద్ నుండి విజయవాడ పనిమీద వచ్చామండీ! ఇక్కడ ఓ తాగుబోతు పోలీస్ అధికారి మమ్మల్ని అరెస్ట్ చేసి మా ఆడాళ్ళను ఎత్తుకుపోయాడు-"

"అవున్రా ఆడిష్టం! ఎత్తుకుపోతార్రా! నువ్వెవర్రా అడగటానికి! నిన్ను కూడా లోపల వేసేస్తాం! నోర్మూసుకుని ఫోన్ పెట్టేయ్-

నాకు అర్థమయింది.

"అవతల ఉన్నది మనని ఎటాక్ చేసిన సర్కిల్ ఇన్ స్పెక్టరే- మనం మాట్లాడుతోంది ముఖ్యమంత్రిగారితో కాదు-"

"అదేమిటి హైదరాబాద్ కి ఫోన్ చేస్తే సర్కిల్ ఇన్ స్పెక్టర్ ఎలా వచ్చాడు ఫోన్లోకి?"

అందరం ఆశ్చర్యపోయాం.

"మైగాడ్! మర్చిపోయాను! మన విజయవాడ ఫోన్ లన్నీ పోలీస్ డిపార్ట్ మెంట్ టాపింగ్ చేస్తోంది! ఎక్కడికి రింగ్ చేసినా ముందు పోలీస్ ఆఫీసుకే వెళ్తుంది-"

"అందుకు టెలిఫోన్ డిపార్ట్ మెంట్ ఎలా వప్పుకుంది?"

"పోలీస్ బిల్ ప్రకారం పోలీసుల కధికారం ఉంది"

అందరం నిశ్శబ్దమయిపోయాం.

"ముందు పోలీస్ స్టేషన్ కెళ్దాం- పదండి- అవతల ఆ తాగుబోతు మన రాజేశ్వరి వాళ్ళను ఏం చేస్తున్నాడో ఏమో-" అంది సుభద్ర ఆదుర్దాగా.

"అవును- అక్కడికే వెళ్దాం పదండి-" అన్నాడు రాజేశ్వర్రావ్. అందరం నడిచే బయల్దేరాం, అప్పటికే తెల్లారిపోవటంతో రోడ్డుమీద జనం తిరగటం మొదలయింది.

పోలీస్ స్టేషన్ బయట ఒక వాన్, జీప్ ఆగి ఉన్నాయ్. వాటిని చూడగానే మా అందరికీ కోపం ముంచుకొచ్చింది.

"పోలీస్ దౌర్జన్యం నశించాలి! చెరపట్టిన స్త్రీలను వదిలేయాలి-" అంటూ అరవసాగాం.

ఈలోగా ఇద్దరు కానిస్టేబుల్స్ తుపాకులు తీసుకుని మా దగ్గర కొచ్చారు.

"ఇక్కడి నుంచి అందరూ త్వరగా వెళ్ళిపోండి రెండు నిమిషాల క్రితమే ఈ ఏరియా అంతా ఎమర్జెన్సీ ప్రకటించారు మా కమీషనర్ గారు-" అన్నాడొకతను. మాకేమీ అర్థం కాలేదు-" ఎమర్జెన్సీ డిక్లేర్ చేయడమేంటి?"

"ఎమర్జెన్సీ అంటే తెలీదా? నీ యమ్మ- ఇలాంటోళ్ళు కూడా ఉన్నారన్నమాట దేశంలో. ఎమర్జెన్సీ అంటే మాకు ఎదురు తిరిగిన వారందరినీ జైల్లో వేసేయటం- ఇదివరకోసారి చేయలా?"

"అంటే. మేం ఇక్కడినుంచి వెళ్ళకపోతే మమ్మల్ని కూడా జైల్లో వేస్తారా?" అడిగాడు యాదగిరి.

"చావగొట్టి మరీ వేస్తాం- అయినా ఎందుకొచ్చిన గొడవ మీకిది? ఇంకా ఒకటి రెండు గంటలు ఓపిక పట్టండి! మా సర్కిల్ కి 'నిషా' దిగిపోతుంది.

* * * * *

## ప్రెస్ బిల్ వస్తోంది

కాలనీ వాళ్ళందరం తెల్లారుజామున అయిదుగంటలకే లేచి రడీ అయిపోయి ఆరుగంటల కల్లా వేదిక దగ్గరకు చేరుకున్నాం.

ప్రెస్ బిల్ ని ప్రభుత్వం బలవంతంగా అమలు జరపటం ప్రారంభిస్తోందని తెలిసి మా కాలనీలో అందరం పేపర్ కొనడం మానివేశాం. ఎందుకంటే ఏ పేపర్ లోనయినా ఒకటే న్యూస్ ఉంటుందనీ, అంచేత అందరూ కలిసి ఒకటే కొని అయిదు నిముషాలు అందులో న్యూస్ చదివితే సరిపోతుందనీ గోపాల్రావ్ మాకు సలహా ఇచ్చాడు. గోపాల్రావ్ జర్నలిస్ట్ కనుకా, ప్రెస్ బిల్ గురించీ వార్తాపత్రికల గురించీ, అతనికి తెలిసినంతగా మాకు తెలీదు గనుక- మేము ఆ సలహాను ఫాలో అయిపోయాము.

మరికాసేపట్లో గోపాల్రావ్ వాళ్ళ పత్రికాఫీస్ నుంచి "ఈక్షణం" దినపత్రిక కాపీ ఒకటి తీసుకొచ్చాడు.

వేదిక మీద నిలబడి పత్రిక చదవడం ప్రారంభించాడు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్థాపించిన రికార్డ్. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల నుంచి వచ్చిన ఆర్జీలన్నీటినీ పరిష్కరించడం జరిగింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించినంత వరకూ ఎలాంటి సమస్యలూ లేవు. ఇది ప్రపంచ చరిత్రలోనే అపూర్వం! ఈ సందర్భంగా మన ముఖ్యమంత్రి ప్రభుత్వాధికారులకూ ప్రజలకూ తమ అభినందనలు తెలియజేశారు. అంతే కాదు. 164వ సారిగా తను మళ్ళీ ప్రజలసేవకు అంకితమవుతున్నానని తెలియజేశారు-"

అందరూ తప్పట్లుకొట్టారు.

మా ముందు కూర్చున్న ఆడవాళ్ళంతా సంబరపడిపోయారు.

"నేన్చెప్పలేదూ? అన్నగారికి దైవాంశ ఉందనీ! అందుకే పదవిలో కొచ్చిన సంవత్సరంలోనే ప్రజల సమస్యలన్నీ తీర్చేశారు-" అంది సావిత్రమ్మ.

"అవును మరి! అన్నగారు ఎంత గొప్పవారు కాకపోతే అలా అన్ని వందలసార్లు మన సేవకి అంకితమయిపోతున్నారు? ఇంతకు బోలెడు మంది ముఖ్యమంత్రుల్ని చూశాం- సంవత్సరాల తరబడి ముఖ్యమంత్రిగా ఉన్నాళ్ళు, నెలకోసారి మారిపోయేవాళ్ళూ, వారానికోసారి మారిపోయేవాళ్ళూ- మరెందరో ఏ ఒక్కరయినా ఇలా ఇన్నిసార్లు ప్రజాసేవకి అంకితమయ్యారా?" అంది కల్చరల్ సెక్రటరీ పార్వతీదేవి.

వాళ్ళ మధ్యలో కూర్చుని వాళ్ళ మాటలు వింటూన్న ఓ పాప ఛటుక్కున వాళ్ళమాటలకు అడ్డుపడింది.

"మమ్మీ, మమ్మీ! అంకితమవటం అంటే ఏమిటి?"

వాళ్ళిద్దరికీ ఏం చెప్పాలో తెలీక మొఖాలు చూసుకున్నారు.

"అంకితమవటం అంటే అంటే అదే జీవితం ధారపోయటం అన్నమాట!"

"ధారపోయటం అంటే ఏమిటీ?"

"నోర్మూసుకో కాసేపు"

"అసలు ఎందుకే అలా ధారపోయటం?" మళ్ళీ అడిగిందాపిల్ల.

"ఎందుకేమిటి! మంచివాళ్ళూ, గొప్పవాళ్ళూ అలా ధారపోస్తారన్న మాట!"

"మరి పునఃరంకితం అంటే ఏమిటే?"

"అంటే మళ్ళీ ధారపోయటం అన్నమాట.

"ఎందుకే అన్నిసార్లు ధారపోయటం?"

"నోర్మూసుకో కాసేపు" ఆ పిల్ల కాసేపు నోరు మూసుకుంది.

"ధారపోయటం అంటే ఏమిటి?" మళ్ళీ అడిగింది.

"అంటే మనకి సహాయం చేయడానికే బ్రతకటం. అలా చేస్తే చాలా గొప్పవాళ్ళన్న మాట!"

"మరి డాడీ కూడా ఎందుకు అంకితమవ్వరు?"

"ఛస్! అది ఎన్టీఆర్ లాంటి గొప్పవాళ్ళే చేయగలరు! మీ డాడీ లాంటి వాళ్ళు చేయలేరు-"

"ఎన్టీఆర్ మనకి ఏం సహాయాలు చేశాడు మమ్మీ?"

"పిచ్చివాగుడు వాగకు! బోలెడు చేశారని పేపర్లో రాయలేదూ?"

"మరి మనం మా స్కూల్లో డొనేషన్ కట్టనవసరం లేకుండా సహాయం చేయరెందుకని?"

"నోర్మూసుకుంటావా లేదా?" కసురుకుంది సావిత్రమ్మ. ఆ పిల్ల నోర్మూసుకుంది.

రెండోవార్త చదవసాగాడు గోపాల్రావ్.

"రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలన్నీ తగ్గిపోయినందుకు ఆంధ్రప్రదేశ్ పౌరుల హర్షం!" హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలో ఒక సింగిల్ రూమ్ క్వార్టర్స్ లో జరిగిన బ్రహ్మాండమయిన బహిరంగ సభలో లక్షలాది ప్రజల ప్రసంగం! ప్రెస్ బిల్ వచ్చిన ఒక్క రోజులో అన్ని వస్తువుల ధరలూ సగానికి పైగా తగ్గించి వేయగలిగిన ప్రభుత్వానికీ, ముఖ్యమంత్రికీ ప్రజలు తమ కృతజ్ఞతలు తెలియజేశారు-"

ఆ వార్తకు ఏంచేతో ఎవరూ చప్పట్లు కొట్టలేదు.

"ఒకవేళ ఆ మీటింగ్ జరిగినచోట ధరలు తగ్గాయేమో" అంది భారతీదేవి సావిత్రమ్మతో.

"అవును అక్కడ తగ్గే ఉంటాయ్- కాకపోతే అన్ని లక్షల మంది ఎందుకు అబద్ధాలు చెప్తారు?"

గోపాల్రావ్ మళ్ళీ చదివాడు.

"నగరంలోని నిర్భయ్ నగర్ కాలనీలో జరిగిన మరో చారిత్రాత్మక మయిన సభలో కాలనీకి చెందిన అనేకమంది గృహిణులు ఆడపడుచులు కూడా అకస్మాత్తుగా ధరలు తగ్గిపోయినందుకు ప్రభుత్వాన్ని మెచ్చుకుంటూ ప్రసంగాలు చేశారు. సభ ఆఖర్లో ఆ సభకు అధ్యక్షత వహించిన శ్యామల్రావ్ గారు మన ముఖ్యమంత్రి అవతార పురుషులనీ అందుకే అలా ధరలు తగ్గించగలిగారనీ అన్నారు-"

ఆ వార్తతో పెద్ద ఎత్తున కలకలం బయల్దేరింది అందరిలోనూ.

"మన కాలనీలో సభ ఎప్పుడు జరిగింది?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారెడ్డి శాయిరామ్ వంక అనుమానంగా చూస్తూ.

"అబ్బే- నాకేం తెలీదు! నేనేం మీటింగ్ పెట్టలేదు నిన్న-" అన్నాడు శాయిరామ్ కంగారుగా.

"అయ్యో! మనం ఎప్పుడన్నామలా? అసలు ధరలు తగ్గిందెక్కడ? పైగా పాలధర ఇవాళ నుంచే మళ్ళీ పెరిగిందని మిల్క్ బూత్ వాడు ఇరవై పైసలు ఎక్స్ట్రా వసూలు చేశాడు కదా!" అంది పార్వతీదేవి.

"డియర్ ఫ్రెండ్స్!" అన్నాడు గోపాల్రావ్ "మన కాలనీలో ఈ సభ జరగలేదని మనందరికీ తెలుసు! అయినా ఈ న్యూస్ ఇలా రాశారంటే కేవలం ఆ శ్యామల్రావ్ గాడి పనేనని నాకు అనుమానంగా ఉంది-"

"అనుమానంగా ఉంటే ఇంకా ఆలస్యం ఎందుకు? వాడింటికెళ్ళి- బయటకు పిలిచి గిటార్ వాయిస్తే సరిపోతుంది కదా-" అన్నాడు మా కాలనీలో వెయిట్ లిఫ్ట ర్ వివిన్ పాల్!

అప్పటికప్పుడే అందరం కలిసి ఊరేగింపులాగా శ్యామల్రావ్ ఇంటి దగ్గరకు నడిచాము. శ్యామల్రావ్ ఇంటి బయట ఇద్దరు పోలీసులు తుపాకులు పట్టుకూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. మమ్మల్ని చూడగానే తుపాకులు చేతిలోకి తీసుకుని పొజిషన్ లో నిలబడ్డారు.

మాకు పరిస్థితి అర్థమయిపోయింది.

"శ్యామల్రావ్ గారూ-" పిలిచాడు శాయిరామ్.

శ్యామల్రావ్ హడావుడిగా చొక్కా వేసుకుంటూ బయటికొచ్చాడు.

"ఏమిటీ- ఇంతమంది వచ్చారు?" అనడిగాడు ఏమీ తెలియనట్లు.

"మీరు నిన్న మన కాలనీలో ఏదో సభ జరిపారట- దాన్ని గురించి తెలుసుకుందామనీ!" అన్నాడు రంగారెడ్డి వెటకారంగా.

"అదా- అదీ జరిగింది మా ఇంట్లోనే-" అన్నాడతను.

"అలాగా- సభకు వచ్చిన జనం మీ ఆవిడా, మీ అబ్బాయ్, మీ కోడలూ అయుంటారు! అవునా?"

"లేదు ఆ చివరింటి ముసలమ్మకూడా వచ్చింది-"

మా కాలనీ బాడీబిల్డర్, వెయిట్ లిఫ్టర్ ఛటుక్కున శ్యామల్రావ్ చొక్కా పట్టుకున్నాడు.

"అలాంటప్పుడు అది కుటుంబ సభ అని రాసుకోక కాలనీ సభ అని ఎందుకు రాయించావ్ బే?"

పోలీసులు ఛటుక్కున రైఫిల్ పైకెత్తి గాలిలోకి రెండు రౌండ్లు కాల్చారు. దాంతో మేము పాల్ ని వెనక్కు లాగేయక తప్పలేదు.

"కాలనీ సభ్యులారా! ఇదంతా ప్రభుత్వం పన్నిన కుట్ర! మన శ్యామల్రావ్ వాళ్ళ దగ్గర ఏ పాతికో పరకో లంచం తిని ఇచ్చిన స్టేట్ మెంట్ అది! అంచేత మనం ఇవాళే మరో స్టేట్ మెంట్ తయారు చేసి ధరల గురించిన నిజానిజాలు అన్ని పత్రికల్లోనూ ప్రచురింపజేద్దాం!" అన్నాడు శాయిరామ్.

అందరం మళ్ళీ వేదిక దగ్గరకెళ్ళి ఓ తీర్మానం తయారుచేసి దానిని పత్రికాఫీసుకి పంపించే బాధ్యత రంగారెడ్డి, గోపాల్రావ్ ల మీద పెట్టాం!

ఆ తరువాత పేపర్లో వార్తలన్నీ మిగతా రాష్ట్రాల్లో ప్రజలు ఎన్ని కష్టాలు పడుతోందీ, అక్కడ ప్రభుత్వాలు ఎంత నికృష్టంగా పరిపాలిస్తోందీ- వీటి గురించినవే!

సరిగ్గా అప్పుడే మా కాలనీ తాలూకు కుర్రాడొకడు పరుగుతో మా దగ్గరకొచ్చాడు.

"అంకుల్- మా మమ్మీ మిమ్మల్ని అర్జంటుగా పిలచుకు రమ్మంటోంది-" అన్నాడు శాయిరామ్ తో.

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు శాయిరామ్.

"మా పక్కింటిలో తాతగారు ఉరివేసుకుని చచ్చిపోయారట-"

అందరం ఆదరాబాదరా పరిగెత్తాం. ఆ కుర్రాడితల్లి భయంగా ఇంట్లో నుంచి బయటకొచ్చింది. ఆమె వెనుకే ఏడుస్తూ ఓ ముసలమ్మ బయటికొచ్చింది..

"ఆ ఇల్లేనండీ! పొద్దున్నుంచీ చడీచప్పుడూ లేకపోతేనూ తలుపు తోసి చూశాను. లోపల ఉరేసుకుని వేలాడుతూ కనిపించారు. పాపం ఈ మామ్మగారు పస్తులుండలేక వాళ్ళమ్మాయి ఇంటికెళ్ళి ఇప్పుడే బియ్యం అప్పుగా తెచ్చుకున్నారు. వచ్చేసరికి ఆయన ఉరి సీన్."

నేనూ, శాయిరామ్ రంగారెడ్డి చప్పున ఆ ఇంట్లోకి నడిచాము. ముసలాయన శరీరం తాడుకి వేలాడుతూనే ఉంది.

టేబుల్ మీద ఓ కాగితం పేపర్ వెయిట్ కింద కనబడుతోంది.

నేను త్వరగా ఆ పేపర్ తీసుకుని చూస్తాను.

"రిటైర్ అయి సంవత్సరం దాటినా ఇంకా నాకు పెన్షన్ రాలేదు. ప్రభుత్వానికి ఎన్నో ఆర్జీలు పెట్టుకున్నా ప్రయోజనం లేకపోయింది. తినడానికి తిండికూడా లేని పరిస్థితుల్లో- నా జీవితాన్ని అంతం చేసుకోవాల్సి వస్తోంది, నా చావుకి ముమ్మార్లూ ప్రభుత్వానిదే బాధ్యత-"

ఆ పేపర్ తీసుకెళ్లి బయట అందరికీ గట్టిగా చదివి వినిపించాను.

"మరి పేపర్లో ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ ఒక్క ఆర్జీగాని, ఫైల్ గానీ, కేస్ గానీ పెండింగ్ లో లేదని రాశారేంటి?" అడిగింది రాజేశ్వరి కోపంగా.

మేం ఆ తర్వాత కార్యక్రమం నిర్వహించడానికి బయల్దేరాం.

మర్నాడు పేపర్లో వచ్చిన వార్తలు చూసేసరికి మాకు మతిపోయినట్లయింది.

"నిర్భయ్ నగర్ కాలనీలో- ఓ వృద్ధుడు కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసింది. అయితే అతని మానసిక పరిస్థితి సరిగ్గాలేదని కూడా తెలుస్తోంది. అతను మాజీ ప్రభుత్వోద్యోగి. పోలీసులు శవాన్ని మార్చురీకి పంపించారు"

దానికిందే మరోవార్త!.

"ధరలను ప్రభుత్వం అదుపులో పెట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని నిర్భయ్ నగర్ కాలనీలోనే జరిగిన మరో ఊరేగింపు శ్యామల్రావ్ ఇంటికి వెళ్ళినప్పుడు ఆనందోత్సాహాలు పట్టలేక ఇరువురు పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపారు. అందరూ మూకుమ్మడి నృత్యాలు జరిపాక ఆ ఊరేగింపు ప్రశాంతంగా ముగిసింది!"

"ఇది టూమచ్ అన్యాయం ఉన్నాయి-" అన్నాడు నిసార్.

"మనం ధరలు తగ్గినందుకు నృత్యాలు చేశామా? ఏడుపొచ్చినా సంతోషం వచ్చినా పాటలు పాడుతూ డాన్స్ లు చేయడానికి ఇదేం సినిమానా?" అంది పార్వతీదేవి ఉక్రోషంగా.

"మనం వూరుకుంటే లాభంలేదు. ఈ వార్త అబద్ధమని మరో పేపర్ స్టేట్ మెంటివ్వాలి!" అంది రాజేశ్వరి.

"దానిని మాత్రం ఎవరు పబ్లిష్ చేస్తారు?"

"ఎవరికీ ఏం చేయడానికి తోచలేదు. మేము మాట్లాడుతూండగానే పోలీస్ వాన్ ఒకటి వేగంగా వచ్చి మాకు సమీపంగా ఆగింది. అందులో నుంచి ఇన్ స్పెక్టర్ ఇద్దరు కానిస్టేబుల్స్ దిగారు.

"ఇక్కడ 'ఈక్షణం దినపత్రిక ఛీఫ్ రిపోర్టర్ గోపాల్రావ్ ఎవరు?"

"నేనే" అన్నాడు గోపాల్రావ్.

"నిన్ను అరెస్ట్ చేస్తున్నాం-"

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు గోపాల్రావ్.

"కొన్ని వార్తలు సెన్సార్ ఆఫీస్ అనుమతి లేకుండా పబ్లిష్ చేసినందుకు"

"ఏమిటీ వార్తలు?"

ఇన్ స్పెక్టర్ పేపర్ తీసుకుని గట్టిగా చదివాడు.

"నిర్భయ్ నగర్ కాలనీలో మెదడువాపు వ్యాధి! ఆరుగురు పిల్లలు మృత్యువుతోపోరాటం జరుపుతున్నారు. కాలనీలో యధేచ్ఛగా తిరుగుతూన్న పందులవల్ల ఈ వ్యాధి మరికొంతమందికి సోకే అవకాశం ఉంది" ఇది ఇది ఎవర్నడిగి రాశారు?"

"ఇందులో అడగాల్సిందేముందీ- మా కాలనీకొచ్చి ట్రీట్ చేసిన డాక్టర్లు చెప్పిందే రాశాను-"

"డాక్టర్లెవరయ్యా చెప్పటానికి! గవర్నమెంట్ చెప్పాలి- వాళ్ళకేం జబ్బో! ప్రెస్ బిల్ అమల్లో ఉన్నప్పుడు అన్ని విషయాలూ గవర్నమెంటే చెప్తుంది! తెల్సిందా?"

"తెల్సిందండీ"

"అసలు ఆంధ్రప్రదేశ్ లో ఎలాంటి అంటువ్యాధులూ లేవనీ, ప్రభుత్వం అన్ని జబ్బులనూ పూర్తిగా నిర్మూలించేసిందనీ ప్రభుత్వం నిన్నే స్టేట్ మెంటిచ్చింది! నువ్వేమో ఇవాళ మెదడు వాపు వ్యాధి ఉందని రాస్తావా?"

"నిజంగానే ఉందికదాని-"

"పిచ్చివాగుడు వాగకు- ఉన్నవన్నీ రాసేస్తే ఇంక ప్రెస్ బిల్ ఎందుకు, మేమెందుకు? ఏమేం నిజాలకు- ఏమేం అబద్ధాలు రాయాలో గవర్నమెంట్ ఒక పట్టిక జారీచేసింది- మీ పత్రికకు చేరలేదా అది?"

"లేద్సార్-"

ఇన్ స్పెక్టర్ జేబులోనుంచి ఓ పట్టిక తీసి గోపాల్రావ్ కిచ్చాడు. మేమంతా గోపాల్రావ్ చుట్టూ మూగిచదివాం.

1) రాష్ట్రంలో ఎక్కడయినా ఎలాంటి వ్యాధులయినా వ్యాపించినప్పుడు ఆ విషయం దాచి- ఆ బాధితులందరూ పెళ్ళిలో విషపూరితమయిన విందు భోజనం చేసినందున అస్వస్థులయారని రాయవలెను.

2) ఎవరు సమ్మెలు చేసిననూ ఆ విషయం దాచి- ఆయా ఉద్యోగులు లేక కార్మికులు సాంస్కృతిక వారోత్సవాల్లో పాల్గొనుచున్నారని వ్రాయవలెను.

3) పోలీసు కాల్పులును, లాటీ చార్జీలనూ, భాష్పవాయు ప్రయోగాలనూ- ఏ పరిస్థితిలోనూ రాయకూడదు.

4) ఆకలి చావులకు స్వల్పమార్పులుచేసి అజీర్ణవ్యాధితో మరణించినట్టు వ్రాయవలెను.

ఇలా చాలా పెద్ద లిస్ట్ కనిపించింది.

"ఇది టూమచ్ అన్యాయం ఉన్నయ్" అన్నాడు నిసార్ మళ్ళీ.

"పిచ్చిమాటలు మాట్లాడితే నిన్ను కూడా అరెస్ట్ చేస్తాం" అన్నాడు ఇన్ స్పెక్టర్ నిసార్ ని కోపంగా చూస్తూ.

"అచ్చా! నేను నమాజ్ కు పోతున్నయ్-" అనేసి అర్జంటుగా నమాజ్ కెళ్ళిపోయాడు నిసార్. పోలీసులతో వాదిస్తే ఏం జరుగుతుందో వాడికి అనుభవపూర్వకంగా తెలుసు.

ఇన్ స్పెక్టర్ పేపర్లో మరోవార్త చదివాడు బిగ్గరగా.

"అసెంబ్లీ దగ్గర జర్నలిస్టులపై పోలీస్ లాఠీచార్జీ- ఇదెవర్నడిగి రాశావ్"

"చూసి రాశానండీ!"

"చూసి రాయమని ఎవరు పర్మిషనిచ్చారు నీకు?"

"ఎవరూ ఇవ్వలేదు-"

"సరే- పద ముందు స్టేషన్ కి-"

"ఓసారి మా పత్రికాఫీస్ కి ఫోన్ చేసి మా ఎడిటర్ గారితో మాట్లాడి వస్తాను-"

"ఎందుకు?"

"నన్ను జామీను మీద విడిపించడానికి!"

"మీ ఎడిటర్నే లాకప్ లో పడేశాం. ఇంక నీకు జామీనేమిటి- పద-"

"అదేమిటి మా ఎడిటర్ని ఎందుకు అరెస్ట్ చేశారు?"

"ఇవాళ్టి పేపరులో మా ఆదేశాల ప్రకారం ముఖ్యమంత్రి ఫోటో వేసి పొగడ్తల దండకం రోజుకొక కవిత రాయించాలి. ప్రభుత్వం వల్ల సహాయాలు పొంది లక్షాధికారులయిన కోట్లమంది బీద ప్రజల ఇంటర్వ్యూలు వేయాలి. ఇవేమీ చేయలేదు మీ పేపర్-"

గోపాల్రావ్ ఏమీ మాట్లాడలేదు.

"పద- వాన్ ఎక్కు-" అన్నాడు ఇన్ స్పెక్టర్. గోపాల్రావ్ వాన్ ఎక్కక తప్పలేదు. అతని భార్య పిల్లలూ ఏడుస్తూ వాన్ దగ్గర నిలబడ్డారు. వాన్ వెళ్ళిపోయింది.

రెండ్రోజుల తర్వాత మేమంతావెళ్ళి గోపాల్రావ్ ని జామీను మీద విడిపించాం. తీరా గోపాల్రావ్ బయటకొచ్చేసరికి అతని వళ్ళంతా బాండేజీలు కనిపించినయ్.

"ఏమిటిది? ఏం జరిగింది?"

అడిగాడు శాయిరామ్ ఆశ్చర్యంగా.

"జర్నలిస్టుల మీద లాఠీచార్జీ చేసినట్లు రాశానని నన్నూ, మా ఎడిటర్నీ చావగొట్టారు!"

"దిసీజ్ టూ మచ్- వెంటనే ప్రధానమంత్రికి టెలిగ్రాం ఇద్దాం-" అన్నాడు రంగారెడ్డి.

"అలాక్కాదు- గోపాల్రావ్ ని బాండేజీలతో ఫోటోలు తీసి రాజీవ్ గాంధీకి పంపితే ఋజువులతో పంపినట్లుంటుంది" అన్నాడు చంద్రకాంత్.

అప్పటికప్పుడు ఫోటోలు తీసి రాజీవ్ గాంధీకి పంపించాం. కానీ మర్నాడు పేపర్ చూస్తూనే మా మొఖాలు వాడిపోయాయి.

"ఒక న్యూస్ పేపర్ కి చెందిన ఎడిటరూ, చీఫ్ రిపోర్టరూ నిన్న పోలీస్ స్టేషన్ దగ్గర జరిగిన స్కూటర్ ప్రమాదంలో గాయపడినట్లు పోలీసులు తెలియజేస్తున్నారు-"

మరో రెండు రోజులు గడిచాయి.

మేమందరం కాలనీ మధ్యలో కూర్చుని కొన్ని గాలివార్తలు గురించి చర్చించుకొంటుండగా గోపాల్రావ్ వారపత్రిక తాలూకూ వాన్ లో హడావుడిగా వచ్చాడక్కడికి. "పదండి- త్వరగా! ఇక్కడికి దగ్గర్లోనే హరిజన గూడెం మీద పక్క ఊరివాళ్ళు దొమ్మీ జరిపి చాలా దారుణాలు చేశారంట! న్యూస్ తీసుకొద్దాం!" అందరం వాన్ ఎక్కాం, గంటసేపట్లో ఆ ఊరు చేరుకుంది మా వాన్. పోలీసులు ఊరిబయటే వాన్ ఆపేసారు.

"న్యూస్ పేపర్ నుంచి" అని చెప్పాక లోపలకు వెళ్ళివచ్చారు. హరిజనుల ఇళ్ళు చాలా కాలిపోయినయి. చాలామంది ఆ మారణకాండకు బలి అయిన వారి చుట్టూ కూర్చుని ఏడుస్తున్నారు. పోలీసులు, ప్రభుత్వాధికారులతో చాలా హడావుడిగా ఉందా ప్రాంతం. న్యూస్ అంతా చూచినది చూచినట్లు రాసుకుని, కొన్ని ఇంటర్ వ్యూలు రికార్డ్ చేసుకున్నాక అందరం తిరిగి వచ్చాం మళ్ళీ. మర్నాడు 'ఈ క్షణం పేపర్ చూసేసరికి మాకు నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు.

"నగరానికి దగ్గరగా ఉన్న హరిజన వాడలో జరిగిన ఓ అగ్ని ప్రమాదంలో అనేక ఇల్లు దగ్ధమయ్యాయ్. అనేక మంది హరిజనులు నిరాశ్రయులయారు. అయితే ప్రభుత్వం వెంటనే వారిని ఆదుకుని సేవలు చేసేసింది. వారిప్పుడు ఎంతో హాయిగా ఉన్నారు-" అని ఉంది అందులో ఆ వార్త పక్కనే ఒక ఫోటో వేశారు. ఆ హరిజనవాడకు చెందిన ఓ అయిదేళ్ళ పిల్ల చిరునవ్వు నవ్వుతోంది కెమెరావేపు చూస్తూ. దాని కింద ఇలా రాసి వుంది.

"హరిజనవాడలో అందరూ ప్రభుత్వ సహాయానికి ఎంతో ఆనందంతో చిరునవ్వులు చిందిస్తోన్న దృశ్యం-"

"వరంగల్ అడవుల్లో నక్సలైట్లు అని అనుమానింప బడుతున్న కొంతమంది నిన్న రాత్రి పొరబాటున తమని తామే కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీస్ వర్గాలు తెలియజేస్తున్నారు. ఇలా ఆత్మహత్యలు చేసుకోవడం చట్టవిరుద్ధమనీ, ఆత్మహత్యలు చేసుకున్న వారివి అరెస్ట్ చేయడం జరుగుతుందనీ పోలీస్ కమిషనర్ గారు- హెచ్చరిస్తున్నారు"

రాన్రాను మన రాష్ట్రంలో ఏం జరుగుతున్నదీ, ఎవరికీ తెలియకుండా పోయింది. ఓసారి వారం రోజులపాటు బస్సులు నడవకపోవటం చేత అందరం ఆఫీసులు మానివేయాల్సి వచ్చింది.

పేపర్లో చూస్తే అదనంగా బోలెడు బస్సులు హైద్రాబాద్ లో నడుపుతున్నందువల్ల ప్రజలకు చాలా మేలు చేకూరినట్లు అనేమంది ప్రభుత్వాధి కారులు స్టేట్ మెంట్ ఇచ్చారు. వారం రోజుల నుంచి నీళ్ళ సప్లయ్ ఆగిపోయింది. ఆ విషయం ఎవరికి రిపోర్ట్ చేసినా ఉపయోగం లేకపోయింది. రెండు రోజుల పాటు సిటీలో ఎలక్ట్రిసిటీ లేకుండా పోయింది.

నగరంలో వెన్నెల ఎక్కువగా లభ్యమవుతున్న కారణంగా ప్రజలు విద్యుచ్ఛక్తి వాడకం తగ్గించాలని పేపర్లో మరో అధికారి స్టేట్ మెంట్ కనిపించింది.

కొత్త పన్నులు విధించమని ప్రభుత్వాన్ని కోరుతూ చాలామంది ప్రజలు అనేక పట్టణాల్లో ఊరేగింపులు జరిపి వినతి పత్రాన్ని గవర్నర్ కు అందించారట ప్రజల కోరికమేరకు మరో రెండు రోజుల తర్వాత ప్రభుత్వం కొత్త పన్నులు విధించింది. కొత్త పన్నులు విధించినట్లు ప్రకటన వెలువడిన రోజు హైదరాబాద్ లోని కొన్ని కోట్లమంది ప్రజలు లారీల్లో తిగుతుతూ, బాణాసంచా కాలుస్తూ ప్రభుత్వాన్ని అభినందించారట!

మరో రోజు రాష్ట్రంలోని ప్రజలంతా అన్ని ఊళ్ళల్లోనూ ప్రదర్శనలు జరిపి అసలు దేశంలో ఎలక్షన్లు అనేవి రద్దుచేయాలని ఇప్పటి ప్రభుత్వం కేంద్రానికి అనుమతి కోసం పంపించింది! రాష్ట్రానికి చెందిన దొంగలంతా తాము మారిపోయామని ప్రభుత్వానికి చెప్పి దొంగతనాలు చేయడం మానివేశారట! కనుక రాష్ట్రంలో దొంగతనాలు లేవట. ఈ గందర గోళంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతూండగా నిసారీగాడు ఓ అర్దరాత్రి వచ్చి మా తలుపు కొట్టాడు.

"ఏమిటి?" అడిగాన్నేను రహస్యంగా.

"రాత్రి తెల్లవారుజామున నాలుగు గంటలకి బెంగుళూర్ నుంచి లారీ వస్తున్నాయ్? అందులో బెంగుళూర్ న్యూస్ పేపర్స్ వస్తయ్ ఆ పేపర్లు సెన్సారింగ్ లేని న్యూస్ ఉంటాయి-" అన్నాడువాడు.

అప్పటికప్పుడే అందరం వెళ్ళి చెక్ పోస్ట్ దగ్గర నిలబడి బెంగుళూరు న్యూస్ పేపర్ కోసం ఎదురుచూడసాగాం. నాలుగ్గంటలకల్లా నిసార్ గాడు చెప్పినట్లు లారీవచ్చింది. అప్పటికే కొన్ని వందల మంది దాని కోసం ఎదురుచూస్తూండడం చేత అందరూ లారీని చుట్టుముట్టేశారు. డ్రైవర్ నెమ్మదిగా న్యూస్ పేపర్ల కట్టతీసి ఒక్కొక్క ప్రతి పది రూపాయలు చొప్పున బ్లాక్ లో అమ్మటం ప్రారంభించాడు. అతి కష్టం మీద ఓ కాపీకొని కాలనీకి చేరుకొన్నాం. కాలనీ వాళ్ళందరూ పిల్లా పాపలతో సహా మా కోసం వేచి ఉన్నారు. మమ్మల్ని అంత దూరంలో చూడగానే "దొరికిందా" అనడిగారు ఆశగా.

దొరికిందనేసరికి వాళ్ళ ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

"సెన్సార్ అవని పేపర్ చూసి ఎంత కాలమయిపోయిందో- ఒక్కసారి చూడనీండి!" అంటూ రంగారెడ్డి వెంబడి పడ్డారు. రంగారెడ్డి అతి కష్టం మీద పేపర్ని కాపాడి వేదిక చేరుకున్నాడు.

"సోదరులారా! మీరందరూ క్రమశిక్షణతో నిశ్శబ్దంగా ఉంటే- ఈ స్మగుల్డు న్యూస్ పేపర్ ని అందరూ చూడవచ్చు. వినవచ్చు!" అన్నాడు శాయిరామ్.

మరుక్షణంలో అమరూ నిశ్శబ్దంగా రెడ్డివైపు చూడసాగారు. రెడ్డి కర్నాటకకు చెందిన న్యూస్ పేపర్ ని మడత విప్పి అందరూ చూసేట్టుగా పట్టుకున్నాడు. మరుక్షణంలో కరతాళధ్వనులు మిన్నుముట్టినయి. కొంతమంది ఆడాళ్ళు కన్నీళ్ళు వత్తుకున్నారు. "ఎంతకాలమయిందో నమ్మా అసలయిన న్యూస్ పేపర్ ని చూసి" అంది సావిత్రమ్మగారు.

రంగారెడ్డి పతాక శీర్షిక బిగ్గరగా చదవసాగాడు. ఒక్కొక్క వాక్యం చదువుతున్న కొద్దీ తప్పట్లు ఈలలు మార్మోగిపోసాగాయి. ఈ హడావుడిలో పోలీసులు ఎప్పుడువచ్చి మమ్మల్ని చుట్టుముట్టిందీ మాకు తెలీలేదు.

"ఎక్కడి వాళ్ళక్కడే ఉండండి! లేపోతే కాల్చిపారేస్తాం!" అన్నకేక వినిపించాకగానీ మేము స్పృహలోకి రాలేదు. చుట్టూ తుపాకులు పట్టుకుని పోలీసులు నిలబడి ఉన్నారు. పోలీస్ అధికారి ఒకరు స్టేజిమీదకొచ్చి రంగారెడ్డి చేతిలోని కర్నాటక రాష్ట్రం పేపర్ లాక్కున్నాడు.

"అభ్యంతరకరమయిన రాతలతో నిండి ఉన్న ఈ పేపర్ కొన్నందుకూ, దీనిని చదివినందుకూ, చదువుతూండగా విన్నందుకూ మీ కాలనీలో అందరినీ అరెస్ట్ చేస్తున్నాం-" అన్నాడు గంభీరంగా. కొద్ది క్షణాలు భయంకరమయిన నిశ్శబ్దం తాండవించింది ఆ ప్రాంతమంతా!

హఠాత్తుగా పెద్దా పిల్లా - అందరూ ఒక్కసారి వేదికమీదకు ఎగబడి ఆ న్యూస్ పేపర్ని ముక్కలు ముక్కలుగా చింపి అందరూ తలో నాలుగు ముక్కలూ మింగేశారు. పోలీసులు షాకయ్యారు. న్యూస్ పేపర్ ముక్కలు మింగి బ్రేవ్ మని తేన్చాక రంగారెడ్డి పోలీసధికారి వేపు చూశాడు.

"ఏ న్యూస్ పేపర్ గురించీ మీరు మాట్లాడుతోంది?" అడిగాడతను.

* * * * *

## పబ్లిషర్ గారొస్తున్నారు

"నిజం చెప్తున్నాను. జీడిపప్పు ఉప్మా పెట్టాడని కాదు. అతని కథలు ఇప్పుడు అనేక పత్రికల్లో వస్తోన్న అనేక కథలకంటే ఎంతో బావున్నయ్."

నెలరోజులపాటు ఈ కథలను వివిధ పత్రికలకూ పంపటం, అవి తిరిగి రావటంలాంటి ప్రక్రియలు జరిగాయ్. ఆ తరువాత అసలు తిరిగి రావడం మానేశాయి.

తరువాత కొద్దిరోజులకు ఓ కథ ఓ వారపత్రికలో పడిందంటూ ఆ పత్రిక కాపీలు ఓ వంద తెచ్చి కాలనీలో అందరికీ తలోటీ పంచసాగాడు చంద్రకాంత్.

"ఇన్ని కాపీలెందుక్కొన్నావ్? రెండు కాపీలు కొంటే కాలనీ వాళ్ళందరం ఒకరి తర్వాత ఒకరు చదువుకునేవాళ్ళంకదా?" అన్నాడు రంగారెడ్డి జాలిగా.

"అబ్బే- ఇవి కొన్నవికావు గురూజీ! ఈ పత్రికవాళ్ళు కథకు పారితోషికం ఇవ్వరు. ఆ సంచిక తాలూకూ వంద కాపీలు ఫ్రీగా ఇస్తారు. వాటిని మనమే ఎక్కడయినా అమ్ముకుని డబ్బు చేసుకోవాలన్నమాట! దయచేసి అందరూ ఇప్పుడు తలో మూడురూపాయలు ఇవ్వండి" అన్నాడు చంద్రకాంత్.

మాకతనిని చూస్తే జాలివేసింది.

ప్రతిఫలం బదులు ఆ పత్రిక కాపీలు ఇచ్చి వాళ్ళు మాకందరికీ తలో రెండ్రూపాయలు ఫైన్ వేస్తున్నట్లనిపించింది.

"అలాంటి చెత్త పత్రికలకు కథలు పంపకు! పెద్ద పత్రికలయితే ప్రతిఫలం కరెక్ట్ గా ఇస్తారు-" అన్నాడు రంగారెడ్డి.

"కానీ పెద్ద పత్రికలు రికమండేషన్ లేనిదే కథలు వేసుకోరుకదా?" అన్నాడు చంద్రకాంత్ విచారంగా.

"తెలుగురాత" వారపత్రిక ఎడిటర్ తో నాకు పరిచయముంది. అతని దగ్గరకు వెళ్దాం సాయంత్రం" అన్నాడు గోపాల్రావ్.

"మరా సంగతి ఎప్పుడూ చెప్పలేదే బాస్! అనవసరంగా కథలన్నీ అలా ఉండి పోయాయ్-"

"మొన్నేగా అతనికీ నాకూ పరిచయమయింది!"

"ఎలా పరిచయమయింది?"

"లకడీకపూర్ ట్రాఫిక్ జామ్ లో ఇద్దరి స్కూటర్లూ పక్క పక్కనే రెండు గంటలు నిలబడ్డాయ్ కదా! అప్పుడు పరిచయమయింది"

"పడ్డినట్లుంది. ట్రాఫిక్ జామ్ పరిచయాలు రికమండేషన్ చేసేంత గట్టిగా ఉంటాయా?" అడిగాడు రంగారెడ్డి.

ఆ మాట వింటూనే శాయిరామ్ రక్కున అందుకున్నాడు.

"అలా అనకు గురూ! మన కాలనీ సంధ్యారాణి లవ్ మారేజ్ ట్రాఫిక్ జామ్ లోనే కదా జరిగింది? అప్పుడే మర్చిపోయావా"

అందరికీ వెంటనే ఈ విషయం గుర్తుకొచ్చేసింది. వెంటనే అందరం కలసి తెలుగురాత వార పత్రిక ఎడిటర్ని కలుసుకోటానికి బయల్దేరాము. గోపాల్రావ్ పేరు చెప్పగానే లోపలకు ఆహ్వానం వచ్చింది.

"హలో గోపాల్రావ్ గారూ! ఏమిటి విశేషాలు? మళ్ళీ ఫ్రెష్ గా ఎక్కడయినా ట్రాఫిక్ జామ్ లోకెళ్ళారా?" అడిగాడాయన ఆప్యాయంగా.

గోపాల్రావ్ గర్వంగా మావేపు చూసి కాలర్ ఎగరవేశాడు.

"అంత పెద్ద ట్రాఫిక్ జామ్స్ జోలికి వెళ్ళటం లేదండీ ఈ మధ్య. చిన్న చిన్న వాటినే ఎన్నుకుంటున్నాను. చిన్నవయితే పోలీసులుండరు కాబట్టి త్వరగా క్లియరయిపోతాయ్"

"ఇంతకూ మీరొచ్చిన పనేమిటి?" గోపాల్రావ్ ని అడిగాడతను.

"మరేంలేదు. మా కాలనీ రైటర్ చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ గురించి మీకు తెలిసే ఉంటుంది. చాలా ఫేమస్ రైటర్-"

"అతని పేరు నేనెప్పుడూ విన్న గుర్తులేదే" అన్నాడతను ఆలోచిస్తూ.

"వినుండక పోవచ్చులెండి! ఎందుకంటే అతను మా కాలనీలోనే చాలా ఫేమస్ రచయిత. బయట కాదు"

"అదీ సంగతి! అలా చెప్పండి..."

"ఇప్పుడతను ఏ- ఒన్ రచయిత అవాలని కంకణం కట్టుకున్నాడు-"

"కంకణం బంగారందేనా?" అడిగాడు ఎడిటరు.

"అవునండీ ప్యూర్ గోల్డ్ వాళ్ళ ముత్తాతలది-"

"అయితే ఇంకేం! అందులో సగం నాకిమ్మనండి! వచ్చేవారం నుంచీ అతని నవల స్టార్ట్ చేసేద్దాం-"

చంద్రకాంత్ స్పృహ తప్పబోయి అతి కష్టంమీద ఆగాడు.

"ఆ, నవలా?"

"అవును-"

"మరి నేనింతవరకూ నవల రాయలేదు కదా?"

"రచయితలు కాని వాళ్ళను రచయితలను చేయటమే మా పత్రిక గొప్పతనం."

"నిజమేననుకోండి! అయినా నవల రాయలేదు కదా?"

"కథ నేన్చెప్తానయ్యా! వారం వారం నువ్ రాసివ్వటమే-"

"ఆ? నిజంగానా సార్! అయితే బంగారు కంకణంలో సగం మీకు తప్పక ఇచ్చేస్తాన్సార్!"

"అక్కడితో అవలేదు. ఆ నవలమీద నీకొచ్చే డబ్బులో మూడొంతులు నాది, ఒకవంతు నీది."

"అదేమిటి సార్? ఫిఫ్టీ ఫిఫ్టీ అని విన్నానే-"

"అది సంవత్సరం క్రితం సంగతి- ఇప్పుడు ధరలు పెరగలా? అంచేత సెవెంటీఫైవ్- ట్వంటీఫైవ్-"

"అలాగేనండీ-"

"అయితే రేపు మధ్యాహ్నం వచ్చెయ్. హోటల్ చిమోక్ లో లంచ్ కొడుతూ మొదటి రెండు వారాలకూ ప్లాట్ చెప్తాను. అన్నట్లు లంచ్ బిల్ నువ్వే ఇవ్వాలి."

"అదేంటండీ- అదికూడా సెవెంటీఫైవ్, ట్వంటీఫైవ్ కాదాండీ-"

"కాదు-"

"పోనీ ప్లాటంతా రేపే చెప్పేస్తే మళ్ళీ మళ్ళీ చిమోకా' బిల్ ఇచ్చే బర్డెన్ తగ్గిపోతుంది కదండీ నాకు-"

"అమ్మో! ఆశే పాపం! ఒక ప్రముఖ రచయిత- పేరెందుకులే- ఇలాగే మొత్తం ప్లాటంతా ఒక సిటింగ్ లో చెప్పించుకుని ఆ నవల టైటిల్ తో సహా వేరే పత్రికలో రాసేశాడు. దగుల్బాజీ-"

"కానీ నేనలాంటి వాడిని కాదండీ-"

"అవునండీ! వీడలాంటివాడు కాదు! చాలా జెంటిల్మెన్" తనూ సర్టిఫై చేస్తాడు శాయిరామ్.

"రచయితల్లో జెంటిల్మెన్ ఉంటారంటే నేన్నమ్మను" దృఢంగా అన్నాడతను.

"వీడు మాత్రం ఎంచేతో జెంటిల్మెనేనండీ? నేను గారంటీ ఇస్తాను" అన్నాడు గోపాల్రావ్.

ఎడిటర్ గారు కాసేపు ఆలోచించారు.

"ఆల్ రైట్! మీరంతా అంతగా చెప్తున్నారు కనుక ఓకే! ఆరువారాల వరకూ కథ చెప్తాను"

"బాబ్బాబు- ఎనిమిది వారాలు చేసుకోండి- వాడు ఆర్థికంగా కొంచెం వీక్ గా ఉన్నాడు."

"కుదరదయ్యా! తరువాత ఏం జరుగుతుందో నాకు మాత్రం ఎలా తెలుస్తుంది."

"పోనీ ఆ ఒరిజినల్ నవలేంటో చెప్పండి. మా వాడు కొని చదువుతాడు"

"ఇంకా అది రిలీజ్ కాలేదయ్యా! అమెరికాలో రెండు నెలల క్రితమే ఓ రచయిత రాయటం మొదలు పెట్టాడు. ఏ రోజు రాసిన మేటర్ ఆరోజు మా డెయిలీ ప్రింటర్ ద్వారా ఆ రచయిత స్లెనో గ్రాఫర్ మాకు రహస్యంగా పంపిస్తుంటాడు. ఈ సంగతెవరికీ చెప్పకండి మళ్ళీ- చెప్పాను కదా! రచయితలంతా దగుల్బాజీలు- ఒకసారేం జరిగిందో తెలుసా? ఒక రచయిత పేరెందుకులెండి- నేను ఫ్రాన్స్ నుంచి ఇంపోర్టు చేసుకున్న నవల టైటిల్ కాపీ కొట్టేశాడు."

"చాలా దారుణమండీ-"

"దారుణంన్నర! అందుకే వాళ్ళంటే నాకు మంట! అందుకే మా పిల్లలను స్కూల్ కి తీసుకెళ్ళే మా రిక్షావాడితో రాయిస్తున్నాను నెక్ట్స్ సీరియల్! మీకు తెలుసో తెలీదో రిక్షా వాళ్ళు చాలా విశ్వాసంగా ఉంటారు- రచయితకన్నా-"

"అవునండీ-"

"ఇంతకూ ఇప్పుడు మీ రచయితకు రిక్షా తొక్కడం వచ్చా?"

"రాదండీ-"

"అయితే నేర్చుకోమను! రిక్షా వారంరోజులు తొక్కితేచాలు. విశ్వాసం అలవడుతుంది."

అఖ్ఖరలేదండీ! వీడు స్వతహాగానే జెంటిల్మెన్ - వాళ్ళ ఫామిలీలో చెడబుట్టాడని వాళ్ళ ఫాదర్ ఇప్పటికీ తిడుతుంటాడు-"

"అలాగా..."

"అవునండీ! వీళ్ళ ఫాదర్ పరమరోగ్- మీకు తెలుసో తెలీదో! మా కాలనీ గవర్నమెంట్ క్వార్టర్స్ అని అందరికీ తెలిసినా పదకొండు మందిని మోసం చేసి అమ్మేశాడు ఇంతవరకూ-"

"దగుల్బాజీ! ఏం చేస్తుంటాడతను?"

"ఎడిటరండీ!"

"సరే మీరు వెళ్ళండి!రేపు మధ్యాహ్నం హోటల్ 'చిమోకా' లో ఎదురు చూస్తుంటాను. సరేనా?"

"సరేనండీ.."

అందరం బయటికొచ్చేశాం.

"గురూ! ఈ హోటల్ బోల్లులు ఇవ్వటం నా వల్లకాదు గురూ! నేను రచయిత అవకపోయినా ఫర్వాలేదు-"

అందరికీ అతనిమీద జాలివేసింది.

"పోనీ మన కాలనీ ఫండ్స్ ఉన్నాయి కదా! అందులో నుంచి అయిదువేలు వీడికిచ్చేద్దాం" అన్నాడు జనార్ధన్.

అందరం చకచక ఆలోచించాం.

"పోనీలే ఇచ్చేద్దాం" అన్నాడు రంగారెడ్డి, శాయిరామ్, గోపాల్రావ్ యాదగిరి కూడా వప్పుకున్నారు. "సాంస్కృతిక కార్యకలాపాలకు ఖర్చు చేశామంటే ఎవ్వరూ కాదనరు" అన్నాడు గోపాల్రావ్.

"కాకపోతే నాకూ ఓ పాతికవేలు ఇవ్వాల్సి ఉంటుంది" అన్నాడు జనార్ధన్.

"అదేంటి? నీకెందుకు?"

"నేను హీరోగా ఓ టీవీ ప్రోగ్రామ్ తీసి మన దూరదర్శన్ ద్వారా టెలికాస్ట్ చేయిస్తాను. అదికూడా సాంస్కృతిక కార్యకలాపమే కదా-"

దాంతో ఆటోమేటిగ్గా చంద్రకాంత్ కి డబ్బిచ్చే ప్రపోజల్ రద్దయిపోయింది.

"ఇగో చంద్రకాంత్ భాయ్! ఆంధ్రఖ్యాతి వారపత్రిక లేదా? అందులో మా చిన్నమ్మ కొడుకు వాచ్ మెన్ గా చేస్తుండు. ఆడి రికమండేషన్ నడుస్తదేమో అడుగుదాం- పదండ్రి" అన్నాడు యాదగిరి.

అందరం మళ్ళీ స్కూటర్ల మీద ఆంధ్రఖ్యాతి వార పత్రికాఫీస్ చేరుకున్నాం.

యాదగిరి చిన్నమ్మ కొడుకు శ్రీనివాస్ గేటు దగ్గరే కనిపించాడు. మా సంగతంతా విన్నాక శ్రీనివాస్ కాసేపు ఆలోచించాడు.

"ఇగో- ఒకపని చేయండి! మా ఎడిటర్ సాబ్ వాళ్ళ పోరడికి పోలీస్ డిపార్ట్ మెంట్ లో ఇన్ స్పెక్టర్ ఇంటర్ వ్యూ వచ్చింది. ఆ డిపార్ట్ మెంట్ ల కోషిష్ జేసి ఆ పోరడికి మీరుద్యోగం ఇప్పిస్తే మీ నవలలు, కతలు అన్నీ పబ్లిష్ జేస్తడు-"

అందరం మొఖమొఖాలు చూసుకున్నాం.

"ఆ గుర్తుకొచ్చింది. పోలీస్ డిపార్ట్ మెంట్ లో ఒక ఎస్పీగారు నాకు తెలుసు?" అన్నాడు రంగారెడ్డి.

అందరం రంగారెడ్డి వేపు ఆశ్చర్యంగా చూశాం.

"ఆ విషయం మరి మనల్ని పోలీసు అరెస్ట్ చేసి లాకప్ లో పడేసినప్పుడు చెప్పలేదేం?" కోపంగా అడిగాడు శాయిరామ్.

"ఎలా చెప్తాను. మనల్ని అరెస్ట్ చేయించిందసలు ఆయనేకదా" నసిగాడు రంగారెడ్డి.

"ఏడ్చినట్లుంది" అన్నాడు గోపాల్రావ్.

అందరం నిరాశగా కూలబడ్డాం. మరో రెండు పత్రికలు చుట్టుముట్టాక చంద్రకాంత్ నవల సీరియల్ గా రావటం అసాధ్యమని మాకర్థమయిపోయింది.

అందరం ఆ రోజు కూర్చుని చంద్రకాంత్ ని ఓదారుస్తూంటే చంద్రకాంత్ కోపంగా, విచారంగా, పచార్లు చేయసాగాడు.

"అయితే నేను నవలా రచయితగా కావటం కుదరదన్నమాట" అన్నాడతను ఆవేశంగా.

"ఇంచుమించుగా కుదరనట్లే" వప్పుకున్నాడు శాయిరామ్.

చంద్రకాంత్ కి కోపం ఆగలేదు. "నా ప్రతిభ తెలుగువాళ్ళు గుర్తించరన్నమాట! హు! తెలుగువాళ్ళు! ఆల్ రైట్. సరే! అయితే నేను టీవీకి రాస్తాను. మీ అందరిమీదా నా పగ తీర్చుకుంటాను" అన్నాడు ఉగ్రుడవుతూ.

ఆ మాట వింటూనే ఉలిక్కిపడ్డాం.

మా కాలనీ ప్రశాంతతకు పెట్టింది పేరు. గూండాలు చేసే వినాయక చవితి లాంటి పండుగలు, ఇతర కొట్లాటలు మా కాలనీలో లేవు. అదొక్కటే మా అందరికీ ఆనందకరమయిన విషయం. అలాంటిది ఇప్పుడు చంద్రకాంత్ టీవీకి రాయటం మొదలుపెడితే ఎలాంటి కొట్లాటలు జరుగుతాయో, ఎలా అనేకమంది రాజధాని వాసులు మా కాలనీ మీదకు దండెత్తుతారో మాకు క్షుణ్ణంగా తెలుసు. ఎందుకో పరమ భయంకరంగా నటిస్తున్న ఒక టీవీ హీరో ఇంటికి మా ఆఫీసు వాళ్ళందరం వెళ్ళి వాడిని చావగొట్టి ఇల్లంతా ధ్వంసం చేసివచ్చాం ఓసారి.

"బాబ్బాబు! అంతపని చేయకు. ఎలాగోలా నువ్ నవలారచయిత అయ్యేట్లు మేము చూస్తాం కదా!" అంటూ సర్దిచెప్పాడు రంగారెడ్డి.

"ఎప్పటికి జరిగేనా పని?" అనుమానంగా అడిగాడు.

"మాకు రెండు రోజులు టైమివ్వు. మా బ్రెయిన్ ఉపయోగించి ఏదొక ఉపాయం కనుక్కుంటాం."

"సరే! రెండ్రోజులు దాటిందంటే మాత్రం మర్యాదగా ఉండదు గుర్తుంచుకోండి. ఆ తరువాత టీవీకి రాస్తాను- అందులో హీరో వేషం కూడా వేసేస్తా." అనేసి బెదిరించి వెళ్ళిపోయాడతను.

అతను వెళ్ళగానే మేము మామూలుగా ఆ విషయం మర్చిపోయి రెండ్రోజులు హాపీగా గడిపేశాం. ఆరోజు బాగా పొద్దుపోయాక యాదగిరి గట్టిగా కేకలు పెడుతూ ఇంట్లోనుంచి కాలనీ మధ్యనున్న వేదిక దగ్గరకు పరుగుతో వచ్చాడు. అతని కెప్పుడయినా అద్భుతమయిన ఆలోచనలు వచ్చినప్పుడు అలా కేకలుపెడుతూ పరుగెత్తుకు వస్తాడని మాకు తెలుసు గనుక అందరం అతని చుట్టూ మూగాం.

"మన చంద్రకాంత్ తంబి నవల మాగజైన్ల వేయకున్నగాని నడుస్తది!" అన్నాడతను ఎగ్జయిట్ మెంట్ తో.

"మరెలా నవలా రచయితవుతాడు?" అడిగాడు శాయిరామ్ ఆశ్చర్యంగా.

"పబ్లిషర్ తానకుపోయి మనమే పబ్లిష్ చేయిద్దాం. పేరుకు పేరూ వస్తది- పైసల్ కి పైసల్ వస్తయి- ఎట్లున్నది మన అయిడియా?"

"వండర్ ఫుల్ అయిడియా" అన్నాడు చంద్రకాంత్ సంతోషంతో.

మిగతా వాళ్ళందరం కూడా ఆ ఉపాయం చాలా బాగుందని యాదగిరిని అభినందించాం.

"అయితే మనం వెంటనే విజయవాడ వెళ్ళాలి-" అన్నాడు చంద్రకాంత్ ఉత్సాహంగా. ఆ మాటతో అందరం అదిరిపడ్డాం.

"విజయవాడెందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారెడ్డి.

"ఎందుకేమిటి?" పబ్లిషర్లంతా అక్కడే ఉంటారు. కొంచెం స్టఫ్ ఉన్న నాలాంటి రచయిత ఎవరయినా కనబడితే చాలు! మాకివ్వమంటే మాకివ్వమని కలబడి నవల ప్రతిని లాక్కుపోతారట-"

"అయితే నువ్వే వెళ్ళిరా మేమంతా ఎందుకు?" అన్నాడు శాయిరామ్ అయిష్టంగా.

"మీరు లేకపోతే ఎలా? నవల పబ్లిషింగ్ అంటే మాటలా? వేలకి వేలు బిజినెస్! నన్నెవరయినా ఎక్స్ ప్లాయిట్ చేస్తారేమోనని భయంగా ఉంది. ఈ పబ్లిషర్స్ ని నమ్మటానికి వీల్లేదని, వాళ్ళు తెగ మోసం చేస్తారనీ మా ఫ్రెండ్ వంచకరావ్ చెప్పాడు"

"అతనికేం మోసం చేసారుట?" కుతూహలంగా అడిగాడు రంగారెడ్డి.

"వాడి నవల పబ్లిష్ చేస్తానని మాటిచ్చి తరువాత దేశం వదిలి పారిపోయాడట!"

"ఇంతకూ విజయవాడ వెళ్ళానికి ఇంతమందికి డబ్బెక్కడుంది?" అడిగాడు గోపాల్రావ్.

"దాన్దేముంది గురూ. మన కాలనీ కల్చురల్ ఫండ్స్ ఉన్నాయ్ కదా! ఇదీ కల్చురల్ యాక్టివిటీయే కాబట్టి అందులో నుంచి కొంతమొత్తం..." అంటూ నడిగాడతను.

ఇక తప్పేట్లు లేదని అందరం ఓ మూలకెళ్ళి చర్చించుకుని చివరకు చంద్రకాంత్ కోరిక తీర్చటానికే నిర్ణయించుకున్నాం.

మర్నాడు ఉదయానికల్లా అందరం విజయవాడ చేరుకున్నాం. హోటల్లో దిగి, స్నానం వగైరాలు ముగించుకుని పబ్లిషర్స్ వేటకు బయలుదేరాం. ముందస్తుగా మేము దిగిన హోటల్లోనే ఉన్న ఓ పుస్తకాలషాపు ఓనర్ని సంప్రదించాడు శాయిరామ్. అతనిచ్చిన వివరాలను బట్టి తేలిందేమిటంటే జగజ్జననీ పబ్లికేషన్స్ చాలా పేరున్న ప్రచురణ సంస్థ అని. వెంటనే ఆ అడ్రస్ కి చేరుకున్నాం. అప్పటికే ఆ సంస్థముందు అరకిలో మీటరు పొడుగు 'క్యూ' ఉంది.

"చూశారా! ఈ సంస్థ ప్రచురించిన పుస్తకాల కోసం పాఠకులు ఎలా 'క్యూ' గట్టి కొంటున్నారో-" గర్వంగా చూపించాడు శాయిరామ్.

"ఇలాంటి పెద్ద పబ్లిషర్ కే ఇచ్చేద్దాం! పాపం! ఇలాంటి వాళ్ళకు నా నవల్లాంటి మంచి క్వాలిటీ నవలలు ఇచ్చి ప్రోత్సాహపరచటం నాలాంటి రచయితల ధర్మం" అన్నాడు చంద్రకాంత్ జాలిగా.

"అవును- ఇచ్చేద్దాం" అన్నాడు రంగారెడ్డి కూడా.

అందరం ఆ క్యూని తప్పించుకుని ముందున్న పుస్తకాలషాపు దాటి వెనుక వేపున్న పెద్ద ఏసీ గదిలోకి అడుగుపెట్టాం. రివ్వాలింగ్ ఛైర్ లో కూర్చున్న లావుపాటి వ్యక్తి మమ్మల్ని చూడగానే గౌరవంగా లేచి నిలబడ్డాడు.

"రండి! కూర్చోండి! ఒరేయ్ రాజూ! అరడజను కూల్ డ్రింక్స్ చెప్పు"

అతని ట్రీట్ మెంట్ కి మాకు ఎక్కడలేని ఆనందం కలిగింది. అందరం కుర్చీల్లో కూర్చున్నాం.

"చెప్పండి సార్? ఏం పుస్తకాలు కొంటానికొచ్చారు?" ఆదరంగా అడిగాడతను.

"పుస్తకాలు కొంటానికి కాదండీ! నవలలివ్వటానికి వచ్చాము-" అన్నాడు శాయిరామ్.

అతని ముఖంలో హఠాత్తుగా మార్పువచ్చింది. అదివరకటి ఆదరణ, మృదుత్వం మాయమైనాయ్.

"నవలలా? ఏం నవలలూ?"

"ఇదిగో - ఇతను మా కాలనీ రైటర్ చంద్రకాంతండీ! మూడు నవలలు రాశాడు. ఇంకా పద్దెనిమిది నవలలకు ప్లాట్స్ ఉన్నాయ్ రడీగా!" ఆనందంగా చంద్రకాంత్ వేపు చూపించాడు రంగారెడ్డి.

"ఇప్పుడు పందొమ్మిదింటికి ప్లాట్స్ రడీగా ఉన్నాయ్- మా వాడు తప్పు చెప్పాడు" అన్నాడు చంద్రకాంత్.

"అయితే ఇక్కడికెందుకొచ్చారు?" కోపంగా అడిగాడతను. మాకు ఆశ్చర్యం కలిగింది.

"ఎందుకేమిటండీ? మాట్లాడ్డాని కొచ్చాము. మీకే ఆ నవలలు వేసే అవకాశం ఇవ్వాలని మా అభిప్రాయం-"

అతను కుర్చీలో నుంచి లేచి నిలబడ్డాడు.

"గెటౌట్" అన్నాడు కోపంగా.

"మమ్మల్నా మీరనేది!"

"అవును! బయటికెళ్ళి షాప్ ముందున్న 'క్యూ'లో నిలబడండి"

"అదేమిటండీ పాఠకుల 'క్యూ' లో మేమెందుకు నిలబడతాం?" అడిగాడు శాయిరామ్ కోపంగా.

"అది పాఠకుల 'క్యూ' కాదయ్యా! రచయితల 'క్యూ'! వాళ్ళందరూ నవలలు వేసుకోమని బ్రతిమిలాడడానికే వచ్చారు. వెళ్ళండెళ్ళండి! ఒరే రాజూ! ఆ కూల్ డ్రింక్స్ కాన్సిల్ చెయ్-" మాకు తలకొట్టేసినట్లయింది.

రచయితలను అతనలా హీనంగా చూడటం మాకు నచ్చలేదు. సరిగ్గా అప్పుడే 'క్యూ'లో ఉన్న ఓ వ్యక్తి లోపలికొచ్చాడు. అతని చేతిలోని వ్రాత ప్రతిని వినయంగా పబ్లిషర్ ముందుంచాడు.

"సబ్జెక్ట్ ఏమిటో రెండు ముక్కల్లో చెప్పు" చిరాగ్గా అన్నాడు పబ్లిషర్.

"ఇది సోషియో డిటెక్టివ్ నవలండీ ఇందులో హీరోయిన్ కి ఓ జబ్బు ఉంటుందండీ- అదేమిటంటే అస్సలు నిద్రపట్టదండీ ఆమెకు. హీరో దాని విషయం పరిశోధించుకుంటూ వెళ్తే చివరకు ఓ మర్డర్ కేసులో ఇరుక్కుపోతాడండీ. అక్కడినుంచీ హత్యలూ, శవాలూ, పోలీసులూ-"

"సరే రెండొందలిస్తాను-"

రచయిత ఆనందంగా చూశాడు.

"సరే- అలాగే ఇవ్వండి-"

పబ్లిషర్ రెండొందలిచ్చి ఓ కాగితం మీద సంతకం పెట్టించుకున్నాడు. మేమింక భరించలేక బయటికొచ్చేశాం.

"మరీ ఇంత దారుణంగా ఉందా రచయితల పరిస్థితి! హు!" అన్నాడు శాయిరామ్.

"కానీ మరి యండమూరి వీరేంద్రనాథ్ ఇంటికెళ్ళినప్పుడు చాలా మంది పబ్లిషర్లు 'క్యూ' కట్టి ఉండటం చూశానే" విచారంగా అన్నాడు చంద్రకాంత్.

అందరం ఆ రోడ్ మీదే ఉన్న ఎనిమిది కొండలు పబ్లికేషన్స్ ఆఫీస్ లోకి నడిచాం. లోపల ఓ యువకుడు కూర్చుని ఉన్నాడు.

"ఏం కావాలాస్సార్?" అడిగాడు వినయంగా.

సంగతంతా చెప్పాడు శాయిరామ్.

"ఓ! తప్పకుండా పబ్లిష్ చేద్దాం సార్. మొత్తం ఇరవై రెండు నవలలూ నేనే పబ్లిష్ చేస్తాన్సార్!" అన్నాడతను.

చంద్రకాంత్ ఆనందంతో పొంగిపోయాడు.

"థాంక్యూ- థాంక్యూ వెరీమచ్! వాటన్నిటినీ పాఠకులు 'క్యూ' కట్టి కొనుక్కుంటారని నాకు నమ్మకం ఉంది-" అన్నాడు గర్వంగా.

"అబ్బే- అలా ఎవరూ కొనరులెండి! బలవంతంగా అంటగట్టేయటమే."

"అంటే?"

అంటే ఏముందండీ! మా చిన్నాన్న కొడుకు సబిన్ స్పెక్టర్ కదండీ! చిన్న చిన్న దొంగతనాలు చేసినవాళ్ళనూ ట్రాఫిక్ రూల్స్ పాటించనివాళ్ళనూ, పోట్లాటలు దొమ్మీ కేసులు, ఇలా ఎంతోమందిని స్టేషన్ కి లాక్కొస్తారు కదండీ! వాళ్ళందరితో పాతిక్కాపీలు చొప్పున మా నవలలు కొనిపిస్తారండీ! అలాగే సేల్స్ టాక్స్ లో మా బామ్మర్ది పనిచేస్తున్నాడు. మా నవలల సెట్ రిలీజవగానే అన్ని షాపులమీద రైడింగ్ చేసి వెయ్యి కాపీలు కొనిపిస్తాడు. ఇంకా మా ఫ్రెండ్ ఒకతనున్నాడు. అతనో వెయ్యి కాపీలమ్మేస్తాడు-"

"అతనేం చేస్తూంటాడు?" అడిగాడు రంగారెడ్డి కుతూహలంగా.

"గవర్నమెంట్ హాస్పిటల్లో డాక్టర్. ఆపరేషన్ రోజున ఎంత చెత్త నవలయినాసరే అయిదువేల కాపీలు అమ్మేస్తాడు- పేషెంట్స్ కి."

"అయితే సరే! మరి రాయల్టీ విషయం చెప్తారా?" అడిగాడు శాయిరామ్.

"ఇందులో చెప్పేదేముందండీ! పదిశాతం! ఫిక్స్ డ్ రేటే అది."

అందరం ఆశ్చర్యపోయాం.

ఒక్కొక్క పుస్తకానికి పదిశాతం చొప్పున రాయల్టీ లభిస్తే ఇరవై పుస్తకాలకూ చంద్రకాంత్ కి సుమారు యాభయ్ వేల రూపాయలు వస్తాయనే సరికి మాకు చంద్రకాంత్ మీద కొంచెం ఈర్ష్య కూడా కలిగింది.

"సరే- మరి కాంట్రాక్ట్ మీద సంతకాలు పెడదామా? అడిగాడు చంద్రకాంత్

"ఎడ్వాన్స్ ఇస్తే పెట్టేద్దాం" అన్నాడతను.

మాకు అతని మాటలు అర్థం కాలేదు.

"అడ్వాన్స్ ఇస్తానంటారా? ఇవ్వండి- మాకేం అభ్యంతరం లేదు" అన్నాడు రంగారెడ్డి.

"అలా జోక్ లేయకండిసార్! అడ్వాన్స్ నేనివ్వటమేమిటి?"

"అంటే?" అనుమానంగా అడిగాడు శాయిరామ్.

"ఓ పదివేలయినా ఎడ్వాన్స్ కొట్టండి-"

"మేమియ్యాలా??" నమ్మలేనట్లు అడిగాడు చంద్రకాంత్.

"అవునూ! కొత్తగా అడుగుతున్నారేమిటి? మా సంస్థలో బిజినెస్ ఎప్పుడూ ఇలాగే ఉంటుంది"

"అదేమిటండీ! రచయితే ఎదురు డబ్బివ్వటమేమిటి? పత్రికల్లోనేగా ఇలాంటి పద్ధతి ఉన్నది"

"ఇదిగో! చూడండి! మీకిష్టమయితే డబ్బు కట్టండి- లేపోతే లేదు. అంతేకానీ ఊరికే నస పెట్టకండి- మాకు ఫిఫ్టీన్ పర్సెంటిచ్చి నవలలు పబ్లిష్ చేయించుకునే వాళ్ళున్నారు-"

మేము మాట్లాడకుండా బయటికొచ్చాం.

అందరూ దిగాలుపడి ఏలూర్ రోడ్ మీద నడుస్తోంటే 'హలో గోపాల్రావ్' అన్న కేక వినిపించింది. మరుక్షణం అవతలి వేపు ఫుట్ పాత్ మీద నుంచీ ఒక్క గెంతు గెంతి మాదగ్గర కొచ్చాడు మీసాల్రావ్. అతనిని చూస్తూనే గుర్తుపట్టేశాము. అతనో ప్రముఖ రచయిత.

"ఏమిటి గురూ సంగతి? ఎప్పుడొచ్చావ్ విజయవాడకి" అడిగాడతను ఆప్యాయంగా. ఇద్దరూ అయిదు నిమిషాల సేపు సంభాషణల్లో మునిగిపోయారు.

"ఇప్పుడో సమస్య వచ్చింది గురూ! మా కాలనీలో రచయిత ఒకడు తన రచనలు ప్రజల మీదకు వదిలే అవకాశాలు దొరక్క చాలా ఇబ్బంది పడిపోతున్నాడు. ఇటు పబ్లిషర్ లేమో వద్దు పొమ్మంటున్నారు-" అతనితో చెప్పాడు గోపాల్రావ్.

అతను పగలబడి నవ్వాడు.

"పిచ్చివాళ్ళల్లారా! రచయిత ఎప్పుడూ డైరెక్ట్ గా పబ్లిషర్ దగ్గర కొచ్చేకూడదు- ముందు మనని మనం పాపులర్ చేసుకోవాలి!"

"పాపులర్ ఎలా చేసుకోవటం?" ఆశగా అడిగాడు చంద్రకాంత్.

"నేను అవలంభించిన పద్ధతి ఫాలో అవటమే-"

"అంటే మీరేం చేశారు?"

"ఒక డినపత్రిక ఎడిటర్ కి అయిదువేలు లంచం కొట్టాను. అంతే! అంతే! డెయిలీ సీరియల్ స్టార్టయిపోయింది. ఆ సీరియల్ అద్భుతంగా ఉందని నేనే దొంగ పేర్లతో వుత్తరాలు రాసి అయిదారు ఊళ్ళనుంచి పోస్ట్ చేశాను. ఆ తరువాత ఆ సీరియల్ వల్ల మోడువారిన తమ జీవితాలు చిగురించాయని కొంతమందితోనూ, కేవలం నా సీరియల్ వల్లే తమ సంసారాలు కుదుటపడ్డాయని మరికొంతమంది స్త్రీల పేర్లతోనూ ఫోటో వుత్తరాలు రాయించాను. ఆ తరువాత ఈ యుగంలోని ఏకైక మేటి రచయిత అన్న బిరుదు ఆ ఎడిటర్ కి మరో రెండువేలు లంచం కొట్టి వేయించాను. ఆ సీరియల్ వల్ల ఆ డెయిలీ సర్క్యులేషన్ రెట్టింపు అయినట్లు కరపత్రాలు ప్రచురించి అన్ని రోడ్లు మీద పంచిపెట్టాను. అంతే! అక్కడి నుంచి పబ్లిషర్స్ రావటం ప్రారంభమయింది. వారం రోజుల్లో ఇంటిముందు క్యూ- ఒకరికి తెలీకుండా ఒకరికి బేరం పెట్టేశాను. పబ్లిషర్స్ ఇస్తానన్నది రెండువేలే. అయినా అరవై వేలకు అమ్ముడయినట్లు మిగతావారందరికీ చెప్పేశాను. ఒప్పందం మేరకు ఆ పబ్లిషర్ కూడా అదే అబద్ధం బెజవాడంతా ప్రచారం చేసేశాడు. నవల పబ్లిషయాక స్కీమ్ నెంబర్- 2 స్టార్ట్ చేయాలి-"

"స్కీమ్ నెంబర్-2 అంటే ఏమిటి?" అడిగాడు రంగారెడ్డి.

"పబ్లిసిటీ! ప్రచురించకముందే పదివేల కాపీలు అమ్ముడయి రికార్డు స్థాపించిన ప్రప్రథమ భారతీయ నవల" అని వేసేయాలి అన్ని పత్రికల్లోనూ. మన ఫోటోని మనమే డబ్బు ఖర్చుపెట్టి అన్ని పత్రికల్లోనూ ప్రకటన రూపంలో గుప్పించేయాలి. అంతే! అక్కడితో డిమాండ్ పెరిగిపోతుంది. "నవలకు పదివేలిస్తాం" అంటూ వస్తారు పబ్లిషర్స్. వాళ్ళందరికీ ఘోస్ట్ రైటర్స్ ని పెట్టి నవలలు రాయించి వదలకుండా సరఫరా చేస్తూండాలి."

"ఘోస్ట్ రైటర్స్ ఎవరు?"

"హైదరాబాద్ లో చాలామంది ఉన్నారు- పేజీకి అర్థరూపాయి ఇస్తే- ఇంగ్లీష్ నవలలన్నీ అనువాదం చేసి ఇచ్చేస్తూంటారు వాళ్ళు - సరే- మీరెలాగూ ఇంత దూరం వచ్చారు కాబట్టి ఈ సందు చివర్లో 'జగజ్జెట్టీ పబ్లిషర్స్' అని ఒకతను ఉన్నాడు. అతని దగ్గరకెళ్ళి ఓసారి ప్రయత్నించి చూడండి. మొన్నే అయిదోక్లాస్ చదువుతున్న వాళ్ళమ్మాయితో ఓ నవల రాయించి రెండువేల కాపీలు అమ్మేశాడు."

అందరం అదిరిపడ్డాం.

"అయిదో క్లాస్ చదివే అమ్మాయితోనా?"

"అంతా వట్టిది. ఆ అమ్మాయి నిజానికి నాలుగోక్లాసే చదువుతోందిట! మాతో అయిదోక్లాసని అబద్ధం చెప్పాడు"

"అయినా రెండువేల కాపీలు అమ్ముడయ్యాయా?"

"అదీ యాభయ్ రూపాయలు ధరతో?"

"ఓ గాడ్ యాభయ్ రూపాయలే?"

"అవును!"

"అంటే నాకింత అనుభవం ఉంది కాబట్టి నావి కనీసం అయిదు వేలు అమ్ముడవుతాయ్ కదూ" ఆనందంగా అడిగాడు చంద్రకాంత్.

"అవవ్! ఎవరివయినా ఎలాంటి చెత్తయినా, రెండువేల కాపీలే అమ్ముతాడు."

"ఎవరు కొంటారు?"

"మన గవర్నమెంట్!"

"గవర్నమెంట్ నవలలు కొంటుందా?" నమ్మలేనట్లు అడిగాడు శాయిరామ్.

"అవునయ్యా! జిల్లా గ్రంథాలయ సంస్థలద్వారా కొనిపిస్తుంది."

"అయితే! ఆ పబ్లిషర్ దగ్గరకే వెళ్దాం!" అన్నాడు రంగారెడ్డి ఉత్సాహంగా. గోపాల్రావ్ మీసాలవ్యక్తికి ధన్యవాదాలు చెప్పాక అందరం జగజ్జెట్టీ పబ్లిషర్ ఆఫీస్ కి చేరుకున్నాం. ఒకేసారి కేవలం ఇద్దరు వ్యక్తులే నిలబడటానికి సరిపోయేంత రూమది. రూమ్ లోనే దొంతర్లు దొంతర్లుగా పాకెట్లు పేర్చి ఉన్నాయి.

వాటి మీద అనేక జిల్లా గ్రంథాలయ సంస్థల అడ్రస్ లు రాసి ఉన్నాయ్. మిగతా పాకెట్ల మీద ఇంకుతో అడ్రస్ లు రాస్తోన్న ఓ సన్నటి వ్యక్తి మమ్మల్ని చూడగానే చిరునవ్వు నవ్వాడు.

"నవలలేమయినా అమ్మకానికి ఉన్నాయా?" ఆప్యాయంగా అడిగాడతను.

"అవును! ఇరవై ఉన్నాయ్" అన్నాడు చంద్రకాంత్ ఆత్రుతగా.

"ఒక్కో నవలా ఎంత బరువుంటుంది?" అడిగాడతను మళ్ళీ.

మాకు అతని ప్రశ్న అర్థం కాలేదు.

"బరువేమిటి?" అయోమయంగా అడిగాడు.

"తెలీదన్నమాట! ఫర్లేదు. ఆ వెయింగ్ మిషన్ లో వేయండి. ఒక్కొక్క నవల మూడుకిలోల బరువుండాలి. వుంటేగాని మనకు గిట్టుబాటు కాదు. గవర్నమెంట్ తో వ్యవహారం కదా! మూడు కిలోలుంటేగానీ వప్పుకోరు. ఒక్కోపుస్తకం నలభై రూపాయలు కనీసం ధర ఉండాలి."

"నలభై రూపాయలే?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారెడ్డి.

"తప్పదు. నలభై ఉంటేనేగాని వాటాలకు తెగదు-"

"వాటాలేమిటి?"

అతను మావేపు చిరాగ్గా చూశాడు.

"వాటాలంటే తెలీనివాడివి నువ్వేం రచయితవయ్యా! పుస్తకం నలభై రూపాయలుంటే సెక్రటరీలకు మనం పదహార్రూపాయలకే ఇచ్చేస్తాం! అర్థమయిందా?"

"ఎలా ఇస్తాం?"

"చేత్తో ఇస్తాం- లేకపోతే ఏమిటయ్యా? జిల్లా గ్రంథాలయ సంస్థల్లో పాపం మళ్ళీ ఎంతమంది పంచుకోవాలి? ఛైర్మెన్, సెక్రటరీ, ఒకోసారి కొంతమంది మెంబర్లు-నానా గొడవా ఉంది లెండి దీనికి- మీకర్థంకాదు."

"అయిందయింది" అన్నాడు శాయిరామ్.

"ఏమర్థం అయింది!"

"అదే! నలభై పుస్తకం పదహారుకిస్తే- నలభై మైనస్ పదహారు ఈజీకొల్టూ నూటపాతికా బై అయిదూ ఈజీకోల్టూ-"

"ష్! ఆపు అరిచాడతను.

మా కందరికీ అర్థమయిపోయింది. ఏ రచయిత ఏ చెత్త రాసినా లంచాలకు ఆశపడి లైబ్రరీవాళ్ళు పుస్తకాలు కొనటం వల్లే సాహిత్యం యింత దారుణంగా తయారవుతోందని-

ఎలాగూ అది దిగజారిపోయింది. మా చంద్రకాంత్ రచయిత అయి దానిని ఇంకొంచెం దిగాజారుస్తే మాత్రమేం అనిపించింది.

నేను ఆ ఒక్కనే ఉన్న తూకం మీద ఒక్కొక్క నవల తూచి చూశాను.

"వీటిల్లో రెండే నవలలు మూడు కిలోల బరువున్నాయండీ! ఒకటి మాత్రం కిలోన్నర ఉంది" అతనితో చెప్పాను.

"అది పనికిరాదు. దాన్ని అవతలపారేసి మిగతా రెండూ ఇటివ్వండి-" రెండూ అతనికిచ్చాన్నేను.

"మరి మిగతా నవలలేవీ? మొత్తం ఇరవై ఉన్నాయన్నారుగా!" అడిగాడతను.

"అవన్నీ ఓ పదిరోజుల్లో రాసిచ్చేస్తానండీ!" అన్నాడు చంద్రకాంత్. "ఖచ్చితంగా పది రోజుల్లో తెచ్చిచ్చిస్తేనే ప్రింట్ చేస్తాను. ఎందుకంటే ఈ నెలాఖరుకల్లా లైబ్రరీలకు వేసెయ్యాలి. లేకపోతే ఇంకో పబ్లిషర్ నవలు కొనేస్తారు లైబ్రరీవాళ్ళు. గవర్నమెంట్ సంగతి మీకు తెలీందేముంది? ఎదురుగ్గా ఎవరుంటే వాళ్ళదే పండగ-"

"అవునవును?" అన్నాడు రంగారెడ్డి.

"ఇకపోతే ఒకో నవలకూ రెండొందలిస్తాను. ఇష్టమేనా?"

"అదేమిటండీ? మరీ రెండొందలా! కనీసం అయిదు వందలయినా లేకపోతే ఎలా?" అడిగాడు జనార్ధన్.

"ఏమిటీ? అయిదొందలా? మీకేమయినా మతిపోయిందేమిటయ్యా? మీరేమయినా హోటల్ సర్వర్లా? అయిదువందలివ్వడానికి? లేకపోతే వార పత్రికల్లో ఎడిటర్లనుకున్నారా? వందరూపాయలిస్తే అరడజను నవలలు రాసిచ్చేవాళ్ళున్నారు. తెలుసా?" కోపంగా అడిగాడతను.

అప్పుడే చిరిగిపోయిన బట్టలతో బాగా మురికికొట్టుకుపోయి బిచ్చగాడులా ఉన్న ఓ వ్యక్తి గోనెసంచితో లోపలికొచ్చి ఆరు నవలలు కుమ్మరించాడు మాముందు.

"రాసుకొచ్చాన్సార్! వంద రూపాయలివ్వండి" అన్నాడు ఆత్రుతగా.

పబ్లిషర్ ఆ నవలలన్నిటినీ తూకంతో తూచాడు. అన్నీ మూడు కిలోల పైచిలుకే ఉన్నాయ్.

వెంటనే ఓ వందనోటు తీసి ఆ వ్యక్తి కిచ్చాడు. అతను సంతోషంగా వెళ్ళిపోయాడు.

"చూసారా! నవలలు దొరక్కకాదు. మీకు రెండొందలివ్వటం! ఈ నెలాఖరు లోపల ఎన్ని నవలలు వీలయితే అన్ని నవలలు గవర్నమెంట్ లైబ్రరీలకు అమ్మేయాలి. మళ్ళీ సంవత్సరం దాకా ఫండ్స్ ఉండవ్! అందుకే నాకు మార్జిన్ తక్కువయినా ఫర్లేదని మీకు రెండొందలివ్వటానికి వప్పుకుంటున్నాను- అర్థమయిందా?"

"అయింది!"

"అయితే- ఇదుగో ఈ వెయ్యి రూపాయలూ తీసుకోండి! ఇది ఇరవై నవలలకు ఎడ్వాన్స్!" చంద్రకాంత్ మారు మాట్లాడకుండా వణుకుతోన్న చేతుల్తో నోట్లు అందుకున్నాడు.

"ఇదుగో! మరీ పదిరోజులెందుకు? ఓ వారంలో మిగతావి రాసిచ్చేయలేరూ? మీ కాలనీలో అందరూ తలోచేయీ వేస్తే నాలుగు రోజుల్లో అయిపోతాయ్. మీ ఫ్రెండ్స్ చాలామంది ఉన్నారు కదా!"

మేము ఆశ్చర్యంతో మొఖాలు చూసుకున్నాం!

"అదేమిటి? మేమందరం ఎలా రాస్తాం? మాకు సరిగ్గా రాయటం రాదు కదా!" అన్నాడు రంగారెడ్డి. అతను చేతిలోని స్కెచ్ పెన్ కింద పడేసి తనూ కిందపడి ఘొల్లున నవ్వాడు రెండు నిమిషాలపాటు.

"నీయమ్మ! భలే విచిత్రం మనుషుల్లాగున్నారు మీరంతా! గవర్నమెంట్ లైబ్రరీలకు సప్లై చేసే నవలలయ్యా అని చెప్తూంటే మళ్ళీ రాయటం సరిగ్గా రాదుకదా అంటారేమిటి? మీకు తెలుసో తెలీదో - కిందటేడు ఏం జరిగిందనుకున్నారు? ఇలాగే అర్జంటుగా లైబ్రరీలకు పాతిక నవలలు సప్లై చేయాల్సి వచ్చింది. రెండే రెండు రోజుల

టైమ్. మతిచెడిపోయిందనుకోండి! ఏం చేయడానికి తోచక రాత్రి రెండింటికి 'టీ' తాగడానికి విజయవాడ రైల్వేస్టేషన్ కెళ్ళాను. సరిగ్గా అప్పుడే పాతికమంది కన్నడ యువకులు పర్స్ ఖు పోగొట్టుకొని టికెట్ కలెక్టర్ బెజవాడలో దించేసేసరికి రోడ్ మీద కొచ్చి కనబడ్డ వారందరినీ సహాయం చేయమని అడగటం మొదలుపెట్టారు. నేను వాళ్ళందరినీ పట్టుకెళ్ళి ఆ రెండు రోజులూ భోజనం పెట్టి తలో కన్నడ నవలా రాయించేసి బస్ టికెట్స్ కొనిచ్చి కర్నాటకకు పంపించేశాను. ఆ నవలలన్నీ మన లైబ్రరీలకు అమ్మేశాను-"

"కన్నడ నవలలు మన లైబ్రరీలకెలా అమ్మారు?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారెడ్డి.

"కన్నడ నవలలని ఎవడికి తెలుసు! వాటి కవర్ మీద తెలుగు నవలలనే రాశాం కదా! అదీగాక కన్నడా- తెలుగూ- కొంచెం దగ్గర దగ్గరగా ఉంటాయ్ కదా! పైగా అది కర్నాటక బోర్డర్స్ లో ఉన్న తెలుగు రచయితలు రాశారని ముందు మాటలో రాసేశాను- ఎలావుంది మన ప్లాను?" గర్వంగా అడిగాడతను.

"అద్భుతం" అన్నాడు చంద్రకాంత్.

"మరి ఆ నవలలు చదివిన వారెవరూ అవి తెలుగు నవలలు కావని కంప్లెయింట్ చేయలేదా?" అనుమానంగా అడిగాడు శాయిరామ్.

అతను శాయిరామ్ వేపు చిరునవ్వుతో చూశాడు.

"ఒకే ఒక్కడు చేశాడ్లే! హైస్కూలులో తెలుగు పండిట్ అంటవాడు. ఆ నవలలో ఉన్నది తెలుగుకాదు, కన్నడ భాష అంటూ ఎడ్యుకేషన్ మినిష్టర్ దగ్గర్నుంచీ అడ్డమయినోడికి మహజర్లు పెట్టాడు. ఇంక లాభం లేదని నేనే స్వయంగా వాడింటికెళ్ళి 'అది తెలుగే" అని మర్యాదగా చెప్పాను. కాదన్నాడు. 'తెలుగేరా దేవుడా! వప్పుకో" అని బ్రతిమాలాను. ససేమిరా కాదన్నాడు. అప్పుడు బయట నిలబెట్టిన గూండాల్ని లోపలికి రమ్మని సైగచేశాను. పాపం! ఒక కాలు విరగ్గానే దారికొచ్చేశాడు.

అప్పటికప్పుడే తనకు తెలుగు సరిగ్గా రాకపోవటం వల్ల ఆ నవలల గురించి తప్పుడు మహజర్లు పంపాననీ, అంచేత వాటిని ఉపసంహరించుకుంటున్నాననీ ఉత్తరాలు రాసి సంతకాలు చేశాడు. చూడండి! ఎంత కిరాతకుడో-"

"అవును! పరమ కిరాతకుడు!" అన్నాడు రంగారెడ్డి.

"కన్నడ భాష అయితే వాడికెందుకు? మరాఠీ భాష అయితే వాడికెందుకు? ఆ భాషవస్తే ఆ పుస్తకాలు చదువుకోవాలి. లేకపోతే సైలెంట్ గా ఉండాలి అంతేకానీ పిటిషన్లు పెడతాడా?" అన్నాడు గోపాల్రావ్.

పబ్లిషర్ మొఖం ఆనందంతో విప్పారింది.

అప్పటికప్పుడే ఫోన్ చేసి కూల్ డ్రింక్స్ తెప్పించి మా అందరికి ఇచ్చాడు.

'మీరు మర్యాదస్తులు కాబట్టి అర్థం చేసుకుని మాట్లాడుతున్నారు. ఇదే మా గవర్నమెంట్ లైబ్రరీలలో ఫ్రీగా పుస్తకాలు చదివే వారున్నారే! ఎంత నమ్మకద్రోహులో మీకు తెలీదు. ఎప్పుడు ఎవడిమీద ఏం రాద్దామా అనే ఇరవై నాలుగ్గంటలూ ఆలోచన. మొన్నటికి మొన్న ఇంకో దెవడో పిసినారి వెధవ నేను వేసిన నవలల్నిటిలోనూ పేజీకి ఆరులైన్లే వున్నాయనీ, ఇలా యాభై పేజీలు పుస్తకాన్ని మూడొందలు పేజీలలో సర్దటం అక్రమమనీ అందరికి రాసిపారేశాడు. ఆ దగుల్బాజీ వల్ల పెద్ద గొడవయిపోయి చివరకు ఆ పేరుతో ఉన్న పబ్లికేషన్స్ మూసిపారేసి, ఇంకో పేరుతో ఈ పబ్లికేషన్స్ పెట్టాను మళ్ళీ. అయితే ఆ ఉత్తరాల్రాసిన వాడిని వదల్లేదనుకోండి. ఒక చేత్తోనే ఆఫీస్ పని చేసుకుంటున్నాడిప్పుడు-"

"రెండోచెయ్యి కూడా తీసెయ్యాల్సింది దొంగవెధవకు" అన్నాడు శాయిరామ్.

"తీద్దామనే అనుకున్నాగానీ- మళ్ళీ జాలివేసింది."

అందరూ అతని దగ్గర శెలవ్ తీసుకుని బయటకొచ్చాం.

"డబ్బు తక్కువే అయినా ఈ దెబ్బతో నువ్ రచయితగా తెలుగు దేశమంతా పాపులర్ అయిపోతావ్!" అన్నాడు రంగారెడ్డి చంద్రకాంత్ ని ఈర్ష్యగా చూస్తూ.

"వాటిల్లో ఒకటి రెండు నవలలు సినిమాలుగా తీస్తేచాలు! డబ్బు కూడా లెఖ్ఖ వుండదు..." అన్నాడు శాయిరామ్.

"ఎవరూ తీయకపోయినా మనకాలనీ తరపున మనమే తీయవచ్చు- హీరోగా నేను ఫ్రీగా యాక్షన్ చేస్తాను కాబట్టి ఎక్కువ ఖర్చుకూడా అవదు" అన్నాడు జనార్ధన్. ఆ మాట వింటూనే అందరూ జనార్ధన్ వేపు భయంగా చూశారు.

నాలుగడుగులు వేశామో లేదో ఎదురుగ్గా అరుగుమీద నిలబడ్డ ఓ వ్యక్తి మావంక చూసి "మాష్టారూ! రండి! ఇటు మరోసారి!" అంటూ చేయి ఊపసాగాడు.

అయోమయంగా అందరం అతని దగ్గరకు నడిచాం.

"ఎంతిస్తానంటున్నాడు?" అడిగాడతను.

"ఏమిటి- ఎంత ఇస్తున్నాడు?"

"అదే! నవలకెంతిస్తానంటున్నాడా జగజ్జెట్టి?"

"ఓ పబ్లిషర్ సంగతా! నవలకు రెండొందలు-"

"చూశారా మిమ్మల్నెట్టా ఫూల్ చేసేసాడో!"

అందరం ఉలిక్కిపడ్డాం.

"ఫూల్ చేసేశాడా?"

"అవును! నేను ఒకో నవలకూ ఆరొందలిస్తున్నాను."

చంద్రకాంత్ మొఖం పాలిపోయింది. మా అందరికీ మోసానికి గురికాబడిన ఫీలింగ్స్ శరీరమంతా గొంగళి పురుగుల్లా పాకేస్తున్నాయ్.

"నిజంగా మీరు ఆరొందలిస్తున్నారా?" అడిగాన్నేను.

"అవునయ్యా! తెలుగు మీడియంలోనే చెప్తున్నాను కదా-"

నేను రంగారెడ్డి వేపు చూశాను.

"అయితే మనం వెనక్కు వెళ్ళి వాడి డబ్బు వాడికిచ్చేసి మన నవలలు మనం పట్టుకొచ్చేద్దాం-" అన్నాడు శాయిరామ్ ఆవేశంగా.

"అవును! పదండి" అన్నాడు యాదగిరి.

అందరం కోపంగా మళ్ళీ జగజ్జెట్టీ పబ్లిషర్స్ ఆఫీసులోకి నడిచాం. ఆ వ్యక్తి మమ్మల్ని చూసి చిరునవ్వు నవ్వాడు.

"నవలలేమయినా అమ్మకానికి ఉన్నాయా?" ఆప్యాయంగా అడిగాడు "ఒకో నవలా ఎంత బరువుంటుంది?"

మాకు వళ్ళు మండిపోయింది.

అయిదు నిమిషాల్లోనే అతను మమ్మల్ని మర్చిపోవటం చూస్తే అది నిజమా, నటనా అనే అనుమానం మొదలయింది.

"మేము ఇంతకు ముందేగా వచ్చి వెళ్ళింది? అప్పుడే మర్చిపోయారా?" ఆశ్చర్యంగా అడిగాడు చంద్రకాంత్.

"ఓ! మీరా! సారీ! రండి! నవలలు రాసుకొచ్చేశారా?" ఆత్రుతగా అడిగాడతను.

మాకు మతిపోతోంది అతని ప్రశ్నలకు.

"పదినిమిషాల్లో ఎలా రాస్తామండీ?" చిరాగ్గా అన్నాడు శాయిరామ్.

"అందరూ తలోచెయ్యివేస్తే ఎంతలోకిసార్! కిందటేడు నేనలాగే రాయించాను- రామవరప్పాడు నుంచి ఎనిమిది మంది ఆడ వ్యవసాయకూలీలను తీసుకొచ్చి రాత్రికి రాత్రి ఆరు నవలలు రాయించేశాను. కాంపిటీషన్ సార్! అంత ఫాస్ట్ గా బిజినెస్ చేయకపోతే దెబ్బతినేస్తాం. అసలే గవర్నమెంట్ తో వ్యవహారం- గవర్నమెంట్ వాళ్ళ వ్యవహారం మీకు తెలీందేముంది? ఎదురుగ్గా ఎవడు పచ్చగా కనబడితే వాడిదే రాజ్యం- ఇంతకూ మళ్ళీ ఎందుకొచ్చారు మీరు?"

"మేము మా నవలలు మీకిచ్చే అభిప్రాయం మార్చుకున్నామని చెప్పటానికొచ్చాం-" అన్నాడు రంగారెడ్డి.

అతను ఆశ్చర్యపోయాడు.

"అదేమిటి? ఎందుకని అలా?"

"లేకపోతే ఏమిటయ్యా? పెద్దమనిషివి గదాని మీ దగ్గరకొస్తే మమ్మల్ని మోసం చేస్తావా?"

అతను మరింత ఆశ్చర్యపోయాడు.

"నేను మోసం చేశానా మిమ్మల్ని?"

"అవ్! వేరే పబ్లిషర్స్ నవలకు ఆరొందలిస్తున్రంట- నువ్ రెండొందలే ఇయ్యబోతివి- నీయవ్వ- ఇది మోసంగాదువయ్యా?" మండిపడుతూ అడిగాడు యాదగిరి.

"ఓహో! అయితే ఇది తప్పకుండా ఆ నవలాంతకరావ్ పనయి ఉంటుంది. సరే వాడి మాటలే మీకు రుచి అయితే మీ నవలలు తీసుకుపోండి! నా వెయ్యి రూపాయిలూ నాకిచ్చేయండి."

దొరికిందే ఛాన్సని అతని డబ్బు అతనికిచ్చేసి నవలలు తీసేసుకున్నాం.

బయటకు నడుస్తూంటే వెనుకనుంచీ నవలాంతకరావ్ ని తిట్టడం వినిపిస్తోంది.

"నా కొడుకు- నా బేరాలన్నీ చెడగొడుతున్నాడు, ఇదిగో ఇంకోసారి ఆలోచించుకుని మీ నవలలు పట్టుకెళ్ళండి. మళ్ళీ తిరిగి వచ్చారంటే ఈసారి నవలకు వందే ఇస్తా."

మేము తిన్నగా నవలాంతకరావ్ ఇంటికెళ్ళాం.

అప్పుడు ఇంట్లోని నవలలన్నీ ఒక పెద్ద ప్రైవేట్ రిక్షాలోకి చేరుస్తున్నాడతను.

"ఏ నవలయినా ఆర్రూపాలే" అని రాసివుంది వాటిమీద.

"నవలలన్నీ తెచ్చేశామండీ" అతనితో ఆనందంగా చెప్పాడు శాయిరామ్.

"మంచి పని చేశారు. లేకపోతే ఎంత నష్టపోయే వాళ్లో చూడండి-"

"చాలా నష్టపోయేవాళ్ళమండి-"

"నన్నడిగితే- గంగోత్రీ పబ్లికేషన్స్ లో మీకు మంచి రేటు దొరుకుతుంది! కృష్ణ ఒడ్డునే ఉంటుంది వాళ్ళాఫీస్. అక్కడికెళ్ళండి-"

"అదేమిటండీ- మీరు తీసుకోరా?"

"నవలల పబ్లికేషన్ మానేశాను కదా! ప్రస్తుతం గవర్నమెంట్ లైబ్రరీలకు నవలలు అంటగట్టే బిజినెస్ బ్రోకర్ గా పనిచేస్తున్నాను-"

"మరి ఇందాక మాతో అలా ఎందుకన్నారు?"

"నేనయితే ఆరొందలిచ్చేవాడినీ అన్నానుగానీ ఇప్పుడు ఇస్తానని చెప్పలేదుగా-"

గోపాల్రావ్ కి కోపం ఆగలేదు. ఛటుక్కున అతని చొక్కా పట్టుకున్నాడు.

"రాస్కెల్ మమ్మల్ని మోసం చేస్తావా?"

అతను బిగ్గరగా అరవటం మొదలుపెట్టేసరికి ఆ వీధిలో వాళ్ళందరూ పరుగుతో వచ్చేశారు. అరగంట పట్టింది మాకు అక్కడినుంచి బయటపడటానికి.

నాలుగడుగులు వేశామోలేదో ఓ వ్యక్తి పరుగుతో వచ్చాడు మా దగ్గరకు.

"నవల్లేమయినా ఉన్నాయా సార్! గవర్నమెంట్ లైబ్రరీస్ బ్రోకర్ ని సార్! ఫస్ట్ క్లాస్ బిజినెస్ చేయిస్తాను. ఎంత చెత్త నవలయినాసరే- రెండువేల కాపీలు అంటగట్టేయవచ్చు-"

"మరి నీ కమిషన్ ఎంత?"

"చాలా మార్జినల్ సార్! హైదరాబాద్ లోనూ, జిల్లాలోనూ అన్నీ పోను నాకు టెన్ పర్సెంట్ - చూస్కోండి ఎంత లాభమో మీకు-" ఉత్సాహంగా అన్నాడతను.

మేము అతనిని వదిలించుకుని ముందుకి నడవసాగాం.

"సార్! మీ బుక్స్ నాకివ్వండి. ప్రస్తుతం దసరా రిబేట్ కూడా అయిదుశాతం ఇస్తున్నాను."

అతి కష్టం మీద అందరం అతనిని తప్పించుకుని కృష్ణ ఒడ్డుకి బయలుదేరాం. గంగోత్రీ పబ్లికేషన్స్ అన్న పెద్దబోర్డు వేలాడుతోంది ఓ పాడుబడ్డ భవనం ముందు.

అందరం లోపలకు నడిచాం. బాగా బూజుపట్టి ఉన్న ఓ పెద్ద విశాలమయిన గదిలో కూర్చుని వ్రాతప్రతులు కొన్ని తిరగేస్తూ కనిపించాడు దాని డైరెక్టర్.

లోపలకు వెళ్ళి మమ్మల్ని మేము పరిచయం చేసుకున్నాం. చంద్రకాంత్ రచయిత అనగానే అతని కళ్ళల్లో ఆనందం వెలిగిపోయింది.

"అబ్బ! మీకోసం ఎంతకాలం నుంచీ ఎదురుచూస్తున్నాను- ఒక్క నిమిషం కూర్చోండి" అంటూ పరుగుతోవెళ్ళి తలుపులు మూసి బోల్ట్ వేసేశాడతను. ఆ డోర్ పక్కనే ఉన్న పొడుగాటి ఇనుప చువ్వ తీసుకుని పరుగుతో మావేపు రాసాగాడు. మాకు వణుకు పుట్టుకొచ్చింది. లేచి మరో మూలకు పరుగెత్తటానికి సిద్ధంగా నిలబడ్డాం.

అతను ఇనుప చువ్వ పైకెత్తగానే మేము తలో మూలకూ చెల్లా చెదురయి పరుగెత్తాం. అతని కళ్ళల్లోంచి నిప్పులు కురుస్తున్నాయ్.

"దొంగ నాయల్లారా! మంచి సాహిత్యానికి భ్రష్టుపట్టిస్తారా? అడ్డమయిన సెక్స్ నవల్లూ రాసి మంచి సాహిత్యాన్ని తెలుగు భాషకు దూరం చేస్తారా? మీ వల్ల నేను ఎన్నో సంవత్సరాల నుంచీ ప్రచురిస్తోన్న మంచి సాహిత్యం ఎలా అమ్ముడవకుండా మ్రగ్గిపోతోందో చూడండ్రా! మిమ్మల్నందర్నీ ఇవాళ మర్డర్ చేయందే వదలను-"

అంటూ ఇనుప చువ్వ విసురుతోంటే అందరం గదంతా ఆ చువ్వకు దొరక్కుండా పరుగెత్తసాగాం. అయిదు నిమిషాల తర్వాత యాదగిరి రిస్క్ తీసుకుని తలుపు దగ్గరకు పరుగెత్తి తలుపు తెరచాడు. దాంతో పక్షుల్లా బయటికెగిరి వచ్చేశాం.

చాలాదూరం మా వెనుకే పరుగెత్తి ఇంక పరుగెత్తలేక ఆగిపోయాడతను. ఊళ్ళోకి చేరుకుని ఆయాసంతో ఒగరుస్తూ ఓ హోటల్లో కూలబడి కాఫీ ఆర్డర్ చేశాం. సర్వర్ ఆప్యాయంగా మా దగ్గరకొచ్చాడు.

"పిచ్చి పబ్లిషర్ దగ్గర్నుంచి తప్పించుకొస్తున్నారా సార్! అడిగాడతను.

"అవును! నీకెలా తెలుసు?"

"సాధారణంగా మా హోటల్ కొచ్చేవాళ్ళంతా అతని దగ్గర్నుంచీ పారిపోయి వచ్చేవాళ్ళే సార్."

"అతనికెందుకని పిచ్చెక్కింది?" అడిగాడు రంగారెడ్డి.

"పాతకాలం పబ్లిషర్సార్. అందుకని మంచి సాహిత్యమంటే అభిమానం- చివరకు ఈ మధ్య బిజినెస్ పడిపోయిందని ఓ ఆధునిక ఫేమస్ రచయిత నవలకొన్నాడు. తీరా పబ్లిష్ చేశాక తెలిసిందేమిటంటే ఆ నవలను ఆ తాగుబోతు రచయిత అప్పటికే అరడజను మంది పబ్లిషర్స్ కు అమ్మేశాడట- ప్రతీసారీ నవల పేరు మాత్రం మారుస్తున్నాడు. దాంతో ఈయనకు పిచ్చెక్కి కనబడ్డ రచయితనల్లా చంపటానికి ప్రయత్నిస్తున్నాడు-"

"అవునూ! వాడూ, వీడూ ఎందుకు? ఇందాక గోపాల్రావ్ ఫ్రెండ్ చెప్పినట్లు స్కీమ్ నెంబర్ వన్, స్కీమ్ నెంబర్ టూ ల ప్రకారం మనమే మన నవలలు పబ్లిష్ చేసుకుంటే?" అన్నాడు శాయిరామ్.

చంద్రకాంత్ ఓ క్షణం ఆలోచించాడు.

"దినపత్రిక ఎడిటర్లకు లంచం ఇచ్చే బదులు డైరక్ట్ గా స్కీమ్ నెంబర్ 2లో నవలలు రిలీజ్ జేసి, అమ్మకాల కోసం బ్రోకర్లను పెట్టుకుంటే బాగుంటుంది కదా" అన్నాడతను.

అందరికీ చంద్రకాంత్ అయిడియా నచ్చింది. వెంటనే హైదరాబాద్ తిరుగు మొఖం పట్టాం.

వారం రోజుల అందరం శెలవుపెట్టి మూడు నవలలు ప్రింట్ చేయించేశాం. ఒకో నవల లక్ష ప్రతులు అమ్ముడవుతుందని చంద్రకాంత్ చెప్పినా ఎందుకయినా మంచిదని ఒకోటీ అయిదువేల కాపీలు మాత్రమే వేశాం. అన్ని పత్రికల్లో పబ్లిసిటీ ప్రారంభించాం. ప్రముఖ అజ్ఞాత రచయిత శ్రీ చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్గారి ఫలానా నవలలు దీపావళికి విడుదల! కావలసినవారు వెంటనే ఎ.33/6/1, నిర్భయ్ నగర్ కాలనీ, హైదరాబాద్ ని సంప్రదించండి. ఆ మర్నాటి నుంచీ పుస్తకాలు కొనేందుకు ఏజెంట్లు, పాఠకులు, రెంటల్ బుక్ స్టాల్ వాళ్ళు కాలనీలో క్యూలు కడతారని మా అందరికీ నమ్మకం.

ఆ రాత్రి పన్నెండు గంటలకు కాలనీ మధ్యలో నుంచి బిగ్గరగా ఏడుపులు, కొన్ని గొంతులు ఆ ఏడుపు ఓనరుని ఓదార్చటం వినిపించేసరికి నేను తలుపు తెరుచుకుని బయటకు పరుగెత్తాను కంగారుగా. అప్పటికే కొంతమంది ఆడా మగా పోగయి వున్నారు. మధ్యలో కూర్చుని ప్రింటయిన నవలలు వళ్ళో పెట్టుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు చంద్రకాంత్.

"ఏమిటి? ఏం జరిగింది?" అడిగాను రంగారెడ్డిని.

"మరేం లేదు, తన నవలను పుస్తక రూపంలో చూసుకునేసరికి కొంచెం మతి చలించినట్లుంది" అన్నాడు జాలిగా.

అందరం అతనిని ఓదార్చసాగాం.

"నా తల్లులూ, తండ్రులూ అందరూ మీరే! పూర్వజన్మ సుకృతం వలనే నేనీ కాలనీలో కొచ్చాను. లేకపోతే జీవితమంతా అజ్ఞాత రచయితగానే మిగిలిపోయేవాడిని" ఏడుపు ఆపి మధ్యమధ్యలో మాట్లాడుతున్నాడతను.

"అయిందేదో అయిపోయిందికదా! ఇంక ఊరుకో" అన్నాడు శాయిరామ్.

"మీకు తెలీదుసార్! నైన్త్ క్లాస్ చదివేప్పుడు నాకు కల వచ్చింది. నేనుకూడా షేక్ స్పియర్ అంత గొప్ప రచయిత అయిపోయినట్లూ, నా పుస్తకాలన్నీ కూడా కాలేజీ విద్యార్థులకు టెక్స్ట్ పుస్తకాలుగా పెట్టినట్లూ- ఇన్నాళ్ళకు నా కలలో కొంత భాగాన్ని మీరు నిజం చేశారు-"

అతనిని ఓదార్చి వాళ్ళింటికి పంపించేసరికి రెండయిపోయింది.

ఆ తరువాత ఇంకమాకు నిద్రపట్టలేదు.

ఉదయం జరగాల్సిన బుక్ రిలీజ్ ఫంక్షన్ కి ఏర్పాట్లు ప్రారంభించాం. మామూలుగానే శాయిరామ్ మైక్ ఎరేంజ్ మెంట్స్ చూస్తున్నాడు.

ఫంక్షన్ తర్వాత జనమంతా 'క్యూ' లో నిలబడి చంద్రకాంత్ పుస్తకాలు కొనుక్కోడానికి ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశాడు చంద్రకాంత్. క్యూలో నిలబడ్డవాళ్ళకు దాహమేస్తే మంచినీళ్ళు ఇవ్వటానికి పార్వతీదేవి ఓ చలివేంద్రం కూడా ప్రారంభించింది.

తెల్లారిపోయింది.

తొమ్మిది గంటలకల్లా జనం రావటం మొదలయింది. బుక్ రిలీజ్ ఫంక్షన్ కి ఇంతమంది జనం ఎలా వచ్చారా- అని అందరం ఆశ్చర్యపోతున్నాం. ఎందుకంటే అది కేవలం ఫార్మాలిటీ కోసం మా కాలనీ వాళ్ళు పదిమందీ కలసి చేయవలసిన కార్యక్రమం. ఆ పుస్తకాల్ని జనార్ధన్ రిలీజ్ చేస్తానని బ్రతిమాలుతే సరేనని వప్పుకున్నాం. రాన్రాను జనం మరీ ఎక్కువయి పోయారు. ముఖ్యంగా యువకులు, విద్యార్థులు, విద్యార్థినులు ఎక్కువ సంఖ్యలో వచ్చేశారు. ఆ జనాన్ని చూసి చంద్రకాంత్ మళ్లీ ఏడవటం ప్రారంభించారు. నాకూ రంగారెడ్డికి వళ్ళు మండిపోయింది.

"మళ్ళీ ఏమొచ్చింది? ఎందుకేడుస్తున్నావ్" అడిగాడు రంగారెడ్డి.

"నా పుస్తకాన్ని ఇంతమంది యువకులు అభిమానిస్తున్నారంటే- తెలుగు ప్రజలకు రచయితల మీద ఎంత ప్రేమ ఉందో, మన రచయితలను ఎంత గౌరవిస్తున్నారో తెలుస్తోంది. ఇంత గొప్ప అభిమానాన్ని నేను భరించలేను" అంటూ మళ్ళీ ఏడవసాగాడు.

ఫంక్షన్ మొదలయింది. జనార్ధన్ పుస్తకాలు రిలీజ్ చేయగానే జనంలోనుంచి కలకలం బయలుదేరింది.

"ఏడీ- చిరంజీవి కావాలి. చిరంజీవి ఎక్కడా?" అంటూ అరుస్తున్నారు కొంతమంది.

మాకేమీ అర్థం కాలేదు.

"ఏ చిరంజీవి కావాలి మీకు?" వేదిక మీద నించే అడిగాడు రంగారెడ్డి.

"హీరో చిరంజీవి కావాలి కావాలీ-"

"అరే సాలే! సినిమా హీరో చిరంజీవికో బులారే-" ఎవడో తిట్టాడు.

రంగారెడ్డికి కోపం వచ్చేసింది ఆ తిట్టుతో.

"అరే తుమ్ సాలే- తేరా బాప్ సాలే- తేరీ బహెన్ సాలే-" అంటూ అయిదు నిమిషాలు హిందీలో మాట్లాడాక అతను తగ్గాడు. ఈలోగా జనంలోనుంచి యాదగిరి దూసుకొచ్చేశాడు.

"చూసిన్రా! ఈ కిరికిరంతా ఎందుకయిన్దానుకున్రు! మనోళ్ళకు తెల్వకుండ మన జనార్ధన్ అన్నపోయి ఊరంతా స్పీకర్ ప్రకటనలు గుప్పించేశాడు. ఎక్కడ చూచినా పెద్ద ఎత్తున వాల్ పోస్టర్స్! ప్రముఖ రచయిత చంద్రకాంత్ రచించిన నవలలు యువకులు ఆరాధ్య దైవం, ప్రముఖ సినీ నటుడుచే ఆవిష్కారం-" అని రాశాడందులో అందుకని అందరూ చిరంజీవే వస్తున్నాడనుకున్నారు-"

అప్పుడర్ధమయింది మాకు. జనమందరినీ బ్రతిమాలి మా ఉద్దేశ్యం యువకుల హీరో అంటే జనార్ధనేనని సర్ది చెప్పేసరికి తల ప్రాణం తోక కొచ్చింది. జనార్ధన్ మీద కొంతమంది టమోటాలు, రాళ్ళు విసిరాక ఎవర్దారిన వాళ్లు వెళ్ళిపోయారు.

వాళ్ళెవరయినా అడిగితే పుస్తకాలు అమ్మేద్దామని కూచున్న చంద్రకాంత్, పార్వతీదేవి సాయంత్రం వరకూ ఎదురుచూసి చూసి విసిగిపోయారు.

ఆ తరువాత వారం రోజులు కూడా గడిచిపోయినయిగాని ఒక్క పుస్తకం కూడా అమ్ముడు పోలేదు.

విజయవాడ నుంచి చంద్రకాంత్ పుస్తకాలు కావాలని ఓ వందమంది బుక్ షాప్స్ వాళ్ళు ఆర్డర్స్ ఇచ్చారుగానీ వాళ్ళకు అరవైశాతం కమిషన్ ఇవ్వాలనీ, ఆ డబ్బు కూడా మరో సంవత్సరం తర్వాత ఇస్తామనీ- రాశారు.

అందరం ఎటూ తోచక తలపట్టుక్కూచున్నాం.

"ఇక లాభంలేదు. ఇంక వీలయినన్ని కాపీలు డిస్ట్రిక్కు లైబ్రేరీస్ కి తోశేద్దాం" అన్నాడు శాయిరామ్.

"అవును- అదేమంచిది" అన్నాడు రంగారెడ్డి.

వెంటనే అందరం ఆ కార్యక్రమంలోకి దిగిపోయాం.

"ముందు మన పుస్తకాలు ఎప్రూవుడ్ లిస్ట్ లోకి రావాలి. ఆ లిస్ట్ లో ఉన్న పుస్తకాలే జిల్లా గ్రంథాలయాలు కొంటాయ్" చెప్పాడు గోపాల్రావ్.

"మరి ఆ లిస్ట్ లో మన పుస్తకాలు రావాలంటే ఎంత పర్సెంటేజ్ ఇవ్వాలి" అడిగాడు చంద్రకాంత్.

"ఎంతో లేదులెండి- కొంచమే! వీళ్ళు చాలా మంచాళ్ళు! బేరమాడేరకం కాదు" అన్నాడు గోపాల్రావ్.

"అయితే కానిచ్చేద్దాం! ఇక ఆలస్యం ఎందుకు?" అన్నాడు రంగారెడ్డి.

రెండు రోజుల్లో లిస్ట్ లో చంద్రకాంత్ నవలల పేర్లు వచ్చేశాయి. వెంటనే ఆ లిస్ట్ ఇు తీసుకుని జిల్లాల పర్యటన ప్రారంభించాం. లైబ్రరీ సెక్రటరీలను, కమిటీ మెంబర్స్ నీ, ఛైర్మెన్ నీ అందరినీ కలుసుకుని పర్సెంటేజ్ లు చాలా వేగంగా ఫిక్స్ చేసేస్తూ పుస్తకాల సప్లయికి ఆర్డర్స్ తీసుకోసాగాం.

పది రోజుల్లో అంతా సెటిలయిపోయింది. రెండువేల కాపీలు అమ్మకాలు జరిగిపోయాయి ఓరల్ గా.

అందరం ఆ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని కాలనీలో బీర్ పార్టీ కూడా ఏర్పాటు చేసుకున్నాం. ఆ మర్నాడు వచ్చింది జీవో.

తెలుగుదేశం ప్రభుత్వం లైబ్రరీల్లో పుస్తకాలు కొనటాన్ని నిషేధించింది. చంద్రకాంత్ మొఖం పాలిపోయింది. ఉండుండి పిచ్చిమాటలు మాట్లాడటం మొదలుపెట్టాడు. అతనికి పిచ్చి ఎక్కిందేమోనన్న అనుమానం కూడా కలిగింది మాకు.

కొద్ది రోజులపాటు మాకు మనసు మనసులోలేదు. కాలనీ ఫండ్స్ అన్నీ పుస్తకాల ప్రింటింగ్ కి ఉపయోగించేశాం. ఏ క్షణాన్నయినా మా మెంబర్స్ ఏదయినా ఫంక్షన్ ఆర్గనైజ్ చేయమని కోరితే ఏం చేయాలో తెలీని అయోమయస్థితిలో పడిపోయాం.

ఓ రోజు మళ్లీ అర్ధరాత్రి ఏడుపు వినిపించేసరికి అందరం బయటకు పరుగెత్తాం.

చంద్రకాంత్ మామూలుగానే వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

గోపాల్రావ్ అతనిని ఓదారుస్తున్నాడు.

యాదగిరి ఆనందంగా. ఎగ్జయిట్ మెంట్ తో మాట్లాడుతున్నాడు.

"చాలా తేలికన్నా- మాచిన్నాన్న గిట్లనే తన్రాసిన పుస్తకమొకటి శాంక్షన్ చేపించిండు..."

"ఏమిటి శాంక్షన్ చేయించటం?" అయోమయంగా అడిగాను.

"అదే మన చంద్రకాంత్ తంబి బుక్కుని మన హైస్కూల్ కిగానీ, కాలేజీకిగానీ నాన్ డిటైల్డ్ టెక్ట్స్ బుక్స్ గా వేయడానికి కోషిస్ చేద్దాం!"

నాకు నవ్వొచ్చింది..

"నీకేమయినా పిచ్చెక్కిందా? టెక్ట్స్ బుక్స్ గా రావాలంటే అది రచించిన వారికి చాలా పెద్ద పేరు ప్రఖ్యాతులుండాలి- లేదా ఎకడమిక్ క్వాలిఫికేషన్స్ ఉండాలి-"

"నీయవ్వ- మీకు తెలీదు, ఇంకొకడు జెప్తే ఇనరు- నడవండ్రి నాతో-" అన్నాడతను కోపంగా.

చంద్రకాంత్ లేచి యాదగిరిని కౌగిలించుకుని బావురుమన్నాడు.

"నైన్త్ క్లాస్ లో నేను కన్న కల తాలూకూ రెండో భాగం కూడా నిజమయేట్లు చేస్తున్నా వన్నా! నువ్వే నా తల్లివి, తండ్రివీ!"

అతనిని అతి కష్టం మీద వదిలించుకుని బయలుదేరాం.

ముందు యాదగిరి చిన్నాన్న ఇంటికి వెళ్ళాం. సంగతి విని అతనే చెప్పాడు.

"ఇది చాలా చిన్న విషయం బిడ్డా! షేక్ స్పియర్ ఏమి చెప్పిండో ఎరుకనా?"

"ఏమి చెప్పిండు?"

"బేర్స్ బై గ్లాసెస్
లయన్స్ బై నైట్స్
ఎలిఫెంట్స్ బై పిట్స్
అండ్ మెన్ బై ప్లేటర్"

"ఇప్పుడెందుకు జెప్తున్నావ్ మాకు?" చిరాగ్గా అడిగాడు యాదగిరి.

"ఇంకా సమజ్ కాలేదా? పొగడ్తకు లొంగని మనిషి దునియాలలేడు. ఎడ్యుకేషన్ మినిష్టరూ, యూనివర్సిటీ చైర్మెన్ ఛు, టెక్ట్స్ బుక్ కమిటీ మెంబర్ అందర్నీ పొగడండ్రి! రెండోరోజు మీరేం పుస్తకం రాసినాగాని మన కాలేజీ, యూనివర్సిటీల్లో టెక్ట్స్ బుక్ గా వస్తది."

గోపాల్రావ్ హఠాత్తుగా ఆయన కాళ్ళమీద పడిపోయాడు.

"ఆహా! ఎంత గొప్ప సూత్రం చెప్పారు సార్!" అన్నాడు ఆనందభాష్పాలు రాలుస్తూ.

అందరం ఇంటికి చేరుకున్నాం.

మా చంద్రకామత్ పుస్తకాలు టెక్ట్స్ బుక్స్ గా రావటానికి ఎవరెవరి సహాయ సహకారాలు కావాలో లిస్ట్ తయారుచేశాం. వాళ్ళందరికీ సన్మానాలు ఏర్పాటు చేసేయాలని నిర్ణయించుకున్నాం.

ఆ తరువాత మా కెవరికీ క్షణం తీరిక లేకపోయింది.

రెండు నెలల్లో పదహారు సన్మానాలు జరిపాం మా కాలనీలో. ఆ సన్మాన వివరాలు అన్ని న్యూస్ పేపర్లలో కవర్ చేయించాం. అలా కవర్ చేసేందుకు ఆ న్యూస్ పేపర్ జర్నలిస్ట్ లకు ముందే సన్మానం చేసేశాం. చివరకు ఆ శుభ సమయం రానే వచ్చింది.

మా చంద్రకాంత్ రాసిన మూడు నవలలూ డిగ్రీ తెలుగు నాన్ డీటెయిల్డ్స్ గా ఎన్నికయిపోయాయ్.

ఆ రాత్రి మళ్ళీ చంద్రకాంత్ ఏడుపు వినిపించింది.

కిటికీ తెరచి చూశాను గానీ అతనొక్కడే కూర్చుని కనిపించాడు.

అందరూ కిటికీలు తెరచి చూస్తున్నారుగానీ ఎవరూ బయట రావటం లేదు.

బహుశా అందరూ నాలాగానే ఆలోచిస్తూండి ఉంటారు.

చంద్రకాంత్ మాకు ఎంత కావలసిన వాడయినా అతను రాసిన చెత్త పుస్తకాల్ని పాఠ్యగ్రంథాలుగా మన తెలుగు పిల్లలు చదవటం ఎందుకో మాకు ఎబ్బెట్టుగా ఉంది. ఎందుకంటే వాటికి ఎలాంటి విలువలూ లేవని మా మనసుల్లో మాకు తెలుసు-

కానీ ఇప్పుడింక చేసేదేముంది?

అంచేత కిటికీ మూసేసి నిద్రలోకి జారిపోయాను-

* * * * *

## ఆజ్ కీ తాజా టీవీ సీరియల్

మా నిర్భయ్ నగర్ కాలనీ తాలూకూ వెల్ఫేర్ సొసైటీకి షుమారు పాతిక లక్షల ఫండ్స్ పోగయినయ్.

ప్రతి వినాయక చవితికీ ఖచ్చితంగా రెండు లక్షలు మిగుల్తుంది. వినాయకుడి లడ్డూ వేలం వేయటం వల్ల ఇంకో లక్ష వస్తుంది.

ఇలా వస్తోన్న ఆదాయాన్ని అలా బాంక్ లో వేసి ఉంచటం కంటే దానిని నాలుగయిదు రెట్లు పెంచుకునే కార్యక్రమం ఏదయినా చేపట్టాలని కాలనీ వాళ్ళందరం డిసైడ్ చేశాం.

"మన బాంబే స్టాక్ ఎక్సేంజ్ లో షేర్లు కొందాం! మన పెట్టుబడికి నూటికి నూరు శాతం లాభం వస్తుంది అయిదేళ్ళల్లో-" అన్నాడు శ్యామల్రావ్.

ఆ అయిడియా బావుందని కొంతమంది అతనిని సపోర్ట్ చేశారు.

స్టాక్ మార్కెట్ గురించి మాకు పెద్దగా నాలెడ్జ్ లేకపోవటం వల్ల నేనూ, శాయిరామ్, రంగారెడ్డి- ఎటూ మాట్లాడలేకపోయాం- కాలనీ వాళ్ళందరం కూడా తలో లక్షా స్టాక్ మార్కెట్లలో పెడితే బాగుంటుందని జనార్ధన్ కూడా ఓ సలహా ఇచ్చాడు అప్పుడే సావిత్రమ్మ లేచి నిలబడింది.

"నన్నడిగితే లాంగ్ టరమ్ కాకుండా ఫ్యూచర్స్ లో ట్రేడింగ్ చేస్తే ఈజీగా నెలల్లో డబుల్ చేసుకోవచ్చు-" అంది. అదే అదనుగా తీసుకుని శ్యామల్రావ్ స్టాక్ మార్కెట్ ఎంత గొప్పదో ఉదాహరణలిస్తూ ఉపన్యాసం ప్రారంభించాడు. సరిగ్గా అప్పుడే రెగ్యులర్ గా మా కాలనీ కొచ్చే బిచ్చగాడు జనాన్ని తోసుకుంటూ డయాస్ దగ్గరకొచ్చాడు.

"అమ్మలారా, అయ్యలారా! గత నాలుగేళ్ళుగా మీ కాలనీ వాళ్లందరూ- నాకు లేదనకుండా భిక్షవేస్తూ ఆకలితో చావకుండా నన్నూ, నా భార్యా పిల్లలనూ ఆదుకుంటున్నారు. ఇంతమంచి మనుషులున్న మీ కాలనీవాళ్ళు పదికాలాల పాటు పచ్చగా ఉండాలని కోరుకునేవాళ్ళల్లో నేను మొదటివాడిని. మీరిప్పుడు మీ కాలనీ డబ్బంతా స్టాక్ మార్కెట్ లో పెట్టాలని ఆలోచిస్తూంటే నాకు హార్ట్ ఎటాక్ వచ్చినట్లయింది- ఎందుకంటే మీరంతా కూడా నాలాగానే చిప్పపట్టుకుని ఇంకో కాలనీకి అడుక్కోడానికెళ్ళటం నేను చూళ్ళేను-"

శాయిరామ్ కి అనుమానం వచ్చింది.

"అంటే నువ్వు స్టాక్ మార్కెట్ లో పెట్టుబడి పెట్టావా?"

"అవున్సార్! కాస్తా కూస్తా కాదు పదిలక్షలు- మొత్తం మటాష్ అయిపోయింది. అప్పుల పాలయి, ఉద్యోగం పోగొట్టుకుని ఇలా వీధినపడ్డాను-" చెప్తూంటే అతని కళ్లవెంబడి నీళ్ళు రాలినయ్.

ఆ మాట వినగానే శ్యామల్రావ్ కంగారుపడ్డాడు.

"ఎక్కడో ఒకడు నీలా అయ్యాడని భయపడితే ఎలా? ఝుంఝూన్ వాలా ఎన్నికోట్లు సంపాదించాడు? బఫెట్ ఎన్ని బిలియన్లు సంపాదించాడు-' అంటూంటే వెనుక నుంచి ఇంకో బిచ్చగాడు చొచ్చుకుని ముందుకొచ్చాడు.

"వాళ్ళ సంగతి సరేసార్! మన హర్షద్ మొహతా సంగతేంటి? హర్షద్ మొహతా లాంటి మోసగాళ్ళు ఇండియన్ స్టాక్ మార్కెట్ ని బాంక్ ల సాయంతో ఫుట్ బాల్ ఆడుకుంటూ అమాయకులయిన ఇన్ వెస్టర్లను మోసంచేసి లక్షల కోట్లు తినేశారు- తింటున్నారు- ప్రపంచంలో ఇండియన్ స్టాక్ మార్కెట్ అంత చెత్త స్టాక్ మార్కెట్ ఇంకోటి లేదు-" అన్నాడతను ఆవేశంగా.

"అంటే నువ్వు కూడా..." డౌటుగా అడిగాడు రంగారెడ్డి.

"అవున్సార్ మన బాంబే స్టాక్ ఎక్సేంజ్ లో జరిగే మోసాలవల్ల ఇల్లు అమ్ముకుని వీధినపడ్డాను సార్-"

ఇంక లాభంలేదని శ్యామల్రావ్ అక్కడినుంచి జారుకున్నాడు.

ఆ తరువాత అందరూ మళ్ళీ రకరకాల సజెషన్స్ ఇవ్వటం మొదలుపెట్టారు. ఆఖరికి మా కాలనీ యూత్ వింగ్ సెక్రటరీ దీపిక ఓ సజెషన్ ఇచ్చింది.

"అంకుల్! ఈ రోజుల్లో టీవీ సీరియల్స్ తీయటం మాంఛి లాభసాటి వ్యాపారం అంకుల్. లాభం వందల కోట్లలో ఉంటుంది- ఏ సీరియల్ అయినా చూడండి! వెయ్యి ఎపిసోడ్లు, రెండువేల ఎపిసోడ్లు- ఎంత లాభముంటే అన్ని ఎపిసోడ్లు తీస్తారు?"

ఆ పాయింట్ డిస్కస్ చేసేసరికి మెజారిటీ సభ్యులు టీవీ సీరియల్ తీసే వేపే మొగ్గారు.

"అంతేకాదు- మన సీరియల్లో చాలా వరకూ మన కాలనీలో ఉన్నవాళ్ళనే నటీనటులుగా తీసుకోవచ్చు-" అన్నాడు జనార్ధన్- తన ఫ్యూచర్ గురించి ఆలోచిస్తూ-

"ఇంకో అడ్వాంటేజ్ ఏంటంటే- ఆ సీరియల్ నేను డైరెక్షన్ చేస్తాను గనుక జనానికి చాలా ఎట్రాక్షన్ గా ఉంటుంది-" అన్నాడు బోసుబాబు ముందు కొస్తూ- బోసు బాబు చాలా సంవత్సరాల కిందట ఒక సినిమా తీశానని చెప్తూంటాడు గానీ ఆ సినిమా గురించి మా కాలనీలో ఎవరికీ తెలీదు-

"వద్దూ- ఆ చెత్త సినిమాని డైరక్ట్ చేసిన వాళ్ళు వద్దూ-" అంటూ యూత్ కొంతమంది వెనుక నుంచి నినాదాలు చేశారు.

దాంతో బోస్ కూర్చుండిపోయాడు.

వెంటనే మా కాలనీ వాళ్ళు కొంతమందితో ఓ కమిటీని ఎనౌన్స్ చేశాడు గోపాల్రావ్.

"శాయిరామ్, రంగారెడ్డి, పార్వతీదేవి, సావిత్రమ్మా- ఈ నలుగురూ మనం తీయబోయే టీవీ సీరియల్ ఎలా తియ్యాలీ, టెక్నీషియన్స్ ఎవరు, ఎలాంటి స్టోరీ తీసుకోవాలి అన్న విషయాలు స్టడీ చేసి నిర్ణయాలు తీసుకుంటారు" అన్నాడతను.

ఆ మర్నాడే మా కమిటీ సమావేశమయింది.

"ముందు మనం ఒక మంచి కథను ఎన్నుకోవాలి! ఇప్పుడొచ్చే చెత్త టీవీ సీరియల్స్ లాగా కాకుండా ఒక మంచి సందేశాత్మకమయిన సీరియల్ తీస్తే మన ప్రేక్షకులకు ఎంతో నచ్చుతుంది" అంది సావిత్రమ్మ.

పార్వతీదేవి ఆమెను సపోర్ట్ చేసింది.

మా మీటింగ్ జరుగుతూంటే కిటికీ బయట ఎండలో నిలబడి మావేపు చూస్తూ ఉండుండి చేతులు ఊపుతూ కనిపించాడు చంద్రకాంత్

"పాపం- ఆ సీరియల్ కి తననే రచయితగా పెట్టుకోమంటున్నాడు" రంగారెడ్డి చెవిలో ఊదాడు శాయిరామ్.

"పోన్లే- ఎంత చెడ్డా కాలనీలో ఉన్న ఏకైక రచయిత కదా! అతన్నే తీసుకుందాం" అన్నాడు రంగారెడ్డి.

ఆ మాటే బయటకు చెప్పాడుగానీ సావిత్రమ్మ ససేమిరా వప్పుకోలేదు.

"చూడండి! కథ విషయంలో మన కాలనీ రచయిత లాంటి పక్షపాతాలు వద్దు- నా ఉద్దేశం ఎలా ఉందంటే టీవీ సీరియల్ అన్నాక లేడీసెంటిమెంట్ అనేది బ్రహ్మాండంగా పండగలగాలి. ఆ కెపాసిటీ ఈ మధ్య సాహిత్య అకాడమీ పొందిన బ్రహ్మకుమారి ఒక్కావిడకే ఉంది-" అందామె.

"అవునవును! ఆవిడ అవార్డ్ నవలనే మన టీవీ సీరియల్ కి అడాప్ట్ చేసుకుంటే అద్భుతంగా ఉంటుంది-" అంది పార్వతీదేవి.

మేం కూడా ఆ సజెషన్ కి వప్పుకోక తప్పలేదు. ఎందుకంటే టీవీ సీరియల్స్ అన్నీ జనరల్ గా లేడీస్ చూస్తుంటారు.

సాయంత్రం సీరియల్స్ వచ్చే టైమ్ లో మగాళ్ళంతా టీవీ సెట్లకు దూరంగా ఎక్కడో పేకాడుకుంటూనో, కబుర్లు చెప్పుకుంటూనో గడుపుతూంటాం! ఆ టీవీ సీరియల్స్, చూడాలంటేనే ఎలర్జీ మాకు!

ఒకసారి గత్యంతరం లేని పరిస్థితుల్లో మేమంతా ఒక టీవీ సీరియల్ చూడాల్సి వచ్చింది.

నిజంగా నరకం అంటే ఏంటో ఆ ఇరవై నిమిషాల్లో తెలిసొచ్చింది మాకు. హీరోయిన్ కి తోటి కోడలు పాలు తెచ్చిచ్చింది ఒక పనిమనిషిలాగా- ఎందుకంటే హీరోయిన్ గొప్పింటిది- తోటి కోడలు బీదింటిది- అందుకని ఇంటిల్లిపాదీ తోటికోడల్ని బానిసలాగా చూస్తూంటారు. తమాషా ఏంటంటే ఎన్ని హింసలు పెట్టినా తోటి కోడలు చిరునవ్వుతో హాపీగా భరిస్తూంటుంది తప్ప నోరుతెరవదు. తనకి ఓ చేతికి వాత పెడుతూంటే ఆనందంగా రెండో చేయి అందిస్తుంది-

"ఒకవేళ ఆ తోటికోడలు మెంటల్లీ రిటార్డ్ డ్ ఏమో-" అన్నాడు రంగారెడ్డి.

హీరోయిన్ పాలు తాగబోతోంటే అత్తగారు 'ఆగు' అంటూ గావుకేక పెట్టింది బెడ్ రూమ్ గడపలోనుంచి.

హీరోయిన్ పాలు తాగటం ఆపేసి అత్తవేపు చూసింది.

అప్పుడే బాత్ రూమ్ లోనుంచి స్నానం చేసి బయటికొస్తున్న హీరో- అక్కడే ఆమె కేక విని ఆగిపోయి తల్లివేపు చూశాడు. మెట్లు దిగుతూ ఆఫీస్ కెళ్ళబోతూన్న హీరోయిన్ మామగారు మెట్లమీదే నిలబడిపోయి భార్యవేపు చూశాడు.

బయట కారుడ్రైవర్ ఆ కేకకి ఇంట్లో యజమానురాలివేపు చూశాడు.

తోటమాలి కూడా కిటికీలోనుంచి యజమానురాలిని చూశాడు.

సోఫాకింద పడుతున్న కుక్కకూడా యజమాను రాలివేపు చూసింది. అప్పుడు తోటి కోడలు స్లోమోషన్ లో- రెండు నిమిషాలు టైమ్ పట్టేట్లు వెనక్కు తిరిగి అత్తగారివేపు చూసింది.

అత్తగారు ఒక్కొక్క అరనిమిషం పాటు వాళ్ళందరి మొఖాలూ చూసింది. మళ్ళీ అందరూ ఆమె మొఖం చూశారు.

"ఆ పాలు తాగకు" అంది అత్తగారు.

అందరూ ఒకరి తర్వాత ఒకరు మళ్ళీ అత్తగారి మొఖంలోకి చూశారు. ఆమె మళ్ళీ అందరి మొఖాల్లోకీ చూసింది.

ఇప్పుడు హీరోయిన్ తన భర్త మొఖంలోకి చూసింది. అతను భార్య మొఖంలోకి చూశాడు.

అందరూ తోటి కోడలు మొఖంలోకి చూశారు.

తోటికోడలు అందరిమొఖాల్లోకీ చూసింది.

తోటమాలీ, డ్రైవరూ మొఖమొఖాలు చూసుకున్నారు.

తోటికోడలూ, మామగారూ మొఖమొఖాలు చూస్తున్నారు.

అత్తగారి మొఖంలోకి, యజమాని మొఖంలోకీ చూసింది కుక్క!

కుక్క మొఖంలోకి చూసింది తోటికోడలు.

హీరోయిన్ మొఖంలోకి చూసింది కుక్క-

మళ్ళీ ఓసారి అందరూ అందరి మొఖాల్లోకీ చూసుకున్నారు-

దాంతో బ్రేక్-

అయిదు నిమిషాలు యాడ్స్ వచ్చాయ్-

ఆ తరువాత అంతకుముందు చూసిన సీనంతా మళ్ళీ చూపించారు.

అప్పుడు అత్త స్లోమోషన్ లో హీరోయిన్ వేపు నడవటం మొదలుపెట్టింది. ఆమె ఒక్కొక్క అడుగు వేస్తూంటే ఒక్కొక్కరు ఆమె వంకే చూస్తున్నారు. ఆమె అందరి వంకా చూస్తూ నడుస్తోంది.

ఆ హాల్ చూస్తే ఫిఫ్టీన్ బై థర్టీ ఉంటుంది- కోడలి దగ్గర కెళ్ళడానికి పాతిక మైళ్ళ దూరం నడిచినట్లు నడుస్తోంది అత్తగారు. కెమెరా ఆమెపాదాల మీద కాసేపు - ఆమె నడుము మీద కాసేపు- ఆమె ఛాతీమీద కాసేపు- మొఖం మీద కాసేపు-

అయిదు నిమిషాలకుగానీ హీరోయిన్ కూర్చున్న చోటకు చేరుకోలేకపోయిందామె.

చేరుకోగానే ఆ పాలగ్లాస్ వంక చూసింది.

ఇప్పుడు అందరి మొఖాలూ పాలగ్లాస్ లోకి-

పాలగ్లాస్ కూడా అందరిమొఖాల్లోకీ చూస్తోంది.

"ఎందుకత్తయ్యా- తాగొద్దంటున్నావ్?" అడిగింది హీరోయిన్. మళ్ళీ అందరూ హీరోయిన్ అత్తవేపు చూశారు. ఆమె అందరివేపూ చూసింది.

తరువాత తోటి కోడలు మొఖంలోకి చూసింది.

తోటికోడలు అందరి మొఖాల్లోకీ చూసింది.

"ఎందుకంటే..." అంటూ సగంలో డైలాగ్ ఆపింది. దాంతో అందరూ ఒక్కొక్కరుగా మళ్ళీ ఆమె వేపు చూశారు.

ఆమె మళ్ళీ అందరివేపూ చూసింది.

తోటికోడలు మొఖంలో భయం-

"ఎందుకంటే- నువ్ చేసిన నికృష్టమయిన పనికి-" దాంతో తోటికోడలు మొఖంలో రకరకాల ఎక్స్ ప్రెషన్స్- అందరూ తోటికోడలు వేపు సపరేట్ గా చూశారు. తోటికోడలు సపరేట్ గా అందరివేపూ చూసింది.

"ఎందుకంటే నువ్ చేసిన నికృష్ఠమయిన పనికి-" అనే డైలాగ్ ఆ హాలంతా అన్నీ కార్నర్స్ లో మార్మోగిపోయింది.

"నేనేం చేశానత్తయ్యా-" ఏడుపు ఆపుకుంటూ అడిగింది తోటికోడలు- అందరి మొఖాలో సస్పెన్స్- అందరూ ఒకరి మొఖాలొకరు చూసుకున్నారు. కిటికీలోనుంచి తోటమాలి- బయటనుంచి కారు డ్రైవర్ కూడా ఒకరి మొఖాలొకరు చూసుకున్నారు.

"ఏం చేశావా?" అంటూ మళ్లీ అరచింది అత్త- మళ్ళీ అందరూ తోటికోడలు హీరోయిన్ వేపు చూసింది. హీరోయిన్ బాత్ రూమ్ డోర్ లో గంటసేపట్నుంచీ టవల్ కట్టుకు నిలబడ్డ భర్తవేపు చూసింది. భర్త తండ్రి వేపు చూశాడు. తండ్రి కుక్కవేపు చూశాడు. కుక్క పాలగ్లాస్ వేపు చూసింది.

"సుష్మితకు పాలిచ్చే ముందు డాక్టరిచ్చిన టాబ్ లెట్ ఇమ్మని చెప్పాను కదా-"

అంతవరకూ చూశాక మేము టీవీ ఆఫ్ చేసి బయటపడ్డాం- ఆ తరువాత ఆ నరకాన్ని మర్చిపోడానికి వారంరోజులపాటు సాయంత్రాలు ఫుల్ గా మందుకొడితేగానీ మర్చిపోవటం కుదర్లేదు.

ఎలాగయితేనేం- రెండు రోజుల్లో టీవీ సీరియల్ కు కథ తయారయింది. దానికి చంద్రకాంత్ తోనే డైలాగులు రాయించాం!

వెంటనే టీవీ సీరియల్స్ తీయటంలో అనుభవం ఉన్న ఒక డైరక్టర్ ని తీసుకొచ్చి అయిదు ఎపిసోడ్ లు షూటింగ్ చేయించాం.

షూటింగ్ అంతా మా కాలనీలోనే జరిగింది.

జనార్ధన్ మెయిన్ రోల్ వేస్తానని పట్టుపట్టాడు గానీ అతనిని అందరం కలసి బ్రతిమాలి హీరోయిన్ అన్నగా వేయించాం!

మిగతాన్ నటీనటుల్లో చాలామంది మా కాలనీలో ఉండేవాళ్ళే. ఎందుకంటే అందరికీ టీవీలో ఏదొక కార్యక్రమంలో పార్టిసిపేట్ చేసిన అనుభవం ఉంది.

అసలు మాకే ఆశ్చర్యం వేసింది- ఇన్ని వందల మంది అప్పటికే వివిధ చానెల్స్ లో ఏదొక ప్రోగ్రాంలో అనుభవం సంపాదించాలంటే-

ఆ తర్వాత ఎడిటింగ్, మ్యూజిక్ అన్నీ అయాక కాలనీ వాళ్ళందరం కలసి ఒకసారి ఆ అయిదు ఎపిసోడ్ లూ మా కమ్యూనిటీ హాల్లో ఓ పెద్ద ఎల్ ఈడీ స్క్రీన్ మీద చూశాం!

అన్ని సీన్స్ లో మా కాలనీవాళ్ళూ, వాళ్ళ పిల్లలూ ఒకటి రెండుసార్లు కనబడటంతో అందరూ ఆ సీరియల్ అద్భుతంగా ఉందని మెచ్చుకున్నారు.

అంతమంచి వెరయిటీ సీరియల్- పైగా అశ్లీలం, అవాంఛనీయమయిన సన్నివేశాలేమీ లేకుండా- ఇవన్నీ కాకుండా ఓ మంచి సామాజిక స్పృహతో, ఒక సోషల్ పర్పస్ తో కథనం ఉన్నందుకు అందరూ మా కమిటీని అభినందించారు. వెంటనే విజృంభించిన ఉత్సాహంతో దాని మార్కెటింగ్ గురించి ప్రయత్నాలు ప్రారంభించాం.

"సీరియల్ చాలా గొప్పగా తీస్తున్నాం గనుక కనీసం ఒక ఎపిసోడ్ కీ లక్షన్నర లేందే ఏ చానెల్ కీ ఇవ్వగూడదు" అన్నాడు రంగారెడ్డి.

"ఏ చానెల్ కిద్దాం?" అడిగాడు శాయిరామ్.

"ముందు చాలా ఫేమస్ చానెల్ చిమ్మీ చానెల్ కాబట్టి దానికే ఇద్దాం! మన స్టేట్ లో లేడీస్ అంతా ఆ చానెలే చూస్తున్నారు-" అంది సావిత్రమ్మగారు.

ఒక మంచి రోజు చూసుకుని అందరం చిమ్మీ చానెల్ కెళ్ళాం.

టీవీ సీరియల్స్ ఇన్ ఛార్జి భోలామోహన్ ని కలుసుకోవాలని రిసెప్షనిస్ట్ కి చెప్పాం.

"ఇవాళ కుదర్దు- వారం తర్వాత రండి-" అందామె.

"వారం తర్వాతా?"

"అవును-"

"ఇప్పుడెందుకు కుదర్దు?"

"పొద్దున్న ఆయనెవరినీ చూడడు-"

"ఎందుకని? హెల్త్ ప్రాబ్లెమా?"

"అది మీకవసరమా?"

"చాలా అవసరం ఎందుకంటే మేము సిటీ బయట ఉండే నిర్భయ్ నగర్ కాలనీ నుంచివచ్చాం! తెల్లారుజామున నాలుగింటికి లేచి బయల్దేరితేనే ఈ ట్రాఫిక్ లో ఇప్పటికి మీ ఆఫీస్ చేరుకోగలిగాం! ఇవాళ కుదర్దన్నారంటే- మళ్ళీ మేము వచ్చే వారం కూడా ఆఫీసులు మానేసి తెల్లారుజామున నాలుగుకి లేవాల్సివస్తుంది."

"అయామ్ సారీ - ఈ వారం కుదర్దు-"

ఏం చేయాలో మా కర్థం కాలేదు. ఆ రిసిప్షనిస్ట్ ని తిట్టుకుంటూ బయటకు నడుస్తోంటే మాకు పరిచయమున్న ఒకతను చిమ్మీ చానెల్ అన్న అక్షరాలున్న యూనిఫారంతో కనిపించాడు.

"నమస్తే అన్నా- మా చానెల్ కొచ్చినేంది సంగతి?" ఆప్యాయంగా పలుకరించాడు.

అతని పేరు రవి.

అతను మా కాలనీలో కొంతకాలం అద్దెకుండి తర్వాత "థూ- నీయవ్వ కాలనీ- బస్ లో ఆఫీస్ కి పోయిరావాల్నంటే ఒకరోజంతా పోతోంది-" అంటూ సిటీలో ఇరుకయిన గది తీసుకుని షిఫ్టయిపోయాడు.

వెంటనే రవికి విషయమంతా చెప్పాం-

"రిసెప్షనిస్ట్ చెప్పిన మాట నిజమే అన్నా! భోలామోహన్ సాబ్ మాణింగ్ టైమ్ లో ఎవ్వరినీ చూడడు-"

"ఎందుకని?"

"మీకు తెలీందేమన్నా! మధ్యాహ్నం పన్నెండింటివరకూ హాంగోవర్ తో ఉంటాడు. దినాం రాత్రుళ్ళు పార్టీలుంటయ్ కదా-"

"బాబ్బాబు! ఈ ఒక్కసారికీ హాంగోవర్ తోనే మాతో మాట్లాడమను- మేమేం అనుకోం. గవర్నమెంట్ ఆఫీసుల్లో మొత్తం హాంగోవర్ కేస్ లే కదా! అందరికీ తెల్సిన సంగతే- అసలు మన గవర్నమెంటే కిందటి ఎలక్షన్ల హాంగోవర్ లో వర్క్ చేస్తోంది-" బ్రతిమాలాడు రంగారెడ్డి.

రవి తలగోక్కున్నాడు.

"కానీ ఆ సారేమంటాడో ఏమో-"

ఇండియాలో సీరియస్ డిస్కషన్స్ అవుతున్నప్పుడు మధ్యలో ఎవడైనా తలగోక్కున్నాడూ అంటే అర్థం ఒక్కటే!

ఆ అర్థం మాకర్థమయింది గనుక వెంటనే ఒక అయిదొందల నోటు తీసి రవి జేబులో కుక్కాం!

"బాబ్బాబు- ఎలాగోలా పని కానీ-"

"ఈ అయిదొందల్లో ఒక క్వార్టర్ తీసుకెళ్ళి సార్ కే ఇస్తా! అప్పుడు హాంగోవర్ దిగుద్దేమో- ఓ పని చేయండి- మీరిక్కడే కూర్చోండి-" అంటూ వెళ్ళి అరగంటలో తిరిగివచ్చాడు.

"రండి- సార్ పిలుస్తున్నారు-"

అందరం రూమ్ లో కెళ్ళాం!

"త్వరగా చెప్పండి! పావుగంటే టైముంది- తర్వాత మీటింగ్ కెళ్ళాలి-" అన్నాడతను కొంచెంగా తూగుతూ-

వెంటనే పార్వతీదేవి చెప్పటం మొదలుపెట్టింది.

"మా సీరియల్ కి కథ సాహిత్య అకాడెమీ బహుమతి ఇచ్చిన నవల నుంచి తీసుకున్నాం సార్! ఆ నవల రాసిన రచయిత్రి బ్రహ్మకుమారి- మన రాష్ట్రమంతా చాలా పేరు ప్రఖ్యాతులున్నాయ్ ఆమెకి-"

"స్టాప్" అన్నాడతను చేయి పైకెత్తుతూ-

పార్వతీదేవి షాకయి ఠక్కున ఆపేసింది.

"చూడండి! స్టోరీ ఎవర్రాశారు? ఆ నవల కెన్ని బహుమతులొచ్చినయ్- ఎందుకొచ్చినయ్- ఎలా వచ్చినయ్- ఇదంతా మాకనవసరం!" అన్నాడతను.

వెంటనే రంగారెడ్డి అందుకున్నాడు.

"ఇక డైరక్షన్ గురించి చెప్పాలంటే- ఫేమస్ టీవీ సీరియల్ డైరెక్టర్ కేకేయస్ వనమాలిగారు డైరక్ట్ చేశారు-"

మళ్ళీ స్టాప్ అంటూ చేయి పైకెత్తాడు బోళామోహన్.

రంగారెడ్డి ఆపేశాడు.

"ఎవడు డైరక్ట్ చేశాడూ" అనేది కాదు మాక్కావలసింది. ఎలా చేశాడూ అనేదే ముఖ్యం-"

"చాలా బాగా చేశాడ్సార్-"

"స్టాప్! ఆ సంగతి చెప్పాల్సింది మీరు కాదు. మా స్క్రీనింగ్ కమిటీ!"

"అలాగే సార్-"

"కథేంటో చెప్పనా సార్?" ఉత్సాహపడింది సావిత్రమ్మ.

"నాక్కాదు. మా క్రియేటివ్ హెడ్ మీనాభజన్ గారిని కలుసుకుని చెప్పండి!"

"ఓకేసార్!"

అతను వెంటనే మీనాభజన్ అనే ఆమెకు ఫోన్ చేశాడు.

"మీనాజీ! వీళ్ళెవరో సీరియల్ తీశారంట- ఒకసారి మాట్లాడండి-"

"ఓకే-"

"వెళ్ళండి!" అన్నాడతను.

అందరం మీనాభజన్ చాంబర్ వెతుక్కుంటూ బయల్దేరాం- చివరకు ఓ మూల కనిపించిందది-

"ఆ పేరు ఎక్కడో విన్నానే" అంది పార్వతీదేవి అప్పుడే అటువచ్చిన రవితో.

"ఇంతకుముందు తుగ్లక్ ఛానెల్లో పనిచేసేది మేడమ్! అక్కడి స్క్రిప్ట్ ఇన్ ఛార్జ్ గా ఉండేది. కొంతమంది బిగ్ షాట్స్ ని ఇంటర్ వ్యూ కూడా చేస్తూండేది-" చెప్పాడు రవి.

దాంతో అందరికీ గుర్తుకొచ్చేసింది.

"మరి ఆ ఛానెల్లో మానేసి ఈ చిమ్నీ ఛానెల్లో కెందుకొచ్చింది?"

"అక్కడ సీరియల్ ప్రొడ్యూసర్లందరి దగ్గరా డబ్బు ఎక్కువగా తీసుకుని- మిగతా హెడ్స్ కి తక్కువ షేర్ ఇచ్చిందంట- టూమచ్ ఫ్రాడ్ అని డిస్మిస్ చేశారు"

మాకు మతిపోయినట్లయింది.

"చానెల్స్ లో కూడా గవర్నమెంట్ ఆఫీసుల్లాగా అవినీతి ఉంటుందా?"

రవి పగలబడి నవ్వాడు.

"సిటీ బయట కాలనీలో ఉంటే ఇదే ప్రాబ్లెమ్ సార్! ఎక్కడేం జరుగుతోందో ఎవరికీ తెలీదు. నేనందుకే పారిపోయి సిటీలో కొచ్చా!"

"అది సరేగానీ నాకిక్కడో విషయం అర్థం కావటం లేదు..." అన్నాడు శాయిరామ్.

"ఏంటది?"

"అదే- తుగ్లక్ ఛానెల్లో ఆమె పరమ ఫ్రాడ్ స్టర్ అని డిస్మిస్ చేశారు కదా! మరి అలాంటి ఆమెకు చిమ్నీ చానెల్ వాళ్ళు ఎలా జాబ్ ఇచ్చారు?"

మళ్ళీ విరగబడి నవ్వాడు రవి.

"ఎంత వెనుకబడి ఉన్నారు సార్ మీ కాలనీవాళ్ళు? ఎప్పటికి అభివృద్ధి చెందుతారో ఏమో- మిమ్మల్ని చూస్తే ఎంతో జాలిగా ఉంది నాకు-"

వాడలా అంటూంటే మాకు చాలా ఇన్సల్ట్ అనిపించింది గానీ వాడు చెప్పేది ఫాక్టే గనుక ఎదురు మాట్లాడలేకపోయాం.

"చూడండి సార్! ఇది కార్పొరేట్ వరల్డ్! ఇక్కడ గవర్నమెంట్ లో లాగా ఎవడు నీతిపరుడు- ఎవడు అవినీతిపరుడు అనే విషయం ఎవడూ పట్టించుకోడు. అసలు కార్పొరేట్ అంటేనే కరప్షన్. వాళ్ళ ఒక ఇండస్ట్రీ పెట్టాలంటే ముందు ఆ ఇండస్ట్రీకి సంబంధించిన మినిష్టర్ కి లంచాలిస్తారు- ఆ తరువాత ముఖ్యమంత్రికి లంచాలిస్తారు. ఆ ఏరియా ఎంపీకీ, ఎమ్మెల్యేకీ, పోలీసాఫీసర్లకూ అందరికీ ఎవరి వాటా వారికిచ్చేస్తారు. అంటే అవినీతినే పెట్టుబడిగా పెట్టి ఆ కార్పొరేషన్ స్టార్ట్ చేస్తారన్నమాట. ఆ లెవల్లో పనిచేసే ఛానెల్ వాళ్ళు మరి స్టాఫ్ ని ఎలాంటి వాళ్ళను సెలక్ట్ చేసుకుంటారు? అందరిలోకీ అవినీతి మొనగాడెవడో వాడే కావాలి వాళ్ళకు- ఎంత గొప్ప అవినీతి పరుడుంటే కార్పొరేషన్స్ కి అంతలాభం! ఎందుకంటే అవినీతినే ఆయుధంగా ఉపయోగించుకుని వాళ్ళు కార్పొరేషన్ కి లాభాల పంట పండిస్తారు-

ఆ సమయంలో వాడు శ్రీకృష్ణుడులాగానూ, మేమంతా అర్జునుళ్ళాగానూ వాడు చెప్పేది భగవద్గీతలాగానూ మాకనిపించింది.

"ఉదాహరణకి ఒక కార్పొరేషన్ తమ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ని టూమచ్ ఆఫ్ అవినీతిపరుడని డిస్మిస్ చేసిందనుకోండి, దానర్థం ఏమిటి? వాడు ఎంత పెద్ద పదవిలో ఉన్నవాడినయినా డబ్బుతో పడేయడానికి- గల సామర్థ్యం ఉన్నవాడూ అని. ఒకవేళ డబ్బుకి లొంగని వాళ్ళుంటే- వాళ్ళని పడేయడానికి వాడికి సపోర్ట్ గా పాతికమంది తారా చౌదరిలు రాత్రింబగళ్ళు పనిచేస్తూంటారు-

పోలీసాఫీసర్లూ, ఇన్ కమ్ టాక్స్ వాళ్ళూ, సెంట్రల్ ఎక్సయిజ్ వాళ్ళూ, మినిష్టర్లూ, ఎమ్మెల్యేలు, ఎంపీలూ, ఒకరేంటి- మొత్తం దేశం ఆ అవినీతి వైస్ ప్రెసిడెంట్ గుప్పిట్లో ఉంటుందన్నమాట!

అలాంటి వాడిని ఒక తెలివి తక్కువ ఛానెల్ డిస్మిస్ చేసిందంటే వెంటనే మిగతా ఛానెల్స్ పోటీలుపడి ఎక్కువ జీతమిచ్చి ఎక్కువ హోదా ఇచ్చి అపాయింట్ చేసుకుంటాయన్నమాట!- అంచేత మీనాభజన్ లాంటి వాళ్ళు లైఫ్ లాంగ్ ఫుల్ డిమాండ్ లో ఉంటారు- అర్థమయిందా సార్-"

రంగారెడ్డి ఆ లెక్చర్ కి ఎంత ఉత్తేజితుడయాడంటే అమాంతం లేచి వాడిని కౌగిలించుకున్నాడు.

"ఒరే రవీ! వయసులో మాకంటే ఎంతో చిన్నవాడివయినా ఎంత కాచి వడబోశావ్ రా- మన ఇండియాని! ఇంతకాలం మన కాలనీలోని వాళ్ళందరం- శుంఠ వెధవల్లాగా, అవినీతి పరులనే వాళ్ళు సమాజానికి చీడపురుగులన్న భ్రమలో ఉన్నాం- అంతే కాదు. అవినీతి పరుల్ని మొత్తం సమాజం నీచంగా చూస్తుంది, ఒకసారి అవినీతి పరుడు అని ముద్రపడిన వాడిని జీవితాంతం ఎవరూ తమ దరిదాపులకు కూడా రానివ్వరు అనే తెలివితక్కువ ఊహల్లో ఉన్నాం! ఈ తెలుగు ఛానెల్లో చేరి ఎంత విజ్ఞానం సంపాదించావ్ రా నువ్వు! ఎంతో మేధావి వయ్యావురా నువ్వు!"

వాడు మావేపు చాలా జాలిగా చూశాడు.

"అరెరె- అలా ఫీలవకండిసార్! ఈ టీవీ సీరియల్ తీస్తున్నారు కదా ఎలాగో- ఇది పూర్తి చేసేప్పటికి మీక్కూడా బోలెడు ప్రాక్టికల్ నాలెడ్జ్ వస్తుంది- అప్పుడు మీరిక అవినీతిని అసహ్యించుకోరు- బూతుని ద్వేషించరు- వ్యభిచారాన్ని చూసి కళ్ళుమూసుకోరు- పైపెచ్చు వీటన్నిటినీ ఆరాధిస్తారు- రియల్ లైట్ అంటే అదేసార్! కనువిప్పు కలిగాక మూడు కోతులు బొమ్మలు కొత్త సిద్ధాంతాలు భోదిస్తాయ్ సార్- చెడులేని ప్రదేశాలను చూడకు- అంటుంది కళ్ళు మూసుకున్నకోతి- చెడు, బూతులేనిమాటలు, ఉపన్యాసాలు వినకు- అంటుంది చెవులు మూసుకున్నకోతి- చెడునే పలుకు- అవినీతినే భోధించు- ఒకవేళ నీతిసూత్రాలను వల్లించాల్సిన దురవస్థ కలిగినప్పుడు- నోరు మూసుకో- అంటుంది మూడోకోతి!

ఇవన్నీ ఆచరించటం మొదలుపెట్టారనుకోండి! మీరు కూడా ఏరాజా, కనిమోళి, కల్మాడీ, మన రాష్ట్రంలో శ్రీలక్ష్మిలా- కర్నాటకలో మైనింగ్ గాలిలా బిలియనీర్స్ అయిపోతారు.

కానీ వాళ్ళందరూ జైల్లో ఉన్నారుగా?"

"లక్షల కోట్లు సంపాదించి మనవాళ్ళందరి పేర్లమీదా ఆస్తులు సంపాదించాక- నాల్రోజులు జైల్లో ఉంటే ఏమైందిసార్! ప్రజాస్వామ్యంలో ఈ పోలీసులూ, కోర్టులూ- ఎల్లకాలం ఎవ్వరినీ జైల్లో ఉంచరు- అలాంటి వాళ్ళను రక్షించడానికే క్షమాభిక్ష స్కీమ్ లున్నాయ్. గాంధీ జయంతులున్నాయ్. వాళ్ళవల్ల లాభం పొందిన రాజకీయ నాయకులే హోమ్ మినిష్టర్ లూ, ముఖ్యమంత్రులూ అవుతారు- అప్పుడు మిమ్మల్ని విడుదల చేస్తే ఎవరడ్డొస్తారు?"

"మరి వాళ్ళను వదిలేస్తే ప్రజలూరుకుంటారా?"

రవి మళ్ళీ పగలబడి నవ్వాడు.

"తెలివితక్కువ వాగుడంటే అదే సార్! ప్రజలంటే ఎవర్సార్- పైన్నుంచి దిగొచ్చారా? వాళ్ళూ మెజారిటీ అవినీతిపరులే సార్! లంచాలివ్వటం- లంచాలు తీసుకోవటం వాళ్ళ ఊపిరి! అందుకే వాళ్ళూ అవినీతిపరులనే ఎన్నుకుంటారు- ములాయంసింగ్ వెనుక భయంకరమయిన గూండాలున్నారని ప్రజలందరికీ తెలుసు- అయినా అతన్నే థంపింగ్ మెజారిటీతో గెలిపించారా లేదా? అలాగే ఎన్ని అవినీతి ఆరోపణలున్నా జగన్ కాంగ్రెస్ కి నెల్లూర్ లో పట్టం కట్టారాలేదా? కనుక ప్రజలూరుకుంటారా? అంటూ చిల్లర కొశ్చెన్స్ వేయకండి!"

మేము మాట్లాడుతూండగానే మీనాభజన్ నుంచి లోపలకు రమ్మని మాకు ఆహ్వానం వచ్చింది-

అందరం లోపలికెళ్ళి సోఫాల్లో కూర్చున్నాం!

అప్పటికే ఆమె ఎవరో టీవీ ప్రొడ్యూసర్ తో ఫోన్ లో మాట్లాడుతోంది.

"మీకేమయినా కామన్ సెన్సుందా? ఇప్పటికి పాతిక ఎపిసోడ్స్ టెలికాస్ట్ అయ్యాయ్. అయినా కూడా ఒకే మొగుడు ఒకే పెళ్లాంతో ఈ పాతిక ఎపిసోడ్స్ నుంచీ వదలకుండా కాపురం చేస్తున్నాడు. హీరో తల్లి కారెక్టర్ కి పెళ్ళికి ముందు ఇంకెవడితోనో ప్రేమకలాపాలు జరిపి- ఒక పిల్లాడిని కని అనాథాశ్రమంలో ఇచ్చేసిన ఫ్లాష్ బాక్ లేదు.

హీరో తండ్రికి వేరే ఊళ్ళో సెకండ్ సెటప్ లేదు- హీరోయిన్ చెల్లెలు ఈ పాతిక ఎపిసోడ్స్ నుంచీ ఒకే బాయ్ ఫ్రెండ్ తో తిరుగుతోంది. ఇలా లవ్ ట్రయాంగిల్స్ డబుల్ ట్రయాంగిల్స్- రివర్స్ ట్రయాంగిల్స్ లేకుండా అదెక్కడి సీరియలండీ? ఈ సీరియల్ ఇలాగే నడుస్తే ప్రేక్షకులు చెప్పు తీసుక్కొడతారు-"

"ఎవర్నండీ?"

"ఎవర్నేమిటి? మమ్మల్నే! ఈ రోజుల్లో వ్యూయర్స్ ఎంత ఫాస్ట్ గా ఉన్నారో గ్రహించకపోతే ఎట్లా?- ఏంటీ? ఏం చేయమంటారా? కథ కూడా క్రియేటివ్ హెడ్డే చెప్తే ఇంక ప్రొడ్యూసర్లెందుకండీ- అడుక్కుతినడానికి? పెట్టండి. వల్గర్ సినిమాలకు కథలు రాసే రచయితలుంటారు. అలాంటి వాళ్ళను పట్టుకుని డబ్బిచ్చి కథ మార్పించండి! మందు తాగిస్తే మర్డర్స్ చేసే బాచ్ ఒకటుంది. వాళ్ళను పట్టుకుని వాళ్ళతో క్రైమ్ యాంగిల్ రాయించండి- ఓకే?"

ఫోన్ పెట్టేసిందామె కోపంగా.

మా గుండెలు ఝల్లుమన్నాయ్.

అలాంటి నికృష్టమయిన కథలల్లి టీవీ సీరియల్ తీయాలన్న నాలెడ్జే మాకులేదు.

ఇప్పుడు మా స్టోరీ వింటే ఏమంటుందో ఏమో!

మీనాభజన్ మావేపు చూసింది.

"యస్- ఎవరు మీరు?"

"మాడి నిర్భయ్ నగర్ కాలనీ మేడమ్! మా గురించి రవి మీతో చెప్పానన్నాడు-"

"ఓ రవి చెప్పిన పార్టీయా?"

"అవును మేడమ్- మేము చాలామంచి ఫ్యామిలీ సీరియల్ తీశాం మేడం-"

"ఫ్యామిలీ సీరియలా?" గాబరాగా అడిగిందామె.

"అవును మేడమ్- అంటే ఫామిలీ అంతా- తల్లీ తండ్రీ, పిల్లలూ, అన్నవదినెలు, కొడుకూ కోడళ్ళూ, కూతురూ అల్లుళ్ళూ- అంతా కలిసి కూర్చుని హాపీగా చూసే ఫ్యామిలీ టైప్ స్టోరీతో తీసిన సీరియల్ మేడమ్-"

ఆమె తలకొట్టుకుంది.

"ఛఛఛ! ప్రొఫెషనల్స్ కానివాళ్ళు సీరియల్స్ తీస్తే ఇలాగే ఉంటుంది. ఫ్యామిలీ టైప్ సీరియల్స్ అంటారేంటి? అసలు కంబైన్డ్ ఫామిలీస్ ఎక్కడున్నయ్ మన దగ్గర? ఫాదర్ మందుకొడుతూంటాడు- తల్లి టీవీ ముందుంటుంది. కాలేజ్ గోయింగ్ పిల్లలుంటే వాళ్ళరూమ్ లో ఇంకో టీవీలో హిందీ చానెల్స్ లేదా ఇంగ్లీష్ చానెల్స్ చూస్తూంటారు- లేదా పిల్లలు అమెరికాలో ఉంటారు. ఇంకా ఫ్యామిలీ ఎక్కడుంది?" చిరాగ్గా అంది.

మాకు మాట రాలేదు కాసేపు.

ఆలోచిస్తే ఆమె చెప్పింది నిజమే అనిపించింది.

ఇప్పుడు కంబైన్డ్ ఫ్యామిలీస్ ఎక్కడున్నయ్?

ఉన్నా సెపరేట్ సెటప్ లు-

సిటీ బయట తల్లీదండ్రీ ఒక ఫ్లాట్ లో- హైటెక్ సిటీ దగ్గర ఫ్లాట్ లో కొడుకూ, కోడలూ, ఇంకెక్కడో కూతురూ అల్లుడూ- ఇంకో ఏరియాలో తమ్ముడూ- మరదలూ- మా కాలనీలో పరిస్థితే అలా ఉంది ప్రస్తుతం-

"ఆల్ రైట్! ఈ సీరియల్ కాన్సెప్ట్ ఏంటి?" ఆమె అడిగింది మళ్ళీ.

"రోజురోజుకీ కుటుంబ బంధాలు వ్యాపారాత్మకం అయిపోతున్నాయ్ కదండీ! దానివల్ల మనిషి జీవితంలో ఎన్ని సమస్యలొస్తోందీ--.."

"చాల్చాలు- అర్ధమయింది- పాత చింతకాయ పచ్చడి సబ్జెక్ట్ అన్నమాట! ప్రొఫెషనల్స్ కానివాళ్ళతో ఇదే న్యూసెన్స్- మీరనే కాదు- మీలాంటివాళ్ళు చాలామంది ఇలాంటి చెత్త సబ్జెక్ట్స్ తో వస్తున్నారు. అవన్నీ అవుట్ డేటెడండీ! ఒకసారి మీ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూడండి! ఎలాంటి వింతలు విడ్డూరాలు జరుగుతున్నాయో, ఎలాంటి ఆశ్చర్యకరమయిన సంఘటనలు జరుగుతున్నాయో- అలాంటి సబ్జెక్ట్స్ కావాలి! వివల్యూషనరీ థీమ్స్ కావాలి!- ఓకే! మీ స్టోరీలో క్రైమ్ ఎలిమెంట్ ఉందా?"

"క్రైమా? ఫామిలీ సీరియల్లో క్రైమ్ ఎందుకుంటుంది మేడమ్? ఫామిలీ అంటే సెంటిమెంట్ ముఖ్యం కదా?"

"మీకేమయినా మెంటలా? క్రైమ్ యాంగిల్ లేని ఫామిలీస్ ఎక్కడున్నాయ్ ఇప్పుడు? న్యూస్ పేపర్స్, టీవీ చానెల్స్ చూట్టంలా- మీరు? మొగుడూ, మరదలూ కలిసి పెళ్ళాన్ని మర్డర్ చేసేస్తున్నారు. మరిది వదినతో అక్రమ సంబంధం పెట్టుకుని ఆమె భర్తను- అంటే తన స్వంత అన్నను లేపేస్తున్నాడు. ఒకడు ఫ్రెండ్ భార్యతో సంబంధం పెట్టుకుని అభ్యంతరం చెప్పిన ఆమె అత్తామామలను పైకి పంపించేస్తున్నాడు. తను పెళ్ళి చేసుకుందామనుకున్న అబ్బాయి ఇంకో అమ్మాయిని పెళ్ళి చేసుకుంటున్నాడన్న విషయం తెలిసి ఆ అమ్మాయి గూండాల గాంగ్ కి డబ్బిచ్చి ఆ అమ్మాయిని లేపేయమంటుంది. తీరా ఆ అమ్మాయిని ఆ గూండాగాంగ్ లీడర్ మర్డర్ చేయబోతూ ఆ అమ్మాయితోనే లవ్ లో పడతాడు. దాంతో కథ రివర్స్ అవుతుంది. ఇప్పుడా డాన్ తనకు డబ్బిచ్చిన అమ్మాయినే లేపేయడానికి ప్లాన్ చేస్తాడు.

అదీ ఫామిలీ సీరియలంటే-

"కానీ మీరు చెప్పిన సంఘటన లేమీ ఏ ఫామిలీలోనూ జరగ్గా మేము చూళ్ళేదు మేడమ్- ఒకవేళ ఎక్కడో చోట జరిగినా అది సాధారణం కాదు! చాలా రేర్ గా జరిగేది-"

"అందుకే- అందుకే- అందుకే- అలాంటి సంఘటనలే మన ఫామిలీస్ కి కావాలి. ఎందుకంటే అలాంటి తీరని కోరికలతో- ఫామిలీలో అందరూ రగిలిపోతూ ఉంటారన్న మాట. ఛాన్స్ దొరికితే అలాంటి నేరాలన్నీ చేయడానికి అందరి మనసులూ ఉవ్విళ్ళూరు తుంటాయన్నమాట! అలాంటి అక్రమ సంబంధాల కోసం వెర్రెత్తి పోతూంటారన్నమాట! అందుకే మన ఫామిలీ మెంబర్స్ లోపల అణగారిపోయి ఉన్న ఆ కోర్కెలను మనం సీరియల్స్

ద్వారా బయటపెట్టాలి- అప్పుడేవాళ్ళు సీరియల్స్ ని ఎంజాయ్ చేయటం మొదలుపెడతారు. వాళ్ళు చేయలేక పోయిన పనిని ఆ సీరియల్లో పాత్రలు అవలీలగా చేసేస్తూంటే ఆ పాత్రల్లో తమని ఊహించుకుని ఈ సీరియల్ కి బానిసలయి పోతారన్నమాట! అర్థమయిందా?"

"అయింది గాని మేడమ్- మీరు చెప్పిన లక్షణాలన్నీ మెంటల్ వాళ్ళకుంటాయ్. సాధారణంగా పెరీనార్మ్ అంటారనుకుంటాను ఆ వ్యాధి పేరు-" కొంచెం తిరుగుతూ అన్నాడు గోపాల్రావ్.

"ఎగ్జాక్ట్ లీ! వ్యూయర్స్ ఒరిజినల్ గా పిచ్చివాళ్ళా, లేక సీరియల్స్ చూడటం వల్ల అలా అయ్యారా అనేది మనకు అనవసరం!"

"అంటే మీరు చెప్పిన మార్పులు చేస్తే సీరియల్ ని ఓకే చేస్తారా మేడమ్?" అడిగింది పార్వతీదేవి ఆశగా.

"అప్పుడేనా? ఇంకా చాలా మార్పులు చేయాలి! తండ్రికి అక్రమ సంబంధం ద్వారా పుట్టిన కూతురు అనుకోని పరిస్థితుల్లో ఆ ఇంట్లో దిగాలి. ఆ తల్లికి పెళ్ళికిముందు అక్రమ సంబంధం ద్వారా పుట్టిన కొడుకు ఆ అమ్మాయిని ద్వేషించాలి!...."

"అంటే అక్రమ సంబంధాలు లేని మనుషులెవరూ మన తెలుగిళ్ళల్లో ఉండరంటారా?" కోపం అణచుకుంటూ అడిగింది పార్వతీదేవి-

"నాక్కావలసింది కొశ్చెన్స్ కాదు- నేను చెప్పినట్లు చేస్తారా లేదా అనేది నాక్కావాలి! అంతే!"

"ఇంతేనా మేడమ్? ఇంకేమయినా చేర్చాల్సిన పాయింట్స్ ఉన్నాయా?"

"లేకపోవటమేమిటి? హీరోయిన్ సాధాసీదాగా ఉండకూడదు. అసలు సీరియల్ ఓపెనింగే ఆమె శోభనం రాత్రితో మొదలవ్వాలి! ఆమె భర్త నపుంసకుడని ఆమెకు తెలియటమే ఎపిసోడ్ ఎండింగ్ బాగ్ అన్నమాట-"

మేమందరం షాకయి మొఖాలు చూసుకున్నాం!

"ఇలాంటి శాడిస్ట్ లా మన చానెల్స్ ని నడుపుతోంది?" శాయిరామ్ చెవిలో గొణిగాడు రంగారెడ్డి.

"తరువాతేమవుతాది మేడమ్?" కోపం కంట్రోల్ చేసుకుంటూ అడిగాడు యాదగిరి.

"తన భర్త నపుంసకుడని ఆ అమ్మాయి తల్లిదండ్రులతో చెప్పదు. తన భర్తను మామూలు మగాడిగా మార్చడానికి ఆమె రకరకాల ప్రయత్నాలు చేస్తుంటుంది. కానీ తన భార్యకు శారీరక సుఖం ఇవ్వలేకపోతున్నానే అన్న అశాంతితో, ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ తో- ఆ భర్త ఒక భయంకరమయిన శాడిస్ట్ గా మారిపోతాడు. తన స్నేహితుడితోనే తన భార్యను రేప్ చేయించేందుకు ప్రయత్నిస్తూంటాడు.

వాంతొస్తున్నట్లు మొఖం పెట్టింది చంద్రమతీదేవి.

"మేడమ్- మాకో డౌటు" అన్నాడు రంగారెడ్డి మేడమ్ స్పీచ్ కి అడ్డుపడుతూ.

"యస్- వాటీజ్ యువర్ డౌట్?"

"ఇలాంటి సీరియల్స్ చూసేది ఫ్యామిలీసా, బ్రోకల్ హౌసెస్ లోని మెంబర్సా?"

ఆ ప్రశ్నతో ఆమెకి కోపం ముంచుకొచ్చేసింది.

"ఆ తిక్క ప్రశ్నలే నాకు నచ్చదు. సీరియల్స్ చూసే వాళ్ళెవరు అనే దానిమీద స్టాటిస్టిక్స్ మాకనవసరం! చూస్తున్నారా- లేదా- అంతే! చూస్తూంటే ఎంతమంది చూస్తున్నారు- అంతవరకే!"

"తరువాత ఇంకేం యాడ్ చేయమంటారు మేడమ్?" పరిస్థితి చెడిపోతోందని గ్రహించి టాపిక్ డైవర్ట్ చేశాడు యాదగిరి.

"ఆ అమ్మాయికి భర్త అయిన తన అన్నయ్య సంసారం సుఖం ఇవ్వటం లేదని తెలిసిన తమ్ముడు అవకాశం దొరికినప్పుడల్లా వదినెను రేప్ చేయడానికి ట్రై చేస్తుంటాడు-"

ఆ డైలాగ్ విని అందరూ షాకయ్యారు.

"వ్వాట్? వదినెను మరిది రేప్ చేయడానికి ప్రయత్నిస్తాడా? మీకేమయినా మెంటలా? మన సంస్కృతిలో వదినె తల్లితో సమానం అన్న కామన్ సెన్స్ కూడా లేదా మీకు? మీతో రామాయణం సీరియల్ తీయిస్తే లక్ష్మణుడు సీతను రేప్ చేయడానికి ప్రయత్నించినట్లు తీసేట్లున్నారు-" అంది సావిత్రి ఆవేశంగా. దాంతో మీనాభజన్ ఆవేశంగానే లేచినిలబడింది.

"ఇదిగో- మీకు తెలీపోతే మూసుకోండి! అంతేగానీ మీబోడి కామెంట్స్ ఇక్కడెవరికీ అవసరం లేదు. టీవీ మీడియమ్ గురించి తెలీని మీలాంటి మూర్ఖులను ఎడ్యుకేట్ చేయాలనుకోవటం నాదీ తప్పు-" లేచి అక్కడి నుంచి వెళ్ళిపోయిందామె.

మేము బయటికొచ్చేస్తూంటే రవి మా వెనుకే పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"మీరేమన్నారు సార్? మేడమ్ నామీద గరమ్ అవుతోంది- ఇలాంటి ఇడియట్స్ ని రికమెండ్ చేస్తావా అని-" అడిగాడతను.

"మీనాభజన్ మేడమ్ తో మాట్లాడాక మాకు కొన్ని డౌట్స్ వచ్చినయ్ రవీ! ఆ డౌట్స్ బయటకు చెప్తే ఆమెకు కోపం వచ్చింది-" "ఏమిటి సార్ ఆ డౌట్స్?"

"మా కాలనీలో వాళ్ళందరికీ అసలు తండ్రెవరు? లేదా తల్లులకు పెళ్ళికిముందు ఫ్లాష్ బాక్ లేమిటి? కాలనీలో గాళ్స్ ఒకేసారి ఎంతమంది బాయ్స్ ని లవ్ చేస్తున్నారు? ఆ బాయ్స్ లో గాంగ్ స్టర్స్ ఎంతమంది? ఎంతమంది భార్యలు కేవలం భర్తతోనే సంసారం చేస్తున్నారు? ఎంతమంది భర్తలు భార్యల్ని మర్డర్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు?"

రవి ఇంక శాయిరామ్ డౌట్స్ వినలేకపోయాడు.

"అర్థమయింది సార్- బెస్టాఫ్ లక్! ఇంకో ఛానెల్లో ట్రై చేయండి-" అనేసి వెళ్ళిపోయాడక్కడి నుంచీ! ఆ రాత్రంతా మా కాలనీలో ఎవరికీ నిద్రపట్టలేదు.

"బోలెడు డబ్బు తగలేసి అనవసరంగా సీరియల్ తీశాం!" అన్నాడు రంగారెడ్డి దిగులుగా.

"నువ్వేం ఫికర్ చేయకన్నా! రేపు ఇంకో చానెల్ కెళ్దాం! అందరూ మీనాభజన్ లాంటి శాడిస్ట్ లే వుండరు. నార్మల్ హ్యూమన్ బీయింగ్స్ భీ చానెల్స్ లో ఉంటారు-" అన్నాడు యాదగిరి. ఆ మాటతో మాకు కొంత ధైర్యం వచ్చింది. మర్నాడు ఇంకో చానెల్ కి చేరుకున్నాం! సాయంత్రం వరకూ వెయిట్ చేశాక సీరియల్స్ ఇన్ ఛార్జ్ ప్రొడ్యూసర్ ఇంటర్ వ్యూ ఇచ్చాడు. మా కాన్సెప్ట్ అంతా వినిపించింది చంద్రమతీదేవి.

"కథ మరీ అలా స్ట్రైట్ గా ఉందేంటి? ఎక్కడికక్కడ ట్విస్ట్ లూ, బాంగ్ లూ అనెక్స్ పెక్టెడ్ టర్నింగ్ లూ ఉండాలి కదా-"

"అంటే ఎలా ఉండాలంటారు?"

"భర్త తన పాత ప్రియురాలిని తనింటికి తీసుకొచ్చి ఆమెతోనే సంసారం చేస్తుంటాడు. కోడలంటే పడని అతని తల్లిదండ్రులు కొడుకునే సపోర్ట్ చేసి అతని సెకండ్ సెటప్ ని ఆ ఇంటి అసలు కోడలిలాగా ట్రీట్ చేస్తూంటారు.

భార్యను విడాకులిమ్మని భర్త ఆమెను కొడుతూంటాడు- అయినా భార్య వప్పుకోదు.

"చచ్చేంతవరకూ మీ భార్యగానే ఉంటానని సంధ్యాదేవికి మాట ఇచ్చాను- ఆ మాట తప్పను-" అంటుంది.

"సంధ్యాదేవెవరు?" షాకవుతూ అడుగుతాడు భర్త.

"నేను చెప్పను-" అంటుంది భార్య.

ఆ రోజునుంచీ సంధ్యాదేవి ఎవరో తెలుసుకోడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తూంటాడు భర్త-"

"ఇంతకూ ఆ సంధ్యాదేవి ఎవరుసార్? అడిగాడు జనార్ధన్ ఆత్రుతగా.

"చూశారా! ఆ కారెక్టర్ గురించి మీ అందరికీ ఎంత సస్పెన్స్ గా ఉందో! అలాంటి కారెక్టర్స్ ని మనం సృష్టించాలన్నమాట! నిజానికి సంధ్యాదేవెవరో నాకూ తెలీదు. కానీ ఆ పాత్రను సృష్టించి, దానికో పెద్ద ఫ్లాష్ భాక్ సృష్టించి- అయిదొందల ఎపిసోడ్ ల తర్వాత మెయిన్ స్టోరీకి కలపాలి- అండర్ స్టాండ్?"

"యస్సార్-"

"ఇప్పుడు కథ కింకో ట్విస్ట్ కావాలి! అదేంటంటే హీరోయిన్ ఒంటరిగా గుడికెళ్ళినప్పుడల్లా ఒక యువకుడు ఆమెను కలుసుకుని ఆమెకు ధైర్యం చెప్తూంటాడు-"

"అతనెవరు సార్?"

"నాకేం థెలుసుగ నాకే కాదు! ఎవడికీ తెలీదు. ఇంకో అయిదొందల ఎపిసోడ్స్ వరకూ తెలీనక్కర్లేదుకూడా! ఆ తరువాత డిసైడ్ చేయవచ్చు. అతను ఆమె మాజీ భర్త అయుండవచ్చు. కానీ కొన్ని కారణాలవల్ల సంసారం చేయకుండానే విడిపోయి ఉండవచ్చు- లేదా ఆమె ప్రియుడయి ఉండవచ్చు- లేదా-"

"అర్ధమయింది సార్-" హాపీగా చెప్పాడు రంగారెడ్డి పిచ్చి చూపులు చూస్తూ-

అతను ఇంకా రకరకాల పాయింట్స్ చెప్తూనే ఉన్నాడు.

"ఈలోగా తోటి కోడలు ఎంటరవుతుంది ఇంట్లో! ఆమెకి పిల్లలు పుట్టరు. అందుకని తన భర్తతో హీరోయిన్ కి గర్భధారణ చేయించి- ఆమెకి పాపపుడితే తను పెంచుకోవాలని పన్నాగం పన్నుతుంది. అందుకు ఇద్దరు లేడీ గైనకాలజిస్ట్ లు ఆమెకు సాయం చేస్తూంటారు. సడెన్ గా హీరోయిన్ గర్భవతవుతుంది-" అందరం ఉలిక్కిపడ్డాం-

"ఎవరివల్ల గర్భం వచ్చింది?" అడిగాడు జనార్ధన్ ఆత్రుతగా-

"ఆ సంగతి మనం ఇప్పటికిప్పుడే డిసైడ్ చేయాల్సిన అవసరం లేదు. ఇంకో రెండొందల ఎపిసోడ్ ల వరకూ ప్రేక్షకులకు సస్పెన్స్! ఎవరు గర్భం చేశారు? అందరికీ ఆమె భర్త వల్లే గర్భవతయిందని అనుమానం కలిగిస్తాం గానీ ఆమె భర్తే ఒకరోజు భార్యను నిలదీస్తాడు.

"ఎవరి వల్ల నువ్వీ గర్భం ధరించావ్?" అంటూ హింసించటం మరో వంద ఎపిసోడ్ లు చూపిస్తాం! అప్పుడు ఆడియెన్స్ కి ఇంకో షాక్!

ఆ షాకేంటంటే తనకు గర్భం ఎవరు చేశారో హీరోయిన్ కే తెలీదు. గుళ్ళో దేముడి ముందు ఏడుస్తూ "స్వామీ నా గర్భంలోని బిడ్డకు తండ్రెవరో నువ్వయినా చెప్పు స్వామీ!" నువ్ చెప్పకపోతే ఇప్పుడే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటాను" అంటూంటే సడెన్ గా ఓ ముసుగు స్త్రీ వస్తుంది.

"జరిగిందంతా - నేను చెప్తానమ్మా!" అంటుందామె.

"మీరెవరు?"

"అది మాత్రం అడక్కు! నేను నీ శ్రేయోభిలాషిని! నీకు రక్షగా ఉంటానికే ఇక్కడి కొచ్చాను. ఇంకో వంద ఎపిసోడ్స్ తర్వాతే నా ముసుగు తీసి నా అసలు రూపం అందరికీ చూపిస్తాను-" అంటుందామె. "ఇంతకూ ఆ ముసుగులేడీ ఎవరు సార్?"

"నాకు మాత్రమేం తెలుసు! వంద ఎపిసోడ్స్ తర్వాత దాన్ని గురించి ఆలోచించవచ్చు- నా ఉద్దేశ్యం ఏమిటంటే- ఆమె ఒక లేడీ డాన్ అని ఆడియెన్స్ కి షాకివ్వచ్చు. ఆ లేడీ డాన్ ఒకప్పుడు రాయలసీమ ఫామిలీకి చెందిన కోడలన్నమాట! ఈ ఫామిలీ వాళ్ళు ఆమె ఫామిలీ వాళ్ళందరినీ పాతికేళ్ళ క్రితం మర్డర్ చేశారన్నమాట!

ఇప్పుడు ఈ ఫామిలీని సర్వనాశనం చేసి రివెంజ్ తీసుకోడానికి వచ్చిందన్నమాట!"

అతను కిటికీలో నుంచి బయటకు చూస్తూ చెప్తూనే ఉన్నాడు.

మేమంతా అతను చూడకుండా సైగలు చేసుకుని శబ్దాలు కాకుండా ఒకరి వెనుక ఒకరు బయటకు నడిచాం. మేమలా వెళ్ళిపోయిన విషయం అతనికింకా తెలిసినట్లులేదు. అందుకే అతను ఇంకా కొన్ని ట్విస్ట్ లు చెప్పటం మాకు వినబడుతూనే ఉంది-

"అప్పుడు అనెక్స్ పెక్టెడ్ గా హీరో ఫస్ట్ వైఫ్ కి పిచ్చెక్కుతుందన్నమాట! ఆ పిచ్చిలో చేసే పనులవల్ల కారెక్టర్స్ మధ్య క్లాషెస్! అందరికీ టెన్షన్-"

ఆఫీస్ బయటికొచ్చాక ఎందుకయినా మంచిదని ఆ భవనం వేపు చూశాం అందరం. మేము వచ్చింది టీవీ చానెల్ కా, మెంటల్ హాస్పిటల్ కా అన్న అనుమానం క్లారిఫై చేసుకోడానికి! కానీ అలాంటి బోర్డ్ ఎక్కడా కనిపించలేదు.

వాచ్ మెన్ మావేపు డౌటుగా చూశాడు.

"ఏంటి సార్- చూస్తున్నారు?" అడిగాడతను-

"మేము వచ్చింది టీవీ చానెల్ కా లేక మెంటల్ హాస్పిటల్ కా అన్న డౌట్ వచ్చింది- అందుకని బోర్డ్ కోసం వెతుకుతున్నాం!" అన్నాడు రంగారెడ్డి.

"మీకే కాద్సార్- చాలామందికి ఇదే డౌట్! ఎందుకంటే ఈ బిల్డింగ్ లో ఒకప్పుడు మెంటల్ హాస్పిటల్ ఉండేది- అందుకే మా మానేజ్ మెంట్ అదిగో ఆ గేటు బయటే బోర్డ్ పెట్టించింది" అంటూ బయట ఉన్న పెద్ద బోర్డ్ చూపించాడు.

అందరం ఆ బోర్డ్ దగ్గరకు నడిచాం.

"భ్రమణ టీవీ ఛానెల్ అన్న అక్షరాల కింది చిన్న అక్షరాలతో ఇంకో రెండు లైన్లు రాసి ఉన్నయ్.

"ఇంతవరకూ ఇక్కడ ఉన్న మెంటల్ హాస్పిటల్ ఇదే భవనంలో వెనుక వేపుకి మార్చబడినది- గమనించ ప్రార్థన-"

"చూశారా సార్- ఇంత క్లియర్ గా రాసినా కూడా ఇంకా చాలామంది మెంటల్ హాస్పిటల్ అనుకుని ఛానెల్ ఆఫీస్ లోకీ, ఛానెల్ ఆఫీస్ అనుకుని మెంటల్ హాస్పిటల్లోకీ వెళ్తుంటారు-" చెప్పాడు వాచ్ మెన్.

"ఇంత క్లియర్ గా రాసినా కూడా ఇంకా కన్ ఫ్యూజన్ ఎందుకొస్తోంది?" అడిగాడు శాయిరామ్.

"ప్రాబ్లెమేంటంటే సార్- ఆ భ్రమణం ఛానెల్ కీ, ఆ మెంటల్ హాస్పిటల్ కీ ఓనర్ ఒక్కడే సార్! అందుకే కన్ ఫ్యూజన్-"

ఎందుకయినా మంచిదని మేము కొంచెం ఫాస్ట్ గా నడిచి అక్కడినుంచి బయటపడ్డాం!

ఆ రాత్రి ఎమర్జెన్సీ మీటింగ్ పెట్టాం!

"ఆ రెండు ఛానెల్స్ వాళ్ళ క్రియేటివ్ హెడ్స్ చెప్పిన సజెషన్స్ విన్నారు కదా! అవన్నీ మన సీరియల్లో చేర్చటం పెద్ద కష్టమయిన పనేం కాదు.

అలా చేస్తే వాళ్ళు మన సీరియల్ ని టెలికాస్ట్ చేస్తారు. టెలికాస్ట్ అయితే బోలెడు డబ్బు మన కాలనీ వెల్ఫేర్ సొసైటీ కొస్తుంది. నిజమే!

కానీ ఆ డబ్బుకోసం మనం మానాభిమానాలు, నీతీ, నియమాలు గాలికొదిలేస్తామా?" అడిగాడు గోపాల్రావ్.

"కేవలం డబ్బు సంపాదనే మనధ్యేయం అయినట్లయితే మనం ఇలా ఎవరుద్యోగం వాళ్ళు చేసుకుంటూ చాలీచాలని జీవితాలు గడపాల్సిన అవసరం లేదు. ఏదొక ఫ్రాడ్ చేసి తేలిగ్గా డబ్బు సంపాదించవచ్చు. కనుక ఆ మెంటల్ గాళ్ళు చెప్పిన వన్నీ మన సీరియల్లో జొప్పించే బదులు ఇంతవరకూ తీసిన ఆ పది ఎపిసోడ్ లూ చెత్తబండిలో పారేద్దాం!" అంది పార్వతీదేవి.

ఏదేమయినా మర్నాడు ఇంక మిగిలిన మరో టీవీ చానెల్ కెళ్ళి ఆఖరి ప్రయత్నం చేయాలనుకున్నాం.

మామూలుగానే రోజంతా పడిగాపులు పడ్డాక సాయంత్రం ఇంటర్ వ్యూ ఇచ్చాడు సీరియల్స్ ఇన్ ఛార్జ్... వెంటనే సీరియల్ కి మేము తీసుకున్న సబ్జెక్ట్ గురించి చెప్పటం మొదలుపెట్టింది పార్వతీదేవి.

"మేము తీసుకున్న సబ్జెక్ట్ ఆషామాషీ టైప్ కాదండీ! సాహిత్య అకాడమీ అవార్డ్ పొందిన బ్రహ్మకుమారి గారి నవలండీ-"

అతనికి అర్థమయినట్లులేదు. "బ్రహ్మకుమారా?"

"అవునండీ!"

"ఆవిడకు అదేదో అకాడెమీ అవార్డ్ ఇచ్చారా?"

"ఆవిడకు కాదండీ! ఆమెరాసిన నవలకి- ఆ నవల్నే మా సీరియల్ కి అడాప్ట్ చేసుకున్నామండీ-"

"ఇదిగో చూడండీ! సీరియల్ స్టోరీ ఏంటి- ఎవర్రాశారు? ఎందుకు రాశారు? ఇవన్నీ మాకనవసరం!" మేము షాకయ్యాం!

"అదేంటి సార్- సీరియల్ కి ముఖ్యం స్టోరీ కాదా?"

"స్టోరీ ఏంటనేది కాదు- ఎలా- ఎంత ఎఫెక్టివ్ గా చూపించాం అనేది ఇంపార్టెంట్-"

"పోనీ మా సీరియల్ టెక్నికల్ టీమ్ గురించీ, డైరెక్టర్ గురించీ చెప్పమంటారా?"

"వేస్టాఫ్ టైమ్!"

మాకు మతిపోయినట్లయింది.

"అయితే మరి మీకేది ఇంపార్టెంట్?"

"పర్సెంటేజ్ ఎంత?"

మాకా ప్రశ్న అర్థం కాలేదు. అందరం ఒకరి మొఖాలొకరు చూసుకున్నాం! ఎవరికీ ఆ ప్రశ్న అర్థం కాలేదన్న విషయం అందరికీ అర్థమయింది.

"పర్సెంటేజ్ అంటే- కొంచెం వివరంగా చెప్తారా?" అతను షాకయ్యాడు.

"వ్వాట్? పర్సెంటేజ్ అంటే ఏంటో తెలీకుండా టీవీ సీరియల్ తీశారా? ఓగాడ్! ఎలాంటెలాంటి వాళ్ళొస్తున్నార్రా ఫీల్డ్ లోకి! ఇదిగో- చూడండి మిస్టరగ ఏమీ తెలీని మీలాంటి వాళ్ళను ఎడ్యుకేట్ చేసేంత టైమ్ నాకు లేదు- మీకు అంత సీన్ లేదు. ఇంక వెళ్ళండి-"

అందరం కంగారుపడ్డాం.

"సారీ సర్! ఫస్ట్ టైమ్ సీరియల్ తీశాం! మీరు అన్న పదాల గురించి నేర్చుకుంటాం! ప్రస్తుతానికి కొంచెం హెల్ప్ చేయండి-" బ్రతిమాలాడు బోసు. అతను మా పరిస్థితి చూసి జాలిపడినట్లున్నాడు.

"పర్సెంటేజ్ అంటే మీరిచ్చే పర్సెంటేజ్ ఎంత అని నా అర్థం-" అన్నాడు కొంత వివరణ ఇస్తూ.

మా కన్ ఫ్యూజన్ ఇంకొంచెం ఎక్కువయింది.

"మేమిచ్చే పర్సెంటేజా?"

"అవును!"

"మేం పర్సెంటేజ్ ఇవ్వటమేంటి?"

"ఇవ్వకపోతే కుదరదండీ-"

"అదే అడుగుతున్నాం సార్- పర్సెంటేజ్ అంటే ఏంటి? ఎవరు ఎవరికివ్వాలి?" అడిగాడు జనార్ధన్.

అతను తలరెండు చేతుల్తో పట్టుకున్నాడు.

"ఓర్నాయనో! మరీ ఇంత ఎమెచ్యూర్సా! మీతో ఇంకాసేపు మాట్లాడితే బీపీ పెరిగి పోతుంది. వన్ మినిట్-" అంటూ సొరుగులాగి అందులోనుంచి ఒక టాబ్లెట్ తీసుకుని నోట్లో వేసుకుని మంచినీళ్ళు తాగాడు.

"చూడండి! మీరు సీరియల్ తీశారు. అవునా?"

"కరెక్ట్ సార్-"

"ఇప్పుడు మీ సీరియల్ ని మా ఛానెల్ కమ్మి నాలుగు రూపాయలు లాభం పొందాలను కుంటున్నారు- అవునా?"

"ఆహా అరటిపండు వలచినట్లు చెప్పారు సార్-"

"అంటే మీరు తీసిన ప్రతి ఎపిసోడ్ కి మేము మీకు ఇంతమొత్తం ఇవ్వాలి- అని అనుకుని ఆ మొత్తం మీకిస్తాం! అవునా?"

"అవున్సార్-"

"ఇక్కడే అసలు మేటరుంది? మేము మీకిచ్చే మనీలో మాకెంత పర్సెంటేజ్ ఇస్తారు?"

అప్పుడర్థమయినట్లుంది రంగారెడ్డికి.

"అదే రా భాయ్! కిక్ బాక్స్ అంటారు చూడండి! రాజా, కనిమోళి, గాలి, కల్మాడీ లాంటివాళ్ళు కాజేసిన డబ్బులాంటిది-"

"ఓహో! మీరడిగేది మీ కమిషనా?"

"అవును!"

"ఇలా కమిషన్ ఇచ్చే ప్రోగ్రామ్స్ నే కమిషన్డ్ ప్రోగ్రామ్స్ అంటారేమో రా భాయ్-" అన్నాడు యాదగిరి.

"అయితే ఇచ్చేద్దాం! మనదేం పోయింది. వాళ్ళిచ్చే డబ్బులోనే వీడికొంత ఇవ్వాలి. అంతేకదా! అన్నాడు గోపాల్రావ్.

"మీరే చెప్పండి సార్ ఎంతివ్వాలో- మాకేం తెలుస్తుంది? ఎమెచ్యూర్స్ కదా మేము- గైడ్ చేయండి" అన్నాడు శాయిరామ్.

"జనరల్ గా నేను ట్వంటీ పర్సెంట్ తీసుకుంటాను-"

"అంటే?"

"అంటే మా ఛానెల్ మీకు ఎపిసోడ్ కి లక్షరూపాయలిచ్చిందనుకోండి! అందులో ఇరవై వేలు నాకివ్వాలి-"

మేమంతా ఓ మూలకెళ్ళి డిస్కస్ చేసుకున్నాం.

"అన్ని ఛానెల్స్ లో ఈ పవిత్రబంధం తప్పదంట బ్రదర్- మన రవి చెప్పాడు కదా! ఇచ్చిపారేద్దాం-" అన్నాడు జనార్ధన్.

"ఓకేసార్! ఎగ్రీడ్-" అన్నాడు రంగారెడ్డి.

"అయితే ఇక్కడో మేటర్ మీరు తెలుసుకోవాలి-"

"ఏమిటి సార్?"

"మేము మీకు మొదటి ఎపిసోడ్ డబ్బు అరవయ్యో ఎపిసోడ్ టెలికాస్ట్ అయ్యేవరకూ ఇవ్వం! అంటే అంతవరకూ ఖర్చంతా మీదే! అంటే నా కమీషన్ మాత్రం ముందే ఇచ్చేయాలి-"

మాకు గుండెలవిసిపోయినయ్.

అతను చెప్పినమేటర్ ని బట్టి మేము షుమారు రెండుకోట్లు ముందు ఇన్ వెస్ట్ చేయాలి.

అంత డబ్బు మా దగ్గరెక్కడుంటుంది?

అదే అతన్తో చెప్పాం.

అతను మండిపడుతూ లేచినిలబడ్డాడు.

"బ్లాక్ మనీ లేనోళ్ళు టీవీ సీరియల్స్ లో కెందుకొస్తారయ్యా? వెళ్ళండి వెళ్ళండి- పొద్దున్నే నాటైమ్ ఖరాబ్-" అంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

మేము ఇళ్ళకు చేరుకుని ఆ ఏపిసోడ్స్ కాసెట్ కాలనీ చెత్తబుట్టలో పడేశాం-

* * * * *

## న్యూ(సెన్స్)స్ చానెల్

మాకాలనీ విలన్ శ్యామల్రావ్ కొంతమంది రాజకీయ నాయకులతో కలసి ఒక న్యూస్ చానెల్ స్టార్ట్ చేస్తున్నాడన్న వార్త గుప్పుమంది కాలనీలో.

ఆ మర్నాడే న్యూస్ పేపర్లో ప్రకటన కూడా వచ్చింది.

"నిప్పు అనే న్యూస్ చానెల్ త్వరలో ప్రారంభం! ఈ ఛానెల్లో పని చేయుటకు నీతి, నిజాయితీ ధైర్యసాహసాలే ఊపిరిగా గల జర్నలిస్ట్ లు కావాలి.

మాకు జర్నలిజం క్వాలిఫికేషన్స్ తో పనిలేదు. ఎవరయినా సరెగ నిప్పులాంటి నిజాల్ని వెలికి తీసే వీరులయితే చాలు! దేశంలో ఎక్కడే అక్రమం జరిగినా, ఎక్కడే అన్యాయం జరిగినా క్షణాల్లో అక్కడ వాలిపోయి, దానికి సంబంధించిన వారందరినీ వెంటాడి వెంటాడి సంచలనాత్మకమయిన నిజాలను వెలుగులోకి తెచ్చే వేడి రక్తం గలవారయి ఉండాలి. వారు జెంట్స్ అయిన ఫర్లేదు- లేడీస్ అయినా ఫర్లేదు-

ప్రకటనంతా ఇలాంటి కొరడా టైప్ డైలాగుల్తో నిండిపోయి ఉంది.

ఆ ప్రకటన చూడటంతోనే మా కాలనీ వాళ్ళంతా అర్జంటుగా గుమికూడిపోయారు.

"అసలు ఈ శ్యామల్రావ్ గాడికేం అనుభవం ఉందనీ వీడు చానెల్ పెడుతున్నాడు?" కసిగా అడిగాడు గోపాల్రావ్.

"మన ప్రెసిడెంట్ కీ, గవర్నర్లకే అర్హతలేమీ అవసరం లేనప్పుడు ఈటీవీ ఛానెల్స్ కేం ఏడుస్తాయ్?" అన్నాడు శాయిరామ్.

"ఆ శ్యామల్రావ్ కనీసం నాలాగా ఒక జర్నలిస్ట్ అయుండినా న్యూస్ చానెల్ పెడ్తున్నాడంటే అర్థం ఉంది. వాడికి పొలిటిక్స్ లో ఏబీసీడీలు కూడా తెలీదు. ఏది న్యూస్ అయిటమ్- ఏదికాదు అనేది కూడా జడ్జ్ చేయటం తెలీదు- అలాంటివాడు..." అని గోపాల్రావ్ అంటూంటే రంగారెడ్డి కట్ చేశాడు.

"మనది డెమొక్రసీ నాయినా! ఒక టెర్రరిస్ట్ మనకు ప్రధానమంత్రి కావచ్చు. ఒక దొంగ లేక మర్డరర్ మనకు హోమ్ మినిష్టరవ్వచ్చు. కోట్లు తీసుకుని సెటిల్ మెంట్లు చేసే ఫాక్షన్ నాయకుడు ముఖ్యమంత్రి అవ్వచ్చు. తారా చౌకరి లాంటోళ్ళు పార్టీ పెట్టి పవర్ లోకి రావచ్చు. కనుక నువ్వా అర్హాతల గురించి ఉపన్యాసం ఆపెయ్"

దాంతో గోపాల్రావ్ సైలెంటయిపోయాడు.

ఈలోగా సావిత్రమ్మ, పార్వతీదేవి, యూత్ లీడర్ నవీన్ కాలనీ రచయిత చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్, కాలనీ సినీ హీరో జనార్ధన్ అందరూ గుంపుగా శ్యామల్రావ్ ఇంటివేపు వెళ్లటం కనిపించింది మాకు.

"ఎక్కడి కెళ్తున్నారు?" అడిగాడు శాయిరామ్.

"అదే 'నిప్పు' ఛానెల్లో న్యూస్ రీడర్ ఇంటర్ వ్యూకి-" అంది సావిత్రమ్మ.

మేం ఉలిక్కిపడ్డాం.

"మీరందరూ న్యూస్ రీడర్స్ అవుదామనా?"

"అందరం కాదు. జనార్ధన్, యాదగిరి జర్నలిస్ట్ లు అవుతారుట- నేనూ, పార్వతీదేవీ, చంద్రమతీదేవీ న్యూస్ రీడర్స్ కోసం- బోసుబాబూ, నిసార్ కెమెరామెన్ అవాలనీ--" అంటూనే ఆగకుండా వెళ్ళిపోయారు వాళ్ళు.

"వీళ్ళకేం మెంటల్ రాలేదు కదా?" డౌటుగా అన్నాడు గోపాల్రావ్.

"గ్లామర్ ప్రపంచం బాబూ! మనదేశంలో టీవీ చూసే వాళ్ళకంటే టీవీలో కనిపించే జనాభా ఎక్కువ-" అన్నాడు శాయిరామ్.

"మనం కూడా వెళ్దామా?" అడిగాన్నేను.

వాళ్ళు షాకయ్యారు.

"ఎక్కడికి?"

"అదే 'నిప్పు'లో ఏదొక జాబ్ చేస్తే మనకూ బోలెడు గ్లామర్ వస్తుంది కదా! ఒకసారి నిప్పులో ఫేమస్ అయ్యామంటే అట్నుంచి అటు సినిమాల్లోకి కూడా వెళ్ళవచ్చు-"

"యూ ఆర్ రైట్-" అన్నాడు శాయిరామ్.

"అంటే నువ్వు కూడా నిప్పులో దూకుదామనా?" ఆశ్చర్యంగా అడిగాడు గోపాల్రావ్.

"నేనూ వెళ్తా! 'లక్' ట్రై చేసి చూద్దాం!" అన్నాడు రంగారెడ్డి కూడా-

"మీరంతా జాయినయితే ఇంక నేనొక్కడినీ దూరంగా ఎందుకుండాలి? నేనూ వస్తా-" అన్నాడు గోపాల్రావ్.

మేము శ్యామల్రావ్ ఇంటికి చేరుకునేసరికే అక్కడ ఒక జాతర లాగా జనం నిండిపోయి ఉన్నారు.

ఆ జనాన్ని చూసి మిఠాయిబళ్ళూ, ఐస్ క్రీమ్ బళ్ళూ, చాయ్ దుకాణాలూ అర్జంటుగా రోడ్ ని ఆక్రమిస్తూ వెలిసినయ్.

ట్రాఫిక్ ని కంట్రోల్ చేయడానికి పోలీసులు ప్రత్యక్షమయ్యారు.

మమ్మల్ని చూడగానే శ్యామల్రావ్ రెండో కొడుకు విఠల్ రావ్ ఆప్యాయంగా పలుకరించాడు.

"హలో! ఏమిటిలా వచ్చారు? డాడీని కంగ్రాచ్యులేట్ చేయడానికా?" అడిగాడు కొంచెం మమ్మల్ని ఇన్సల్ట్ చేసే ధోరణిలో.

"అవును మరి! ఎంత చెడ్డా, మన కాలనీ వాడు న్యూస్ చానెల్ పెడుతున్నాడంటే గ్రేట్ కదా!" అన్నాడు శాయిరామ్.

అందరం వెళ్ళి శ్యామల్రావ్ ని అభినందించాం.

"మన కాలనీలో చాలా మంచి టాలెంట్ ఉంది శ్యామల్రావ్! వాళ్ళందరూ నీ 'నిప్పు'కి ఒక అసెట్ అనుకో!" అన్నాడు గోపాల్రావ్ పెద్దమనిషి తరహాలో.

"అవునవును! కల్చరల్ ప్రోగ్రామ్స్ లో చూస్తూనే ఉన్నాకదా!"

"ఛానెల్లో వర్క్ చేసే ఛాన్స్ దొరక్క అలా ఉన్నారుగానీ లేకపోతే దుమ్ము లేపేవాళ్ళు-"

"అయ్ నో- అయ్ నో-" అతను కొత్తగా ఇంగ్లీష్ వాడటం మేము గమనించాం!

"ఆ ఒక్క పదం తప్ప ఇంకోటి వచ్చి ఉండదు! అందుకే దాన్నే రెండు సార్లు రిపీట్ చేస్తున్నాడు" అన్నాడు చంద్రకాంత్ నెమ్మదిగా.

"మరి మేమేమయినా అప్లికేషన్ లాంటిది నింపాలా?" అడిగాడు బోస్.

"డైరక్ట్ గా ఇంటర్ వ్యూ ఎటెండవటమే-" చిరునవ్వుతో అన్నాడు శ్యామల్రావ్.

"అలాగా- అయితే మరి ఇంటర్ వ్యూ ఎప్పుడు?"

"ఇప్పుడే- ఆ పక్కగదిలో కెళ్ళండి!"

అందరం ఆ పక్క హాల్లోకెళ్ళాం. అప్పటికే ఆ హాల్ హౌస్ ఫుల్ అయిపోయింది.

శ్యామల్రావ్ భార్య అతని బామ్మర్ది, రోడ్లవెంబడి లావార్సీగా తిరుగుతూ చాలా ఫ్రాడ్ కేసుల్లో ఇరుక్కున్న అతని తమ్ముడి కొడుకూ, డిగ్రీ ఫెయిలయి ఒక రాజకీయపార్టీలో చేరి వార్తల్లో కెక్కిన శ్యామల్రావ్ కూతురూ- వీళ్ళే ఇంటర్ వ్యూ చేసేవాళ్ళు- మా వెనుకే శ్యామల్రావ్ కూడా వచ్చి వాళ్ళతో జాయినయాడు. అప్పటికే మా కాలనీలోనే ఉండే యువతిని ఇంటర్ వ్యూ చేస్తున్నారు వాళ్ళు.

"చూడు శ్వేతా! నీ టేబుల్ మీదకు రకరకాల వార్తలు వచ్చి చేరాయ్ అనుకో! వాటిల్లో ఏ వార్తను మొదటి హెడ్ లైన్ గా టేకప్ చేస్తావ్?" అడిగింది శ్యామల్రావ్ భార్య.

"రాష్ట్రంలోని పొలిటికల్ హాట్ న్యూస్ ని ఫస్ట్ టేకప్ చేస్తానూసర్-" ఆ జవాబు వినగానే "గోవిందా - గోవింద" అన్నాడు శ్యామల్రావ్ చేతుల గాల్లోకెత్తి-

ఆ అమ్మాయి కంగారుపడింది-

"అదేంటి? అలా అన్నారు?" అడిగింది ఆశ్చర్యంగా.

"న్యూస్ అలా పొలిటికల్ వార్తతో స్టార్ట్ చేస్తే చానెల్ మట్టికొట్టుకుపోతుంది. నెక్స్ట్-" అన్నాడు శ్యామల్రావ్.

ఆ అమ్మాయి బిక్కమొఖంతో బయటికెళ్ళిపోయింది.

ఇంకో కాండేట్ వచ్చి వాళ్లముందు నిలబడ్డాడు.

"అదేంటి ఆ అమ్మాయి చెప్పింది కరెక్టేగా? హాట్ పొలిటికల్ న్యూసే ఫస్ట్ హెడ్ లైన్ గా టెలికాస్ట్ చేస్తారెవరైనా-" అన్నాడు గోపాల్రావ్ మాతో నెమ్మదిగా.

"శ్యామల్రావ్ లెవల్ వేరు కదా మరి!"

అదే ప్రశ్న ఆ రెండో కాండేట్ నడిగింది శ్యామల్రావ్ భార్య.

"నేషనల్ లెవల్లో హాట్ న్యూస్ ఏదుంటే దాన్తో స్టార్ట్ చేస్తా మేడమ్-"

"రాంగ్-"

అతనూ బయటి కెళ్ళిపోయాడు.

సడెన్ గా మా మధ్య నిలబడ్డ రంగారెడ్డిని పిలిచాడు శ్యామల్రావ్.

"మీరు చెప్పండి రంగారెడ్డిగారూ! మీరు పెద్ద విమర్శకులు కదా- అన్ని టీవీ ఛానెల్సూ చూసి కామెంట్స్ కూడా చేస్తూంటారు-"

రంగారెడ్డి చిరునవ్వు నవ్వాడు.

"టీవీ ఛానెల్స్ చూసి చూసి మరీ రాటు తేలిన మాట నిజమే శ్యామల్రావ్-నేనే నీ నిప్పు ఛానెల్లో ఎడిటర్నయితే ఫస్ట్ హెడ్ లైన్ ఏది సెలక్ట్ చేస్తానో తెలుసా? ఫ్రెష్ గా జరిగిన రేప్ కేస్ కి సంబంధించిన న్యూస్ అయిటమ్-"

శ్యామల్రావ్ ఆనందంతో తప్పట్లు కొట్టాడు.

"కరెక్ట్! యూ ఆర్ జీనియస్! ఎందుకంటే వెధవ పొలిటికల్ న్యూస్ ఎవడికీ ఇంట్రెస్ట్ ఉండదు. కేవలం రేప్ న్యూస్ అయితేనే అన్ని వయసులవాళ్ళూ ఆత్రుతగా, ఇష్టంగా చూస్తారు. ఇంత కరెక్ట్ గా ఎలా చెప్పగలిగావ్ రంగారెడ్డీ?"

"ఎలాగేముందీ? మన న్యూస్ చానెల్స్ అన్నీ కేవలం రేప్ వార్తలూ, వీడియో తీసిన సెక్స్ రాకెట్ లూ, తారాచౌదరి లాంటివాళ్ళ సీక్రెట్ వీడియో క్లిప్పింగ్ లూ, ఆశ్రమాల్లో స్వామీజీల సెక్స్ లీలలూ- కేవలం వీటి వల్లే లాభాల్తో నడుస్తున్నాయ్. కనుక కొత్తగా ఎవడు ఛానెల్ పెట్టినా అదే ట్రెండ్ లో వెళ్తాడు-"

"గుడ్! ఫర్ ఫెక్ట్ ఎనలైజేషన్! ఒక కాలేజ్ లో ఒక ప్రిన్సిపాల్ ఒక గాళ్ స్టూడెంట్ తో సెక్సీ విన్యాసాలు జరిగినట్లు మనకో వీడియో మన వాళ్ళ స్ట్రింగ్ ఆపరేషన్ లో దొరికిందనుకోండి! ఆ న్యూస్ ఎలా ప్రెజెంట్ చేస్తారు?"

"ఆ వీడియోని బ్లర్ చేసి అందులో వాళ్ళమొఖాలు కనబడకుండా ప్లే చేయిస్తాం! జరిగిందంతా ఒక లేడీ వాయిస్ ఓవర్ లో డిటెయిల్డ్ గా వినిపిస్తూంటుంది. ఆ తరువాత ఆ సంఘటన గురించి ఒక సెక్సాలజిస్ట్ తో ఎనలైజ్ చేయిస్తాం.

ఆ తర్వాత ఒక హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్ తో యంగ్ గాళ్స్ ఎందుకలా బిహేవ్ చేస్తారు అనే అంశం మీద అరగంట ఇంటర్ వ్యూ చేస్తాం-"

"ఒండర్ ఫుల్!" తప్పట్లు కొట్టింది శ్యామల్రావ్ భార్య.

సడెన్ గా అంతవరకూ కామ్ గా కూర్చున్న శ్యామల్రావ్ కూతురు రంగారెడ్డి మీద ఇంకో ప్రశ్న సంధించింది.

"వాళ్ళ మొఖాలు ఎందుకు బ్లర్ చేయాలనుకుంటున్నారు?" బ్లర్ చేయకపోతే ఏమౌతుంది?"

రంగారెడ్డి చిరాగ్గా చూశాడు.

"చూడమ్మా! మనం బేసిక్ గా మనుష్యులం! కనుక మనలో మానవ లక్షణాలుండాలి! ఒక ప్రిన్సిపాల్- తన కాలేజ్ లోని ఒక యంగ్ గాళ్ స్టూడెంట్ తో జరుపుతున్న సెక్స్ విన్యాసాలు యథాతథంగా చూపించటం వల్ల మన సొసైటీ తాలూకూ డెలికేట్ ఫాబ్రిక్స్ చిన్నాభిన్నం అవుతాయ్! ఎక్కడో ఒక ప్రిన్సిపాల్, ఒక గాళ్ స్టూడెంట్ అలా చేశారని అదంతా చూపిస్తే మిగతా ప్రిన్సిపాల్స్ కీ గాళ్స్ స్టూడెంట్స్ కీ ఇబ్బందికరంగా ఉంటుంది-"

శ్యామల్రావ్ రంగారెడ్డి స్పీచ్ కి అడ్డుపడ్డాడు.

"చూడు రంగారెడ్డి- నేను న్యూస్ ఛానెల్ పెడుతోంది ప్రజలకు నీతి పాఠాలు చెప్పటానిక్కాదు. అలాంటి న్యూస్ ఎంత దారుణంగా, ఎంత ఎక్కువగా- ఎంత సెక్సీగా, ఎంత బట్టబయలుగా చూపిస్తే అంత వ్యూయర్ షిప్ వస్తుంది మనకి- వ్యూయర్ షిప్ ఎంతెక్కువ ఉంటే అంత లాభాలుంటాయ్- అల్టిమేట్ గా మనం ఎంత సంపాదించాం అనేదే ముఖ్యం గానీ- దానివల్ల సమాజానికి ఎంత నష్టం జరుగుతోంది? మనం చూపించే దృశ్యాల వల్ల యువత చెడు మార్గాన్ని పడుతోందిలాంటి బొంగులో కబుర్లు మాకనవసరం- అర్థమయిందా?"

"ఇదెప్పుడో అర్థమయింది కాబట్టి మీ బొంగులో ఛానెల్లో నాలాంటి వాళ్ళు పనిచేయకూడదని మావాళ్ళకు చెప్పడానికొచ్చా-" అనేసి వెళ్ళిపోయాడు రంగారెడ్డి.

ఆ తరువాత యాదగిరి వచ్చాడు.

"ఇదిగో యాదగిరీ! నలుగురు ధనవంతుల కొడుకులు కలసి లగ్జరీ కార్లో మందు కొడుతూ రోడ్ల వెంబడి తిరుగుతూ- బస్ స్టాప్ లో నిలబడ్డ ఓ అమ్మాయిని కిడ్నాప్ చేశారు. వాళ్ళ కారుని తన స్కూటర్ మీద వెంబడించాడో యువకుడు. ఆ గ్యాంగ్ ఆ యువతిని రేప్ చేయబోతూంటే ఆ యువకుడు అడ్డుకునేసరికి అతనిని రివాల్వర్ తో కాల్చారు. ఆ అమ్మాయిని అపస్మారకస్థితిలో వదిలేసి వాళ్ళు పారిపోయారు- ఇదీ మన కొచ్చిన న్యూస్- దీన్నెలా ప్రెజెంట్ చేస్తావ్?"

యాదగిరి చిరునవ్వు నవ్వాడు.

"చాలా ఈజీ కొశ్చెన్ రాభయ్! ముంగట ఆ పోరి హాస్పిటల్లో ఉంటది కదా! గాడకు పోయి కిడ్నాప్ ఎట్ల జరిగిందీ, ఆ నలుగుర్లో ముందెవరు రేప్ జేసిన్రు- రేప్ ఎట్లా జరిగిందీ ఎంతసేపు జరిగిందీ ఆ సమయంలో ఆ పోరి ఎట్ల ఫీలయింది - అన్నీ ఆ పోరి నడిగి రికార్డ్ జేస్తాం!"

హుషారుగా చెప్తూంటే శ్యామల్రావ్ భార్య అడ్డుపడింది.

"అదే హాస్పిటల్లో ఇంకో బెడ్ మీద- అమ్మాయిని రక్షించడానికెళ్ళి గాయపడిన యువకుడున్నాడు కదాగ అతనిని కూడా ఇంటర్ వ్యూ చేయవా?" అడిగిందామె.

యాదగిరి ఆమె వంక ఓ పురుగుని చూసినట్లు చూశాడు.

"ఆడా? ఆడితో ఇంటర్ వ్యూ ఏంది? అదెవడిక్కావాలి? అడికేమయితే మన ప్రేక్షకుల కెందుకు? మన ఛానెల్స్ లెక్కలో రేప్ జరుగుతున్నప్పుడు  అడ్డుపడినోడు విలన్! రేప్ జేసేటోళ్ళు మన ఛానెల్స్ కి హీరోలు! మన కెమెరాలెప్పటికీ రేప్ జేసినోళ్ళ వెంటనే వుండాలె! ఆళ్ళు ఎట్లా కిడ్నాప్ ప్లాన్ జేసిందీ. ఎట్లా అంతకు ముంగట భీ గిసంటి యాక్టివిటీస్ జేసిన్రు- జేస్తే ఆ వీడియోలు వాళ్ళతానున్నావా. ఆళ్ళ జీవిత చరిత్రలేంది? గిట్ల దినమంతా ఆళ్ళనే ఛానెల్లో చూబించాలె! అప్పుడే మొత్తం పబ్లికంతా మన ఛానెల్ జూస్తారు-"

"యూ ఆర్ సెలెక్టెడ్-" ఆవేశంగా అరచాడు శ్యామల్రావ్.

"ఏంది బే- నన్ను సెలక్ట్ జేసుగున్నావా? థూ నీయవ్వ! గిసంటి నీతీ నియమాల్లేని ఛానళ్ళ పని జేయనికి నేనేం నంగా బాడుకవ్ నా బే! సమాజం ఏమయితే నాకేంది- నేను బ్లాక్ మెయిల్ జేస్తా- నా ఛానెల్ వ్యూయర్ షిప్ కోసం బ్లూఫిలిమ్స్ భీ చూపుతూ అనేటోళ్ళ ఛానెల్ల నేను పన్జేస్తాను? థూ! దానికంటే అడుక్కు తినడం మంచిది- థూత్తేరీకీ-" అంటూ ఆవేశంగా అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

కొద్దిక్షణాల తర్వాత తేరుకున్న మా వాళ్లందరూ పెద్ద ఎత్తున తప్పట్లు కొట్టి బయటకు నడిచారు.

ఆ రాత్రి అందరం కాలనీ వేదిక దగ్గర సమావేశమయ్యాం! మా కాలనీ యూత్ కిషన్ రావ్ శ్యామల్రావ్ 'నిప్పు' న్యూస్ ఛానెల్ మహాభారత్ కాలంలో ఉండి ఉంటే- ఆ కవరేజ్ ఎలా ఉండేదో మిమిక్రీ చేసి చూపిస్తున్నాడు.

"ప్రేక్షకులకు 'నిప్పు' స్వాగతం! నా పేరు తార!

ఇప్పుడే అందిన వార్త! కౌరవుల దర్బార్ లో దుశ్శాశనుడు పాండవుల భార్య అయిన ద్రౌపది చీర విప్పేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఆ దృశ్యాన్ని మీకు ప్రత్యేకంగా చూపించడానికి మా జర్నలిస్ట్ రాజు, కెమెరామెన్ దిగంబర్ ఆ దర్బార్ లో ఉన్నారు. అక్కడ ప్రస్తుత పరిస్థితేంటో స్వయంగా మా జర్నలిస్ట్ రాజునే అడిగి ప్రత్యక్షంగా తెలుసుకుందాం!

అనగానే కెమెరా కౌరవుల రాజ దర్బార్ లో ఓపెనయింది. ద్రౌపది క్లోజ్ లో కెవ్వున కేక వేసింది. జూమ్ చేస్తే ద్రౌపది చీరని వికటాట్టహాసంతో లాగేస్తున్నాడు దుశ్శాసనుడు. దర్బార్ లో ఉన్న వారంతా షాకయి చూస్తూంటే కౌరవుల గాంగ్ మాత్రం "మహత్తరం! దుశ్శాసనా మహత్తరం!" అంటూ ఆనందోత్సాహాలతో అరుస్తున్నారు.

వెంటనే న్యూస్ రీడర్ గొంతు ఖంగునమోగింది.

"రాజూ! ఇప్పుడా కౌరవ సభలో ఏం జరుగుతోంది!"

"తారా! ప్రస్తుతం సభంతా హోరెత్తిపోతోంది. దుశ్శాసనుడు ప్రతిపక్షాల కేకలు, నిరసనల మధ్య ద్రౌపది చీరను లాగేస్తున్నాడు తారా! నిండు సభలో ద్రోణాచార్యులు, కృపాచార్యులవంటి పెద్దలు ఆ దృశ్యాన్ని షాకయి చూస్తున్నారు తారా!"

"మరి ధర్మరాజూ అతని నలుగురు బ్రదర్స్ పరిస్థితేంటి రాజూ! వారీ సంఘటన గురించి ఏమంటున్నారు? ఎలాంటి ఫీలింగ్స్ వెలిబుచ్చుతున్నారు?"

"తారా! వాళ్ళంతా ఎంతో కోపంతో, ప్రతీకారవాంఛతో రగులుతున్నప్పటికీ- ధర్మరాజు గాంబ్లింగ్ లో తనను తను కూడా లీగల్ గా ఓడిపోయి ఉండడంతో- అందరూ సైలెంట్ గా తలొంచుకున్నారు తారా! వాళ్ళందరి ఫీలింగ్సూ మనం కెమెరాలో స్పష్టంగా చూడవచ్చు తారా!"

అంటూండగానే కెమెరా పాండవుల మొఖాల మీదకు జూమ్ అయి పాన్ అవుతోంది.

"రాజూ! మన ఛానెల్ ప్రేక్షకులకు కావలసింది పాండవుల ఫీలింగ్స్ కాదు. ద్రౌపది వస్త్రాపహరణం సీన్ చూడ్డానికే ఉవ్విళ్ళూరుతున్నారు. వెంటనే కెమెరా ద్రౌపది మీదకు ఫోకస్ చేయించు-"

"అలాగే తారా! ఒక్క క్షణం! హలో ధర్మరాజుగారూ! మీ అయిదుగురు బ్రదర్సూ కొంచెం అవతలకి జరుగుతే ద్రౌపది వస్త్రాపహరణం సీన్ మా ఛానెల్ ప్రేక్షకులకు క్లియర్ గా కనబడటానికి వీలవుతుంది! ప్లీజ్! అర్జునుడుగారూ- మీరు కూడా ఆ మూలకెళ్ళి నిలబడండి! హలో భీముడుగారూ- మీరు కూడా ఓ- థాంక్యూ-"

"థాంక్యూ రాజూ! ఈ పరిస్థితిలో ద్రౌపది ఫీలింగ్సేమిటో మన ప్రేక్షకులకు తెలియజేస్తే వాళ్ళెంతో ఆనందిస్తారు రాజూ-"

"వన్ మినిట్ తారా! హలో- ద్రౌపదిగారూ! దుశ్శాసనుడు ఇలా నిండు సభలో మీ చీర లాగేస్తూంటే మీకెలా అనిపిస్తోంది? మీ ఫీలింగ్సేమిటి?"

"నిండు సభలో ఆ దుర్మార్గుడు చీరలాగేస్తూ, వివస్త్రను చేయడానికి ప్రయత్నిస్తూంటే ఏ ఆడదానికయినా ఎలాంటి ఫీలింగ్స్ ఉంటాయో నీకు తెలీదంట్రా! పైగా ఈ సభలో కొలువు తీరి ఉన్న దుర్మార్గులు చాలనట్లు ఈ సీన్ దేశమంతా కూడా చూపించడానికి మీకు సిగ్గులేదూ? ఇది చాలనట్లు నా ఫీలింగ్స్ ని కూడా మీ బోడి కెమెరాతో చెప్పుకోవాలా? మీరసలు మనుషులేనా?"

"తారా! ద్రౌపది మేడమ్ కొంచెం కోపంగా ఉన్నట్లున్నారు. ఆమె కోపం తగ్గాక తిరిగి ఆమెతో మాట్లాడే ప్రయత్నం చేద్దాం! ఈలోగా ఈ సందర్భంగా ద్రౌపది భర్తల్లో సీనియర్ అయిన ధర్మరాజుగారి ఫీలింగ్సేమిటో అడిగి తెలుసుకుందాం!

"నమస్కారం ధర్మరాజుగారూ-"

"ఊ!"

"సార్- మీ మిసెస్ ద్రౌపది గారిని నిండు సభలో ఆ దుశ్శాసనుడు చీరనులాగుతూ వివస్త్రను చేయడానికి ప్రయత్నిస్తున్నాడు కదా! ఈ సందర్భంలో మీరెలా ఫీలవుతున్నారు? అయ్ మీన్ మీకేమనిపిస్తోంది?"

సడెన్ గా ధర్మరాజుకి బదులు భీముడు మాట్లాడాడు ఆవేశంగా.

"ఒరేయ్- ఆ సీనే నీ పెళ్ళానికి జరుగుతుంధనుకో! అప్పుడు నీ ఫీలింగ్స్ ఎలా వుంటాయ్ రా? ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతావంట్రా? ఈ సమయంలో ఒక నీతి నియమాలున్న భర్తగా మా అన్నగారి ఫీలింగ్సెలా ఉంటాయో నీకు తెలీదంట్రా!"

"తారా! భీముడు కొంచెం కోపంగా రియాక్టవుతున్నారు! అందుకని వారి రియల్ ఫీలింగ్స్ తెలుసుకోవటం కష్టంగా ఉంది తారా!"

"ఏం ఫర్వాలేదు రాజూ! నిప్పు ఛానెల్ ప్రేక్షకులకో గమనిక! పాండవుల ఫీలింగ్స్ ఎలా ఉంటాయో వెంటనే ఊహించి మా ప్రేక్షకులు మాకు ఎస్సెమ్మెస్ పంపించండి! ఎస్సెమ్మెస్ పంపించాల్సిన నెంబర్ 420420!

రాజూ! ద్రౌపది చీర అలా ఎంతసేపు లాగుతాడా దుశ్శాశనుడు! ఈ సమయంలో దుశ్శాశనుడు ఫీలింగ్సేమిటి?"

"హలో దుశ్శాసనుడుగారూ- నమస్కారం"

"హలో నమస్తే- నమస్తే- మీదే చెత్త ఛానెల్ లో నాకు తెలీదుగానీ ఇలాంటి అద్భుతమయిన సీన్లు ఒక్క కెమెరాతో షూట్ చేస్తార్రా ఎవరయినా? అరడజను కెమెరాలు ద్రౌపదిని కవర్ చేయాలి-!"

"థాంక్యూసర్- ఇంకో రెండు కెమెరాలు మావాళ్ళ జేబుల్లో ఉన్నాయ్! ఎందుకంటే ఇలాంటి దృశ్యాలు సీక్రెట్ గా వీడియో తీయటం మా ఛానెల్ వాళ్ళ జన్మహక్కు! ఆ విధంగా బ్లాక్ మెయిల్ చేసే అవకాశం మాకుంటుంది! ఎనీవే- ఇప్పుడు మీరు ద్రౌపదిగారి చీర లాగేస్తున్నారు కదా! ఈ సమయంలో మీ ఫీలింగ్సెలా ఉన్నాయ్? ఎలా ఫీలవుతున్నారు?"

"అదికూడా అదగాలాగ నా మొఖం చూస్తే తెలీటంలా! ఆహ్హాహ్హా! ఇంత సంతోషంగా నా జన్మలో ఎప్పుడూ లేను- ఎందుకంటే ఇలా ఆడాళ్ళందరి చీరలూ లాగేయాలని నేను చిన్నప్పటి నుంచీ కలలు కంటున్నాను- చివరకు నా కల ఇలా ఇంతమంది ప్రేక్షకులు, శ్రేయోభిలాషులు, అభిమానుల మధ్య పైగా ప్రభువుల సమక్షంలో తీరటం ఎంతో ఎగ్జయిటింగ్ గా ఉంది."

"థాంక్యూ దుశ్శాశనుడు గారూ!"

"రాజూ- ఇప్పుడో చిన్న బ్రేక్! బ్రేక్ తర్వాత కూడా ద్రౌపదీ వస్త్రాపహరణం సీన్ కంటిన్యూ అవుతుంది. పైగా చీరలో చాలా భాగం దుశ్శాసనుడు ఇప్పటికే లాగేశాడు గనుక ఇకముందు ఈ సన్నివేశం పతాకస్థాయికి చేరుతుంది. కనుక ఎవరూ ఛానెల్ మార్చవద్దు! కంటిరెప్పలు మూయవద్దు!

"నేడే కొనండి అందనా వారి పట్టుచీరలు! పదికాలాల మన్నికకూ పదిమంది లాగినా ఇంకా ఎన్నో గజాలు మిగిలి ఉండే మహా భారత్ చీరలు! స్వయంగా దుశ్శాశనుడి కోసం ప్రత్యేకంగా తయారు చేయించిన ఈ చీరలు నేడే మీ స్వంతం చేసుకోండి! ఈ ఛానెల్లో ఈ సీన్ పూర్తయ్యేలోగా ఫోన్ ద్వారా మాకు ఈ చీరలు ఆర్డర్ చేసిన వారికి యాభైశాతం డిస్కౌంట్! ఇప్పుడే మా సెల్ ఫోన్లకు రింగివ్వండి- అందనా చీరలు- అందనా చీరలు- అందనా చీరలు-

"ద్రౌపది విరబోసుకున్న శిరోజాల కన్నా వత్తుగా, పొడుగ్గా పెరిగే శిరోజాల కోసం గాంధారి కొబ్బరినూనెనే వాడండి! మూడు నెలల్లో వత్తుగా పెరిగే పొడుగాటి శిరోజాలు మీ స్వంతం చేసుకోండి! పది బాటిల్స్ కొనేవారికి ఒక అందమయిన సవరం ఉచితం-"

"ఈ ద్రౌపదీవస్త్రాపహరణం సీన్ స్పాన్సర్ చేస్తున్నవారు దృతరాష్ట్ర ఎంటర్ ప్రైజెస్! మీ అందచందాలను ఇనుమడింపజేసేందుకు నేడే కొనండి ఇంటర్నేషనల్ మేకప్ కిట్! ఒక్కొక్క బాక్స్ ఖరీదు కేవలం డెబ్బయ్ తొమ్మిది వేలు మాత్రమే-"

"వెల్ కమ్ బాక్ టు ద్రౌపదీ వస్త్రాపహరణం! రాజూ! ఇంటర్ వ్యూ కంటిన్యూ చెయ్-"

"ఓకే తారా ! దుశ్శాశన్ జీ! మీ కల నెరవేరబోతూన్న ఈ సందర్భంలో మనదేశ యువతీ యువకులకు మీరిచ్చే సందేశం ఏమిటి?"

"మనదేశంలోని యువతీ యువకులందరూ కూడా నాలాగానే అద్భుతమయిన సంస్కృతి నలవర్చుకుని, ఇంతకన్నా కూడా మరెన్నో రెట్లు ముందుకుపోవాలి! ఎన్ని అడ్డంకులెదురయినా మొత్తం చీరను లాగేసి పట్టుదలతో మనం అనుకున్నది సాధించాలి!"

"థాంక్యూ దుశ్శాశన్ జీ!"

"రాజూ! ఈ ఉత్సవంలో భాగం పంచుకుంటున్న మహారాజు దృతరాష్ట్రుల వారెలా ఫీలవుతున్నారు?"

"ఇప్పుడే తెలుసుకుందాం తారా! నమస్తే దృతరాష్ట్రాజీ-"

"నమస్తే ఎవరు నాయినా నువ్వు?"

"నిప్పు టీవీ ఛానెల్ విలేఖరినండీ!"

"నిప్పా? ఈ పేరెప్పుడూ లేదే?"

"కొత్తగా వచ్చిన ఛానెల్ సార్ మాది! అయినాగానీ ప్రస్తుతానికి నెంబర్ టూ స్థానానికి చేరుకుంది. తెలుగు ప్రేక్షకులు అంత గొప్పగా అభిమానిస్తున్నారు మా ఛానెల్ ని!"

"సంతోషం నాయనా! అంతమంది అభిమానిస్తున్నారంటే ఖచ్చితంగా మీ ఛానెల్ కూడా అశ్లీల అభ్యంతరకర దృశ్యాలనే నమ్ముకుని ఉంటుందని నాకర్థమవుతోంది-"

"అవున్సార్- అశ్లీలాన్ని మేము మిగతా ఛానెల్స్ కంటే ఎక్కువ వెరయిటీగా చూపిస్తాం సార్! ఉదాహరణకి మిగతా ఛానెల్స్ లేటెస్ట్ గా జరిగిన ఒక రేప్ సీన్ చూపించారనుకోండి! మేము దాంతోపాటు గత పదేళ్ళుగా పట్టుబడ్డ సెక్స్ రాకెట్స్ క్లిప్పింగులూ, సెన్సార్ వాళ్ళు బాన్ చేసిన సినిమా రేప్ సీన్లూ- అన్నీ నెలరోజుల పాటు రాత్రింబగళ్ళు చూపిస్తాం- సార్- మీకు తెలీదేమో- మొన్న ఒక ఫోటో స్టూడియోవాడు అక్రమంగా తీసిన ఒక సెక్స్ వీడియో మొత్తం మా ఛానెల్లో చూపిచ్చేశాం సార్- మీరూ చూసే ఉంటారది-"

"ఆ ఒక్క విషయంలో నేనూ నా మిసెస్ అదృష్టవంతులం నాయినా! అలాంటి నికృష్టమయిన సీన్లు ఇరవై నాలుగ్గంటలూ చూడకుండా భగవంతుడు మాకు చూపు ఇవ్వలేదు-"

"ధృతరాష్ట్రాజీ! ఈ ద్రౌపదీ వస్త్రాపహరణం నిజానికి మీ అంగీకారంతోనే జరుగుతోంది కదా! దీన్ని గురించి మీ ఫీలింగ్సేమిటి?"

"కొడుకుల మాట కాదనే వయసు కాదు నాది! వారి ఆనందమే నా ఆనందంగా బ్రతుకువెళ్ళదీస్తున్నవాడిని! కనుక వారి ఫీలింగ్సే నా ఫీలింగ్స్ కూడా! అయినా లోలోపల ఎంతో విచారంగా ఉంది-"

"విచారమా? అంటే పాపం ద్రౌపదికి ఇలా నిండు సభలో జరుగుతోన్న అవమానం గురించా?"

"ఏడ్చావ్! ఇలాంటి సీన్- ప్రత్యక్షంగా చూసి ఎంజాయ్ చేసేందుకు నాకు కళ్ళులేకపోవటం ఎంతో లోటుగా ఫీలవుతున్నా!"

"థాంక్యూ రాజూ! ఇప్పుడు మా ఛానెల్ ప్రేక్షకులకో సవాల్!

కౌరవులు కమ్ దుశ్శాసనుడు పాండవుల మీద రివెంజ్ కోసం ద్రౌపదిని నిండు సభలో చీరలాగివేయటం సరైనదే అని మీరు ఫీలవుతున్నారా? లేక దుశ్శాశనుడు చేస్తున్నది తప్పని మీరు భావిస్తున్నారా? వెంటనే మీ సమాధానం ద్రౌపదిచీర అని టైప్ చేసి స్పేస్ ఇచ్చి- సమాధానంకై- 420420కి ఎస్సెమ్మెస్ చేయండి!

"రాజూ లేటెస్ట్ గా అక్కడి పరిస్థితేంటి? ద్రౌపది చీరలాగి వేసే కార్యక్రమం ఆఖరి దశకొచ్చిందా?"

"తారా! ఇప్పుడిక్కడొక అనుకోని ట్విస్ట్ సంభవించింది తారా! వెంటనే దాన్ని బ్రేకింగ్ న్యూస్ గా చూపించు! అదేంటంటే శ్రీకృష్ణుడే స్వయంగా గాల్లో ఎగుర్తూ వచ్చి మొత్తం చందన, బొమ్మన లాంటి చీరల షాపుల్లోని చీరలన్నీ కలిపిన దానికంటె పెద్ద చీర తీసుకొచ్చి ద్రౌపది చీరకు జాయిన్ చేశాడు తారా!

ఇప్పుడిక దుశ్శాశనుడు ఆ చీరనులాగడానికి వందేళ్ళు పడుతుందని సభలో కొలువు తీరియున్న పెద్దలు బాహాటంగానే అనుకోవటం వినబడుతూనే ఉంది తారా-"

"థాంక్యూ రాజూ- బ్రేకింగ్ న్యూస్! ఇప్పుడే మా ఛానెల్ కి మాత్రమే ప్రత్యేకంగా అందిన వార్త!

ద్రౌపది వస్త్రాపహరణం సన్నివేశంలో ఉత్కంఠకు తెరదించుతూ శ్రీకృష్ణుడు ప్రపంచంలో అతిపెద్ద చీరను ద్రౌపది చీరకు జాయింట్ చేసి గిన్నిస్ బుక్ లో రికార్డ్ నెలకొల్పడం జరిగింది- రాజా- ఇప్పుడు దుశ్శాశనుడేమంటున్నాడు? శ్రీకృష్ణుడు తన కార్యక్రమాన్ని అడ్డుకుంటున్నందుకు ఏ విధంగా స్పందిస్తున్నాడు? చీరలాగే కార్యక్రమాన్ని వాయిదావేస్తున్నాడా? ఈ వివరాలన్నీ తెలుసుకునేలోపు హైద్రాబాద్ లో ఇప్పుడే అందిన మరో మినిష్టర్ సెక్స్ కుంభకోణం వీడియోతో ప్రేక్షకుల కనువిందు చేయబోతున్నాం-!"

మొత్తం ఆ ఆవరణంతా తప్పట్లతో మార్మోగిపోయింది-

"ఛానెల్ హోతో ఐసా" అంటోంది చంద్రమతీదేవి.

* * * * *

## రోజులు మారలా! బుద్ధులే గడ్డి తింటున్నయ్!

(ఈ మధ్య జరిగిన కౌన్సిల్ ఎలక్షన్ లో గ్రాడ్యుయేట్స్ చాలామంది డబ్బు తీసుకుని ఓట్లేశారన్న విషయం తెలిశాక)

ఒకప్పుడు రాజకీయాలు చాలా గౌరవప్రదంగా ఉండేవి. ప్రతి ఊళ్ళో ఒకో పార్టీకి ఒకరో లేక ఇద్దరో నాయకులు ఉండేవారు. వాళ్ళ మాటను పార్టీ వర్కర్స్ వేదవాక్కుగా భావించేవారు. బాగా చదువుకున్నోళ్ళూ నీతీ నిజాయితీలకు పేరున్నవాళ్ళూ, ముందు నా దేశం- తర్వాతే నా ఊరు అనుకునేవాళ్ళూ- కర్రప్షన్ మాట వినబడితే చాలు కర్ర పట్టుకుని వెంటపడే వాళ్ళు. అలాంటి వాళ్ళకే పార్టీ టిక్కెట్లు ఇచ్చేవాళ్ళు. అధికార పార్టీతో సమానంగా ప్రతిపక్ష నాయకులూ చాలా హుందాగా, నీతీ నిజాయితీలతో ఉండేవారు. ఒకరినొకరు గౌరవించుకునేవారు. చౌకబారు ఆరోపణలు అసలు ఉండేవి కావు. దొంగలు దోపిడీ గ్యాంగ్ లు, మర్డర్లు, కులాల పిచ్చోళ్ళూ- వీళ్ళందర్నీ అన్ని పార్టీలూ ఆమడ దూరంలో ఉంచేవి. మరి ఇప్పుడో-

మొత్తం రివర్స్!

"అవతల పార్టీవాడు ఓల్డ్ సిటీలో ఎవర్ని నిలబెడుతున్నాడు?"

"వాడే- చాంద్ పాషా అని నొటోరియస్ రౌడీ షీటరున్నాడు కదా! వాడికిచ్చారు టిక్కెట్టు"

"మరి మనం ఎవర్ని నిలబెట్టాలి?"

"ఇర్ఫాన్ అనేవాడి మీద ఈ మధ్యే ఎనిమిది మర్డర్ కేసుల్లోనూ, తొమ్మిది రాబరీల్లోనూ, 14 బ్లాక్ మెయిలింగ్ కేసుల్లోనూ పోలీస్ స్టేషన్స్ లో కేసులు రిజిష్టర్ అయ్యాయ్- ప్రస్తుతం వాడే సిటీలో చాలా ఫేమస్ అయ్యాడు- వాడికి టెర్రరిస్ట్ లింక్స్ కూడా ఉన్నాయంటున్నారు. ఈ మర్డర్స్, లూటింగ్స్, లాండ్ గ్రాబింగ్స్ లతో దగ్గర దగ్గర వందకోట్లు సంపాదించాడంటున్నారు. మనం వాడిని నిలబెడితే బెస్ట్. ఈజీగా గెలుస్తాడు"

"చాంద్ పాషా మీద ఎలా గెలుస్తాడు? వాడూ ఇదే టైప్ కదా?"

"కానీ వీడికి ఎక్కువ బుకింగ్స్ ఉన్నాయ్. మర్డర్స్, కిడ్నాప్స్ కు 2014లోని ఎలక్షన్స్ వరకూ అడ్వాన్స్ గా బుక్కయిపోయాడు"

"అయితే ఇంక ఆలస్యం ఎందుకు వాడిని కాంటాక్ట్ చేయకపోయారా?"

"చేశాం సార్. కానీ వాడు ఒక కండిషన్ పెడుతున్నాడు- మన పార్టీ తరపున పోటీ చేయడానికి!"

"ఏమంటున్నాడు?"

"మన ఆర్టీ పవర్ లోకొస్తే- వాడికి హోమ్ మినిష్టర్ పోస్ట్ ఇవ్వాలంట"

"ఏంటి? వాడికి మన స్టేట్ హోమ్ మినిస్టర్ పోస్ట్ ఇవ్వాలా? వాడికేం పిచ్చెక్కిందా?"

"తప్పేముంది సార్. ఇంతకుముందు హోమ్ మినిష్టర్లు వాడి కంటె తక్కువేముందని?"

"నేననేదదేనోయ్. ఇంత పవర్ ఫుల్ కాండిడేట్ కేంద్రంలో హోమ్ మినిస్టరవ్వాలి! ఈ చెత్త రాష్ట్రంలో అంత టాలెంట్ వృథా అయిపోతుంది కదా!"

"కానీ కేంద్రంలో హోమ్ మినిష్టరంటే వాడొప్పుకోవటం లేద్సార్"

"ఎందుకని?"

"వాడి గ్యాంగ్ లో సగం మంది మన స్టేట్ లోనే జైల్లో చాలా కేసుల్లో ఇరుక్కున్నారు. వాళ్ళందరినీ విడుదల చేయాలంటే రాష్ట్ర హోంమంత్రిగా ఉంటే- ఉరిపడ్డ వాడి గాంగ్ మెంబర్లు అందరినీ విడిపించుకోవచ్చు కదయ్యా?"

"పాయింట్ ఓకేగానీ- వాడింకో ప్రాబ్లెమ్ చెప్తున్నాడు సార్-"

"ఏంటిది?"

"సెంటర్ లో ఒక పార్టీ- స్టేట్ లో ఇంకో పార్టీ వస్తే కేంద్ర హోంమంత్రిగా వాడికేం ఉపయోగం ఉండదు కదా?"

"అవునవును, సరే- చేసేదేముంది? డెమోక్రసీకి వాడొక్కడే కరెక్ట్ కాండిడేట్ లాగా కనబడుతున్నాడు. వెంటనే వాడికి బి.ఫారం ఇచ్చి నామినేషన్ వేయించెయ్"

ఇది ఇవాళ పొలిటికల్ సెటప్! యథా రాజా తథా ప్రజా అనేది నూటికి నూరు పాళ్ళూ నిజం కదా!

అందుకే మా నియోజకవర్గంలో ఎవరెవరు నిలబడ్డారో వారందరికీ ఇంటర్వ్యూలు కండక్ట్ చేసి, మా టెస్ట్ లో పాసయిన వాడికే మా నిర్భయ్ నగర్ కాలనీలో ఉన్న రెండువేల ఓట్లూ వేయాలని నిర్ణయించుకున్నాం.

మొదటిరోజు ఒక ఫేమస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న గూండారెడ్డి మా కాలనీ కొచ్చాడు. గూండారెడ్డి అదివరకే రెండు మూడుసార్లు ఎమ్మెల్యేగా చేశాడు. కాలనీ వాళ్ళందరం స్వాగతం పలికాం. పార్వతీదేవీ, సావిత్రమ్మా ఇంకొంతమంది లేడీస్ కలిసి అతనికి హారతి ఇచ్చి వేదిక మీదకు ఆహ్వానించారు.

మా కాలనీ మైనార్టీ కాండేట్ నిసార్ అతనికి స్వాగతం పలికాడు.

"గూండాధ్యక్షా! అవినీతాగ్రేసరా! మా నిర్భయ్ నగర్ కాలనీకి మేమంతా మీకు స్వాగతం చెప్తున్నయ్! మీట్ యువర్ ఓటర్ కార్యక్రమం లోపట మీరూ మా కాలనీకి ఇన్ వైట్ చేస్తే వచ్చినయ్. అందుకు మా మెంబర్స్ అన్నీ హాపీగున్నయ్. ఇప్పుడు మా కాలనీ లేడీస్ వింగ్ ప్రెసిడెంట్ అనూష మీకు దండలేస్తయ్" అనగానే అందరూ తప్పట్లు కొట్టారు.

వెంటనే అనూష వేదిక మీదకెళ్ళి అతని మెడలో దండవేసింది.

అనూషను చూసి గూండారెడ్డి కన్నుగీటాడు.

ఆమె ఉలిక్కిపడింది.

"వాడు నన్ను చూసి చిల్లరగా బిహేవ్ చేస్తున్నాడు" అంది కోపంగా రంగారెడ్డితో.

"వాడు మనక్కాబోయే ఎమ్మెల్యే! వాడితో గొడవ పెట్టుకోవటమెందుకు? సైలెంట్ గా ఊర్కో" అన్నాడు జనార్థన్.

ఆ తరువాత ప్రశ్నోత్తరాల కార్యక్రమం మొదలయింది.

"గూండారెడ్డి సాబ్- మీ మీద ఎన్ని పోలీస్ కేస్ లున్నయ్?" అడిగాడు శాయిరామ్.

"మన స్టేట్ లో రెండొందలు కేస్ ఈ పెండింగ్ లో ఉన్నయ్- పక్క స్టేట్ లో నూట పద్నాలుగు. ఇంకో పదహారు కేసులు బుక్కయితే గిన్నిస్ రికార్డ్ బ్రేక్ జేస్తా-"

అందరూ తప్పట్లు కొట్టారు.

"నేన్చెప్పలే! చాలా గ్రేట్ ఫెలో వీడు!" అంటోంది పార్వతీదేవి.

"మీరెంత కాలం జైల్లో ఉన్నారు?" అడిగాడు రంగారెడ్డి.

"ఇగో! బచ్ పన్ కెళ్ళి మన జిందగీ అంతా జైల్లోనే గుజరాయించినారా భాయ్! ఒకదినం మా జైలర్ సాబ్ నాతాన కొచ్చి- నన్ను చానా లైక్ చేస్తాడన్నట్లు- 'ఏంరా గూండారెడ్డీ! మన జైల్లో ఉన్న ఖైదీలందరూ ఎప్పుడు ఛాన్స్ దొరికితే అప్పుడు పెరోల్ మీద బంధువుల్ని పెళ్ళాం బిడ్డల్ని కలుసుకుని గడపనీకి రెండు మూడు రోజులు ఇండ్లకు పోతారు కదా? మరి నువ్ ఒక్కదినం కూడా మీ వాళ్ళ దగ్గరకు పోవేంరా? అనడిగిండు.

నేనేం జెప్పినానో ఎరుకనా? "జైలర్ సాబ్! నా బంధువులు, నా కుటుంబం, నా దోస్త్ లు- అందరూ ఈ జైల్లోనే ఉండే- ఇంక బయటెవడున్నాడని బయటకు పోవాలె?"

అందరూ ఈలలు వేసి తప్పట్లు కొట్టారు.

"అటువంటి ఖాన్ దాన్ మాది. మొత్తం ఖాన్ దానంతా జైల్లోనే ఉంటూండెరా భాయ్. నాకు ఇంకొక్క గిన్నిస్ రికార్డ్ కూడా ఉన్నదిరా భాయ్. జైల్లో ఉండే బయట ఎనిమిది మర్డర్లు జేసినా! వరల్డ్ లో గిట్ల జేసెడిది ఎవడితోటి కాలే!"

మళ్ళా మా కాలనీ లేడీస్, పిల్లలు, యూత్ తప్పట్లు కొట్టారు.

"నా మీద మర్డర్ కేస్ లు, రేప్ కేస్ లు, కిడ్నాప్ కేస్ లు, లాండ్ గ్రాబింగ్ కేస్ లూ, బ్లాక్ మెయిలింగ్ కేస్ లూ- ఇన్నున్నాగానీ కాంగ్రెసోళ్ళూ, తెలుగుదేశమోళ్ళూ- బీజేపీ వోళ్ళు, కమ్యూనిస్టోళ్ళు జైలులో నా సెల్ ముందు లైన్ కట్టిన్రు.

అన్నా! నువ్వే వచ్చే ఎలక్షన్స్ లో మా పార్టీ కాండేట్ గా ఎన్నికల్లో పోటీ చేయాలని కాళ్ళమీద పడిన్రనుకో!"

మళ్ళీ మేమంతా హాపీగా తప్పట్లు కొట్టి ఈలలు వేశాం.

"నేను వాళ్ళందరికీ ఒక్కటే జెప్పినా! ఇగో- నా మీదా, నా ఖాన్ దాన్ మీదున్న కేస్ లన్నీ మాఫ్ జేస్తానని ఎవడు నాకు రైటింగ్ లో ఇస్తే ఆడి పార్టీల జేర్తా- అన్నా!

అరె నీయవ్వ- అందరూ రాసిచ్చిన్రురా భయ్! ఇంకేం జెయ్యాలో సమజ్ కాక లాటరీ ఏసినా! నేను జైల్లోపటే ఉంటినా? నా చెంచాలు ఇంటింటికీ తిరిగి చాకు చూబించి మంచిగ ప్రచారం జేసిన్రు! అరె నీయవ్వ- పబ్లిక్ అలాంటి దాదాలను ఎంత లైక్ చేస్తున్రో నాకప్పుడు సమజయింది! లక్షన్నర ఓట్ల మెజార్టీతో గెలిచినరా భయ్. అది గూడా ఎవళ్ళ మీద గెలిచినా? ఆడెవడో పెద్ద సదువులు సదివిన మేధావంట! ఆది మీద ఒక్క పోలీస్ కేస్ భీ లేదంట! వాని ఖాన్ దానంతా ఫ్రీడమ్ ఫైటర్సంట! నువ్వేమయిన జెప్పు, ఆ పాగల్ గాడిని చూస్తే నాకు జాలేసిందిరా భయ్. గసంటోళ్ళు ఏడనో కొలువులు జేసుకు బ్రతకాలె. ఆళ్ళకు పాలిట్రిక్సెందుకు రా?"

మళ్ళా అందరూ తప్పట్లు కొట్టాం!

"సార్! ఈ ఎలక్షన్స్ లో మిమ్మల్ని మళ్ళా గెలిపిస్తే మీరు మా కోసం ఏం జేస్తారు?"

"ఇగో- మీలో ఎవడు ఏ కేస్ మీద జైలుకి పోయినాగాని 24 గంటల్లో నేను జామీనిచ్చి ఇడిపిస్తా! ఇదివరకే క్రిమినల్ కేస్ కింద బుక్కయినోళ్లందరినీ సిఆర్ ఎస్ స్కీమ్ కింద ఇంటికి పంపిస్తా"

"సిఆర్ ఎస్ స్కీమ్ అంటే ఏంది సార్?" అడిగాడు శాయిరామ్.

"అరె నీయవ్వ! సిఆర్ ఎస్ అంటే ఎరుకలేదా? అన్ని పార్టీవాళ్ళూ పవర్లోకొచ్చాక పైసలు దండుకోనికి పెడతార్రా భయ్- బిఆర్ ఎస్ స్కీమ్ అని- అంటే బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీమ్- అంటే ఏందన్నట్లు- ప్లాన్ శాంక్షన్ లేకుండా భూమి నీదికాక పోయినాగానీ, కబ్జా చేసి ఇల్లు కట్టినావనుకో- దానిని రెగ్యులరైజ్ జేయాలి కదా! గట్లనే క్రైమ్ చేసినోళ్ళందరూ గూడా క్రైమ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ కింద అప్లయ్ జేస్తే పైసల్దీసుకుని మొత్తం కేస్ లన్నీ మాఫ్ జేస్తామన్నట్లు!"

అందరం మళ్ళీ తప్పట్లు కొట్టాం! మా కాలనీలోని గాళ్స్ కొంతమంది వేదిక మీదకు దూసుకెళ్ళి గూండారెడ్డి ఆటోగ్రాఫ్ లు తీసుకుని ఫోటోలు దిగారు.

"ఇంకోముచ్చటేందంటే టెన్త్ క్లాస్ కెల్లే కొత్త కంప్యూటర్ కోర్స్ లు షురూ జేయిస్తా- ఆ కోర్స్ లో ఏం ట్రైనింగ్ ఇస్తరంటే- ఏటిఏం కార్డ్ ఫ్రాడ్ ఎట్లా జేయాలె! క్రెడిట్ కార్డ్ ఎట్లా ఫ్రాడ్ జేయాలె! చేసినాక ఎట్లా పట్టుబడకుండా ఉండాలె! బాంక్ ఎకౌంట్స్ లో వేరేవోళ్ళ ఎకౌంట్స్ లోని డబ్బు మన ఎకౌంట్స్ లోకి ఆన్ లైన్ లో ఎట్లా ట్రాన్స్ ఫర్ జేసుకోవాలె! ఇవన్నీ నేర్పిస్తే ఇంక మన స్టేట్ ల నిరుద్యోగం ఏడుందిరా భాయ్"

అందరూ 'జయహో' అని అరిచాం!

అక్కడితో ఆ రోజు కార్యక్రమం ముగిసింది.

గూండారెడ్డి వెళ్ళేటప్పుడు మా ప్రెసిడెంట్ ని పక్కకు పిలిచాడు. "ఇగో గోపాల్రావ్ అన్నా! మీ కాలనీ లేడీస్ వింగ్ ప్రెసిడెంట్ పేరు అనూష కదా! దాన్ని నాతోటి సెటిలవమని జెప్పు! దాన్ని నాకు పర్మనెంట్ గా సెటప్ జేసినావనుకో- మీ కాలనీకి రెండు కోట్లు డొనేషన్ ఇస్తా"

యాదగిరి షాకయ్యాడు.

"దేఖోసాబ్! ఇది ఫస్ట్ టైమ్, ఎమ్మెల్యే కేండేట్ గిసంటి డిమాండ్ చేసెడిది! ఇది డిగ్నిఫైడ్ పీపుల్ ఉండే కాలనీ. గసంటి దందాలు ఎవ్వరూ చెయ్యరు"

గూండారెడ్డి పగలబడినవ్వాడు.

"ఏందిరో! నాకు లెసనిస్తున్నావ్! పైసల్దీసుకుని ఓటేయటం మన స్టేట్ లో కాలనీలన్నింటికి ఆదత్ జేసిందెవళ్ళు? మా రాజకీయ నాయకులే కదా! మీ కాలనీలో వుండేటోళ్ళందరూ డిగ్నిఫైడ్ పీపులన్నావ్. మేము పైసల్దీసుకోకుండా ఓటేస్తాం అని ఎవళ్ళయినా అంటున్రా! పైసల్దగ్గర బుద్ధి గడ్డితినేప్పుడు లేని డిగ్నిటీ పడుకోనికి అడ్డమెందుకొస్తున్నదిరా భయ్"

మా అందరికీ అతని మాటలతో రక్తం ఉడికిపోయింది. అదే ఇంకొకళ్ళెవరయినా ఆ మాటంటే దుమ్ము లేపేవాళ్ళం.

కానీ వాడు మన ప్రజలందరి ప్రతినిధి! వాడికే మనం ఓట్లేసి గెలిపిస్తున్నాం. ప్రజాస్వామ్యం పేరుతో లుచ్చా పనులన్నీ వాళ్ళు చేయిస్తూంటే హ్యాపీగా చూస్తున్నాం. వాళ్ళు గల్లీకొక వైన్ షాప్, రోడ్డుకొక బెల్ట్ షాప్, లొకాలిటీకొక బ్రోతల్ హౌస్, దానిపక్కనే గాంబ్లింగ్ హౌస్- ఇవన్నీ వాళ్ళే ప్రారంభోత్సవాలు చేస్తుంటే పోటీలుపడి వెళ్ళి వాళ్ళను పూల

దండలతో ముంచెత్తుతున్నాం.

ఆ మర్నాడు రెండోపార్టీ అభ్యర్థి మా కాలనీకొచ్చాడు. అతని కారువెనుక వందకార్లు వచ్చి మా రోడ్లన్నీ బ్లాక్ చేసేశాయ్.

దండలేసే కార్యక్రమం అయ్యాక మీట్ యువర్ ఓటర్ కార్యక్రమం మొదలయింది.

"సార్, మీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు యాభైవేల కోట్లు అవినీతి జరిగిందని మీడియా అంటోంది" అడిగాడు రంగారెడ్డి.

"నో! యూ ఆర్ రాంగ్! యాభైవేల కోట్లు కాదు, అరవై వేల కోట్లు ఫ్రాడ్ చేశాం!"

అందరూ ఆనందంతో తప్పట్లు కొట్టి ఈలలు వేశారు.

"నేన్జెప్పలే? ఈళ్ళు కనీసం డెబ్బైకోట్లు ఆమ్ దానీలేన్దే ఫ్రాడ్ చేయర్రా భయ్! బాగా డిగ్నిఫైడ్ పార్టీ" అన్నాడు యాదగిరి.

"మరి మీరు అవినీతితో గిన్నీస్ రికార్డ్ బ్రేక్ చేయలేదా?"

"చేశాంగానీ మా రికార్డ్ ని మేమే బ్రేక్ చేశాం గనుక ఆ ఉత్సవాలు చేయలేకపోయాం! ఏదేమయినా ఈసారి అధికారంలోకొస్తే లక్షకోట్ల అవినీతిని టార్గెట్ గా పెట్టుకున్నాం"

అందరూ చాలాసేపు తప్పట్లుకొట్టి హర్షధ్వానాలు చేశారు.

"ఎలా తయారయ్యారు జనం! లక్షకోట్ల అవినీతిని టార్గెట్ గా పెట్టుకున్నామని వాడు చెప్తుంటే వీళ్ళు తప్పట్లు కొడుతున్నారు" అంటూ గొణుక్కుంటున్నాడు చంద్రకాంత్.

సావిత్రమ్మ లేచి నిలబడింది.

"గెలిచాక మీరు ప్రజలకోసం ఏం చేయబోతున్నారు?"

"చెప్పాను కదమ్మా! లక్షకోట్ల అవినీతి మా ప్రభుత్వం టార్గెట్ అని"

"అవినీతివల్ల మీకు లాభం గానీ మా ప్రజలకేంటి లాభం?"

"ఆమాత్రం మీలాంటి ఎడ్యుకేటెడ్ కి తెలీలేదంటే నాకు చాలా షాకింగ్ గా ఉంది. అవినీతి అనేది ఎలా పుడుతుంది? ఏదయినా ఒక పని చేస్తేనే కదా అవినీతి పుట్టేది? మేము లక్షకోట్ల అవినీతిని టార్గెట్ గా పెట్టుకున్నామంటే కనీసం కోటి కోట్ల అభివృద్ధయినా జరుగుతుంది కదా! ఆ అభివృద్ధి వల్ల లాభం ప్రజలకే కదా!"

అందరూ మళ్ళీ తప్పట్లు కొట్టారు.

"సార్, ఈసారి ఓటుకి ఎంత డబ్బివ్వబోతున్నారు?"

"ఎడ్యుకేటెడ్ ఓటర్లయితే ఓటుకి రెండువేల రూపాయల వరకూ ఖర్చుపెట్టాలనుకుంటున్నాం! అదే కూలీనాలీ జనం ఓటుకి అయిదువందల కంటె ఎక్కువ ఇవ్వదల్చుకోలేదు"

"అదేంటి? చదువుకున్నోడి ఓటుకి అంత ఎక్కువ ఎందుకు ఇవ్వాలనుకుంటున్నారు?"

"ఎందుకంటే చదువుకున్నోడు అందరి దగ్గరా డబ్బు తీసుకుని తనకు నచ్చిన పార్టీకి వేసే అవకాశం ఉంది! అందుకే వాడికి రెండువేలిచ్చి, ఎలక్షన్ రోజున ఉదయం వాడింటికెళ్ళి వాడి వేళ్ళన్నిటికీ ఇంక్ గుర్తులు పెట్టేస్తాం! దానివల్ల వాడి ఓటు మాకు పడదుగానీ వేరే ఎవడికీ పడకుండా ఆపుతామన్నమాట!"

అందరూ మళ్ళీ తప్పట్లు కొట్టారు.

"సార్ మీరు గెలుస్తే కిలో బియ్యం ఎంతకిస్తారు?"

"మేం గెలిచిన మొదటిరోజు నుంచే కిలో బియ్యం వందరూపాయలు చేస్తాం"

అందరూ షాకయిపోయాం.

"అదేంటి సార్! అందరూ కిలో బియ్యం రూపాయికీ లేదా అసలు ఉచితంగా ఇస్తామంటూంటే మీరు వందరూపాయలు అంటారేంటి?"

"మీ కాలనీ ఓటర్లు మరీ బ్యాక్ వర్డ్ పీపుల్ లాగున్నారు. వందరూపాయలకు కిలోబియ్యం ఎప్పుడు చేయగలం? ప్రజలందరూ కూడా అవినీతిపరులయి, లక్షలు లక్షలు సంపాదించే అవకాశాన్ని మా ప్రభుత్వం కల్పిస్తుంది. మరి ప్రజల దగ్గర అంత అవినీతి సొమ్ము ఉన్నప్పుడు వంద రూపాయలు కిలో బియ్యానికి ఖర్చు చేయడానికేమయింది?

ప్రపంచంలోకెల్లా అతి పెద్ద పర్చేజింగ్ పవర్ ఉన్నదేశంగా మనది అభివృద్ధి చెందుతుంది గనుక మన ఎకానమీ కూడా బ్రహ్మాండంగా ఉంటుంది"

"కానీ ప్రజలందరికీ అవినీతి సంపాదన ఎలా వస్తుంది సార్?"

"ప్రభుత్వం లక్షకోట్ల అవినీతిని టార్గెట్ గా పెట్టుకున్నప్పుడు పర్ కాపిటా ఫ్రాడ్ కూడా ఆటోమేటిగ్గా పెరిగిపోతుందని మా పార్టీ ఆర్థిక నిపుణులు అంటున్నారు- ఎక్స్ పెరిమెంట్ చేసి చూద్దాం! మనకు నష్టం లేదుగా. అయితే వరల్డ్ లో నెంబర్ వన్ అవుతాం- అంతేకదా?" అందరూ మళ్ళీ తప్పట్లుకొట్టారు.

ఇలా నాలుగు రోజులు గడిచాక నలుగురు అభ్యర్థులు దగ్గర్నుంచీ మా కాలనీ వాళ్ళు యాభై లక్షలు తీసుకుని రెండువేల ఓట్లు అమ్మడానికి నిశ్చయించుకున్నారు.

ఓట్లు అమ్ముకున్న డబ్బుతో ఆ రాత్రి మా కమిటీ మెంబర్స్ అందరం ముందు పార్టీ చేసుకున్నాం.

బాగా మందెక్కువయి పోయేసరికి రంగారెడ్డికి ఏడుపు మొదలెట్టాడు.

"ఒరేయ్ గోపాల్రావ్! మా ఓట్లకు మంచి రేటే ఇప్పించావ్ గానీ, ఇంకొంత కాలం మనం ఈ ప్రజాస్వామ్యాన్నే నమ్ముకుంటే మన ప్రజలందరూ తాగుబోతులు, వ్యభిచారులు, అవినీతిపరులు, దొంగలు, మర్డరర్లు, కిడ్నాపర్లుగా తయారయిపోవటం ఖాయం రా!"

అతను ఏడుస్తూ మాట్లాడుతుంటే మేమందరం ఆ స్పీచ్ ని ఎంజాయ్ చేయటం మొదలుపెట్టాం.

* * * * *

## ఎన్ని 'కలకలం'

మిగతా దేశమంతా పట్టుకున్నట్లే ఎలక్షన్ ఫీవర్ మా కాలనీక్కూడా పట్టుకుంది.

మా కాలనీలో ప్రత్యేకత ఏంటంటే మొత్తం రెండువేల ఓట్లుంటాయ్. అదిగాక ఈ మధ్య ఓటు హక్కు కొత్తగా వచ్చిన యూత్ ఓట్లు కనీసం వెయ్యుంటాయ్.

ప్రతి ఓటుకూ కొన్ని వేల ధర పలుకుతున్న ఈ రోజుల్లో- మూడువేల ఓట్లు ఒకేచోట- ఒకే అసోసియేషన్ కింద ఉన్నాయనేసరికి ఏ పార్టీ అభ్యర్థికయినా కొంచెం టెంప్టింగ్ గానే ఉంటుంది కదా!

అందుకని ఎలక్షన్స్ ఇంకా చాలా దూరం ఉన్నా అందరూ ఏదొక వంక కల్పించుకుని మా కాలనీకి రావటం- వాళ్ళ పార్టీకి మా వాళ్లంతా ఓటేస్తే ఏమేం ఉచితంగా ఇవ్వబోతున్నారో లిస్ట్ చదవటం చేస్తున్నారు. మా అసోసియేషన్ వాళ్ళందరం ఎమర్జెన్సీ మీటింగ్ పెట్టుకున్నాం. ఈసారి మేమందరం ఏ పార్టీకి ఓటేయాలనే విషయం మీద మా నిసార్ మియా డిస్కషన్ ప్రారంభించాడు.

"బాగా ప్రియం అయిన సోదరిలారా! ఎక్కువ ప్రియం అయిన సోదరులారా!" అన్నాడు ఉర్దూలో రాసుకున్న తెలుగు చదువుతూ.

"బాగా ప్రియం అయినా అంటాడేంటి! ప్రియమైన అని చదవొచ్చుగా!" అడిగాడు రంగారెడ్డి పక్కనున్న శాయిరామ్ ని.

అంటే ఆయనుద్దేశ్యం ఏంటంటే అదివరకు ఓట్లు కొనుక్కోవడానికి చాలా చవగ్గా దొరికేవి! ఇప్పుడు బాగా ప్రియం అయిపోయినయ్ అని!" అంటూ ఎక్స్ ప్లనేషనిచ్చాడు శాయిరామ్.

"కరెక్టే మరి! ఆ రోజుల్లో ఓట్లసలు ఫ్రీగా దొరికేవట! ఒక్కపైసా కూడా అడక్కుండానే ఓటేసేవారట!" అంది సావిత్రమ్మ వాళ్ళ అమ్మమ్మ చెప్పిన మాటలు గుర్తు చేసుకుంటూ.

దాంతో అందరూ ఆమె చుట్టూ మూగిపోయారు.

"నిజంగా ఒక్కపైసా కూడా తీసుకునే వారు కాదా?" అడిగారు యూత్ అసోసియేషన్ వాళ్ళు.

"అవును! యంగ్ ఏజ్ లో ఉన్నప్పుడు నేనూ నా మొదటి ఓటు డబ్బులేమీ తీసుకోకుండానే వేశాను" అందామె గర్వంగా.

యూత్ అంతా పగలబడి నవ్వారు.

"ఏం పాగల్ గాళ్లా భాయ్ ఆ దినాల్లో పబ్లిక్! అందుకే ఇండియా ఇంత వెనుకబడింది. వాళ్ళు చేసిన ఆ వెధవ పనివల్ల మన జనరేషనంతా సఫర్ అవుతున్నాం!" అన్నాడొకడు.

నిసార్ ఉపన్యాసం కంటిన్యూ చేశాడు.

"ఈ దినం మనమంతా టూమచ్ గర్వపడుకోవాల్సిన దినం!"

"ఆహా! ఎంత గొప్ప తెలుగురా నాయినా! గర్వాన్ని కూడా పడుకోబెట్టాశావ్" అన్నారెవరో వెనుకనుంచి.

ఆ మాట వినిపించేసరికి నిసార్ కి కోపం వచ్చింది.

"ఇగో- నేను కొంచెం జర ఎక్కువ కష్టంపడి తెలుగూ మాట్లాడినయ్. నీకు ఒక్క ఉర్దూ అక్షరంభీ రావ్ కదా! మూడు జన్మ కావాలి-"

అందరూ నిసార్ కి సర్ది చెప్పారు.

"నా దగ్గర ఒక లిస్ట్ ఉన్నయ్- ఏ పార్టీ మనకు ఏం పుక్కట్ గా ఇస్తయ్- మీదికెళ్ళి- ఎలక్షన్ ముందటి దినం రాత్రి మన ఇళ్ళకొచ్చి ఎన్ని పైసల్ ఎక్ స్ట్రా ఇస్తయ్- ఇదంతా ఈ లిస్ట్ లో ఉన్నయ్. ఇప్పుడు ఈ లిస్ట్ రంగారెడ్డి చదువుతయ్-" అంటూ రంగారెడ్డికి నిసార్ లిస్ట్ ఇచ్చాడు.

రంగారెడ్డి వెంటనే చదవటం మొదలుపెట్టాడు.

"నిలువు దోపిడీ పీపుల్స్ పార్టీ వాళ్ళు ఇచ్చిన హామీలు- రాష్ట్రంలోని వైట్ కార్డ్ స్త్రీలందరికీ జరీ చీరలు ఒక్కొక్కరికి ఆరు చొప్పున ఉచితం! ఒక్కో చీర ఖరీదు కనీసం మూడు వేలుంటుంది!"

కాలనీలో ఉన్న వైట్ కార్డ్ వాళ్ళు తప్పట్లు కొట్టారు.

"నిలుపు దోపిడీ పీపుల్ పార్టీ- జిందాబాద్" అంటూ అరిచారు.

"అది కాకుండా- వైట్ కార్డ్ కుటుంబాలన్నిటికీ నెలకు వందకిలోల బియ్యం ఉచితం-"

మళ్ళీ తప్పట్లు కొట్టారు వైట్ కార్డ్ వాళ్ళు.

"అది కూడా కాకుండా- వైట్ కార్డ్ వాళ్ళందరికి- ప్రతి ఇంటికీ నాలుగు వైట్ కార్డ్ లు ఉచితం-"

తప్పట్లు ఇంకా పెద్ద ఎత్తున మారుమ్రోగిపోయినయ్.

"ఇక అష్టదరిద్ర ప్రజాస్వామ్య పార్టీవాళ్ళు ఇస్తున్న ఎన్నికల మానిఫెస్టో ఏంటంటే తెలుగు ప్రజలందరికీ- వైట్ కార్డ్ తో పని లేకుండా- నెలకు ముప్పై లీటర్ల బ్రాందీ, లేక విస్కీ, లేక రమ్ము ఉచితం-"

ఈసారి మొత్తం అక్కడున్న వారంతా, పదేళ్ళ విద్యార్థులతో సహా తప్పట్ల వర్షం కురిపించారు. యూత్ అసోసియేషన్ వాళ్ళు డాన్స్ ను కూడా చేశారు- గాళ్ స్టూడెంట్స్ తో కలసి.

"హాట్ డ్రింక్స్ తీసుకోని వారికి వెయ్యి లీటర్ల బీరు కూడా ఉచితంగా ఇవ్వాలె! అప్పుడే ఆ పార్టీకి మా ఓట్లు" అంటూ అరిచారు అమ్మాయిలు.

"అష్టదరిద్ర ప్రజాస్వామ్య పార్టీ- జిందాబాద్- పది కాలాలు వర్ధిల్లాలి-" అని కూడా నినాదాలు చేశారు.

"అది కాకుండా- ఇదే పార్టీ ఇంకో అద్భుతమయిన వాగ్దానం కూడా చేస్తోంది-" అన్నాడు శాయిరామ్.

"అదేంటో చెప్పు- చిల్లర సస్పెన్సూ నువ్వూనూ-" వెనుక నుంచి స్టూడెంట్స్ అరిచారు.

"వైట్ కార్డ్ ఉన్న ప్రతి కుటుంబానికి టాటావారి 'నానో' కారు ఉచితం-"

అంతా ఈలలూ, తప్పట్లూ-

"ఇక వీరపీకుడు పార్టీవాళ్ళ వాగ్దానాలేంటంటే బలహీన, బడుగు, మైనారిటీ, వెనుకబడిన వర్గాల వారందరికీ మెట్రోరైల్లో ఉచిత ప్రయాణం, ఆర్టీసీలో రాష్ట్రంలో ఏ మూల నుంచీ ఏ మూలకయినా ఉచిత ప్రయాణం. విమానాల్లో సంవత్సరానికి రెండుసార్లు ప్రపంచంలో ఏ దేశానికైనా ఉచిత ప్రయాణం! ఆకాశశ్రీ అనే ఈ పథకంలో ఫోన్ 1001 కొట్టగానే ఏసీ వాన్ వచ్చి అందర్నీ ఎయిర్ పోర్ట్ కి తీసుకెళ్తుంది."

తప్పట్ల మోత మోగిపోయిందీసారి.

"వీరపీకుడు పార్టీయే- గెలవాలి- మాక్కావాలి! మన ఓట్లన్నీ వీరపీకుడు పార్టీకే-" లాంటి నినాదాలు హోరెక్కిపోయాయ్.

తరువాత పరమ నికృష్ట పార్టీ మానిఫెస్టో చదివాడు రంగారెడ్డి.

"కార్మికులందరూ వారానికొక్కరోజే- అంటే సోమవారాలు మాత్రమే పనిచేయాలి- మిగతా ఆర్రోజులూ ఎంజాయ్! అంతేకాదు- వారందరికీ సంవత్సరానికి పది లక్షల రూపాయలు బోనస్ ఇస్తాం! ఆ కంపెనీలు, ఆఫీస్ లు ఎంత నష్టాల్లో ఉన్నా సరే- ఒకవేళ కంపెనీ దివాలా తీస్తే ఇన్సూరెన్స్ కంపెనీలు ఆ పదిలక్షలూ చెల్లిస్తాయ్. రైతులకు పొలం ఉన్నా లేకపోయినా వ్యవసాయం చేసినా, చేయకపోయినా నెలకు లక్షరూపాయలు బ్యాంక్ రుణం ఫ్రీ- అది కూడా వాపస్ ఇవ్వక్కర్లేదు-"

అంతా తప్పట్లు మార్మోగిపోయాయ్ గానీ ముందు వరుసలో కూర్చున్న కార్మికుడు లేచి నిలబడ్డాడు కోపంగా.

"వారానికొక్కరోజు అంటే- సోమవారం మాత్రమే పని చేయాలన్నారు బాగానే వుంది సార్- కానీ ప్రతి సోమవారం అలా పనిచేస్తూనే ఉండాలా? ఇక మాకు వీక్లీ ఆఫ్ ఎప్పుడిస్తారు సార్? సంవత్సరానికి ఎన్ని రోజులు శెలవులుంటాయ్? సిక్ లీవ్ ఎన్ని నెలలుంటుంది? ప్రసూతి శెలవులు సంగతేంటి?"

"ఆ విషయంపై పార్టీ మానిఫెస్టోలో వివరాలు లేవు- కనుక్కొని చెప్తాం-" అన్నాడు శాయిరామ్.

ఆ వర్కర్ గొణుక్కుంటూ కూర్చున్నాడు.

"భూర్జువా నా కొడుకులు-"

"అంతేకాదు! మా పార్టీ అధికారంలో కొస్తే మైనారిటీలయిన ముస్లిమ్ సోదరులకు రంజాన్ మాసమంతా ఉచితంగా బిరియానీ, హలీమ్ పాకెట్లు ఇస్తాం!"

ముస్లిం సోదరులు తప్పట్లు కొట్టారు.

"తరువాత చిల్లర పార్టీ వాళ్ళ మానిఫెస్టో! ఆ పార్టీ అధికారంలో కొస్తే మద్యం రాష్ట్రమంతా ఏరులయి ప్రవహిస్తుంది- అదీ ఉచితంగా. ప్రతి ఇంటికి మద్యం కుళాయిలు ఏర్పాటు చేస్తాం- కుళాయిలు తిప్పుకుని ఎవరికెంత కావాలో అంత 24 గంటలూ తాగి పడివుండవచ్చు- అంతేకాదు. వ్యభిచారానికీ పెద్దపీట వేస్తాం! లీగలైజ్ చేస్తాం. గల్లీగల్లీకీ వ్యభిచార గృహం- ఆ వ్యభిచారులందరికీ కార్పొరేట్ హాస్పిటల్స్ లో ఉచిత పరీక్షలు, వైద్యం- అంతేకాదు- ఉచిత మందులు కూడా- ఫోన్ కొడితే చాలు- ఈ స్కీమ్ పేరు సెక్స్ శ్రీ పథకం-

జీరో నెంబర్ డయల్ చేయగానే సెక్స్ శ్రీ కారు మీ ఇంటికొస్తుంది. మిమ్మల్ని తీసుకెళ్ళి సమీపంలో ఉన్న వ్యభిచార గృహానికి చేరుస్తుంది. అక్కడ మీక్కావలసిన అమ్మాయిని మీరు సెలక్ట్ చేసుకుని ప్రభుత్వ అతిథి గృహాలు బుక్ చేసుకుని అందులో మీకిష్టమొచ్చినన్ని రోజులు ఉండవచ్చు-"

స్టూడెంట్స్ ఈలలూ తప్పట్లతో మోతెక్కించేశారు.

"చిల్లర పార్టీయే కావాలి"

"చిల్లర పార్టీ - జిందాబాద్-"

"సాటిలేని మేటి పార్టీ- చిల్లర పార్టీ"

"ఇవీ మనకున్న పార్టీలు! కనుక వీటిల్లో ఏ పార్టీని గెలిపిస్తే మనకు లాభాల పంట కలుగుతుందో డిస్కస్ చేసుకుని డిసైడ్ చేయాల్సి ఉంది" అంటూ ముగించాడు రంగారెడ్డి.

రాత్రి పన్నెండింటివరకూ తీవ్రమయిన చర్చలు జరిగాయ్. ఒక్కో ఏజ్ గ్రూప్ వాళ్ళూ ఒక్కో పార్టీని సపోర్ట్ చేయడంతో ఏకాభిప్రాయం కుదర్లేదు. వాతావరణం చాలా వేడెక్కిపోయాక జనార్ధన్ కల్పించుకున్నాడు.

"సోదర సోదరీమణులారా! మీరు నినయం తీసుకునే ముందు రెండు మాటలు మాట్లాడాలనిపించింది. ఇన్ని పార్టీలు ఎన్నికల మానిఫెస్టోని ప్రకటించాయ్ గానీ- వీటిల్లో ఏ ఒక్కరూ వాళ్ళ ఎన్నికల వాగ్దానాలకు నిధులు ఎలా సమకూర్చుకుంటారో తెలుపలేకపోతున్నారు. ఓటు వేసేముందు మనం ఆ పాయింట్ క్లారిఫై చేయమని చెప్పాలి" అన్నాడతను. అప్పుడే అతని సెల్ ఫోన్ మోగింది.

"సోదరులారా! ఇప్పుడే నిలువుదోపిడీ పార్టీవాళ్ళు మాట్లాడారు. వాళ్ళు మన రాష్ట్రంలో మూడోవంతు భూమిని విదేశాలకు అమ్మి ఆ డబ్బుతో ఎన్నికల వాగ్దానాలు అమలు చేస్తారట- ఇక అష్టదరిద్ర ప్రజాస్వామ్య పార్టీవాళ్ళయితే రైతులందరినీ పక్క రాష్ట్రాలకు వలస పంపి వాళ్ళ భూములన్నీ సెజ్ లకు ఇచ్చి ఆ డబ్బుతో వాగ్దానాలు అమలు పరుస్తారంట- ఇక వీరపీకుడు పార్టీవాళ్ళు అరబ్ దేశాలకు మన రాష్ట్రంలోని లేబర్ ని అమ్మేసి ఆ డబ్బుతో వాగ్దానాలు అమలు పరుస్తారంట. ఇక పరమనికృష్ట పార్టీ వాళ్ళు మన రాష్ట్రాన్ని థాయ్ లాండ్ లాగా సెక్స్ కాపిటల్ గా చేసి విదేశీ యాత్రికుల ద్వారా వచ్చే ఆదాయంతో వాగ్దానాలు అమలు పరుస్తారంట!

చిల్లర పార్టీవాళ్ళేమో టెర్రరిస్ట్ లతో లింకులు పెట్టుకుని వాళ్ళకు స్థావరాలు ఇచ్చినందుకు డబ్బు సంపాదిస్తారట-"

అందరూ రాత్రి రెండింటి దాకా ఆలోచించి చివరకు కంబైన్డ్ గా నిర్ణయం తీసుకున్నారు.

"మా నిర్భయ్ నగర్ కాలనీ కే లోగ్-టూమచ్ గా విచారణ చేసి ఒక అండర్ స్టాండింగ్ కి వచ్చినయ్. ఆ నిర్ణయం ఏమున్నయ్ అంటే పార్టీలు ఇచ్చిన ప్రామిస్ లు అన్నీ మంచిగున్నయ్. ఆ ప్రామిస్ లు అమలు చేస్తే- మన స్టేట్ లో ఒక్క జనంభీ కొలువు చేసే పనిలేవ్! మొత్తం జనం అన్నింటికీ ఫ్రీగా మద్యం వస్తయ్. పుక్కట్ గా బియ్యం వస్తయ్ ఫారిన్ టూర్స్ పుక్కట్! మెట్రోరైల్ పుక్కట్- బస్ జర్నీ పుక్కట్! వ్యభిచారం పెద్ద ఇండస్ట్రీ అవుతయ్! లేబర్ నెలకు ఒక్కటే దినం కొలువు జేస్తయ్- రైతులు వ్యవసాయం చేయకపోయినా పుక్కట్ గా బాంక్ లోనే- అదిభీ హర్ ఏక్ కో దస్ లాక్- ఆ లోన్ వాపస్ చేసే పనిలేవ్- అందుగురించి మనం ఏదో ఒక్కపార్టీకి ఓటింగ్ చేస్తే బాకీ పార్టీలు ఇచ్చే లాభం పోతయ్. దాన్దిక్కు వెళ్ళి ఏ పార్టీకి మెజారిటీ రాకుండా ఓటింగ్ చేయాలే- వైసాకరేతో- కొయ్ లేషన్ గవర్నమెంట్ ఏర్పడతయ్-

అప్పుడు అన్ని పార్టీలు వాగ్దానాలు ఇంప్లిమెంట్ చేస్తయ్. మనకి బహుత్ ఫాయిదా అవుతయ్-" అందరూ తప్పట్లు కొట్టి నిసార్ ని అభినందించారు.

"ఈ పార్టీల వాగ్దానం వల్ల మనందరికీ లాభాలే గాని కొద్ది రోజులు తరువాత మన రాష్ట్రం గతేంటి?" రంగారెడ్డి అడిగాడు. చాలాసేపు ఎవరూ మాట్లాడలేదు గానీ ఆఖర్లో అరిచారు.

"అరె రంగారెడ్డీ! ఫ్యూచర్ గురించి నీకెందుకురా! ఇప్పుడెంజాయ్ చెయ్"

* * * * *

## హైటెక్ ఆంధ్రప్రదేశ్ జిందాబాద్

ఆంధ్రప్రదేశ్ హైటెక్ రంగంలో ముందుకు పోతోంది. ఆంధ్రప్రదేశ్ కమ్యూనికేషన్ రంగంలో ఇంకా ముందుకు దూసుకుపోయింది.

ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్ పోర్ట్ రంగంలో ఇంకా ఇంకా ఫాస్ట్ గా దూసుకెళ్ళిపోయింది. ఆంధ్రప్రదేశ్ మందుకొట్టడంలో రాకెట్ కన్నా స్పీడుగా వెళ్ళి నెంబర్ వన్ ప్లేస్ లో నిలబడింది. ఆంధ్రప్రదేశ్- అబ్బో- ఆ లెవెలే వేరు.

ఒక వంశానికి కాళ్ళు పిసికిన ముఖ్యమంత్రులు, చదువులేని ముఖ్యమంత్రులు, చదువుండీ చదవలేని ముఖ్యమంత్రులు, చెదపట్టిన ముఖ్యమంత్రులూ, హైటెక్ ముఖ్యమంత్రులూ, జలయజ్ఞం ముఖ్యమంత్రులూ- అందరూ కలసి ఆంధ్రప్రదేశ్ ని ఆ లెవెల్లోకి తీసుకెళ్ళి నిలబెట్టారు.

* * *

నేషనల్ హైవే నెంబర్ నైన్ మీద కారు ఒకటి శరవేగంతో రాజధాని వైపు వస్తోంది.

"ఫోర్ లేన్, సిక్సెలేన్, ఎయిట్ లేన్ అని గత పాతికేళ్ల నుండి పేపర్లో రాస్తున్నారు. ఆ రోడ్డెక్కడా కనబడదేం?" అనుకున్నాడు శంకర్రావ్.

బహుశా అదంతా పేపర్ న్యూస్ గనుక. ఆ సిక్స్ లేన్ రోడ్లన్నీ పేపర్ మీద- ఆల్ రెడీ వేసేసినట్లు రాసేసుకుని ఉంటారు.

కాంట్రాక్టర్ జిందాబాద్, ఇంజనీర్లు జిందాబాద్, మినిష్టర్లు జిందాబాద్.

ఆ- రోడ్లు కొంచెం వీక్ అయితే ఏమైందిలే! మిగతా అన్ని రంగాల్లో ఆంధ్రప్రదేశ్ బాగా ముందుకు దూసుకుని తోసుకుని వెళ్లిపోయిందంటగా!

అంతా ఫారిన్ టైపేనంట్లే!

హైవేల మీద రెస్ట్ హౌస్ లూ- రెస్ట్ లెస్ ట్రాఫిక్కూ, బార్ అండ్ రెస్టారెంట్ లూ, హైవే పెట్రోల్- హైవే హైటెక్ కమ్యూనికేషన్ బూత్స్- ఒకటేంటి, సర్వస్వం. అసలు అమెరికా ఏం పనికొస్తుందని! అమెరికా, మిగతా యూరప్ దేశాల్ని ఏనాడో దాటి ముందుకెళ్ళి పోయాం.

ఆహా! రోడ్ చాలా స్మూత్ గా ఉంది. దీన్నే హైటెక్ రోడ్ అంటారేమో! మరి రోజూ ఈ హైవేల మీద అన్ని ప్రమాదాలు- అంతమంది ఎగిరిపోవటం- ఎందుకని?

వాళ్ళ ఆయుష్షు మూడింది- అంతే! గవర్నమెంట్ కేం సంబంధంలేదు.

అమ్మో! మరీ రోడ్డు మధ్యలో పార్కు చేశారేంటి లారీలు- బ్రేక్ నొక్కటం ఒక్కక్షణం ఆలస్యం అయుంటే ఆ లారీలోంచి బయటకు పొడుచుకొచ్చిన ఇనుపరాడ్స్ గుండెల్లో దిగిపోయేవి.

అయినా గవర్నమెంట్ కేం సంబంధం?

అది జనం తప్పు!

అయినా ఓకే! రాష్ట్రాన్ని జుట్టు పట్టుకుని హైటెక్ యుగంలోకి ఈడ్చుకెళ్ళిపోయారు.

అలా ఈడ్చుకెళ్ళడంలో బాడీ తాలూకు కాళ్ళూ చేతులూ విరిగిపోవచ్చు. ఒకోసారి బాడీ మొత్తం పోయి, చేతిలో ఉట్టి జుట్టు మాత్రమే మిగిలి ఉండవచ్చు. అయినా ఓకే! హాట్సాఫ్ టు గవర్నమెంట్స్!

మూడు ప్రాంతాల్లో వెనుకబడిన జిల్లాల్లో జనం అడుక్కు తింటూండవచ్చు.

చదువూ సంధ్యల్లేక మట్టి కొట్టుకుపోయుండవచ్చు. పంటలూ, పొలాలు లేక గడ్డి తింటూండవచ్చు. అయినా రాజధాని పేరు ప్రపంచమంతా మార్మోగేట్లు చేశారంటే, ఇంత గొప్ప నాయకులు ఇంకే రాష్ట్రంలో అఘోరించారని?

అమ్మో! రోడ్ మధ్యలో ఇంత పెద్ద గొయ్యి ఉందేంటీ?

ఓర్నాయనో- దేవుడా రక్షించు-

జ్జూ... థడ్-

అమ్మో! హైటెక్ యాక్సిడెంట్- కారు ఎగిరి ఎదురుగ్గా వస్తోన్న హైటెక్ బస్ కి తగిలి- రోడ్ పక్కనే కార్లు, స్కూటర్లు ఆపి ఉచ్చలు పోసుకుంటున్న వాళ్లను కొంచెంలో మిస్సవుతూ- రోడ్ మీదే నిలబడి మందు కొడుతూన్న యూత్ తాలూకూ మందు బాటిల్స్ ని స్మాష్ చేస్తూ-

అమ్మో- తిరగబడిందిరా దేవుడో-

అబ్బ! కళ్లు నెమ్మదిగా తెరుచుకుంటున్నయ్. కారింకా తలక్రిందులుగానే పడుంది. యాక్సిడెంటై చాలా సేపయినట్లనిపించింది. హైవే హైటెక్ పెట్రోలింగ్ ఏమైపోయినట్లు- ఏంటి తలమీద నుంచీ ముక్కు మీదకు కారుతోంది. కొంపదీసి రక్తమా?

ఓర్నాయనో- రక్తమే! అంటే తలకు దెబ్బ తగిలింది. వెంటనే హాస్పిటల్ కెళ్ళకపోతే పైకే ఇక-

ఎవరూ బయటకు లాగటానికి రారేం?

"రక్షించండి! రక్షించండి!"

పక్కనుంచే వెహికల్స్ అన్నీ పోతున్నయ్- ఎవడూ ఆపడేం?

ఎవరివో మాటలు వినబడుతున్నాయ్. ఎవరో దగ్గరకొస్తున్నట్లున్నారు.

"రక్షించండి! రక్షించండి!"

"ఎవరో కార్లోనుంచి అరుస్తున్నట్లు వినిపిస్తోందిరా! ఒకవేళ ఇప్పుడే యాక్సిడెంట్ అయిందేమో. లోపల ఎవరయినా బతికి ఉన్నారేమో చూద్దామా?"

"అరేయ్! ఈ యాక్సిడెంట్ కేసుల్ల తలదూర్చొద్దురా భయ్. తర్వాత పోలీసోళ్ళతోటి కిరికిరి."

"రాజూ నాక్కొంచెం విస్కీ ఇవ్వు. ఇలాంటి యాక్సిడెంట్స్ చూస్తే చాలా డిప్రెసింగ్ గా ఉంటుంది నాకు"

"యా-షూర్-"

"లెటజ్ గో ఎవే ఫ్రమ్ దిస్ ప్లేస్"

"రక్షించండి- రక్షించండి-"

వీళ్ళకేమయినా జాలి అనేది ఉందా? వీళ్ళసలు మనుషులేనా? గొంతు విని కూడా వెళ్ళిపోతున్నారు. మనుషులు కాదు వీళ్ళు- మృగాలు. ఇంక లాభంలే లేదు. ఎవడూ రాడు. ఎలాగోలా బయటపడి ఎవరొకరి సాయం తీసుకుని సిటీకి పోయి, హాస్పిటల్లో చేరాలి. లేకపోతే ఇక్కడే హరిమనేయచ్చు.

అబ్బ! వళ్లంతా దెబ్బలు తగిలినట్లున్నయ్. ఒకటే నొప్పులు. అదృష్టం ఈ కిటికీ వంగలేదు. బయటకు జారవచ్చు- అబ్బ- అమ్మా- ఆహా- బయటికొచ్చేశా- అబ్బ అమ్మా- ఫర్లేదు, లేచి నిలబడగలిగాను- ఎదురుగ్గా మెరుస్తోన్న బోర్డ్ కనిపిస్తోంది. ఏం బోర్డది?

"హైవే ప్రయాణీకులకు హైటెక్ రాష్ట్రం సుస్వాగతం పలుకుతోంది! మీరు ఎలాంటి ప్రమాదానికి గురయినా ఈ ఆంధ్రప్రదేశ్ హైటెక్ కమ్యూనికేషన్స్ ద్వారా తక్షణ హైటెక్ మెడికల్ సేవలు పొందండి. వెంటనే ఫోన్ తీసుకుని తక్షణ సాయం కోసం ఒకటి డయల్ చేయండి-"

రియల్లీ గ్రేట్? అందుకే ఆంధ్రప్రదేశ్ ని హైటెక్ స్టేట్ అన్నారు- ఊరికే అన్నారా?

క్లింటనే వప్పుకున్నాడు.

"మీ ప్రగతి అద్భుతం' అని. మొత్తం అన్నీ చైనానుంచే దిగుమతి అవుతున్నా ఓకే. ప్రగతి దారి ప్రగతిదే చైనా దారి చైనాదే- అబ్బ! కాళ్ళునొప్పులు- రెండు మూడు ఫ్రాక్చర్స్ అయినా అయుంటాయ్.

ముందు ఒకటి డయల్ చేద్దాం

టింగ్

ఆహా! ఫోన్ పనిచేస్తోంది.

ఇంక నా ప్రాణానికి ఢోకాలేదు-

"థాంక్యూ! మా హైటెక్ కమ్యూనికేషన్ వ్యవస్థను వినియోగిస్తున్నందుకు ధన్యవాదాలు! ఇంగ్లీష్ లో సంభాషణలకోసం ఒకటినొక్కండి. హిందీమే సున్ నే కేలియే దో దబాయియే! తెలుగులో వినుటకయి తీన్ దబాయియే"

ఇతరభాషలు మనకెందుకు? మన ఓన్ మదర్ టంగ్ ఉండగా! అందుకని మూడేనొక్కుదాం- టింగ్

"తెలుగు భాషమీద మీకున్న ప్రేమకు జోహార్లు. తెలుగు భాషకు త్వరలోనే ప్రాచీన భాషాయోగం కల్పించేందుకు ప్రభుత్వం, తెలుగు ప్రజలు కృతనిశ్చయంతో ఉన్నారని తెలియజేయడానికి ఆనందిస్తున్నాం.

దేశబాషలందు తెలుగు లెస్స

ధన్యవాదాలు-

"ఇప్పుడు ఆంధ్రా తెలుగు కావాలంటే ఒకటి నొక్కండి, తెలంగాణా తెలుగు కోసం రెండు నొక్కండి. ఉత్తరాంధ్ర తెలుగుకోసం మూడునొక్కండి. రాయలసీమ తెలుగుకోసం నాలుగు నొక్కండి."

ఓర్నాయనో ఈ నొక్కుడులన్నీ అయేలోపల చచ్చేట్లున్నాఅగ అయినా తప్పేదేముంది? తెలంగాణా తెలుగులోనే విందాం- అంటే ఎన్నినొక్కాలి! ఆ! రెండు-

టింగ్

"తెలంగాణా తెలుగు కోరుకున్నందుకు ధన్యవాదాలు! జై తెలంగాణా!

ఇప్పుడు కొద్దిసేపు వ్యాపార సందేశాలు వినండి. శంషాబాద్ ఎయిర్ ఫోర్డ్ గోడనానుకుని ఉన్న విచ్చలవిడి రియల్ ఎస్టేట్ కంపెనీలో నేడే మీ ప్లాట్ బుక్ చేసుకోండి. 500 గజాలు, వెయ్యి గజాల ప్లాట్లు అతిసరసమయిన ధరలకే మీ సొంతం చేసుకోండి! ఒక ప్లాటు కొన్నవారికి ఒక కారు ఉచితం.

టింగ్ టింగ్

ప్రమాదంలో గాయపడ్డారా?

వెంటనే 'శాశ్వతం' మల్టీస్పెషాలిటీ హాస్పిటల్లో చేరండి! మూడు నెలలపాటు ఇన్ పేషెంట్ గా ఉన్నవారికి- మూడు రోజుల సింగపూర్ యాత్ర ఉచితం. (రానూ పోనూ విమాన ఛార్జీలతో సహా)

ఆరు నెలల ఇన్ పేషెంట్ గున్నవారికి ఒక మినీ హెలికాప్టర్ (వన్ సీటర్) ఉచితం! (చైనా మేడ్) సంవత్సరంపాటు ఇన్ పేషెంట్ గా ఉన్నవారికి- తర్వాత బతికి బట్టకడితే ప్రముఖ సెక్సీ సినీనటి రతీదేవితో మూడు రాత్రులు ఉచితం-

వెంటనే మా శాశ్వతం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో చేరండి-"

టింగ్-టింగ్-

ఓర్నాయనో ఈ వ్యాపార ప్రకటనలు పూర్తయ్యేసరికి చావటం ఖాయం.

రక్తం మొత్తం పోతోంది. తలకూడా దిమ్ముగా అయిపోతోంది.

టింగ్- టింగ్

"ఇగో- గిప్పుడు- హైదరాబాద్ తెలుగిట్ట ఇనాలనుకుంటే ఒకటి నొక్కండ్రి."

అబ్బా- మళ్ళీ ఇందులో ఇన్ని రకాలా? సరే హైదరాబాద్ తెలుగే విందాం.

టింగ్-

"బహుత్ షుక్రియా భాయిసాబ్! ఇగో- నీది కారాక్సిడెంట్ గిట్టయితే ఒకటి దబాయించు. అగర్ స్కూటర్ యాక్సిడెంటయితే దో నంబర్ దబాయించు"

ఓర్నాయనో- ఈ నొక్కుళ్ళు నావల్ల కాదు- వళ్ళంతా కూడా దిమ్ముగా అవుతోంది.

అబ్బా! ఒకటి నొక్కితే వెంటనే సాయం వస్తుందేమో-

టింగ్-

"షుక్రియా! అగర్ యాక్సిడెంట్ పెద్దది గిట్టయితే ఏక్ నెంబర్ దబావ్- మీడియం అయితే దో నెంబర్ దబావ్- లైట్ యాక్సిడెంటయితే లైట్ లేలో భాయ్-"

అబ్బా- ఇంక నావల్ల కాదు. చక్కెరొచ్చేస్తోంది. ఈ ఫోన్ చావాలనుకునే వాడికి ఉపయోగపడుతుందిగానీ బ్రతకాలనుకునే వాడిక్కాదు. అబ్బా- హమ్మా- నేను ఇంకా బ్రతికున్నానా, పైకెళ్ళి పోయానా? అదిగో ఇంకా కార్ల శబ్దాలు, లారీల శబ్దాలూ వినబడుతూనే ఉన్నయ్. అంటే బ్రతికే ఉన్నానన్నమాట!

దేవుడా- ఎలాగోలా ఒక్కసారి ఆ ఒకటి బటన్ నొక్కే శక్తి నివ్వు- లేదా ఒక పెగ్గు రమ్ సప్లయ్ చేయించినా ఓకే- అప్పుడు శక్తి వచ్చి నేనే బటన్ దబాయిస్తా-"

బటన్ ప్రెస్ చేశాడు.

అమ్మయ్య- నొక్కాను. దీన్నే ఆఖరి బటన్ గా మార్చే వరం ప్రసాదించు స్వామీ- ఇదే ఆఖరి బటనవ్వాలి- ఇదే- ఆఖరిబటనవ్వాలి- ఇదే ఆఖరిబటనవ్వాలి- స్వామీ- స్వామీ- దేవుడా- దేవుడా-

ట్రింగ్-

మళ్ళీ టేప్ వాయిస్-

"అగత్ తుమ్ ఫైవ్ స్టార్ హాస్పిటల్ మే చేరాల్ననుకుంటే ఒకటి దబాయించుండ్రి! లగ్జరీ హాస్పిటల్ మే జేరాలనుకుంటే దో నెంబర్ దబావ్-"

నీయవ్వ- ఇంకెన్ని సార్లు నొక్కాల్రా! నా ప్రాణం పోతోందిరా- నీయవ్వ- ఎడ్వాన్స్ డ్ హైటెక్ అంటే మందిని మసిచేసేయటమా? థూ- నీయవ్వ- అబ్బా- అమ్మా- నేను చావటం ఖాయం!

"ఇప్పుడు ఒక బ్రేక్-

ఒకవేళ మా సహాయం అందేలోపల ఈ యాక్సిడెంట్లో మీరు ఛస్తే- మీకళ్ళు దానం చేయడానికి అంధేరా హీ అంధేరా సంస్థను సంప్రదించండి! మిగతాదంతావాళ్ళు చూసుకుంటారు.

మీ కిడ్నీలు వగైరాలు దానం చేయాలనుకుంటే అండర్ గ్రౌండ్ డాన్ దావూద్ ని సంప్రదించండి"

టింగ్- టింగ్-

"మీరు ఎయిడ్స్ తో బాధపడుతున్నారా? ఫస్ట్ ఎయిడ్ అండ్ లాస్ట్ ఎయిడ్ కోసం డెస్టినీ ఇంటర్నేషనల్ కి ఫోన్ చేయండి!"

టింగ్ టింగ్-

"మీరు మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నారా?

హేరామ్ మారేజ్ బ్యూరోలో రిజిష్టర్ చేసుకోండి- ఫీజు లక్ష- గాళ్స్ లక్షలు-"

టింగ్- టాంగ్-

"జబర్దస్త్ రుచికి గబ్బర్ సింగ్ అప్పడాల్నేవాడుడు. గబ్బర్ సింగ్ అప్పడాలు-"

ఓరి దేముడో- ఈ చెత్తనా కొడుకులు ఈ వ్యాపార ప్రకటనలు ఆపేదెప్పుడు? నేను బ్రతికి బట్టగట్టేదెప్పుడు.

టింగ్ టాంగ్-

"వెల్ కమ్ టు ఆంధ్రప్రదేశ్ హైవే కమ్యూనికేషన్స్- అగర్ తుమ్ ఫైవ్ స్టార్ హాస్పిటల్ మే జాయినవ్వాలంటే ఒకటి దబాయించుండ్రి- సూపర్ లగ్జరీ హాస్పిటల్లో జేరాల్లనుకుంటే రెండు దబాయించుండ్రి! గవర్నమెంట్ దవాఖానాలో జేరాల్లనుకుంటే మూడు నొక్కండి-"

అబ్బా- ఏదొకటి నొక్కుదామంటే చేయిలేవటం లేదు. ఏమైంది? పక్షవాతం వచ్చిందా? ఎలాగోలా నొక్కాలి- లేకపోతే చావుఖాయం- చావు దగ్గర కొచ్చినట్లు తెలుస్తూనే ఉంది. చేయి లేపడానికి ప్రయత్నిస్తున్నా సగం లేచి పడిపోతోంది-

"మాఫ్ కీజీయే- మీరు ఏ బటనూ దబాయించటం లేదు- మీరు మళ్ళీ మెనూ మొదటి కెళ్ళాలంటే తొమ్మిది డయల్ చేయండి-"

నీ యవ్వ ఇక్కడికే చస్తోంటే మళ్ళీ మొదట్నుంచా?

"సారీ మీ సమయం మించిపోయినది!

ఆంధ్రప్రదేశ్ హైటెక్ కమ్యూనికేషన్స్ ఉపయోగించుకున్నందుకు మీకు ధన్యవాదాలు!

బహుత్ షుక్రియా!

థాంక్ యూ-"

ఆఖరి ప్రయత్నంగా మళ్ళీ చేయిలేపడానికి ప్రయత్నిద్దాం- కొంచెం పైకిలేచి చేయి ధబేల్ మని పడిపోయింది.

దాంతో గావుకేకపెట్టాడు.

ఆ తర్వాత అతని మొఖంలో ఆనందం- శ్వాసం ఆగిపోయింది. కళ్ళు శాశ్వతంగా మూసుకుపోయినయ్.

* * *

కొద్దిక్షణాల తర్వాత నిద్రమెలకువ వచ్చినట్లయి లేచి నుంచున్నాడతను.

"అరె- భలే నిలబడ్డానే- ఇంత శక్తి ఎక్కడినుంచి వచ్చింది- అరె- ఈ దెబ్బలన్నీ కూడా మాయమైపోయాయే! ఎలా జరిగిందిది?" అంటూ చుట్టూ చూశాడు.

ఒక్కసారిగా షాకయ్యాడు.

"ఓర్నాయనో- అదిగో- నా శరీరం అక్కడే పడుంది- అంటే నాలోని చిలకెగిరి పోయిందా? నేను పైకెళ్ళి పోయానా?
-

అవును! డౌట్ లేదు- నేను చచ్చిపోయాను-

ఆహా! హైటెక్ ఆంధ్రప్రదేశ్ పుణ్యమా అని ఈ పాడు మానవ జన్మ నుంచి విముక్తి పొందగలిగాను-

అంటే నేను యమలోకాని కొచ్చానా?

అదే కరెక్టయితే ఇక్కడ చిత్రగుప్తుడు, యమధర్మరాజు, యమభటులూ- వీళ్ళంతా ఏరీ?

హఠాత్తుగా పెద్ద సౌండ్ తో ఓ లేడీ వాయిస్ వినిపించింది.

"మా హైటెక్ యమలోకానికి స్వాగతం- సుస్వాగతం- చిత్రగుప్తుడు, యమధర్మరాజు మిమ్మల్ని ఎంతో ప్రేమతో ఆహ్వానిస్తున్నారు. తదుపరి ప్రోగ్రామ్స్ కోసం మీరు సంసిద్ధంగా ఉండండి- యమలోకం హైటెక్ సర్వీస్ లను వినియోగించుకోవడానికి- యమ ట్రిక్ కమ్యూనికేషన్స్ నెట్ వర్క్ ని ఉపయోగించుకోండి!

మీరు వృద్దులయితే ఒకటి నొక్కండి.

మధ్య వయస్కులయితే రెండు నొక్కండి.

పిన్న వయస్కులయితే మూడు నొక్కండి"

అతనికి కళ్ళు తిరిగినట్లనిపించినయ్. రెండు చేతుల్తో తలపట్టుకుని నేలమీద కూలబడిపోయాడు.

ఓర్నాయనో- ఈ యమలోకానిక్కూడా హైటెక్ రోగం తగులుకుందా? ఇక్కడయినా ప్రశాంతంగా ఎంటరయే ఛాన్స్ లేదా?

"క్షమించండి! మీరు మీ ఛాయిస్ ని ఉపయోగించుకోవటం లేదు. సమయం మించుతే మీరు అటూ ఇటూ కాకుండా అయిపోతారు." మళ్ళీ మోగింది గొంతు-

"అమ్మో! అటూ ఇటూ కాకుండా అంటే నరకం కంటే డేంజరస్ ఇంకోటేదయినా ఉందేమో- వెంటనే రెండు నొక్కటం మంచిది-" అంటూ రెండు నొక్కాడు.

"ఒకటి నొక్కనందుకు ధన్యవాదాలు-
మీది సహజ మరణమయితే ఒకటినొక్కండి
ఆత్మహత్య అయితే రెండు నొక్కండి-
హత్యకు గురయితే మూడు నొక్కండి.
టెర్రరిస్ట్ దాడిలో ఛస్తే నాలుగు నొక్కండి-
వరదలు- సునామీ, భూకంపాల వల్ల పైకొస్తే అయిదు నొక్కండి-
ఆంధ్రప్రదేశ్ హైటెక్ పుణ్యమా అని ఇక్కడి కొస్తే ఆరునొక్కండి-"

ఓర్నాయనో- కథ మళ్ళీ మొదలయినట్లుంది-

అంటే నేను ఆరునొక్కాలన్నమాట- అనుకుంటూ ఆరునొక్కాడతను-

"మీరు మగయితే ఒకటి నొక్కండి-
ఆడయితే రెండు నొక్కండి.
రాజకీయ నాయకుడయితే మూడు నొక్కండి-"

ఓరి యముడో- నీ యమట్రిక్ కమ్యూనికేషన్స్ తో మళ్ళీ నేను రెండోసారి చచ్చేట్లున్నాన్రా దేవుడా- అంటూ ఒకటి నొక్కాడతను-

"ధన్యవాదాలు! మీరు పాపములు ఎక్కువ చేసి ఉంటే ఒకటి నొక్కండి- పుణ్యాలు ఎక్కువ చేసినట్లయితే రెండు నొక్కండి."

అబ్బా- అయినా చిత్రగుప్తుడు ఇక్కడలేడు కాబట్టి ఎక్కువ పుణ్యాలు చేశామంటే ఎవడు కాదంటాడు? అందుకని రెండే నొక్కుదాం- అంటూ రెండు నొక్కాడు.

"మీరు స్వర్గానికి అర్హులనుకుంటే ఒకటి నొక్కండి-
నరకానికి అర్హులనుకుంటే రెండు నొక్కండి-"

ఆహా! అంటే పుణ్యాలు ఎక్కువ చేసినట్లు వాళ్ళు వప్పుకున్నారన్నమాట! అయితే నేను చాలా లక్కీ! స్వర్గమా, నరకమా అనే ఛాయిస్ నాకే ఇస్తున్నారంటే- యమలోకం నిజంగానే చాలా అడ్వాన్స్ అయిపోయినట్లే- అయినా వాళ్ళ పిచ్చిగానీ ఛాయిసిస్తే ఎంత తెలివి తక్కువాడయినా నరకానికెందుకెళ్తాడు? అహ్హాహ్హా! అందుకని ఒకటే నొక్కుదాం. అంటూ ఒకటి నొక్కాడు.

"సారీ- మీరు స్వర్గానికి అవుటాఫ్ కవరేజ్ ఏరియాలో ఉన్నారు. మీరు చేసినవన్నీ పాపాలయినా కూడా పుణ్యాలు చేసినట్లు యమలోకాన్ని మోసగించడానికి ప్రయత్నించారు- గనుక మీకు నరకంకన్నా నరకమైన- పరమనికృష్ట నరకం- అనే కొత్త నరకానికి పంపిస్తున్నాం-"

ఓర్నాయనో ఈ పరమనికృష్ట నరకం అంటే ఎలా వుంటుందో ఏమో- అనవసరంగా అబద్దమాడి బుక్కయిపోయానే- ఇప్పుడెలా?

హఠాత్తుగా నెత్తిమీద రెండు కొమ్ములతో ఓ యువతి ప్రత్యక్షమయింది.

"పరమనికృష్ట నరకానికి స్వాగతం- సుస్వాగతం! మిమ్మల్ని అక్కడికి తీసుకెళ్ళడానికి నేను వినియోగించబడ్డాను- దయచేసి నన్ను అనుసరించండి!"

ఆమె ముందు నడుస్తోంటే భయంతో వణుకుథూ ఆమె వెనుకే బయల్దేరాడతను.

"మేడమ్- అసలు నరకమంటేనే మేం ఉచ్చపోసుకుంటాం! ముక్కలు ముక్కలుగా నరకటం- నూనెలో వేయించటం- దబ్బాలతో పొడవటం- లాంటి ఎన్నో రకాల శిక్షలుంటాయని మాకు తెలుసు!

అలాంటిది ఈ పరమనికృష్ట నరకం అంటే ఏంటి మేడమ్! ఇంకేం శిక్షలుంటాయ్ అక్కడ? ఇంకెన్ని రకాల చిత్రవధలు పెడతారు? అవన్నీ మేం భరించగలమా?"

ఆమె నవ్వింది.

"పాపాలు చేశాక శిక్ష తప్పదు మానవా! పరమనికృష్ట నరకం అంటే మామూలు నరకం కన్నా వెయ్యిరెట్లు చిత్రవధలుంటాయ్.-

కానీ- అవన్నీ మోడ్రన్ పద్ధతుల్లో ఉంటాయ్. మిమ్మల్ని సలసల కాగే నూనెలో వేయించకుండానే దానికి వెయ్యిరెట్లు నరకయాతన పెట్టే ప్రదేశం అది! ఓకే- ఇంక నేను వెళ్తున్నాను!"

అతను షాకయ్యాడు.

"అరె హలో మిస్! నన్ను ఆ స్పెషల్ నరకానికి తీసుకెళ్ళకుండానే వెళ్తున్నానంటున్నారేంటి?"

"పిచ్చివాడా- సరిగ్గా చూడు- నువ్ నుంచున్న ప్రదేశమే పరమ నికృష్ట నరకం!"

అతను చుట్టూ చూసి మళ్ళీ షాకయ్యాడు.

"అరె- ఇది హైద్రాబాద్ నగరం మిస్! ఇదేం స్పష్టంగా తెలుస్తోంది- సౌండ్ పొల్యూషన్, ఎయిర్ పొల్యూషన్, ఫుడ్ ఎడల్టరేషన్, పాలిటిక్స్ పొల్యూషన్- వయొలెన్స్ పొల్యూషన్- సెక్స్ పొల్యూషన్- ముఖ్యమంత్రుల ఫ్రాడ్ పొల్యూషన్, - ఖచ్చితంగా ఇది హైదరాబాదే-"

యువతీ చిరునవ్వు నవ్వింది.

"పిచ్చివాడా హైదరాబాదే పరమనికృష్ట నరకం! అతి భయంకరమయిన పాపాలు చేసినవాళ్ళందర్నీ ఇప్పుడు మా నరకం తాలూకు పరమనికృష్ట నరకం బ్రాంచ్ అయిన హైదరాబాద్ కే పంపుతున్నాం! మా నరకంలో ఈ బ్రాంచ్ ని హైదరాబాద్ కి అవుట్ సోర్సింగ్ కిచ్చాం!"

* * * * *

## చాటింగ్ లవ్

మాకాలనీ యూత్ అంతా కూడా ఈ మధ్య మన దేశంలోని యూత్ అందరిలాగానే ఇంటర్నెట్ ఎడిక్ట్స్ అయిపోయారు.

ఎవరూ కాలనీ మీటింగ్ లకు రావటం లేదు- అసలు కాలనీలో ఎవరికీ కనిపించటం కూడా లేదు.

మా కాలనీలో వినాయక చవితి ఉత్సవాలు సాధారణంగా మా యూత్ అసోసియేషన్ వాళ్ళే నిర్వహిస్తారు గానీ ఈసారి ఒక్కరూ ముందుకు రాకపోయేసరికి మాకు డౌటొచ్చేసింది.

అసలువాళ్ళు పార్టిసిపేట్ చేస్తారా లేదా అనేది తెలుసుకోడానికని ఒక్కొక్కరింటికి వెళ్ళటం మొదలుపెట్టాం.

ముందు రాజేష్ ఇంటికెళ్ళేసరికి గడ్డం పెంచుకుని పిచ్చాడిలా కనిపించాడు.

"ఏమిటి ప్రాబ్లెమ్? ఏమైనా జబ్బా?" అంటూ పలుకరించాం.

"కాదంకుల్- అయామ్ ఓకే-"

"మరీ గడ్డం అదీ-"

"మనసు బావుండలేదంకుల్-"

"ఎందుకని?"

"మా చాటింగ్ ఫ్రెండ్ సునీత చాటింగ్ కి రావటం లేదు-"

"రా పోతేపోనీ-"

"కష్టం అంకుల్- తనతో చాటింగ్ చేయకుండా నేనుండలేను-"

ఆ మర్నాడు రాజేష్ ని హాస్పిటల్లో చేర్చారు.

రెండోరోజు గాళ్స్ వింగ్ కల్చురల్ సెక్రటరీ మిథాలిను కలుసుకున్నాం.

"రేపు మార్నింగ్ రండంకుల్- ఇప్పుడు నేను బిజీగా ఉన్నాను-"

"ఏం బిజీ?"

"ఫేస్ బుక్ లాగ్ అయి ఉన్నాను-"

"తర్వాత మళ్ళీ అవ్వచ్చుగా-" అంటూండగానే వెళ్ళి లాప్ టాప్ ముందు కూర్చుంది.

"రోజూ ఇదే వరుస- రాత్రి పన్నెండింటివరకూ అంతే" అంది వాళ్లమ్మ.

ఆ తరువాత శ్రీకాంత్ దగ్గర కెళ్ళాం.

ఇద్దరు గాళ్స్ తో కూల్ డ్రింక్స్ తాగుతూ మాట్లాడుతున్నాడతను.

"వాళ్ళిద్దరూ నా చాటింగ్ ఫ్రెండ్సంకుల్" అంటూ పరిచయం చేశాడు.

"ఇద్దరిలో ఎవర్ని లవ్ చేస్తున్నావ్?"

"ఇంకా డిసైడ్ చేసుకోలేదు"

"ఏంటి డిసైడ్ చేసుకోలేదు?"

"ఇద్దర్నీ లవ్ చేసే విషయం-"

మాకు మతిపోయింది- అందరం మీటింగ్ రూమ్ కెళ్ళి కూర్చున్నాం- మా కాలనీలోనే ఉండే బాబూరావ్ ఇంట్లో అద్దెకుండే స్టూడెంట్ సురేష్ కి ఈ మధ్య జరిగిన ఒక ఇన్సిడెంట్ గురించి చెప్పటం మొదలుపెట్టాడు.

* * *

సురేష్ పక్క రూమ్ లో కొత్తగా దిగిన సాఫ్ట్ వేర్ గాళ్ కి లైట్ కొడుతూండగా సెల్ మోగింది.

"హలో" అన్నాడు సురేష్.

"హలో" అంది ఓ అందమైన లేడీ గొంతు.

ఆ గొంతు ఎవరిదో ఓ పట్టాన అర్థంకాలేదు. చకచక తన మెమొరీ డిస్క్ ఓపెన్ చేశాడుగానీ అది స్ట్రక్ అయిపోయింది.

"హాయ్ నేనే" అందా గొంతు.

"నువ్విలా ఫోన్ చేయటం చాలా ప్లెజెంట్ గా ఉంది" అలా కాసేపు మాట్లాడిస్తే ఎవరో గుర్తుపట్టొచ్చుగదాని ప్లాన్.

"యా- చేయక తప్పలేదు"

"యా యా- ఏమిటి విశేషం? ఈవెనింగ్ కలుస్తున్నామా?"

"అదెలాగూ తప్పదుగానీ, మన కొంపమునిగింది!" అందా అమ్మాయ్.

సురేష్ కంగారుపడ్డాడు.

"మన కొంపా?" అనుమానంగా అడిగాడు. తనెప్పుడూ రూమ్ లు షేర్ చేసుకుంటాడు గానీ కొంపలు షేర్ చేసుకోడు.

"అవును-" అందా అమ్మాయ్.

"వాహ్-! కొంప! అంటే ఏ కొంప?"

"ఇడియట్! నేను ప్రెగ్నెంట్ అయ్యాన్రా!"

"అమ్మో!" అదిరిపడ్డాడు సురేష్.

ఇలాంటి డైలాగ్ లు వినే పరిస్థితి రాకుండా తను చాలా కేర్ ఫుల్ గా ఉంటాడు.

అయినా అప్పుడప్పుడు అదే రీసౌండ్ లా వినిపించి ప్రాణాలు తోడేస్తుంటాయ్. మొత్తం స్త్రీ జాతిమీదే విరక్తి పుట్టిస్తూంటాయ్.

ఇంక లాభం లేదు. ముందీ క్యాండేట్ ఎవరో తెలుసుకోవాలి.

"హలో! ఎవరు మాట్లాడేది?" అడిగాడు ధైర్యం తెచ్చుకుని.

ఆ క్యాండేట్ కి వళ్ళు మండినట్లుంది.

"ఏంటి? ఎవరు మాట్లాడేదా? నేనేనని చెప్తున్నా అర్థం కాలేదా?"

"అయింది- అయిందయింది- అదే పేరు కన్ ఫరమ్ చేసుకుందామని-"

"అంటే ఇంతసేపూ నా పేరు తెలీకుండానే మాట్లాడావా?"

"అహహ.. అంటే..ఆగ వినీత!"

"అంటే? వినీత అనేది ఒకటుందా నీకు? షేమ్ లెస్ ఫెలో-"

"అహహ! వినీతంటే, జస్ట్ ఫ్రెండ్. మా ఇద్దరి మధ్యా ఏం లేదు"

"ఏమీ లేదా? కనీసం బెడ్ షీట్ కూడా లేదా? సిగ్గులేని రకం-"

"అయ్యయ్యో అదికాదు-"

"అంటే జస్ట్ ఫ్రెండ్స్ ని కూడా ప్రెగ్నెంట్ చేస్తావా?"

"నోనోనో- విషయం ఏంటంటే, నీ వాయిస్ కొంచెం మా మిసెస్ వాయిస్ ని పోలి ఉంటుంది కదా! అందుకని మా మిసెస్ అనుకున్నా-"

"అంటే మీ మిసెస్ వాయిస్ ని కూడా గుర్తుపట్టలేవన్నమాట"

"ప్లీజ్- సారీ! సడెన్ గా నీ వాయిస్ విని మా మిసెస్ అనుకున్నా"

"నేను మీ మిసెస్ నేరా రాస్కెల్"

సురేష్ ఇంకా కన్ ఫ్యూజయ్యాడు.

"ఓ! మిసెసా? సారీ డియర్! వాయిస్ కొంచెం స్వీట్ గా ఉంటేనూ మిసెస్ కాదనుకున్నా"

"నువ్ మారావని ప్రామిస్ చేశావ్ కదా త్రీడేస్ బ్యాక్. ఆ మాట నమ్మటం నా తప్పురా!"

"సారీ డియర్! సారీ అన్నాను కదా- కానీ అది ఎలా జరిగింది?"

"ఏదెలా జరిగింది?"

"అదే! ప్రెగ్నెన్సీ-"

"అంటే? అది కూడా తెలీదా నీకు? అన్ని విషయాలూ తెల్సినట్లు ఫోజులు కొడతావ్ కదరా!"

"అహహ! అది ఓకే! కానీ, నేను చాలా కేర్ ఫుల్ గా ఉంటాగదాని!"

"నీ బోడి కేర్ సంగతెవడికి తెలీదు. మందు కొడితే మనిషివి కాదుగా!"

"చిలిపీ! మందు ఒక్కడినే కొట్టే అలవాటు లేదని నీకూ తెలుసుగా!"

"అదేరా నేనూ అనేది! మందుకొట్టే కంపెనీ కోసం రోజుకోదాన్తో వెధవ్వేషాలేస్తున్నావ్!"

"ప్లీజ్! నువ్వెవరో చిన్న క్లూ ఇవ్వవా?"

"నీ మిసెస్ నని చెప్తూంటే సిగ్గులేకుండా మళ్ళీ ఆ ప్రశ్నేమిట్రా?"

"యా యా- అయ్ నో- అయ్ నో- అయిన చిన్న క్లూ ఇవ్వకూడదూ?"

"అంటే నీ ఉద్దేశ్యం ఏంటి? నీకు పదిమంది మిసెస్ లున్నారా?"

"ఛ! నేనేం నిత్యపెళ్ళికొడుకునా? అది కాదుగానీ, పేరు చెప్పకూడదూ?"

"అంటే? ఇంతసేపూ ఎవర్తో మాట్లాడుతున్నావో తెలీకుండానే మాట్లాడావా?"

"నా మిసెస్ తోనే అని తెలుసే! మరీ అంత డీగ్రేడ్ చెయ్యక్కర్లా నన్ను! మిసెస్ అంటే ఏ ఏరియా మిసెస్? ఆంధ్రనా? తెలంగాణానా? రాయలసీమనా?"

"అంటే నీకు రీజియన్ కో మిసెస్ ఉందన్నమాట. అయిపోయావురా ఇవాళ- ఇప్పుడే వచ్చి నీ అంతు తేలుస్తా!"

ఫోన్ కట్టయింది.

"ఓర్నాయనో! ఇవాళ పరిస్థితి కొంచెం ఆంధ్రప్రదేశ్ లాగానే ఉండేట్లుంది" అనుకుంటూ లేచి నిలబడేసరికి గడపలో నిలబడ్డ యువతి కనిపించింది.

ఆటోమేటిగ్గా చిరునవ్వు నవ్వి "హాయ్" అన్నాడు.

"హాయ్" అందా యువతి.

సురేష్ మెమొరీ బ్రౌజ్ చేశాడు.

ఎవరో తెలీటంలేదు. కానీ ఫేస్ పరిచయం ఉన్నట్లే ఉంది. అదేం విచిత్రమో గానీ ఈ మధ్య గాళ్స్ అందరూ బాగా క్లోజ్ ఫ్రెండ్స్ లాగానే కనబడుతున్నారు.

ఎవరు ప్రియురాలు? ఎవరు ప్రియుడు? అసలెవరితో ఎంతవరకూ పరిచయం కొత్తాళ్ళెవరు- అంతా ఒకటే కన్ ఫ్యూజన్.

మళ్ళీ వెధవ నవ్వు నవ్వాడు సైలెంట్ గా ఉండలేక.

"సో- హియర్ వుయార్" అన్నాడు ఇంగ్లీష్ లో.

"యా" అందామె హ్యాపీగా.

"నువ్ రావటం ప్లెజెంట్ సర్ ప్రైజ్" అన్నాడు.

చెంప పేలిపోయింది- అదిరిపడ్డాడు.

"ఏంటలా కొట్టావ్?"

"ప్లెజెంట్ సర్ ప్రైజేంటి? ఈ టైమ్ కి రమ్మని బతిమాలింది నువ్వేగా?"

"అహ్హాహ! అవునవును! బతిమాలను- ఫోన్లో కదా?"

మళ్లీ చెంప ఛెళ్ళుమంది.

"మళ్ళీ ఏంటి?"

"ఫోన్లో అంటావేంటి?"

"ఓహో! యాయా! ఫోన్లో కాదు- కాదు కానేకాదు- మనం రెస్టారెంట్ లో కలుసుకున్నప్పుడు-"

మళ్ళీ చెంప ఛెళ్ళుమంది.

"అంటే ఇలా ప్రతి డైలాగ్ కీ వాయిస్తావా?"

"లేకపోతే ఏంటి? గంటల తరబడి నన్ను ప్రేమించాను. నీలాంటి అందగత్తెను జన్మలో చూళ్లేదు. ఒక్కసారి నిన్ను తనివితీరా చూస్తే జన్మ ధన్యమయిపోతుంది" అని లెక్చర్స్ ఇచ్చావ్ గా! అంతా బోగసేనా? అసలు నేనెవరో తెలీనట్లు ఫేస్ లో ఆ ఎక్స్ ప్రెషనేంట్రా?"

"ఆ! రానా అంటే యా- యా గుర్తుకొచ్చింది అనితా! అనిత! యా! అనితా! ఎంత కాలమయింది మనం కలుసుకుని హ్యాపీగా" అంటూండగానే చెంప మళ్ళీ పేలింది.

"నా పేరు అనితా? నిజం చెప్పు హూ ఈజ్ దట్ బిచ్?"

"అరెరె- అలా రైజవబోకు! కూల్ కూల్- నువ్ అచ్చం అనితలాగే ఉన్నావ్ అందుకని-"

చెంప ఛెళ్ళుమంది.

"అమ్మో! మళ్ళీ ఏమయింది? మాట్లాడితే చెంప పగలగొడుతున్నావ్. ఇదేం చెంపనుకున్నావా? బాస్కెట్ బాల్ గ్రౌండ్ అనుకున్నావా?"

"లేకపోతే, అనితలాగ ఉన్నానంటేవేంటి? నేను అనితనేరా రాస్కెల్"

"ఆ! అనితవేనా? యా! యా! కుకట్ పల్లి అనితవె"

చెంప మళ్ళీ పగిలింది.

"కుకట్ పల్లి అనితను కాదురా, చిక్కడపల్లి అనితని"

"అబ్బ! ఇప్పటికి గుర్తుకొచ్చింది" అన్నాడు గానీ ఇంకా కన్ ఫ్యూజన్ ఎక్కువయి పోయింది.

ఈ కాండేట్ ని చూసినట్లే ఉందిగానీ ఎక్కడ కలిశాడో, ఎప్పుడు పిలిచాడో ఏమీ అర్థం కావటం లేదు.

"ఇంకా ఆ కన్ ఫ్యూజన్ లుక్కేమిట్రా? రూమ్ కి రమ్మని అలా ఒంగోల్ బర్రె మొఖం వేసుకు చూస్తున్నావేంటి? ఈ మాత్రానికే ఎందుకు రమ్మన్నావ్ రా"

"అదా! జస్ట్ ఎంజాయ్ కోసం- రా! ఆ బెడ్ మీద కూర్చో! మనం చాలా మేటర్ మాట్లాడుకోవాలి"

"ఇంకా ఏం మేటరుంటుంది? నెలరోజుల్నుంచి గంటలు గంటలు చాటింగ్ చేసుకుంటూనే ఉన్నాంగా!"

"ఆ! చాటింగా? అంటే మనం చాటింగ్ ఫ్రెండ్సా?"

చెంప మళ్ళీ పేలిపోయింది.

"అమ్మో"

"అంటే చాటింగ్ లో ఇంకా చాలామందిని నాకు చెప్పినట్లే అయ్ లవ్ యూ చెప్తున్నావా?"

"నెవర్ యార్- నేనెందుకు చెప్తాను? నిజంగా నిన్ను లవ్ చేశాను కాబట్టి నీకే చెప్పాను"

"చూడు రాకేష్! కేవలం ఈనెల రోజుల చాటింగ్ లో నీ లవ్ లోపడి నేనెంత పిచ్చిదాన్నయిపోయానో తెలీదు. అందుకే ఇవాళ మనం ఏమయినా సరే కలుసుకుని ఎంజాయ్ చేయాలని నువ్వు బతిమాలితే హ్యాపీగా వప్పుకొన్నా- నేను వచ్చేసరికి ఇల్లంతా నాకోసం ఫ్లవర్స్ తో డెకరేట్ చేసి ఉంచుతానన్నావ్. గోడలమీద వెల్ కమ్ టు మై లవ్ చిక్కడపల్లి అనితా" అని ఎన్ గ్రేవ్ చేస్తానన్నావ్. తీరా నేనొచ్చేసరికి ఏముంది? చెత్త రూమూ. ఖాళీ బీరుబాటిల్సూ-"

"సారీ డియర్! రాత్రి లేటుగా రూమ్ కొచ్చాను. పొద్దున్నే నీకోసం డెకరేట్ చేద్దామనుకున్నాగానీ, ఈ లోపలే నువ్ వచ్చేశావ్" అన్నాడు ఫీలయిపోతూ.

"ఈసారికి సారీ అనితా! అయ్ మీన్ చిక్కడపల్లి అనితా!"

అనిత హ్యాపీగా అతని కౌగలించుకుని ముద్దు పెట్టుకుంది.

"ఇది ఫస్ట్ టైమ్- నేను లవ్ చేసినతనిని- అతనింటికొచ్చి కలుసుకోవడం- అందుకే కొంచెం నెర్వస్ గా ఫీలయి నిన్ను అయ్ మీన్- నీ చెంపని బాస్కెట్ బాల్ ఆడాను. అయామ్ సారీ రాకేష్"

సురేష్ ఉలిక్కిపడ్డాడు.

"రాకేషా! రాకేషేంటి? ఇందాక్కూడా రాకేష్ అన్నావ్"

"అంటే నీ పేరు రాకేష్ కాదా?"

"కాదు, సురేష్!"

అతని చెంప చెళ్ళుమంది.

"అమ్మో! మళ్ళీ ఎందుకొట్టావ్?"

"నీ పేరు సురేష్ అయితే చాటింగ్ లో నాకు రాకేష్ అని చెప్పినందుకు! ఇలా దొంగ పేర్లతో చాటింగ్ చేసే వాళ్లంటే నాకు మంట"

సరిగ్గా అప్పుడే ఆ అమ్మాయి సెల్ మోగింది.

"హలో!"

"హాయ్ అనితా! ఇంకా రాలేదేంటి? నీ కోసం వెయిట్ చేస్తున్నా డియర్?"

అనిత కన్ ఫ్యూజయింది.

"నా కోసం వెయిట్ చేస్తున్నావా?"

"అవును డియర్! రూమంతా పూలతో డెకరేట్ చేసి మధ్యలో వెల్ కమ్ టు మై డార్లింగ్" అని కూడా ఎన్ గ్రేవ్ చేశా"

"అదేంటి నేను- ఇదే అపార్ట్ మెంట్స్ లో ఉన్నా కదా?"

"వచ్చేశావా? లవ్ లీ! ఎక్కడున్నావిప్పుడు? లిఫ్ట్ లో ఫోర్త్ ఫ్లోర్ కి రావాలి"

అనిత సురేష్ వేపు చూసింది.

"ఇది ఫోర్త్ ఫ్లోర్ కాదా?" అడిగింది.

"నో నో, థర్డ్ ఫ్లోర్- ఏ ఫ్లోరయితే ఏంటి? మనం కలుసుకోవటం ముఖ్యం కదా" అని ఆమెను ముద్దు పెట్టుకున్నాడు.

అతన్ని అతి కష్టమ్మీద తోసేసింది అనిత.

"అదికాదు. నేను కొంచెం కన్ ఫ్యూజయ్యాను."

"ఏం కన్ ఫ్యూజయ్యావ్?"

"అదే! ఫోర్త్ ఫ్లోర్ అనుకుని థర్డ్ ఫ్లోర్ లో మీ ఇంటికొచ్చా"

"అయిందేదో అయిపోయింది కదా డియర్" అంటూ మళ్లీ కౌగిలించుకున్నాడు సురేష్.

అతని చెంప చెళ్ళుమంది.

"రాస్కెల్! నా లవర్ రాకేష్ నని అబద్ధం చెప్పి నాతో ఎంజాయ్ చేయాలని చూస్తావా?" అనేసి వేగంగా ఫోర్త్ ఫ్లోర్ కి పరుగెత్తింది.

అప్పుడే సురేష్ సెల్ మోగింది మళ్ళీ.

"హలో! కూకట్ పల్లి అనితా! హౌ ఆర్ యూ? ఏంటి శివరామ్ పల్లి అనితవా? హాయ్! వెల్ కమ్! వెల్ కమ్!"

* * *

బాబూరావ్ ఆ కథ చెప్పటం ముగించేసరికి మాకర్ధమయింది.

ఇంక యూత్ మీద ఆధారపడి లాభంలేదు.

మేమే వినాయక చవితి కాలనీలో జరిపే ఏర్పాట్లు చేసుకోవాలి.

* * * * *

## డయల్ యువర్ సీయమ్

మా కాలనీ వాళ్లందరికీ టీవీ ఛానెల్లో వచ్చే ఫోన్ ఇన్ కార్యక్రమంలో మాట్లాడాలని ఒకటే కోరిక- స్క్రీన్ మీద మనం కనబడకపోయినా మన వాయిస్ దేశమంతా మార్మోగిపోతూంటే ఆ థ్రిల్ వేరుకదా!

ముఖ్యంగా మా కాలనీ లేడీస్ వింగ్ కొత్త ప్రెసిడెంట్ యంగ్ గాళ్ అనూష అలాంటి ఫోన్ ఇన్ కార్యక్రమంలో ఒక వెలుగు వెలగాలని చాలా ఆశగా ఎదుర్చూస్తోంది.

ఇక పార్వతీదేవి, సావిత్రమ్మా, చంద్రకళలాంటి వాళ్ళు సరేసరి- నిజం చెప్పాలంటే రంగారెడ్డికీ, శాయిరామ్ కీ, జనార్ధన్ కీ, గోపాల్రావ్ కీ, నిసార్ కీ, యాదగిరికీ- ఇంకా చాలామంది కూడా ఆ కోరిక ఉంది గానీ మేం వాళ్ళల్లా బయటపడటం లేదు.

హఠాత్తుగా ఆ రోజు రాత్రే తుగ్లక్ టీవీ ఛానెల్లో ముఖ్యమంత్రితో ఫోన్ ఇన్ కార్యక్రమం ఫలానా రోజునుంచీ రాబోతోందనీ, మాట్లాడదల్చుకున్న వారంతా ఫలానా నెంబర్ కి ఫోన్ చేస్తే లైవ్ గా మాట్లాడవచ్చనీ ప్రకటించారు.

ఆ ప్రకటన రాగానే మా కాలనీ మొత్తం ఎలక్ట్రిఫై అయిపోయింది. ఎవర్ని కదిపినా ఆ టాపిక్కే మాట్లాడుతున్నారు.

"ఏమోయ్ చంద్రరావ్- ఆఫీస్ కెళ్ళలేదా ఇవాళ?"

"వారం రోజులు శెలవు పెట్టేశాను బ్రదర్-"

"ఎందుకు? ఏమయినా పనుందా?"

"అవును- చాలా ఇంపార్టెంట్ వర్క్-"

"ఏంటది?"

"అదే- ముఖ్యమంత్రితో ఫోన్ ఇన్ కార్యక్రమం ఉంది కదా! ఆ కార్యక్రమంలో మాట్లాడ్డానికి మంచి కొశ్చెన్స్ తయారు చేయాలి కదా! అందులోనూ నేను కొశ్చెన్స్ వేస్తే సాధారణంగా ఎవడూ రిప్లయ్ ఇవ్వలేడని మీకూ తెలుసు కదా!" అంటూ టేప్ ఆన్ చేసేసరికి మేం వెంటనే జాగ్రత్తపడి అతని ధాటికి అడ్డుకట్టవేశాం!

"అవునవును! నీ సంగతి తెలిసిందే కదా" అన్నాడు గోపాల్రావ్.

"అయితే ఇంక ఇంటికెళ్ళి కొశ్చెన్స్ తయారు చేసుకో-" అన్నాడు రంగారెడ్డి అతని గొడవ వదిలించుకోడానికి-

కానీ చంద్రావ్ మమ్మల్ని వదల్లేదు.

"రెండు రోజుల్నుంచీ రాత్రింబగళ్ళు తలపగలగొట్టుకుని ఎలాంటి అద్భుతమయిన కొశ్చెన్స్ తయారు చేశానో తెలుసా?" అన్నాడు ఉత్సాహంగా.

"వస్తాం- వేరే పనుంది" అంటూ అందరం సైక్లోన్ గాలి వేగంగా అక్కడి నుంచి వేరే చోటకు దూసుకెళ్ళిపోయాం.

కాలనీ వాళ్ళందరూ కూడా ముఖ్యమంత్రిని ఏమేం కొశ్చెన్స్ వేయాల్సిందీ రాసుకుని బైహార్ట్ చేస్తున్నారు.

ఆ రోజు రానే వచ్చింది.

నాలుగు ఫోన్లు (కార్డ్ లెస్) దగ్గర పెట్టుకుని మా మీటింగ్ హాల్లో కూర్చున్నాం.

మా ఎదురుగ్గా టీవీ- సరిగ్గా మధ్యాహ్నం పన్నెండు గంటలకు ఫోన్ ఇన్ కార్యక్రమం స్టార్టయింది. అందరు ఆ టీవీ వాళ్ళిచ్చిన నెంబర్ డయల్ చేయటం మొదలుపెట్టాం! మాలాంటివాళ్ళు రాష్ట్రమంతా ఉన్నట్లున్నారు- అందరికీ ఎంగేజ్ వస్తోంది. సడెన్ గా రంగారెడ్డి ఫోన్ లింకయింది.

ఆ సంగతి తెల్సి అందరూ రంగారెడ్డి చుట్టూ మూగారు ఎగ్జయిట్ మెంట్ తో-

ముఖ్యమంత్రి ఫోన్లో కొచ్చాడు.

"హలో-"

"హలో సర్- నమస్కారం! నా పేరు రంగారెడ్డి- హైదరాబాద్ నిర్భయ్ నగర్ కాలనీ నుంచి మాట్లాడుతున్నా సార్- సార్! మీ మంత్రివర్గం అందరూ పరిశుభ్రత పచ్చదనం అంటూ తెగ ఉపన్యాసాలు ఇస్తున్నారు కదండీ! కానీ మా కాలనీకి చెత్త బండి వచ్చి నెలరోజులయింది. ఇక మా కాలనీ అంతా మొక్కలు నాటాంగానీ, వాటికి పోయడానికి నీళ్ళెక్కడున్నాయ్ సార్? మాకు తాగడానికే నీళ్ళు సరిపోక- నానా ఛావూ ఛస్తున్నాం సార్- మీరు నమ్మరు గానీ నీళ్ళు చాలక మూడు రోజులు కొకసారి స్నానం చేస్తున్నాం! నీళ్ళకోసం ఎంత నరకం అనుభవిస్తున్నామో మీకు తెలీదు సార్-" అంటూ తన దగ్గరున్న పేపర్లోదంతా గడగడా చదివేశాడు.

అందరం ముఖ్యమంత్రి జవాబుకోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నాం-

సడెన్ గా ఆయనగొంతు వినిపించింది.

"నీళ్ళు దొరక్కపోతే ఛావండ్రా బాడుకవ్! సాలే- నేను విస్కీలోకి నీళ్ళు దొరక్క ఛస్తున్నారా! నీ యమ్మ- నావిస్కీ కంటే నీకు స్నానం ఎక్కువైనాది బే- నీకేం దమాకున్నదేరా?"

ఆ జవాబు విని అందరం ఉలిక్కిపడ్డాం.

రంగారెడ్డి మొఖం వాడిపోయింది.

"ఏంటి- ముఖ్యమంత్రి అంత బేవార్స్ గా మాట్లాడుతున్నాడు?" అన్నాడు శాయిరామ్.

"ఏంటి? నీకు విస్కీలోకి నీళ్ళు ముఖ్యమా? పైగా అలా అసభ్యకరంగా మాట్లాడుతున్నారేంటి?"

"నా యిష్టంరా బాడుకవ్! నేనిలాగే మాత్లాదథాగ నేను మందుకొట్టే టైమ్ లో ఎవడు న్యూసెన్స్ జేసినా ఈ లెవల్లోనే తిడతా! నెక్ట్స్ లెవలేందో ఎరుకనా? బండ బూతులొస్తయ్ బే- అసలు నాకు ఫోన్ చేయమని నీకెవడ్రా చెప్పింది? చీడబట్టిన చెట్టు మొఖం నువ్వూనూ-"

అప్పటిగ్గానీ మాకర్థం కాలేదు- ఆ వాయిస్ ముఖ్యమంత్రిది కాదని- ఎందుకంటే టీవీలో ముఖ్యమంత్రి ఇంకెవరికో సమాధానం ఇస్తున్నాడు.

దాంతో రంగారెడ్డి వళ్ళుమండి ఆ ఫోన్లో ఉన్నాడి మీద తిరగబడ్డాడు.

"ఏయ్- ఎవడ్రా నువ్ మాట్లాడేది-"

"మీ మొగుడ్నిరా- కబూతర్ సాలే-"

"నోర్ముయ్ రాస్కెల్! అసలు నువ్వెవడివో చెప్పరా! నీ అంతుతేలుస్తాం-"

"నేనా? నేనెవరో తెలీదంట్రా! కవాడిగూడా కల్లు కాంపౌండ్ పక్కిల్లో నర్సింహుల్నిరా! నా అంతు చూస్తావ్ బే నువ్వుగ ఇప్పుడే రారా! ఎవడి అంతు ఎవడు చూస్తాడో తేల్చుకుందాం!"

ఇంక వాడితో డిస్కషన్ అనవసరమని రంగారెడ్డి ఫోన్ డిస్కనెక్ట్ చేశాడు.

"రాంగ్ నెంబర్ కెళ్లింది- వెధవ టెలిఫోన్ డిపార్ట్ మెంట్-" అన్నాడు కసిగా.

వెంటనే శాయిరామ్ ఫోన్ అందుకున్నాడు.

"హలో-"

"హలో- ఎవరు?"

"నమస్తే సార్! నా పేరు శాయిరామ్ సార్! నిర్భయ్ నగర్ కాలనీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీని సార్-

"నమస్తే- అడుగు-"

"అదే సార్! మనరాష్ట్రంలో ట్రాఫిక్ రూల్సూ, ట్రావెల్స్ రూల్సూ ఎవ్వడూ పాటించటం లేదు కదా! ట్రావెల్స్ కంపెనీల వాళ్ళు ఆఖరికి పర్మిట్లు కూడా లేకుండా ఇంటర్ స్టేట్ బస్ లు నడుపుతున్నారు- దాంతో ప్రమాదాలు జరిగి వేలమంది ఛస్తున్నారు- అయినా మీ ఆర్టీఏగ్గానీ, పోలీసులగ్గానీ చీమకుట్టినట్లుకూడా లేదు- అసలు మన రాష్ట్రంలో గవర్నమెంట్ ఉందో లేదో ఎవడికీ తెలీటం లేదు-"

సరిగ్గా మా ఏరియాలో అప్పుడే పవర్ కట్ వల్ల టీవీ ఆఫ్ అయిపోయిందిగానీ ఫోన్ కనెక్షన్ పోలేదు.

"పచ్చనైన ఆకాశంలో ఎర్రెర్రగా వర్షం చినుకులు-" అంటూ ఫోన్ లో గొంతు వినిపించేసరికి అందరం మళ్ళీ షాకయ్యాం-

"హలో- ఏమంటున్నార్ సార్?"

"తెల్లకోడిపెట్ట- నల్ల పావురాయి డమాఢమ్- డమాఢమ్-" మాకు మతిపోయి నట్లయింది.

"సార్- మీ మాటలు మాకేం అర్థం కావటం లేదు-"

"అర్థం కాకపోవటమేమిట్రా చిల్లర నరేష్! అవునూ! నువ్వెప్పుడయినా తలకిందపెట్టి కాళ్ళు పైకిపెట్టి చేతుల్తోనడిచావట్రా?"

"అలా ఎందుకు నడుస్తాను- అసలెవరూ అలా నడవరుకదా-"

"నేను నడుస్తాన్రా భమ్ భమ్! అవునూ చీకటికీ-వెల్తురుకీ మధ్యలో ఏముంటుందిరా?"

"గాడిదగుడ్డుంటుంది- మర్యాదగా మాట్లాడకపోతే ఎంత ముఖ్యమంత్రివయినా లెక్క జెయ్యన్రా!"

"నేను ముఖ్యమంత్రినేమిట్రా చోర్ కందిల్"

"కాదా? నా కప్పుడే డౌటొచ్చింది. ఎవర్నువ్వు?"

"ప్రధానమంత్రిని బే! కనబట్టంలా?"

"ఇదిగో- అతిగా వాగకుండా నువ్వెవరో చెప్పరా!"

"చెప్పాను కదు బే! ప్రైమ్మినిస్టర్! నీకు తెలుసేరా- మనదేశాన్ని రెండు రోజుల్లో అమెరికాలాగా మార్చేస్తున్నా! ఎలాగని అడగవేంరా? నోటికేమయిందిరా! నోరు లేదు బే నీకు- అడుగు-"

"నేనడగను-"

"అడక్కపోయినా చెప్తాన్రా! తేలిగ్గా వదిలేస్తాననుకోకు! మనదేశాన్ని అమెరికాలాగా ఎలా మార్చేస్తానో తెలుసా? దమ్ముంటే ఎలా మారుస్తానో చెప్పరా!"

"నేన్చెప్పను-"

"ఫర్లేదురా! నేను చెప్తా! ముందు దేశమంతా బీటీ వంకాయల మొక్కలు నాటాల్రా! ఆ చెట్టు పెరిగి పెద్దవృక్షాలయ్యాక వాటికి అమెరికా అన్న బోర్డ్ ఉ తగిలించాల్రా! ఎటు చూసినా వంకాయ్- ఎవడినోట్లో చూసినా వంకాయ్- జై వంకాయ్- జై రత్నాకర్-"

"రత్నాకరెవరు?"

"నీయబ్బ! అదికూడా తెలీదు బే- పంజాబ్ ప్రెసిడెంట్-"

"నువ్వెవర్రానాయినా ఎక్కడి నుంచి మాట్లాడుతున్నావ్?"

"కేరాఫ్ ఎర్రగడ్డ- వార్డ్ నెంబర్ త్రీ- బెడ్ నెంబర్ నిల్-"

"ఓర్నీ నా ఫోన్ మెంటల్ హాస్పిటల్ కెళ్ళినట్లుంది-" ఫోన్ కట్ చేశాడు శాయిరామ్.

ఈసారి ఫోన్ అనూషకు దొరికింది.

"హలో-"

"హలో-"

"ముఖ్యమంత్రిగారా సార్?"

"....."

"హలో- హలో- హలో- హలో-"

"ఛ! డిస్కనెక్ట్ అయిపోయింది" అంటూ మళ్ళీ మళ్ళీ డయల్ చేయటం మొదలుపెట్టింది.

"మీరు డయల్ చేసిన నంబర్ మరోసారి సరిచూసుకోండి-"

"అదేంటి? కరెక్ట్ నెంబర్ కొట్టాను కదా-"

"అది మామూలేలే మళ్ళీ చెయ్" అరచారు మిగతా యూత్- మళ్ళీ డయల్ చేసింది.

"ప్రస్తుతం ఈ నెంబర్ తో ఏ ఫోనూ పని చేయటం లేదు-"

మరో పదినిమిషాలు శ్రమపడ్డాక ఫోన్ రింగయింది.

"హలో నమస్తే నేను నిర్భయ్ నగర్ కాలనీ నుంచి అనూషని మాట్లాడుతున్నా-"

"హలో అనూషా! ఇంకా రాలేదేంటి? నీ కోసం ఎంపీగారు ఫామ్ హౌస్ లో ఎదుర్చూస్తున్నారు. వీలైతే ఇంకో యిద్దరమ్మాల్ని తీసుకురా, చెరో పదివేలిద్దాం లే- ఎందుకంటే పోలీసాఫీసర్లుక్కూడా అమ్మాయిలు కావాలంట-"

"హలో ఎవర్నువ్వు? అమ్మాయిలేంటి?"

"నేనే మీరాచౌదరి- తెలియనట్టు మాట్లాడతావేం? నీ సెక్స్ వీడియో నా దగ్గరుంది గుర్తుంచుకో"

అనూష కంగారుపడి చెమటలు తుడుచుకుంటూ చుట్టూ ఉన్నవారందరి వంక భయంగా చూసింది.

"నిజం అంకుల్ అదెవరో నాకు తెలీదు" అంది రంగారెడ్డితో.

"మామూలే రాంగ్ నెంబర్ అయుంటుంది. ఫోన్ పెట్టెయ్"

అనూష ఫోన్ డిస్కనెక్ట్ చేసి మళ్ళీ డయల్ చేయబోతూంటే ఆమె ఫోనే రింగయింది.

"కట్టయిందికదా! అందుకని ముఖ్యమంత్రిగారే నీ నెంబర్ కి ఫోన్ చేయించుంటారు" అన్నాడు శాయిరామ్.

అనూష ఆనందంగా ఫోన్ అందుకుని హలో అంది.

వెంటనే అవతలిగొంతు మాట్లాడటం మొదలుపెట్టింది.

"నమస్తే ముఖ్యమంత్రిగారూ! నేను లింగంపల్లి నుంచి మంగంతల్లిని మాట్లాడుతున్నా సార్!"

అనూష షాకయింది-

"వాళ్ళెవరో ముఖ్యమంత్రికి ఫోన్ జేస్తూంటే నీ ఫోన్ లింకయినట్లుంది-" అన్నాడు రంగారెడ్డి-

"ఆమెతో నువ్ ముఖ్యమంత్రివి కాదని చెప్పు-"

అనూష హలో అనేలోపలే మంగంతల్లి మళ్ళీ మొదలుపెట్టింది.

"హలో ముఖ్యమంత్రిగారూ! మీకేమయినా బుద్ధుందా లేదా? మా ఊళ్ళో కుక్కల బెడద ఎక్కువగా ఉందని ఇప్పటికి ఎనిమిది లెటర్స్ రాసినా! అయినా నువ్ కేర్ జెయ్యలె- నిన్న పధ్నాలుగు కుక్కలు కలసి స్కూల్ కెళ్తున్న మా పాప ఝాన్సీని కరిచనయ్. ఈ ఏరియాలో ఎక్కడా ఇంజెక్షన్స్ దొరికవ్. ఇప్పుడు ఆ కుక్కలు కరిచిన పిల్లలందర్నీ సిటీకి తోల్కపోయి ఇంజెక్షన్స్ జేయించాలె! ఒక్కొక్కరికీ రెండువేలు ఖర్చవుతది- అన్ని పైసలు ఏడకెళ్ళి తేవాలె? మీ

హయాంలో ఒక్క డిపార్ట్ మెంట్ గూడా మంచిగ డ్యూటీలు జేయటంలే! మరి చేతకానప్పుడు నౌఖరీ వదిలిపోవాలె నువ్వు-" ఫుల్ స్టాప్ లేకుండా ఆమె మాట్లాడుతూంటే అనూష మధ్యమధ్యలో ఇంటర్ ఫియర్ అవడానికి ప్రయత్నిస్తోంది.

"హలో! నేను ముఖ్యమంత్రినికాదు. నీలాగా నేనూ ముఖ్యమంత్రితో ఫోన్ లో మాట్లాడ్డానికి కోషిష్ జేస్తున్నా!"

ఇద్దరు చాలనట్లు- సడెన్ గా ఇంకెవడో ఫోన్ లో కొచ్చాడు.

"ఇప్పుడు మన సమాజాన్ని పట్టిపీడిస్తోన్న లంచగొండితనాన్ని రూపుమాపేదెలా? ఈ విషయంలో మీరేం చేయదల్చుకున్నారు?"

"పిచ్చికుక్కల గురించి అడిగితే లంచగొండితనం గురించి మాట్లాడుతున్నావేంది?" కోపంగా అంది మంగంతల్లి.

"మా ఇండస్ట్రీస్ అన్నీ పవర్ కట్ లతో నష్టాలో కూరుకుపోతున్నాయంటే పిచ్చికుక్కల గురించి మాట్లాడుతోందెవరు?" నాలుగోవాడి గొంతు కొత్తగా ఎంటరయింది. అనూష చేతిలోనుంచి శాయిరామ్ ఫోన్ లాక్కున్నాడు.

"అబ్బా- నేను ముఖ్యమంత్రిని కానయ్యా!"

"గంట కిందట నువ్వే గదా ముఖ్యమంత్రివి! ఇంతలోనే హైకమాండ్ కొత్తోడికి ముఖ్యమంత్రి పదవి ఇచ్చిందా?"

"హలో- నేనూ నీలాగానే ముఖ్యమంత్రి గురించి ట్రై చేస్తున్నారా భయ్-"

"చేసోక్- నాకెందుకు చెప్తున్నావ్ మళ్ళా?"

"నువ్వేనా ఫోన్లో కొచ్చినావ్-"

సరిగ్గా అప్పుడే ముఖ్యమంత్రి గొంతు ఫోన్లో వినిపించింది.

"హలో- ఎవరో ఒక్కరే ప్రశ్న అడగండి-"

"అదేసార్ నేనడుగుతూంటే- ఇంకోడెవడో ఫోన్ లో కొచ్చిండు-"

"నేను కాదురా! నువ్వే నా ఫోన్ లో కొచ్చినావ్" అరుస్తోంది మంగంతల్లి.

"సార్- రాజశేఖర్ రెడ్డి నాకిచ్చిన వృద్ధాప్య పెన్షన్ ఉంటదా? ఊడ్తదా సార్?"

"హలో ఎవరు మాట్లాడుతోంది? నీ పేరేంటి?"

"లింగంపల్లి మంగంతల్లి-"

"చూడమ్మా నీ వృద్ధాప్యం పెన్షన్ గురించి-"

"నేనడిగింది పిచ్చికుక్కల గురించి-" గట్టిగా అరిచిందామె.

"పిచ్చికుక్కలా?"

"నేను ఇప్పటికి పదిసార్లు దోమల సమస్య గురించి అడుగుతోంటే పిచ్చికుక్కలంటారెవళ్ళువయ్యా-"

"హలో-" అంది ఇంకో ఆడగొంతు-

"హలో-" అంది మరో ఆడగొంతు-

"ఇప్పుడు నా సమస్యకు పరిష్కారం చెప్పండక్కయ్యా! నా భర్తకు విడాకులివ్వకుండా నేను రాకేష్ ని పెళ్ళి చేసుకోవచ్చా? పెళ్ళికి ముందు నాకూ రాకేష్ కీ పుట్టినబిడ్డకూ- పెళ్ళయ్యాక నాకూ నా భర్తకు పుట్టిన బిడ్డకూ- ఇద్దర్లో ఎవరికి ఎవరు తల్లిదండ్రులు-"

"చూడమ్మా శ్రీరంగవల్లీ! నువ్ అడిగిన ప్రశ్న చాలా జటిలమయింది. లీగల్ గా చెప్పాలంటే-"

ఆ వాయిస్ కట్టయింది.

"హలో-" అన్నాడు శాయిరామ్ మధ్యలో.

"హలో ముఖ్యమంత్రిగారూ! నమస్తే సార్- ఇప్పుడు మా తండ్రి సడెన్ గా పోయాడు గనుక నాకూ ఆ కొలువిస్తారా?"

"హలో- నేను ముఖ్యమంత్రిని కాదయ్యా-"

"కాకుంటే మరి ఫోనెందుకెత్తినావ్?"

"అసలు నా ఫోన్ లోకి నువ్వెందుకొచ్చినావ్-"

"నువ్వే నాఫోన్లో కొచ్చినావ్ బే-"

"ఏయ్- మాటలు మంచిగ రానీ-

"లేకుంటే ఏం పీకుతావ్ రా?"

మధ్యలో మళ్లీ ముఖ్యమంత్రి గొంతు వినిపించింది.

"చూడండి- బాలయ్యగారూ! మా ప్రభుత్వం వెనుక బడిన తరగతులు వారి సంక్షేమం కోసం ఎన్నో పథకాలు టేకప్ చేశామండీ!"

"ఏయ్- ముందు ముఖ్యమంత్రికి కనెక్షనిస్తావా లేదా?"

హఠాత్తుగా మా సావిత్రమ్మ గొంతు ఫోన్లో కొచ్చింది.

"హలో- ముఖ్యమంత్రిగారేనా సార్ మాట్లాడేది?"

"ముఖ్యమంత్రి టెలిఫోన్ పోల్ పైకెందుకెక్కుతాడమ్మా?"

"ఆ మాటెవరన్నారిప్పుడు?"

"నేనే పోల్ మీదకెళ్ళి మాట్లాడుతూంటే నువ్వేగదా- నువ్వు ముఖ్యమంత్రా? అని నన్నడిగినావ్."

"ఏయ్- ఏందిరా! నా పెండ్లాంతో ఎక్కువ తక్కువ వాగుతున్నావ్?"

ఆ డైలాగ్ కి సావిత్రమ్మ మండిపడింది.

"ఏయ్- ఎవడ్రా నువ్వు? నేను నీ పెళ్ళాన్నా? చెప్పు తీసుకొడతా!"

"బాటా చెప్పులు మంచిగుంటయ్- అదేవాడు-"

"నువ్వెవరసలు? పోల్స్ ఎక్కి ఎందుకు డిస్టర్బ్ చేస్తున్నావందర్నీ?"

మళ్ళీ అరిచింది సావిత్రమ్మ-

"అది నా డ్యూటీ మేడమ్- నేను టెలిఫోన్స్ లైన్ మెన్ ని-"

"అయితే మాత్రం- మా ఫోన్ లో కెందుకొచ్చావ్?"

"ఈ ఏరియాలో చాలా లైన్స్ తో ప్రాబ్లెమ్ ఉంది- అందుకని బాగుచేయడానికొచ్చా!

"హలో- మీ హోటల్లో ఏసీ డబుల్ రూమ్స్ ఉన్నాయా?"

"రెండు లారీలు లోడ్ చేశాం రా- నెంబర్లు రాస్కో-5161, 3797-"

"గోదావరి ఎంతలేటంటే ఒక్కనా కొడుకూ చెప్పడేం?"

"మల్లికాషెరావత్ ఊపేసిందిరా భయ్-"

"ఏయ్ ఎవర్నువ్వు?"

"గాలి జనార్ధన్ రెడ్డి-"

"నీకు బెయిలిచ్చినోడిని కూడా లోపట జేసినావ్ గదురా భయ్- జనార్ధన్"

"హలో ముఖ్యమంత్రిగారా? నమస్తే సార్! నా పేరు భిక్షపతి-"

"అరేయ్ భిక్షపతీ- నువ్ ముందు ఫోన్ పెట్టరా!"

"సాయంత్రం ఫామ్ హౌస్ లో పార్టీ ఉందిరా శంకర్- బాంబే నుంచి 50 మంది టాప్ గాళ్స్ వచ్చారు- నైట్ కి పదివేలు వస్తావా- వెళ్దాం?"

"హలో- సావిత్రమ్మగారూ! మీ ప్రాబ్లెమేంటో చెప్పండి-" ముఖ్యమంత్రి గొంతు వినిపించింది సడెన్ గా-

"సార్! మా నిర్భయ్ నగర్ కాలనీలో ఇప్పటికి మూడొందల దొంగతనాలు జరిగినయ్ సార్-"

"హై ఓల్టేజ్ ప్రాబ్లెమయ్యా- మేమేం చేయలేం!"

"హలో ఎవరది?"

"కనిమోళి రెండువందల కోట్లు ఏడదాచిందరా భయ్-"

"నాకెరుకే- కానీ నీకు చెప్ప!"

"ఎందుకు చెప్పవ్ బే-"

"నాకు మొత్తం రెండొందల పాతిక పందులూ ఉన్నాయ్ సారూ! కానీ బాంకోళ్ళు అప్పులివ్వటం లేదు- అమ్ముదామంటే కొనేటోళ్ళు లేరు. ధాన్యానికి మద్దతు ధర ఇచ్చి సర్కారు కొంటున్నది గదా్సరూ- గట్లనే నా పందుల్నీ సర్కారోళ్ళు మద్దతు ధరిచ్చి కొనాలి సారూ- లేకుంటే నేనూ నా పెండ్లాంబిడ్డలూ ఆగమయిపోతాం సారూ-"

"హలో రైల్వే ఎంక్వయిరీస్-"

మేం ఫోన్లు విసిరికొట్టి ఎవర్దారిన వాళ్ళు ఇళ్ళకుపోయాం.

*** THE END ***